ఈనాడు

విజయవాడ 18-12-2025 గురువారం సిటీ సంపుటి 52 . సంచిక 128

THE LARGEST CIRCULATED TELUGU DAILY

రూ. 6-50 పేజీలు 16 www.eenadu.net

Vijayawada, Visakhapatnam, Hyderabad, Tirupati, Ananthapuramu, Karimnagar, Rajamahendravaram, Suryapet, Guntur, Nellore, Srikakulam, Kurnool, Tadepalligudem, Warangal, Kadapa, Nizamabad, Khammam, Ongole, Mahaboobnagar, Chennai, Bengaluru

మీరే అడ్డంకి కావద్దు

అడ్డంకులు తొలగించడమే మీ పని

- ప్రజల సంతృప్తే మీ పనితీరుకు కొలబద్ద
- కలెక్టర్లకు సీఎం దిశానిర్దేశం
- ఇకపై స్పీడ్ ఆఫ్ డెలివరింగ్ గవర్నెన్స్
- మెరుగైన పాలన, వేగంగా సేవలే లక్ష్యం
- 'పీపీపీ' వైద్య కళాశాలలపై నియంత్రణ ప్రభుత్వానిదేనని స్పష్టీకరణ
- వైకాపా నాయకులది విష ప్రచారమని చంద్రబాబు మండిపాటు



కలెక్టర్ల సదస్సులో మాట్లాడుతున్న సీఎం చంద్రబాబు. చిత్రంలో ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, మంత్రులు లోకేశ్, సత్యప్రసాద్, సీఎస్ విజయానంద్, డీజీపీ హరీశ్ కుమార్ గుప్తా

కలెక్టర్లే ప్రభుత్వానికి రాయబారులు. ఏ జిల్లాలో అయినా ప్రభుత్వంపై సానుకూల వాతావరణం ఏర్పడటమన్నది కలెక్టర్లపైనే ఆధారపడి ఉంటుంది. మీరే జిల్లాలకు పరిపాలనా సారథులు. ఇన్‌ఛార్జి మంత్రులేమో రాజకీయ సారథులు. మీరిద్దరూ సమన్వయంతో పనిచేస్తేనే ప్రభుత్వానికి మంచి పేరొస్తుంది.

\- సీఎం చంద్రబాబు

ఈనాడు, అమరావతి: 'అడ్డంకులుంటే తొలగించి పరిపాలనను పరుగులు పెట్టించాలే తప్ప, మీరే అడ్డంకిగా మారకూడదు. ప్రజల అవసరాల్ని ఎంత వేగంగా, సమర్థంగా తీర్చగలరో చూడండి' అని ముఖ్యమంత్రి చంద్రబాబు కలెక్టర్లకు ఉద్బోధించారు. ప్రజలు మనల్ని గమనిస్తుంటారని గుర్తుపెట్టుకోవాలన్నారు. వివిధ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలపై ప్రజల సంతృప్త స్థాయే కలెక్టర్ల పనితీరుకు కొలమానమని స్పష్టం చేశారు. 'మీరు బాగా పనిచేయడమే కాదు, దాని ఫలితం క్షేత్రస్థాయిలో చాలా స్పష్టంగా కనిపించాలి. సోషల్ మీడియాలో ప్రాచుర్యం పొందితే బాగా పనిచేసినట్టు కాదు' అని పేర్కొన్నారు. రాష్ట్రాన్ని పారిశ్రామికంగా అభివృద్ధి చేసేందుకు, పెట్టుబడులు ఆకర్షించేందుకు 'స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్' విధానం పెట్టుకున్నట్టే.. ప్రజలకు మెరుగైన పాలన, వేగంగా సేవలందించేందుకు పరిపాలనలో వేగం (స్పీడ్ ఆఫ్ డెలివరింగ్ గవర్నెన్స్) అన్న సూత్రాన్ని అనుసరిస్తామని సీఎం ప్రకటించారు. సచివాలయంలో బుధవారం ఉదయం ప్రారంభమైన ఐదో కలెక్టర్ల సదస్సులో సీఎం ప్రారంభోపన్యాసం చేశారు.

కలెక్టర్లకు సీఎం ఏమని దిశానిర్దేశం చేశారంటే..

పింఛను పంపిణీపై ప్రజల్లో సంతృప్తస్థాయి 92 శాతం ఉంది. అలాంటి ఫలితాలు తేవాలి. ఇళ్లులేని వారు, రైతులు, పిల్లలు, మహిళలు.. ఇలా సమాజంలోని అన్ని వర్గాలను స్పృశిస్తేనే అనుకున్న లక్ష్యాన్ని చేరుకుంటాం. మీలోని యువకుల ఆలోచనలు, సీనియర్ల విజ్ఞానం మేళవించి అత్యుత్తమ విధానాలు రూపొందించి, ప్రభావవంతంగా (మిగతా 3లో)

ఇక గ్రామ/వార్డు సచివాలయాల పేరు 'స్వర్ణ గ్రామం'

గిరిజన గ్రామాలకు రహదారులపై ప్రత్యేక శ్రద్ధ పెట్టండి

- ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్

12లో



వీరికి ఉద్యోగం అంటే లెక్కలేదు!

ఏళ్లుగా 62 మంది వైద్యులు విధులకు గైర్హాజరు

నోటీసులతో చర్యలకు ఉపక్రమించిన వైద్యశాఖ

ఈనాడు - అమరావతి

ప్రభుత్వం నుంచి ఎలాంటి అనుమతీ లేకుండా 62 మంది వైద్యులు ఏళ్లుగా విధులకు గైర్హాజరవుతున్నారు. వైద్యారోగ్యశాఖ ఉన్నతాధికారులు పట్టించుకోకపోవడంతో ఇన్నాళ్లూ ఆడిందే ఆటలా సాగిపోయింది. రాజకీయ అండదండలు, ఇతరత్రా ఆశీస్సులు ఉండడంతో ఇన్నాళ్లూ వీరి జోలికి వెళ్లే నాథుడే లేకపోయారు. కొందరు అనధికారిక గైర్హాజరును సిఫార్సులతో క్రమబద్ధీకరిస్తుండడంతో చర్యలంటే మిగిలినవారిలోనూ భయంలేకుండా పోయింది. పరిస్థితి గతి తప్పుతుండడంతో.. ఎట్టకేలకు వీరిపై క్రమశిక్షణ చర్యలకు ప్రభుత్వం సిద్ధమైంది. అనుమతి లేకుండా ఏడాదికిపైగా విధులకు గైర్హాజరైన 12 మంది అసోసియేట్ ప్రొఫెసర్లు, 48 మంది అసిస్టెంట్ ప్రొఫెసర్లు, ఇద్దరు ట్యూటర్లకు షోకాజ్ నోటీసులు జారీచేసింది.

నోటీసులు ఇచ్చాం: డీఎంఈ

ప్రభుత్వ అనుమతిలేకుండా ఏడాదికి పైగా విధులకు గైర్హాజరైన వైద్యుల సేవలు తాత్కాలికంగా రద్దుచేయాలని నిర్ణయించామని ఆంధ్రప్రదేశ్ వైద్య విద్య సంచాలకులు (డీఎంఈ) డాక్టర్ జి.రఘునందన్ తెలిపారు. ఆయా వైద్యుల సేవలు ఎందుకు (మిగతా 3లో)

65 ఏళ్లు నిండితే ఉపకులపతి పదవికి అనర్హులు!



వర్సిటీలకు కొత్తగా బోర్డు ఆఫ్ గవర్నర్స్

- బీఓజీ ఛైర్‌పర్సన్‌గా పారిశ్రామికవేత్త లేదా టెక్నోక్రాట్
- రెక్టార్ స్థానంలో ప్రో-వైస్‌ఛాన్స్‌లర్
- ప్రభుత్వానికి చేరిన వర్సిటీల ఏకీకృత చట్టం ముసాయిదా

ఈనాడు, అమరావతి: రాష్ట్రంలోని వ్యవసాయ, వైద్య, సంప్రదాయ, సాంకేతిక విద్య విశ్వవిద్యాలయాలు అన్నింటికీ కలిపి రాష్ట్ర ప్రభుత్వం ఏకీకృత చట్టం తీసుకురానుంది. ఏపీ ప్రభుత్వ విశ్వవిద్యాలయాల ఏకీకృత చట్టం-2025 పేరుతో దీన్ని తీసుకొస్తోంది. చట్ట రూపకల్పనకు ఏర్పాటు చేసిన కమిటీ.. ముసాయిదాను ప్రభుత్వానికి సమర్పించింది. వచ్చే అసెంబ్లీ సమావేశాల్లో ఈ బిల్లును ప్రవేశ పెట్టనున్నారు. రాష్ట్రంలో 20 విశ్వవిద్యాలయాలకు సంబంధించి ఉన్న ఎనిమిది చట్టాల్లో ఏకరూపత లేని నిబంధనలను పరిష్కరించేందుకు దీన్ని రూపొందించారు. పరిశ్రమ- విద్యా సంస్థ సమీకృత భావనను తీసుకువచ్చేందుకు కొత్తగా గవర్నర్ల బోర్డు (బీఓజీ)ను నియమిస్తారు. అన్ని వర్సిటీలకు కులపతిగా గవర్నర్ ఉంటారు. ఇప్పటి వరకు వీసీలకు గరిష్ఠ వయోపరిమితి నిబంధన లేదు. ఇప్పుడు 65 ఏళ్ల నిబంధన తీసుకురానున్నారు. మూడేళ్ల పదవీ కాలం (మిగతా 3లో)

లోకాయుక్త, హెచ్‌ఆర్‌సీలు కర్నూలులోనే

వాటిని అక్కడే కొనసాగించాలని ప్రభుత్వం నిర్ణయించింది

హైకోర్టుకు తెలిపిన ఎస్‌జీపీ



ఈనాడు, అమరావతి: లోకాయుక్త, ఏపీ మానవ హక్కుల సంఘం (హెచ్‌ఆర్‌సీ) కార్యాలయాలను కర్నూలులోనే కొనసాగించాలని ప్రభుత్వం నిర్ణయించినట్లు ప్రభుత్వ ప్రత్యేక న్యాయవాది (ఎస్‌జీపీ) ఎస్.ప్రణతి హైకోర్టుకు నివేదించారు. ధర్మాసనం స్పందిస్తూ.. 'హెచ్‌ఆర్‌సీ, లోకాయుక్త ఏర్పాటు వ్యవహారం ప్రభుత్వ విధానపరమైన నిర్ణయం. పాలసీ నిర్ణయాల్లో మేము జోక్యం చేసుకునేందుకు కొన్ని పరిమితులు ఉంటాయి' అని వ్యాఖ్యానించింది. హెచ్‌ఆర్‌సీ, లోకాయుక్త తరలింపు వ్యవహారంపై 2021లో ప్రభుత్వం దాఖలు చేసిన కౌంటర్ ప్రతి.. కోర్టు రికార్డుల్లోకి చేరకపోవడంతో విచారణ వాయిదా పడింది. ఈ మేరకు హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్, జస్టిస్ చల్లా గుణరంజన్‌తో కూడిన ధర్మాసనం బుధవారం ఉత్తర్వులిచ్చింది.

- రాష్ట్ర విభజన చట్ట నిబంధనలకు విరుద్ధంగా లోకాయుక్త, (మిగతా 3లో)

మరో వంద స్వచ్ఛ రథాలు వస్తున్నాయ్!

- ఫలించిన ప్రయోగాత్మక విధానం
- అన్ని జిల్లాల్లో అమలుకు చర్యలు

లోపలి పేజీలో

10 గంటల ముందే ప్రయాణికుల జాబితాలు

- రైల్వేశాఖ నిర్ణయం

దిల్లీ: ప్రయాణికుల వివరాలతో కూడిన తొలి జాబితాలను రైలు బయల్దేరే సమయానికంటే 10 గంటల ముందే సిద్ధం చేయాలని రైల్వేశాఖ నిర్ణయించింది. దూర ప్రాంతాల నుంచి వేరే స్టేషన్లకు వెళ్లి రైలును అందుకోవాల్సినవారికి తమ బెర్తు, సీటు ఖాయమైందో లేదో స్పష్టంగా తెలిస్తే చివరిక్షణంలో హైరానా పడాల్సిన అవసరం ఉండదని ఈ ఏర్పాటు చేసినట్లు రైల్వేవర్గాలు చెబుతున్నాయి. తెల్లవారుజామున 5.01 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల మధ్య బయల్దేరే రైళ్లకు తొలి చార్టును (మిగతా 3లో)

పవర్‌గ్రిడ్ కార్పొరేషన్ సీఎండీగా వంశీ రామ్మోహన్ బుర్రా: పీఈఎస్‌బీ సిఫార్సు



ఈనాడు, దిల్లీ: పవర్ గ్రిడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా ఛైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ (సీఎండీ)గా వంశీ రామ్మోహన్ బుర్రా పేరు ఖరారైంది. ఈ మేరకు ప్రభుత్వ రంగ సంస్థల ఎంపిక మండలి (పీఈఎస్‌బీ) కేంద్ర ప్రభుత్వానికి సిఫార్సు చేసింది. ప్రస్తుతం అదే సంస్థలో పర్సనల్ డైరెక్టర్(ప్రాజెక్ట్స్)గా పనిచేస్తున్న ఆయన మరో 8 మందితో పోటీపడి ఈ పదవికి ఎంపికయ్యారు. ఆయన ఇంజినీరింగ్‌తోపాటు మేనేజ్‌మెంట్‌లో పోస్ట్ గ్రాడ్యుయేట్ డిప్లొమా, హార్వర్డ్ మేనేజ్‌మెంట్ (హెచ్‌ఎంపీ) ప్రోగ్రాం చేశారు. ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్‌లో పలు ఎగ్జిక్యూటివ్ కోర్సులు పూర్తిచేశారు. విద్యుత్తు, టెలికాం రంగాల్లో మూడు దశాబ్దాల విస్తృత అనుభవం ఉంది. ఇదివరకు పవర్‌గ్రిడ్ టెలిసర్వీసెస్ లిమిటెడ్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్‌గానూ సేవలందించారు. కాంపిటీటివ్ బిడ్డింగ్‌లో పవర్‌గ్రిడ్ ప్రవేశించేలా చేయడంలో వంశీ రామ్మోహన్ కీలకపాత్ర పోషించారు. ఆ వ్యూహాత్మక అడుగే ఆ సంస్థను పోటీ మార్కెట్లో విజయవంతమైన సంస్థగా నిలిపింది.



కళాశాల వజ్రోత్సవాల్లో మాట్లాడుతున్న అక్కినేని నాగార్జున. వేదికపై ఎమ్మెల్యే వెనిగండ్ల రాము, హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బట్టు దేవానంద్, యార్లగడ్డ లక్ష్మీప్రసాద్, అక్కినేని నాగసుశీల తదితరులు



పూర్వ విద్యార్థుల సమ్మేళనంలో మాట్లాడుతున్న హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బట్టు దేవానంద్. వేదికపై యలమంచిలి శివాజీ, కత్తిపూడి పద్మనాభయ్య, కావూరి సాంబశివరావు, అక్కినేని వెంకట్, అక్కినేని జ్యోత్స్న తదితరులు



కేంద్ర మాజీ మంత్రి కావూరి సాంబశివరావును సత్కరిస్తున్న ఎమ్మెల్యే వెనిగండ్ల రాము, కళాశాల వజ్రోత్సవ కమిటీ సభ్యులు

మంచి పనులు శాశ్వతంగా నిలిచిపోతాయి

- మా నాన్న చేసిన సాయానికి గుర్తు... ఏఎన్ఆర్ కళాశాల
- ఉపకార వేతనాలకు రూ.2 కోట్ల విరాళం
- కళాశాల వజ్రోత్సవాల్లో సినీనటుడు నాగార్జున

ఈనాడు డిజిటల్, మచిలీపట్నం; న్యూస్‌టుడే, గుడివాడ: 'మనుషులు శాశ్వతం కాదు. వాళ్ల మంచి పనులే చిరస్థాయిగా ఉండిపోతాయి. మా నాన్న చేసిన మంచి పనికి ప్రత్యక్ష నిదర్శనం.. గుడివాడలోని ఏఎన్ఆర్ కళాశాల' అని సినీనటుడు అక్కినేని నాగార్జున పేర్కొన్నారు. కళాశాల విద్యార్థులకు ఉపకారవేతనాలు ఇచ్చేందుకు తమ కుటుంబం తరపున రూ.2 కోట్లు విరాళం ఇస్తున్నట్టు ప్రకటించారు. ఏఎన్ఆర్ కళాశాల వజ్రోత్సవాల్లో రెండో రోజైన బుధవారం పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఘనంగా జరిగింది. ముందుగా కళాశాలలో రూసా నిధులతో నిర్మించిన భవనాన్ని నాగార్జున ప్రారంభించారు. అనంతరం సభలో ఆయన మాట్లాడారు. 'ఏఎన్ఆర్ చదువుకోలేక పోయినా వేల మందికి విద్యాభాగ్యం కల్పించేందుకు సాయం చేశారు. హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బట్టు దేవానంద్, కేంద్ర మాజీ మంత్రి కావూరి సాంబశివరావు, రాజ్యసభ మాజీ సభ్యుడు యలమంచిలి శివాజీ, 'ఈనాడు' గ్రూప్ సంస్థల అధినేత దివంగత రామోజీరావు, యార్లగడ్డ లక్ష్మీప్రసాద్, కైకాల సత్యనారాయణ, విశ్రాంత ఐఏఎస్ పద్మనాభయ్య.... వంటి వారెందరో ఇక్కడ చదివారు. కళాశాలలో నైపుణ్యాభివృద్ధి కోర్సులు ప్రారంభించనుండటం శుభపరిణామం. విద్యాశాఖ మంత్రి లోకేశ్ చొరవతో కళాశాలను అభివృద్ధి పథంలోకి తీసుకెళ్లాలి' అని నాగార్జున తెలిపారు. అనంతరం ఏఎన్ఆర్ జీవితంపై యార్లగడ్డ లక్ష్మీప్రసాద్ రాసిన పుస్తకాన్ని ఆవిష్కరించారు.

సొంత ఇల్లు లేని సమయంలోనే దాతృత్వం

కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బట్టు దేవానంద్ మాట్లాడుతూ.. ఎంతోమంది రైతులు దానంగా ఇచ్చిన భూములతో ఏర్పడిన ఈ కళాశాల ఏఎన్ఆర్ సాయంతో ఎంతో మంది విద్యావంతులను దేశానికి అందించిందన్నారు. ఈ ఇక్కడ చదివే రోజుల్లో అక్కినేని నాగేశ్వరరావు చేతులమీదుగా ఉత్తమ నటుడి అవార్డు అందుకున్నానని కళాశాలతో ఉన్న అనుబంధాన్ని గుర్తుచేసుకున్నారు. యార్లగడ్డ లక్ష్మీప్రసాద్ మాట్లాడుతూ.. మహోన్నత వ్యక్తిత్వం ఉన్న వ్యక్తి అక్కినేని నాగేశ్వరరావు అని కొనియాడారు. ఆయన సొంత ఇల్లు కట్టుకోక ముందే విశ్వవిద్యాలయాలకు విరాళాలు అందించారన్నారు. బస్తా బియ్యం రూ.11 ఉన్న రోజుల్లోనే ఈ కళాశాలకు రూ.లక్ష విరాళం ఇచ్చారని తెలిపారు.

కావూరి సాంబశివరావు రూ.కోటి విరాళం : తను కేంద్ర మంత్రి స్థాయికి ఎదిగేందుకు ఏఎన్ఆర్ కళాశాలలో పడిన బీజమే కారణమని కావూరి సాంబశివరావు పేర్కొన్నారు. కళాశాల అభివృద్ధికి రూ.కోటి విరాళం ప్రకటించారు. కార్యక్రమంలో విశ్రాంత ఐఏఎస్ కె.పద్మనాభయ్య, రాజ్యసభ మాజీ సభ్యుడు యలమంచిలి శివాజీ, అక్కినేని వెంకట్, ఎమ్మెల్యేలు వెనిగండ్ల రాము, వర్ల కుమార్‌రాజా తదితరులు పాల్గొన్నారు.



క్రికెటర్ శ్రీచరణికి రూ.2.5 కోట్ల చెక్కును అందజేస్తున్న మంత్రి లోకేశ్. చిత్రంలో మంత్రి రామ్‌ప్రసాద్‌రెడ్డి, అధికారులు

శ్రీచరణికి రూ.2.5 కోట్ల నగదు ప్రోత్సాహకం

చెక్కు అందించిన మంత్రి లోకేశ్

ఈనాడు, అమరావతి: భారత మహిళా క్రికెటర్ శ్రీచరణికి రాష్ట్ర ప్రభుత్వం తరపున రూ.2.5 కోట్ల నగదు చెక్కును విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ అందజేశారు. ఉండవల్లి నివాసంలో బుధవారం జరిగిన కార్యక్రమంలో శ్రీచరణిని ప్రత్యేకంగా అభినందించారు. ప్రభుత్వం క్రీడాకారులకు అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి, శాప్ ఛైర్మన్ రవినాయుడు, క్రీడాశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజయ్ జైన్, శాప్ ఎండీ భరణి పాల్గొన్నారు.

15కి చేరిన స్క్రబ్ టైఫస్ మరణాలు

ఈనాడు, అమరావతి: రాష్ట్రంలో స్క్రబ్ టైఫస్ బాధితుల సంఖ్య రోజురోజుకీ పెరుగుతోంది. ఈ ఏడాది జనవరి 1 నుంచి బుధవారం (ఈ నెల 17) వరకు రాష్ట్రంలో 9,236 మందికి పరీక్షలు నిర్వహించారు. పాజిటివ్ కేసులు 1,806 నమోదు కాగా ఈ కేసుల్లో మరణాల సంఖ్య 15కి చేరింది. ఈ మరణాలకు స్క్రబ్ టైఫస్‌తో పాటు దీర్ఘకాలిక, ఇతర అనారోగ్య సమస్యలు కారణమని వైద్యులు నిర్ధారించారు.

◆ రాష్ట్రంలో అత్యధికంగా పాజిటివ్ కేసులు చిత్తూరు జిల్లాలో 444, కాకినాడ జిల్లాలో 183, విశాఖ 143, వైఎస్సార్ కడప 118, శ్రీపొట్టిశ్రీరాములు నెల్లూరు 113, విజయనగరం 96, తిరుపతి జిల్లా 90, గుంటూరు జిల్లా 85, అనంతపురం జిల్లాలో 83 కేసుల చొప్పున నమోదయ్యాయి.

◆ స్క్రబ్ టైఫస్ అనుమానిత మరణాలు ఇప్పటి వరకు పల్నాడు జిల్లాలో మూడు, విజయనగరం, బాపట్ల, కృష్ణా, ప్రకాశం జిల్లాల్లో రెండు చొప్పున.. శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా, అన్నమయ్య, ఎన్టీఆర్, కాకినాడ జిల్లాల్లో ఒకటి చొప్పున నమోదయ్యాయి.

క్లాట్‌లో ప్రతిభ చూపిన ఎన్టీఆర్ ట్రస్టు విద్యార్థినులకు చంద్రబాబు, భువనేశ్వరి అభినందనలు

ఈనాడు, అమరావతి: కామన్ లా అడ్మిషన్ టెస్ట్(క్లాట్)-2026లో ప్రతిభ చూపిన ఎన్టీఆర్ జూనియర్ కళాశాల విద్యార్థినులకు సీఎం చంద్రబాబు అభినందనలు తెలిపారు. విద్య ద్వారా బాలికల్లో సాధికారత పెంపొందిస్తున్న కార్యక్రమానికి నాయకత్వం వహిస్తున్న ఎన్టీఆర్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ నారా భువనేశ్వరి, అధ్యాపక బృందం, పరిపాలనా సిబ్బందికి అభినందనలు తెలిపారు. "ఎన్టీఆర్ ట్రస్టు ఆధ్వర్యంలో నడుస్తున్న విద్యాసంస్థల్లో చదువుతున్న విద్యార్థినులు వివిధ కేటగిరీల్లో జాతీయ స్థాయిలో ఉత్తమ ర్యాంకులు సాధించారు. భవిష్యత్తులో న్యాయ వ్యవస్థను బలోపేతం చేసే దిశగా వీరు ఉత్తమ నిపుణులుగా ఎదగాలి" అని చంద్రబాబు 'ఎక్స్' వేదికగా ఆకాంక్షించారు. క్లాట్-2026లో ప్రతిభ చూపిన ఎన్టీఆర్ విద్యాసంస్థల విద్యార్థినులకు ఎన్టీఆర్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ నారా భువనేశ్వరి అభినందనలు తెలిపారు. ''ఎన్టీఆర్ ట్రస్టు ఆధ్వర్యంలో నడుస్తున్న విద్యాసంస్థల్లో చదువుతున్న 13 మంది విద్యార్థినులు ఈ ప్రవేశ పరీక్షలో జాతీయ స్థాయిలో ఉత్తమ ర్యాంకులు సాధించారు'' అని ట్రస్టు బుధవారం ఒక ప్రకటనలో పేర్కొంది.

క్లాట్ ఫలితాల్లో శ్రీషిర్డిసాయి విద్యాసంస్థల విద్యార్థుల సత్తా

ఈనాడు, అమరావతి: క్లాట్-2026 ఫలితాల్లో రాజమహేంద్రవరం శ్రీషిర్డిసాయి విద్యాసంస్థల విద్యార్థులు ప్రతిభ చూపారని ఆ విద్యాసంస్థల ఛైర్మన్ తంబాబత్తుల శ్రీధర్, డైరెక్టర్ టి.శ్రీవిద్య తెలిపారు. తమ డ్యాఫ్నీ సివిల్స్ అకాడమీకి చెందిన ఎస్.శ్రీ సాయి గీతిక జాతీయ స్థాయిలో 3వ ర్యాంకు, రాష్ట్రస్థాయిలో ప్రథమ ర్యాంకు సాధించారని చెప్పారు. వివిధ కేటగిరీల్లో 100 లోపు ర్యాంకులు ముగ్గురికి, 500 లోపు 12 మందికి, 1000 లోపు ర్యాంకులు 20 మందికి వచ్చాయని వెల్లడించారు.

ఆర్టీఐ పూర్వ కమిషనర్ శామ్యూల్‌కు అరెస్ట్ వారంట్

- కోర్టుధిక్కరణ కేసులో హైకోర్టు ఉత్తర్వులు

ఈనాడు, అమరావతి: కోర్టుధిక్కరణ కేసులో విచారణకు గైర్హాజరైన సమాచార హక్కు చట్ట (ఆర్టీఐ) పూర్వ కమిషనర్ శామ్యూల్ జొనాథన్‌కు హైకోర్టు బెయిలబుల్ వారంట్ (బీడబ్ల్యూ) జారీ చేసింది. శామ్యూల్‌ను అరెస్ట్ చేయాలని, ఈ నెల 19న విచారణకు హాజరుపరచాలని గుంటూరు జిల్లా ఎస్పీని ఆదేశించింది. మరోవైపు తదుపరి విచారణ నాటికి తానే కోర్టుకు హాజరవుతానంటూ శామ్యూల్ రూ.10 వేల వ్యక్తిగత బాండ్‌తో రెండు పూచీకత్తులు సమర్పించి ఆ మేరకు అఫిడవిట్ ఇచ్చేటట్లయితే బెయిల్‌పై విడుదల చేయాలని ఎస్పీకి స్పష్టం చేసింది. హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎస్.సుబ్బారెడ్డి ఈ నెల 5న ఈ ఉత్తర్వులిచ్చారు. వారంట్ జారీ నేపథ్యంలో మంగళగిరి గ్రామీణ ఎస్సై.. శామ్యూల్‌కు ఫోన్ చేసి శుక్రవారం హైకోర్టు విచారణకు హాజరుకావాలని సమాచారం ఇచ్చారు.

◆ కదిరికి చెందిన నూరుల్లా సమాచార హక్కు చట్టం కింద కదిరి మున్సిపాలిటీ నుంచి సమాచారం కోరారు. స్పందన లేకపోవడం/ సరైన సమాచారం ఇవ్వకపోవడంతో స.హ. కమిషన్ వద్ద అప్పీల్ చేశారు. దానిని నిర్దిష్ట కాలంలో పరిష్కరించకపోవడంతో హైకోర్టులో పిటిషన్ వేశారు. విచారణ జరిపిన న్యాయమూర్తి సాధ్యమైనంత త్వరగా, చట్ట నిబంధనల మేరకు అప్పీల్‌ను పరిష్కరించాలని ఆదేశించారు. ఈ ఉత్తర్వులను అమలు చేయకపోవడంతో నూరుల్లా.. అప్పటి సహ కమిషనర్ శామ్యూల్ జొనాథన్‌పై కోర్టు ధిక్కరణ వ్యాజ్యం వేశారు. నోటీసు అందుకున్నప్పటికీ జొనాథన్ విచారణకు హాజరుకాకపోవడంతో కోర్టు ఆయనకు బీడబ్ల్యూ జారీచేసింది.

ఇక కేరళ తరహా జలవిహారం

- విజయవాడ బెర్మ్ పార్కు నుంచి పవిత్ర సంగమం వరకు
- సూర్యలంక బీచ్ బ్యాక్‌వాటర్‌లో కూడా..
- రాత్రి బోటులోనే బస
- అక్టోబరుకల్లా అందుబాటులోకి విలాసవంతమైన పడవలు



ఈనాడు, అమరావతి: పర్యాటక రంగంలో కీలక ముందడుగు పడింది. విజయవాడ బెర్మ్ పార్కు, సూర్యలంక బీచ్ బ్యాక్ వాటర్‌లో పర్యాటకుల కోసం ఐదు అల్ట్రా లగ్జరీ బోట్లు నడిపేందుకు ప్రైవేటు ఆపరేటర్లు ముందుకొచ్చారు. వీరికి రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ ప్రాథమిక అనుమతులిచ్చింది. రెండు చోట్లా ఐదు జెట్టీలు నిర్మించడంతోపాటు బోట్లకు విద్యుత్తు సౌకర్యం సంస్థ కల్పించనుంది. ఐదు బోట్లకు సంబంధించిన డ్రాయింగ్‌లకు 'ఇన్‌లాండ్ వాటర్ వేస్ అథారిటీ' అనుమతులు ఆపరేటర్లు తీసుకుని బోట్ల నిర్మాణ పనులు చేపట్టనున్నారు. 2026 అక్టోబరు నాటికి బోట్లు అందుబాటులోకి వచ్చే అవకాశాలు ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు.

◆ రాష్ట్రంలో కేరళ తరహాలో నదులు, సముద్రం బ్యాక్ వాటర్‌లో పర్యాటకుల కోసం విలాసవంతమైన పడవలు (అల్ట్రా లగ్జరీ బోట్లు) ప్రైవేటు ఆపరేటర్ల ద్వారా నడిపించేందుకు కూటమి ప్రభుత్వం ఏడాదిగా ప్రయత్నిస్తోంది. ఇందుకోసం ఆసక్తిగల సంస్థలను ఆహ్వానించింది. కేరళలో ఇప్పటికే ఈ తరహా సేవలు అందిస్తున్న ఒక సంస్థ, ఏపీకి చెందిన మరొకరితో కలిసి ఉమ్మడి భాగస్వామ్యం కింద బెర్మ్ పార్కు నుంచి పవిత్ర సంగమం వరకు రెండు బోట్లు నడిపేందుకు ముందుకొచ్చింది. ఇందుకు సంబంధించి 20 కిలో మీటర్ల మేర సర్వే కూడా చేశారు. ఒక బోటులో ఐదు పడక గదులు, వంద మందికి సరిపడా కాన్ఫరెన్స్ హాల్ ఉంటుంది. మరో బోటును 200 మంది డిన్నర్ చేసేందుకు వీలుగా డిజైన్ చేయనున్నారు. రాత్రుల్లో భవానీ ద్వీపం వద్ద బోట్లు నిలిపేలా అక్కడో జెట్టీ, విద్యుత్తు సదుపాయం కల్పించనున్నారు.

◆ బాపట్ల జిల్లా సూర్యలంక బీచ్ బ్యాక్ వాటర్‌లో నాగరాజు కెనాల్ నుంచి నిజాంపట్నం వరకు మూడు బోట్లు ప్రైవేట్ సంస్థలు నడపనున్నాయి. ఒక బోటులో 9, మరో బోటులో 3, ఇంకో బోటులో 2 పడక గదులు ఉంటాయి. బ్యాక్ వాటర్‌లో దాదాపు 30 కిలో మీటర్ల మేర బోటులో ప్రయాణించొచ్చు. మార్గమధ్యంలో సుందరమైన ప్రాంతాలను కూడా గుర్తించారు. విశాఖ తీరంలో రాజమహేంద్రవరం, కాకినాడలో గోదావరి నదిలో, నాగార్జునసాగర్‌లోనూ అల్ట్రా డీలక్స్ బోట్లు ప్రైవేట్ ఆపరేటర్లతో నడిపేలా పర్యాటకాభివృద్ధి సంస్థ ఫీజిబులిటీ సర్వే చేస్తోంది. ఈ ప్రక్రియ పూర్తయ్యాక ఆసక్తిగల సంస్థలను ఆహ్వానిస్తారు.

ట్రాన్స్‌ఫార్మర్ల కొనుగోళ్లలో దోపిడీ

- తెలంగాణతో పోలిస్తే ఒక్కోదానిపై రూ.73 లక్షలు అధికం
- ప్రభుత్వంపై రూ.14 కోట్ల భారం
- ట్రాన్స్‌కో టెండర్లలో కమీషన్ల మాయాజాలం

ఈనాడు, అమరావతి: ఒకే రకమైన ట్రాన్స్‌ఫార్మర్లు.. అవే స్పెసిఫికేషన్లు.. తయారు చేసింది కూడా ఒకే కంపెనీ.. కానీ వాటి ధరల్లో మాత్రం ఆంధ్రప్రదేశ్, తెలంగాణల మధ్య భారీ వ్యత్యాసం ఉంది. ఏ 10 వేలో.. 20 వేలో కాదు. ఏకంగా ఒక్కో ట్రాన్స్‌ఫార్మర్‌పై రూ.73 లక్షలు! కమీషన్లకు కక్కుర్తి పడుతూ ఇష్టారీతిన ధరలు నిర్ణయిస్తున్న ట్రాన్స్‌కో అధికారులు.. కంపెనీలకు ఎడాపెడా దోచిపెడుతున్నారనడానికి ఇదే తార్కాణం. ట్రాన్స్‌కోలోని ప్రొక్యూర్‌మెంట్ విభాగం ట్రాన్స్‌ఫార్మర్లు కొని నిల్వ చేస్తుంది. వాటిని రాష్ట్రవ్యాప్తంగా అవసరమైన ప్రాంతాలకు పంపిస్తుంది. ఈ విభాగం ఇటీవల 50 ఎంవీఏ 132/33 కేవీ పవర్ ట్రాన్స్‌ఫార్మర్ల కోసం హరియాణాకు చెందిన ఈసీఈ ఇండస్ట్రీస్ లిమిటెడ్‌కు రిపీట్ ఆర్డర్ ఇచ్చింది. మొత్తం 20 ట్రాన్స్‌ఫార్మర్లను రెండు లాట్లలో సరఫరా చేయాలని సూచించింది. ఆ ఆర్డర్‌లో ఒక్కో ట్రాన్స్‌ఫార్మర్ ధరను అన్ని ఛార్జీలు, జీఎస్టీతో కలిపి రూ.4,78,12,380గా పేర్కొంది. ఈ లెక్కన 20 ట్రాన్స్‌ఫార్మర్లకు మొత్తం రూ.95.62 కోట్లుగా ధర నిర్ధారించారు. ఇదే కంపెనీకి, ఇవే స్పెసిఫికేషన్లతో కూడిన ఒక్కో ట్రాన్స్‌ఫార్మర్ కొనుగోలుకు తెలంగాణ ట్రాన్స్‌కో గత సెప్టెంబరులో రూ.4,04,85,800 చొప్పున ఆర్డర్ ఇచ్చింది.

రిపీట్ ఆర్డర్ వెనుక కక్కుర్తి?

గతేడాది ఆగస్టులో ఈ రకమైన ట్రాన్స్‌ఫార్మర్ల సరఫరా కోసం ఏపీ ట్రాన్స్‌కో టెండర్లు పిలిచింది. ఇందులో ఈసీఈ సంస్థ టెండరు దక్కించుకుని ఒక్కోటి రూ.4.78 కోట్లకు అందించింది. తాజాగా రిపీట్ ఆర్డర్ పేరుతో ఇదే సంస్థకు ట్రాన్స్‌కో అధికారులు మళ్లీ సరఫరా కాంట్రాక్టును కట్టబెట్టారు. గతేడాది అధిక ధర వెచ్చించింది చాలక.. మళ్లీ ప్రభుత్వ సొమ్మును దోచుకునేందుకు అదే ధరకు రిపీట్ ఆర్డర్ ఇవ్వడం గమనార్హం. అత్యవసర పరిస్థితులు, టెండరు పిలిచేందుకు సమయం లేని సందర్భాల్లోనే సాధారణంగా రిపీట్ ఆర్డర్లు ఇస్తుంటారు. ఇక్కడ అలాంటి పరిస్థితి లేదు. కొత్తగా టెండర్లు పిలిస్తే.. పోటీలో ధర తగ్గే ఆస్కారం ఉండేది. రిపీట్ ఆర్డర్ వల్ల తెలంగాణతో పోలిస్తే.. ఏపీ ట్రాన్స్‌కోపై 20 ట్రాన్స్‌ఫార్మర్ల కొనుగోలుపై రూ.14.65 కోట్ల మేర అధిక భారం పడుతోంది. ప్రస్తుత ధరలు, పొరుగు రాష్ట్రాలు కొనుగోలు చేసిన ధరలు తెలియక అధికారులు బిడ్లు ఆమోదించారా? లేక కమీషన్ల కోసం కక్కుర్తి పడ్డారా? అన్నది ప్రభుత్వం విచారణ జరిపితే తేలుతుంది.

లేడీ డాన్ నిడిగుంట అరుణపై పీడీయాక్ట్

ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం

ఈనాడు, అమరావతి: నెల్లూరుకు చెందిన లేడీ డాన్ నిడిగుంట అరుణ (31)పై రాష్ట్ర ప్రభుత్వం పీడీ యాక్ట్ ప్రయోగించింది. ఆ జిల్లా కలెక్టర్ నుంచి అందిన ప్రతిపాదనలకు ఆమోదముద్ర వేస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. వ్యక్తులను అపహరించటం, రహస్యంగా నిర్బంధించటం, దాడులు చేయటం, నకిలీ పత్రాలు సృష్టించి డబ్బు దోచుకోవటం తదితర అభియోగాలు అరుణపై ఉన్నాయి. వీటికి సంబంధించిన కేసులో ఆమె ఇప్పటికే అరెస్టయ్యారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తున్నారనే కారణంతో ఆమెపై పీడీ యాక్ట్ ప్రయోగించారు. ఆమెతో పాటు నెల్లూరు నగరానికి చెందిన చింతల భూపతి, సుద్దమల్ల జయప్రకాశ్, కోవూరు మండలం పోతిరెడ్డిపాలెంకు చెందిన అంకెం రాజాలపైనా పీడీ చట్టం ప్రయోగించారు.



బ్లేడ్‌లను తితిదే ఛైర్మన్ బీఆర్ నాయుడి సమక్షంలో కల్యాణకట్ట ఏఈవో రమాకాంత్‌కు అందిస్తున్న దాత శ్రీధర్ బోడుపల్లి, జ్యోతి దంపతులు

తితిదేకు రూ.1.20 కోట్ల విలువైన బ్లేడ్‌ల విరాళం

తిరుమల, న్యూస్‌టుడే: హైదరాబాద్‌కు చెందిన వర్టిస్ గ్లోబల్ సంస్థ డైరెక్టర్ శ్రీధర్ బోడుపల్లి బుధవారం తితిదేకు ఏడాదికి సరిపడా రూ.1.20 కోట్ల విలువైన సిల్వర్‌మాక్స్ షేవింగ్ హాఫ్ బ్లేడ్‌లను విరాళంగా అందించారు. స్థానిక క్యాంపు కార్యాలయంలో తితిదే ఛైర్మన్ బీఆర్ నాయుడికి వాటిని అందజేశారు. ఈ సందర్భంగా ఛైర్మన్ మాట్లాడుతూ.. భక్తులు తలనీలాలు సమర్పించేందుకు బ్లేడ్‌ల కోసం ఏడాదికి రూ.1.16 కోట్లు ఖర్చు చేస్తున్నామని, రోజుకు 40 వేల హాఫ్ బ్లేడ్‌లను కల్యాణ కట్టల్లో వినియోగిస్తున్నామన్నారు. ఈ సందర్భంగా దాతను ఛైర్మన్ అభినందించారు. వినియోగదారుల అవసరాలు దృష్టిలో ఉంచుకుని మొదటిసారిగా హాఫ్ బ్లేడ్‌లను తీసుకువచ్చిన సంస్థ తమదేనని దాత తెలిపారు. కల్యాణకట్ట ఏఈవో రమాకాంత్ తదితరులు పాల్గొన్నారు.

'సమగ్ర శిక్ష' కింద కేంద్రాన్ని మరో రూ.1,200 కోట్లు కోరాం

మంత్రి లోకేశ్

ఈనాడు, అమరావతి: 'సమగ్ర శిక్షా అభియాన్ కింద రూ.1,363 కోట్లకు ఇప్పటికే రూ.1,259 కోట్లు ఖర్చు చేసేశాం. మరో రూ.1200 కోట్లు ఇవ్వాలని కేంద్రమంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌ను కోరాం. ఆయన సానుకూలంగా స్పందించారు. మరిన్ని నిధులు తీసుకువచ్చి ఖర్చు చేయబోతున్నాం' అని రాష్ట్ర విద్యాశాఖ మంత్రి లోకేశ్ తెలిపారు. కేంద్ర ప్రాయోజిత పథకాలపై చర్చ సందర్భంగా ఆయన ఈ విషయం వెల్లడించారు. మరోవైపు పీఎంఏవై అర్బన్ కింద అందుబాటులో ఉన్న నిధులు వెంటనే ఖర్చు పెట్టేలా చూడాలని మంత్రి పార్థసారథిని సీఎం ఆదేశించారు.

గ్రహం అనుగ్రహం

18-12-2025 గురువారం

శ్రీ విశ్వావసు నామ సంవత్సరం; దక్షిణాయనం; హేమంత రుతువు, మార్గశిర మాసం, బహాళపక్షం

చతుర్దశి: తె. 4-26 తదుపరి అమావాస్య

అనూరాధ: రా. 8-19 తదుపరి జ్యేష్ఠ

వర్జ్యం: రా. 2-30 నుంచి 4-17 వరకు

అమృత ఘడియలు: ఉ. 8-47 నుంచి 10-34 వరకు

దుర్ముహూర్తం: ఉ. 10-07 నుంచి 10-50 వరకు తిరిగి మ. 2-29 నుంచి 3-13 వరకు

రాహుకాలం: మ. 1-30 నుంచి 3-00 వరకు

సూర్యోదయం: ఉ.6.28; **సూర్యాస్తమయం:** సా.5.25

మాస శివరాత్రి

చలి - పులి

ప్రాంతం	కనిష్ఠ	గరిష్ఠ
ఆదిలాబాద్	9.2	28.8
హైదరాబాద్	13.7	30.3
విజయనగరం	16.0	28.0
అనంతపురం	16.0	30.4
శ్రీకాకుళం	17.0	28.0
కడప	17.0	29.0
విశాఖపట్నం	17.4	28.6
రాజమహేంద్రవరం	17.5	33.5
విజయవాడ	17.6	29.6
కర్నూలు	18.8	32.6
నరసాపురం	19.2	32.0
ఒంగోలు	20.9	31.4
గుంటూరు	22.0	29.0
నెల్లూరు	22.6	31.1
తిరుపతి	23.4	30.0
తాడేపల్లిగూడెం	28.0	31.0

జిల్లా స్థూల ఉత్పత్తిలో విశాఖపట్నం టాప్

అట్టడుగున అల్లూరి సీతారామరాజు జిల్లా

ఈనాడు, అమరావతి: జిల్లా స్థూల ఉత్పత్తి (జీడీడీపీ)లో విశాఖపట్నం రాష్ట్రంలోనే అగ్రగామిగా నిలవగా అల్లూరి సీతారామరాజు జిల్లా అట్టడుగున ఉంది. 2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి తొలి అర్ధ సంవత్సరంలోని (ఏప్రిల్-సెప్టెంబరు) జీడీడీపీ లెక్కల ఆధారంగా ఆయా జిల్లాల ర్యాంకులను ప్రభుత్వం బుధవారం కలెక్టర్ల సదస్సులో ప్రకటించింది. అత్యధికంగా జీడీడీపీ సాధించిన జిల్లాల్లో విశాఖపట్నం తర్వాతి స్థానాల్లో కృష్ణా, ఎన్టీఆర్, తిరుపతి, ఏలూరు, గుంటూరు నిలిచాయి. అత్యల్పంగా ఉన్న జిల్లాల్లో అల్లూరి సీతారామరాజు జిల్లా తర్వాత పార్వతీపురం మన్యం, అన్నమయ్య, నంద్యాల, పల్నాడు, విజయనగరం జిల్లాలు ఉన్నాయి. అతి తక్కువ జీడీడీపీ కలిగిన అల్లూరి, పార్వతీపురం మన్యం, అన్నమయ్య, నంద్యాల జిల్లాల జీడీడీపీ మొత్తం కలిపినా విశాఖపట్నం కంటే తక్కువే. రాష్ట్రంలోని అన్ని జిల్లాల మొత్తం కలిపి రూ. 7,58,271 కోట్లు కాగా.. అందులో రూ.2,33,378 కోట్లు (30.77 శాతం) విశాఖ, కృష్ణా, ఎన్టీఆర్, తిరుపతి, ఏలూరు జిల్లాల నుంచే ఉంది.

జీడీడీపీలో అగ్రభాగాన ఉన్న జిల్లాలు

జిల్లా	జీడీడీపీ	ర్యాంకు
విశాఖపట్నం	59,557	1
కృష్ణా	47,009	2
ఎన్టీఆర్	44,211	3
తిరుపతి	43,994	4
ఏలూరు	38,607	5
గుంటూరు	37,016	6

జీడీడీపీలో అట్టడుగున ఉన్న జిల్లాలు

జిల్లా	జీడీడీపీ	ర్యాంకు
అల్లూరి సీతారామరాజు	6,646	26
పార్వతీపురం మన్యం	8,474	25
అన్నమయ్య	19,427	24
నంద్యాల	19,490	23
పల్నాడు	19,600	22
విజయనగరం	19,836	21

(నోట్: జీడీడీపీ రూ.కోట్లలో)

3 నెలల మేకకు 30 సెం.మీ. చెవులు



మూడు నెలల మేక పిల్ల 30 సెంటీ మీటర్ల పొడవైన చెవులతో ఆకట్టుకుంటోంది. సాధారణంగా మన ప్రాంతాల్లో ఉండే మేకలు, పొట్టేళ్ల చెవులు 10 సెం.మీ. ఉంటాయి. కానీ, జమునా బ్రీడుగా పిలిచే మేకలకు మాత్రం చెవులు ఇలా పొడవుగా ఉంటాయి. చిత్తూరు శివారులోని మంగసముద్రానికి చెందిన గోపి జమ్మూ నుంచి రెండు జంట పిల్లలను తెప్పించి క్రాస్ బ్రీడ్ చేయించారు. ఇవి తక్కువ సమయంలో ఎక్కువ ఎత్తు, బరువు పెరుగుతాయని తెలిపారు. ఈ రకం మేకలు 80 కిలోల వరకు పెరుగుతాయన్నారు. – ఈనాడు, చిత్తూరు

10 గంటల ముందే ప్రయాణికుల జాబితాలు

(మొదటి పేజీ తరువాయి)

ముందురోజు రాత్రే రూపొందిస్తారు. మధ్యాహ్నం 2.01 గంటల నుంచి రాత్రి 11.59 గంటల వరకు; అర్ధరాత్రి 12 గంటల నుంచి తెల్లవారుజామున 5 గంటల మధ్య బయల్దేరే రైళ్ల తొలిచార్టును ఇదే విధంగా తగినంత ముందుగా సిద్ధం చేస్తారు. ఈ మేరకు చర్యలు తీసుకోవాలని అన్ని జోనల్ కార్యాలయాలకు రైల్వే మంత్రిత్వశాఖ ఆదేశాలిచ్చింది. తుదిచార్టులను మాత్రం ఇప్పటి మాదిరిగానే రైలు బయల్దేరడానికి ఎనిమిది గంటల ముందు తయారుచేస్తారు.

ఐఆర్‌సీటీసీ ఈ-వ్యాలెట్ల నుంచి డబ్బు ఉపసంహరణ కుదరదు

'భారతీయ రైల్వే ఆహార-విహార సంస్థ (ఐఆర్‌సీటీసీ) ఈ-వ్యాలెట్ల'లో డబ్బు జమ చేసుకున్నవారు దానిని టికెట్ల కొనుగోలుకే వాడాలని, ఉపసంహరణకు వీల్లేదని రైల్వేశాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ బుధవారం లోక్‌సభలో తెలిపారు. వ్యాలెట్లలో డబ్బు ఎక్కువకాలం పాటు పడిఉండకుండా వేరేచోట వాడుకునేందుకు వీలుగా అవకాశం గానీ, లేదా దానిపై వడ్డీని గానీ ఇచ్చే అవకాశం ఉందా అని ఓ సభ్యుడు అడిగిన ప్రశ్నకు ఆయన రాతపూర్వక సమాధానం ఇచ్చారు. ఈ-వ్యాలెట్ ఖాతాను మూసివేసినప్పుడే దానిలో మిగిలిపోయిన డబ్బును వినియోగదారుల బ్యాంకు ఖాతాల్లోకి బదలాయిస్తామని చెప్పారు.

వీరికి ఉద్యోగం అంటే లెక్కలేదు!

(మొదటి పేజీ తరువాయి)

రద్దుచేయకూడదో వివరణ ఇవ్వాలని షోకాజ్ నోటీసులు జారీచేశామని చెప్పారు. ఈనెల 31 లోపు వ్యక్తిగతంగా హాజరై వివరణ ఇవ్వాలని పేర్కొన్నారు. గడువులోగా లిఖితపూర్వక వివరణ ఇవ్వకపోతే వారి సేవలను పూర్తిగా రద్దుచేస్తామని డీఎంఈ స్పష్టంచేశారు.

ఏళ్లుగా విధులకు గైర్హాజరు..

విశాఖలోని ఆంధ్ర మెడికల్ కాలేజీలో పీడియాట్రిక్ సర్జరీ విభాగం అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ ఎం.జగన్ మోహన్ 2022 ఫిబ్రవరి 7 నుంచి.. విధులకు గైర్హాజరవుతున్నా చర్యల్లేవు.

- కర్నూలు వైద్య కళాశాలలో న్యూరాలజీ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ ఎ.శ్రీనివాసులు 2022 నవంబరు 8 నుంచి, తిరుపతిలోని ఎస్వీ వైద్యకళాశాల రేడియోథెరపీ విభాగం అసోసియేట్ ప్రొఫెసర్ ఎన్.ఆర్ముగం 2022 నవంబరు 7 నుంచి.. ఒంగోలు ప్రభుత్వ వైద్యకళాశాలలో పీడియాట్రిక్ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ ఎం.మురళీకృష్ణ 2022 జూన్ 28 నుంచి విధులకు గైర్హాజరయ్యారు.
- అనంతపురం ప్రభుత్వ వైద్య కళాశాల ఆర్థోపెడిక్ అసిస్టెంట్ ప్రొఫెసర్ ఆర్.బాలాజీ 2022 సెప్టెంబరు 1 నుంచి.. ఒంగోలులో న్యూరోసర్జరీ అసిస్టెంట్ ప్రొఫెసర్ షేర్ ఖాన్ 2022 మార్చి 13 నుంచి.. గైనకాలజీ అసిస్టెంట్ ప్రొఫెసర్ సునయ కమల 2022 సెప్టెంబరు 30 నుంచి.. కడప జీఎంసీ రేడియో డయాగ్నసిస్ అసిస్టెంట్ ప్రొఫెసర్ డా.పి.అర్చనారెడ్డి 2022 ఆగస్టు 22 నుంచి విధులకు హాజరవడంలేదు. వీరంతా మూడేళ్లకుపైగా గైర్హాజరవుతుంటే వైద్యారోగ్య శాఖలో ఉలుకూ పలుకూ లేదు.
- అనంతపురం ప్రభుత్వ వైద్య కళాశాలలో ఆర్థోపెడిక్స్ విభాగం ట్యూటర్ డాక్టర్ జీఎస్ రవి 2019 మార్చి 18 నుంచి.. (ఆరేళ్లకుపైగా..) విజయవాడలోని సిద్ధార్థ వైద్య కళాశాలలో పెథాలజీ ట్యూటర్ 2021 ఫిబ్రవరి 1 నుంచి (నాలుగేళ్లకుపైగా..) విధులకు హాజరవడంలేదు.

వైద్యశాలల బలోపేతానికి రూ.137 కోట్లు విడుదల

ఈనాడు, అమరావతి: రాష్ట్రంలో ఆరోగ్య వ్యవస్థ బలోపేతానికి ప్రధానమంత్రి ఆయుష్మాన్ భారత్ ఆరోగ్య మౌలిక సదుపాయాల మిషన్ కింద ప్రభుత్వం రూ.137.33 కోట్లు మంజూరు చేసింది. 2025-26 బడ్జెట్ అంచనాల నుంచి ఈ నిధులు కేటాయిస్తూ వైద్యశాలల అభివృద్ధి, సమర్థ సేవలకు వీలుగా ఈ నిధుల వినియోగానికి పరిపాలన ఆమోదం తెలిపింది. ఈ మేరకు వైద్యారోగ్య-కుటుంబ సంక్షేమ శాఖ కార్యదర్శి సౌరభ్ గౌర్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు.





సదస్సుకు హాజరైన వివిధ జిల్లాల కలెక్టర్లు, వివిధ శాఖల అధికారులు ● సదస్సులో సీఎం చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, మంత్రులు లోకేశ్, అనగాని సత్యప్రసాద్ మధ్య విరబూసిన నవ్వులు

మీరే అడ్డంకి కావద్దు

(మొదటి పేజీ తరువాయి)

పనిచేయండి. దేశంలోని అన్ని రాష్ట్రాలు మన గురించే మాట్లాడే పరిస్థితి రావాలి. అన్ని దేశాలూ మనవైపు చూడాలి.

పెట్టుబడిదారులపై చిన్న చూపొద్దు

పెట్టుబడులు పెడతామని వచ్చినవారిని గౌరవించండి. నేను మంత్రిని, కలెక్టర్‌ను.. వాళ్లే వచ్చి మన దగ్గర నిలబడాలన్న ధోరణి వద్దు. రాష్ట్రాభివృద్ధికి సహకరించేందుకు ఎవరు వచ్చినా సాదరంగా స్వాగతించాలి. మనం చేసే పనులు, అమలు చేసే విధానాల్లో భాగస్వాములు ప్రజలే. వారు పూర్తి సంతృప్తిగా లేరు. నాతో సహా ప్రతి ఒక్కరూ దీన్ని దృష్టిలో ఉంచుకుని పనిచేయాలి.

సెర్ప్, మెప్మాలు ఒకే గొడుగు కిందకు

సూపర్‌సిక్స్ ద్వారా ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపరిచేందుకు ప్రయత్నిస్తున్నాం. కూటమి ప్రభుత్వం వచ్చాక చేసిన డీఎస్సీ, కానిస్టేబుళ్ల ఉద్యోగ నియామకాలు చరిత్రాత్మక ఘట్టాలు. పేదరిక నిర్మూలనకు ఉద్దేశించిన సెర్ప్, మెప్మా విభాగాల్ని ఒకే గొడుగు కిందకు తెస్తాం. దస్త్రాల పరిష్కారం అంటే మన దగ్గర లేకుండా పైకో కిందకో తోసేయడమన్న భావనకు కొందరు వచ్చేశారు. దాని వల్ల సమస్యలు పరిష్కారం కావడం లేదు. ప్రజల్లో సంతృప్తి పెరగడం లేదు. ఇప్పుడు అందరూ జవాబుదారీగా ఉండేలా విధానాలు పెడుతున్నాం. రెవెన్యూ శాఖలో బ్లాక్‌చైన్ టెక్నాలజీతో వ్యవస్థల్ని కట్టుదిట్టం చేస్తున్నాం. ఫైల్ ప్రాసెసింగ్‌లో, ఆదేశాలు జారీ చేయడంలో ఎవరు, ఎప్పుడు తప్పు చేసినా ఆటోమేటిక్‌గా తెలిసిపోతుంది. ప్రస్తుతం చాలా దస్త్రాలకు లింక్ ఫైల్స్ లేవు. ఇకపై అలా కుదరదు. మీలో చాలామంది బాగా పనిచేశామని అనుకుంటున్నారు గానీ ఫలితాలు రావడం లేదు. కొన్ని విభాగాలు మంచి పనితీరు కనబరుస్తుంటే, మరికొన్ని అసలు పికప్ కావడం లేదు. వైకాపా ప్రభుత్వ హయాంలో కొన్ని విభాగాలు వ్యవస్థలోని లోపాల్ని అడ్డుపెట్టుకుని అధికార దుర్వినియోగానికి పాల్పడటం వల్ల సమస్యలు వచ్చాయి. రెవెన్యూ శాఖే దానికి నిదర్శనం. జనవరి నుంచి దస్త్రాలన్నీ ఆన్‌లైన్‌లోనే ఉండాలి. ప్రజలకు త్వరలో సేవలన్నీ ఆన్‌లైన్‌లోనే ఇవ్వాలి.

రహదారులపైనే ఎక్కువ ఫిర్యాదులు

ప్రజా సమస్యలపై చేసిన వివిధ సర్వేలను విశ్లేషించినప్పుడు.. రహదారులు బాగాలేవని 17 శాతం, మురుగుకాలువలపై 5.3 శాతం, నీటి కొరతపై 4.3 శాతం, గృహ వసతిపై 3.8 శాతం, నిరుద్యోగంపై 3.3 శాతం, వ్యవసాయానికి మద్దతు ధర లేదని 2.4 శాతం, పింఛన్లపై 2 శాతం, పథకాల అమలుపై 1.1 శాతం, భూసమస్యలపై 1.3 శాతం, కరెంటు కోతలపై 0.4 శాతం, ఎడ్యుకేషన్ సపోర్టు లేకపోవడంపై 0.4 శాతం మంది ఫిర్యాదు చేశారు. 51 శాతం మంది ఎలాంటి సమస్యలూ లేవని చెప్పారు. ఆ శాతాన్ని పెంచుకోవాలి. అయితే కేవలం అంకెలతోనే ప్రయోజనం నెరవేరదు. నమ్మకం మాటలతో రాదు. విశ్వసనీయతతో వస్తుంది. నమ్మకంతో పాటు సంతృప్తి కూడా ఉండాలి. రాబోయే రోజుల్లో గ్రీవెన్స్ పరిష్కారం విధానంలో మార్పులు తెస్తాం. అన్నదమ్ములు, తల్లీబిడ్డలు, అన్నా చెల్లెళ్ల మధ్య ఆస్తితగాదాలు ఎప్పటికీ తేలవు. వాటిపై పదే పదే అర్జీలు ఇస్తూనే ఉంటారు. ఇకపై అలాంటివాటిని వేరు చేసి, ఆన్‌లైన్‌లో విడిగా చూపిస్తాం.

13–14% వడ్డీకి ఎడాపెడా అప్పులు తెచ్చేశారు

వైకాపా ప్రభుత్వం అనేక తప్పులు చేసింది. ఉద్యోగులకు సకాలంలో జీతాలు కూడా ఇవ్వలేని దుస్థితి తెచ్చింది. 13-14 శాతం వడ్డీకి అప్పులు తెచ్చి, రాష్ట్రంపై మోయలేని భారం మోపింది. అన్ని రాష్ట్రాలూ ఎస్టాబ్లిష్‌మెంట్ వ్యయాల్ని తగ్గించుకుంటే.. వైకాపా ప్రభుత్వం మన రాష్ట్రంలో 100 శాతం పెంచేసింది. రాష్ట్ర ఆదాయం మొత్తం దానికే సరిపోతోంది. సంక్షేమానికి డబ్బు కష్టమవుతోంది. అందుకే 9 శాతం కంటే ఎక్కువ వడ్డీ ఉన్న రుణాలపై బ్యాంకర్లతో మాట్లాడుతున్నాం. రుణ పునర్వ్యవస్థీకరణ, తిరిగి చెల్లించడం, సంపద సృష్టి, ఆదాయమార్గాల పెంపుపై దృష్టి పెట్టాం.

పవన్ నిరంతరం కష్టపడుతున్నారు

ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ వేరే రంగం నుంచి రాజకీయాల్లోకి వచ్చినా ప్రజలకు మెరుగైన పాలన అందించేందుకు నిరంతరం కష్టపడుతున్నారని చంద్రబాబు కొనియాడారు. 'కానిస్టేబుళ్లకు నియామకపత్రాలు అందజేసే కార్యక్రమంలో వారిలో ఒకరు తమ ఊరికి రోడ్డు లేదని అడిగారు. పవన్ కల్యాణ్ వెంటనే వారి శాఖకు మెసేజ్ పంపించి అప్పటికప్పుడు రూ.3.9 కోట్లతో అంచనాలు సిద్ధం చేయించారు. మీటింగ్‌లోనే దాన్ని ప్రకటించాం. బాధ్యత అంటే అదీ' అని సీఎం ప్రశంసించారు.

రుషికొండపై పెట్టిన రూ.500 కోట్లతో రెండు వైద్య కళాశాలలు వచ్చేవి

వైద్యకళాశాలల్ని పీపీపీ విధానంలో చేపడుతుంటే ప్రైవేటుపరం చేస్తున్నారంటూ వైకాపా విషప్రచారం చేస్తోందని సీఎం మండిపడ్డారు. 'వైకాపా పాలకులు రుషికొండపై విలాసవంతమైన భవనాలకు రూ.500 కోట్ల ప్రజాధనాన్ని తగలేశారు. ఆ డబ్బులు పెడితే రెండు మెడికల్ కాలేజీలు వచ్చేవి. రుషికొండ భవనాలు ఇప్పుడు తెల్ల ఏనుగులా మారాయి' అని ధ్వజమెత్తారు. 'పీపీపీ ద్వారా నిర్మించే వైద్య కళాశాలలు ప్రభుత్వ ఆస్తులే. ప్రభుత్వ మార్గదర్శకాల మేరకే అవి నడుస్తాయి. ప్రభుత్వమే వాటిని నియంత్రిస్తుంది. వాటిపై పేరు ప్రభుత్వ కాలేజీలనే ఉంటుంది. ఫలానా సంస్థ నిర్వహిస్తోందని వారి పేరూ రాస్తారు. ఆ కాలేజీలు రావడం వల్ల వైద్య విద్య సీట్లు పెరుగుతాయి. అవుట్ పేషెంట్లకు వైద్యం నూరుశాతం ఉచితం. ఇన్ పేషెంట్లుగా 70 శాతం మందిని ఎన్టీఆర్ వైద్య సేవ కిందే చేర్చుకుంటారు. గత ప్రభుత్వ హయాంలో ప్రభుత్వ సర్వీసులు చాలవనే కదా ఆరోగ్యశ్రీ చికిత్స కోసం రోగుల్ని హైదరాబాద్, చెన్నై వంటి ప్రాంతాలకు పంపించారు. వాస్తవాల్ని ప్రజలకు వివరిస్తాం. పీపీపీ విధానంలో ప్రైవేటువాళ్లు అభివృద్ధి చేసిన రోడ్డుపై గుంత పడితే వెంటనే బాగు చేస్తారు. ప్రభుత్వ నిర్వహణలోని రోడ్డుపై గుంత పడితే అంచనాలు సిద్ధం చేసుకుని, అనుమతులు తెచ్చుకునేసరికి ఆ గుంత పదింతలు పెద్దదవుతుంది' అని ఆయన పేర్కొన్నారు.

ఏప్రిల్ నుంచి సంక్షేమ క్యాలెండర్

సంక్షేమశాఖలపై సమీక్షలో సీఎం చంద్రబాబు ఆదేశాలు

ఈనాడు, అమరావతి: సంక్షేమ పథకాల అమలుకు ప్రత్యేక క్యాలెండర్‌ను ప్రకటించాలని అధికారులను ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశించారు. ఏ నెలలో ఏ పథకాన్ని అమలు చేస్తామో స్పష్టంగా తెలియజేస్తూ వచ్చే ఆర్థిక సంవత్సరం నుంచి సంక్షేమ క్యాలెండర్‌ను అమల్లోకి తీసుకురావాలన్నారు. ఇందుకు సంబంధించి ఆర్థిక వనరుల్ని ముందుగానే సిద్ధం చేసుకోవాలని సూచించారు. సూపర్‌సిక్స్ పథకాల్లో 90 శాతం పైగా సంతృప్తి స్థాయి రావాలని స్పష్టం చేశారు. కలెక్టర్ల సదస్సులో సంక్షేమ శాఖలపై సమీక్షలో సీఎం ప్రసంగించారు. కీలకాంశాలివీ..

వసతిగృహాల నిర్వహణ సరిగా లేకపోతే డిస్మిస్ చేస్తాం: 'ఇటీవల కొన్ని సంక్షేమ వసతిగృహాల్లో మరుగుదొడ్లు, స్నానాలగదుల నిర్వహణ సరిగా లేకపోవడం, కలుషిత ఆహారం, తాగునీరు వల్ల విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారు. దీనికి సిగ్గుపడాలి. ఇకపై అలాంటి సంఘటనలు జరిగితే అధికారుల్ని సస్పెండ్ చేయాలి. అవసరమైతే డిస్మిస్ చేయాలి. అన్ని వసతిగృహాల్లోనూ మరుగుదొడ్లు, బాత్‌రూమ్‌లు, తరగతి గదుల నిర్వహణను అవుట్ సోర్సింగ్ విధానంలో చేపట్టాలి. కలెక్టర్లు, ప్రజాప్రతినిధులు వసతిగృహాల్లో ఒక రాత్రి బస చేయాలి. 5 వేల సంక్షేమ వసతిగృహాలను పీ4 కింద దత్తత తీసుకుని వసతులు కల్పించేలా చర్యలు తీసుకోవాలి. మైనింగ్ సీనరేజ్ నిధులు, సీఎస్ఆర్ నిధుల్ని వీటికి వినియోగించేందుకే తొలి ప్రాధాన్యమివ్వాలి. దీన్ని పర్యవేక్షించేందుకు జిల్లా అధికారిని ఇన్‌ఛార్జిగా నియమించాలి.

పిన్నెల్లికి ప్రత్యేక సౌకర్యాలు అనుమతించిన కోర్టు

ఈనాడు డిజిటల్, నరసరావుపేట: అనారోగ్య కారణాలు, మాజీ విప్, ప్రస్తుతం వైకాపా జిల్లా అధ్యక్షుడి హోదాలో ఉండటంతో తనను స్పెషల్ క్లాస్ 'ఏ' ఖైదీగా పరిగణించి ప్రత్యేక సౌకర్యాలకు అనుమతివ్వాలని మాచర్ల మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి వేసిన పిటిషన్‌ను కోర్టు సమర్థించింది. ఈ మేరకు అవసరమైన సౌకర్యాలను త్వరగా అందించాలని నెల్లూరు జిల్లా మేజిస్ట్రేట్, పోలీసు సూపరింటెండెంట్‌కు మాచర్ల అదనపు జూనియర్ సివిల్ జడ్జి కోర్టు న్యాయమూర్తి శ్రీనివాస కల్యాణ్ ఆదేశాలు జారీ చేశారు. జైలు నిబంధనల పరిధిలో ప్రత్యేక బ్యారక్ ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు. అనారోగ్య సమస్యలతో బాధపడుతుండటం వల్ల ప్రత్యేక గది, ఆహారం కోసం అనుమతివ్వాలని ఈనెల 16న మాచర్ల కోర్టులో పిన్నెల్లి పిటిషన్ వేశారు.

జనవరి నుంచి ఉన్నతి 2.0

- ఎస్సీ యువతకు స్వయం ఉపాధి రాయితీ రుణాలు
- సాంఘిక, గిరిజన సంక్షేమశాఖ కార్యదర్శి ఎంఎం నాయక్

ఈనాడు, అమరావతి: సెర్ప్, ఎస్సీ కార్పొరేషన్ ద్వారా స్వయం ఉపాధి రాయితీ రుణాలకు సంబంధించి ఉన్నతి 2.0 పథకాన్ని జనవరి నుంచి ప్రారంభించనున్నామని, అన్ని జిల్లాల కలెక్టర్లు అర్హుల ఎంపిక చేపట్టాలని సాంఘిక, గిరిజన సంక్షేమశాఖ కార్యదర్శి ఎంఎం నాయక్ సూచించారు. నైపుణ్య శిక్షణ సంస్థ ద్వారా 10 వేల మంది గిరిజన యువతకు శిక్షణ ఇవ్వనున్నట్లు వెల్లడించారు. గిరిజనులను ఉద్యాన ప్రాజెక్టు కింద పసుపు, డెయిరీ, రబ్బరు చెట్ల పెంపకం రంగాల్లో ప్రోత్సహిస్తామన్నారు. కలెక్టర్ల సదస్సులో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, మహిళా శిశు సంక్షేమం, సెర్ప్ శాఖలపై ఆయా శాఖల ఉన్నతాధికారులు ప్రజెంటేషన్ ఇచ్చారు.

- వచ్చే ఏడాది నుంచి డ్వాక్రా మహిళలు రుణం కోసం బ్యాంకులకు దరఖాస్తు చేసుకున్న 48 గంటల్లో మంజూరయ్యేలా చర్యలు తీసుకుంటున్నట్లు సెర్ప్ శాఖ కార్యదర్శి వాకాటి కరుణ తెలిపారు. సర్క్యులర్ ఎకానమీ ద్వారా జూట్ బ్యాగుల తయారీని ప్రోత్సహిస్తున్నామన్నారు.
- స్వచ్ఛ భారత్ పథకం కింద బీసీ వసతి గృహాల్లో 971 మరుగుదొడ్లు మంజూరయ్యాయని, వీటిని త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టర్లకు బీసీ సంక్షేమశాఖ కార్యదర్శి సత్యనారాయణ సూచించారు. వసతి గృహాల్లో సీసీ కెమెరాల ఏర్పాటును ప్రాధాన్యంగా తీసుకోవాలన్నారు.
- అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు పోషకాహారాన్ని అందించడంలో ఫేషియల్ రికగ్నిషన్ విధానాన్ని తీసుకొచ్చినట్లు మహిళా శిశు సంక్షేమశాఖ కార్యదర్శి సూర్యకుమారి వివరించారు. ముస్తాబు కార్యక్రమాన్ని అమలు చేస్తున్నామన్నారు.

లోకాయుక్త, హెచ్‌ఆర్‌సీలు కర్నూలులోనే

(మొదటి పేజీ తరువాయి)

హెచ్‌ఆర్‌సీ కార్యాలయాలను కర్నూలులో ఏర్పాటు చేయడాన్ని సవాలు చేస్తూ డాక్టర్ మద్దిపాటి శైలజ 2021లో హైకోర్టులో పిల్ వేశారు. ఇదే అంశంపై ఏపీ సివిల్ లిబర్టీస్ అసోసియేషన్ (ఏపీసీఎల్ఏ) సంయుక్త కార్యదర్శి ఏకేఎన్ మల్లేశ్వరరావు అప్పట్లో పిల్ వేశారు. ఈ వ్యాజ్యాలు బుధవారం హైకోర్టులో విచారణకు వచ్చాయి. పిటిషనర్ల తరఫు న్యాయవాది డీఎస్ఎన్‌వీ ప్రసాదబాబు వాదనలు వినిపించారు. హెచ్‌ఆర్‌సీ, లోకాయుక్త కార్యాలయాలను హైదరాబాద్ నుంచి నేరుగా విజయవాడకు తరలించేందుకు అన్ని ఏర్పాట్లూ చేశారన్నారు. అందుకోసం రూ.కోట్లలో ఖర్చు చేశారని తెలిపారు. ఆ ప్రయత్నాన్ని విరమించి, కర్నూలులో ఏర్పాటు చేశారని పేర్కొన్నారు. శ్రీకాకుళం నుంచి కర్నూలుకు వెళ్లాలంటే శ్రమతో కూడుకొన్న విషయమని, అందువల్ల న్యాయస్థానాలు, ట్రైబ్యునళ్లు, న్యాయ సంబంధ సంస్థలన్నీ రాజధాని అమరావతిలోని జస్టిస్ సిటీలో ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందని వాదించారు.

గుండె.. మెగ్నీషియం మ్యాగ్నెట్



మానవ శరీరంలో 4-6 టీ స్పూన్ల మెగ్నీషియం ఉంటుంది. అందులో అధికశాతం ఎముకలు, పళ్లలో ఉంటుంది. ఆ తర్వాత ఎక్కువగా గుండె కణాల్లో ఉంటుంది. అది రక్తంలో ఉండే మెగ్నీషియం స్థాయి కంటే 10 రెట్లు ఎక్కువ. అందుకే హృదయాన్ని మెగ్నీషియం మ్యాగ్నెట్‌గా వ్యవహరిస్తారు. ఇది గుండె ఆరోగ్యానికి మెగ్నీషియం ఆవశ్యకతను తెలియచేస్తుంది. గోధుమలు, పాలకూర, బాదం, జీడిపప్పు, వేరు సెనగ, అవకాడోల్లో మెగ్నీషియం అధికంగా లభిస్తుంది.
– క్రిస్టీ లియాంగ్, ఫిజీషియన్

65 ఏళ్లు నిండితే ఉపకులపతి పదవికి అనర్హులు!

(మొదటి పేజీ తరువాయి)

లేదా 65 ఏళ్ల వయసు.. ఇందులో ఏది ముందైతే దాన్ని పరిగణనలోకి తీసుకుంటారు. రెక్టార్ పోస్టును ప్రో-వైస్‌ఛాన్సలర్‌గా మార్పు చేయనున్నారు.

మార్పు ఎందుకు ?

రాష్ట్రంలో ప్రస్తుతం రాష్ట్ర నిధులతో నడిచే విశ్వవిద్యాలయాలు 32 ఉన్నాయి. వీటిలో 11 సంప్రదాయ, 21 ప్రత్యేక వర్సిటీలు ఉన్నాయి. వేర్వేరు చట్టాల ద్వారా 24 వర్సిటీలు కొనసాగుతున్నాయి. వీటి పరిపాలన, విద్య, ఆర్థిక నిర్మాణాలు ఒకే విధంగా ఉన్నా చట్టాలు వేరుగా ఉన్నాయి.

ఎకడమిక్‌లో ఏం తీసుకురానున్నారు..

- నైపుణ్యాభివృద్ధి, ఫలితాల ట్రాకింగ్, సిబ్బంది పదోన్నతుల కోసం బోధన- అభ్యాసంలో డిజిటల్ టెక్నాలజీ, ఏఐ ఆధారిత విశ్లేషణ ఉంటుంది.
- పరిశోధనల సమన్వయం, పర్యవేక్షణ, నిధుల కోసం పరిశోధనాసలహా మండలి ఏర్పాటు
- ఇంక్యుబేషన్ కేంద్రాల ఏర్పాటు
- విద్యా సంస్థ ఎకడమిక్ మదింపు వ్యవస్థ, వర్సిటీ-పరిశ్రమ హబ్ ఏర్పాటు

కొత్తగా బీఓజీ..

- బోర్డు ఆఫ్ గవర్నర్స్‌కు ప్రముఖ పారిశ్రామికవేత్త, టెక్నోక్రాట్, విద్యావేత్త, శాస్త్రవేత్త, సామాజిక శాస్త్రవేత్త, న్యాయనిపుణుల నుంచి ఒకరిని ఛైర్‌పర్సన్‌గా నియమిస్తున్నారు. పరిపాలన, విద్య, ఆర్థిక విధానాలను నిర్దేశించే అత్యున్నత సంస్థగా ఇది కొనసాగుతుంది.
- అన్ని వర్సిటీల్లోనూ విద్యా మండలి ఏర్పాటు. ఇది ఏడాదికి రెండు పర్యాయాలు సమావేశం కావాల్సి ఉంటుంది. అత్యవసర విద్యా విషయాలపై ఈ మండలి స్టాండింగ్ కమిటీ నిర్ణయాలు తీసుకుంటుంది.
- న్యాక్ గుర్తింపు ఉన్న కళాశాలల ప్రతినిధులకే ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్, ఎకడమిక్ కౌన్సిల్‌లో ప్రాతినిధ్యం ఉంటుంది.
- అంతర్గత నాణ్యత భరోసా సెల్ ఉంటుంది.
- విశ్వవిద్యాలయాల్లో పారదర్శకంగా సిబ్బంది నియామకాలకు విశ్వవిద్యాలయాల నియామక బోర్డు ఏర్పాటు.
- మెరిట్ కమ్ సీనియారిటీతోనే బోధనేతర ఉద్యోగులకు పదోన్నతులు. ప్రస్తుతం ఉన్న డైరెక్టర్, అడ్మినిస్ట్రేటివ్ అధికారి పదవులను చట్టబద్ధ హోదా.
- కొన్ని వర్సిటీల్లోని రీజినల్, జోనల్ సెంటర్లు, ఎక్స్‌పరిమెంట్ స్టేషన్ లాంటి అనుబంధ సంస్థలకు చట్టబద్ధ హోదా ఇస్తారు.
- రాజీవ్‌గాంధీ విజ్ఞాన, సాంకేతిక విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలోని ట్రిపుల్ ఐటీలకు ఉన్న సెంట్రల్ జనరల్ కౌన్సిల్, కార్యనిర్వాహక కౌన్సిళ్ల తొలగింపు.

వీసీలపైన విచారణ..

- వైస్‌ఛాన్సలర్ (వీసీ) ఎంపికకు వేసే సెర్చ్ కమిటీలో బోర్డు ఆఫ్ గవర్నర్స్, యూజీసీ, ప్రభుత్వం నుంచి ఒక్కొక్కరు నామినీగా ఉంటారు.
- వీసీ పదవీకాలం 3 ఏళ్లు పూర్తయినా.. 65 ఏళ్లు నిండినా పదవి నుంచి తొలగాల్సి ఉంటుంది.
- అవకతవకలకు పాల్పడినా, చట్టం, శాసనాలు ఉల్లంఘించినా వీసీపై విచారణ జరిగితే సస్పెండ్ చేయవచ్చు.
- పదవిలో వీసీ కొనసాగడం వర్సిటీ ప్రయోజనాలకు హానికరమని భావిస్తే తొలగించవచ్చు. రాజకీయ కార్యకలాపాల్లో పాల్గొన్నా తొలగింపు విషయంలో కులపతిదే అంతిమ నిర్ణయం.
- రెక్టార్ హోదాను ప్రో-వైస్‌ఛాన్స్‌లర్‌గా మార్పు చేశారు. కనీసం ఐదేళ్లు ప్రొఫెసర్‌గా పని చేసిన వారిని రెక్టార్‌గా నియమించాల్సి ఉంటుంది. ద్రవిడ వర్సిటీకి ఈ పోస్టు ఉండదు.

పిల్లల సంరక్షణ సెలవులపై ఉద్యోగుల్లో ఆనందం

- ఆరోగ్య కార్డుల సమస్యకూ 60 రోజుల్లో పరిష్కారం
- సీఎం చంద్రబాబు, మంత్రులకు ధన్యవాదాలు
- ఏపీ ఎన్జీవో అధ్యక్షుడు ఎ.విద్యాసాగర్



ఉద్యోగులతో మాట్లాడుతున్న విద్యాసాగర్, ఏపీఎన్జీవో నేతలు

ఈనాడు, అమరావతి: ఉద్యోగ, ఉపాధ్యాయ, పింఛనుదారుల సమస్యల పరిష్కారానికి కూటమి ప్రభుత్వం తీసుకుంటున్న చొరవతో లక్షల మంది వేతన జీవులకు ప్రయోజనం కలుగుతోందని ఏపీ ఎన్జీవో అధ్యక్షుడు, ఏపీ జేఏసీ ఛైర్మన్ ఎ.విద్యాసాగర్ తెలిపారు. పిల్లల సంరక్షణ సెలవులను ఎప్పుడైనా వాడుకునే వెసులుబాటు కల్పించడంతో 2 లక్షల మందికి లబ్ధి చేకూరబోతోందన్నారు. విజయవాడలోని ఏపీ ఎన్జీవో హోంలో అన్ని జిల్లాల మహిళా ఉద్యోగులతో బుధవారం విద్యాసాగర్ సమావేశమయ్యారు. ప్రభుత్వ నిర్ణయంపై హర్షం వ్యక్తం చేశారు. విద్యాసాగర్ మాట్లాడుతూ.. మహిళా ఉద్యోగులకు పిల్లల సంరక్షణ సెలవులను 2018లోనే చంద్రబాబు అమల్లోకి తీసుకొచ్చారన్నారు. కానీ, గత ప్రభుత్వం అమలు చేయలేదన్నారు. 'వయోపరిమితి వల్ల ప్రస్తుతం లక్షల మంది ఉద్యోగులు ఆ సెలవులను వాడుకోలేకపోతున్నారనే విషయం ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లాం. సీఎం స్పందించి వయోపరిమితి ఆంక్షలు తొలగించారు. ఒంటరి పురుష ఉద్యోగులకూ ఇది వర్తిస్తుంది' అని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రులు లోకేశ్, సత్యకుమార్ యాదవ్, ఉన్నతాధికారులకు ఏపీ ఎన్జీవో ఉద్యోగులందరం ధన్యవాదాలు తెలియజేస్తున్నామన్నారు. ఆరేళ్లుగా 24 లక్షల ఉద్యోగుల ఆరోగ్య కార్డులు పనిచేయడం లేదని విద్యాసాగర్ తెలిపారు. 'ముఖ్యమంత్రికి ఈ విషయాన్ని తెలియజేశాం. ఇతర రాష్ట్రాల్లోని విధానాలు వివరించాం. 60 రోజుల్లో ఉద్యోగులకు మేలు చేసే నిర్ణయం రాబోతోంది' అని విద్యాసాగర్ తెలిపారు. ఉద్యోగుల ఆర్థికేతర సమస్యలూ ఒక్కోటిగా వచ్చే 3 నెలల్లో పరిష్కారం కాబోతున్నాయని తెలిపారు.

ఈనాడు

రక్తమార్పిడి సేవలు మెరుగుపడవా?

చక్కటి రక్తమార్పిడి సేవలు(బీటీఎస్‌) అనేవి ఆరోగ్య సంరక్షణ వ్యవస్థలో అతిముఖ్యమైనవి. అత్యవసర సమయాల్లో ఎక్కించే నెత్తురు ద్వారా ఇన్ఫెక్షన్లు ఏవీ సంక్రమించకుండా చూడటానికి మన దేశానికంటూ ఒక సమగ్ర వ్యూహం ఉండాలి. ఈ మేరకు ఎప్పుడో పద్దెనిమిదేళ్ల క్రితమే స్పష్టీకరించిన జాతీయ రుధిర విధానం(ఎన్‌బీపీ)- సురక్షితమైన రక్తం, దాని భాగాలను ప్రజావసరాలకు తగినంతగా అందుబాటులో ఉంచడం ప్రభుత్వ కర్తవ్యమని ఉద్ఘాటించింది. దేశవ్యాప్తంగా రక్తమార్పిడి సేవలను పునర్వ్యవస్థీకరించడం, తాజా సాంకేతిక పరిజ్ఞానంతో ‘బీటీఎస్‌’ను సమర్థంగా నిర్వహించడం తదితరాలనూ ఎన్‌బీపీ ప్రస్తావించింది. అవన్నీ నీటిపైరాతలైన దౌర్భాగ్య వాతావరణంలో రక్తనిధి కేంద్రం నిర్వాహకుల నేరపూరిత నిర్లక్ష్యం కారణంగా కిందటి నెలలో ఝార్ఖండ్‌లో ఆరుగురు థలసీమియా బాధిత చిన్నారులకు హెచ్‌ఐవీ సోకింది. మధ్యప్రదేశ్‌లో మరో ఆరుగురు థలసీమియా పీడిత పిల్లలు అలాగే హెచ్‌ఐవీ బారినపడినట్లు తాజాగా వెలుగుచూసింది. తమిళనాడు, ఒడిశా, మహారాష్ట్ర, గుజరాత్‌, రాజస్థాన్‌, ఉత్తర్‌ప్రదేశ్‌, దిల్లీ వంటిచోట్ల కూడా గతంలో పలువురికి హెచ్‌ఐవీ రక్తం ఎక్కించిన దారుణాలు అనేకం బయటపడ్డాయి. రక్తాన్ని సేకరించడం మొదలు మార్పిడి దాకా ప్రతి దశలో మేటవేసిన లోపాలు ఎంతోమందికి ప్రాణసంకటాలవుతున్నాయి!

మన దేశంలో ఏడాదికి 44వేల మంది చిన్నారులు సికిల్‌సెల్‌ అనీమియాతో, 15వేల మంది పిల్లలు తీవ్రస్థాయి థలసీమియాతో జన్మిస్తున్నారని అంచనా. తమ ఆయుర్దాయాన్ని పొడిగించుకోవాలంటే- పాపం! ఆ అభాగ్యులు తరచూ రక్తమార్పిడి సేవలు పొందక తప్పదు. ఇలాగే మరికొన్ని రక్తసంబంధిత వ్యాధులతో పోరాడేవారు, క్యాన్సర్‌ రోగులు, రోడ్డు ప్రమాదాల బాధితులు, శస్త్రచికిత్సలు చేయించుకునేవారు, కాన్పు సమయంలో రక్తస్రావానికి గురయ్యేవారికి అప్పటికప్పుడు నెత్తురు ఎక్కించాల్సి వస్తుంది. ఇలా భారతావనిలో సగటున ప్రతి రెండు సెకండ్లకు ఒకరికి రక్తం అవసరం పడుతోంది. వెరసి, మన దేశానికి ఏడాదికి దాదాపుగా 1.46కోట్ల యూనిట్ల నెత్తురు కావాలి. 2024-25లో అంతకంటే కాస్త ఎక్కువ రక్తాన్నే దాతల నుంచి సేకరించినట్లు సర్కారీ వర్గాలు సెలవిస్తున్నాయి. కానీ, పలు ప్రాంతాల్లో ప్రాణాపాయ స్థితిలో ఉన్నవారికీ సకాలంలో నెత్తురు దొరకట్లేదు. పైపెచ్చు రక్తనిధి కేంద్రాలూ ఆసుపత్రుల నడుమ సమన్వయ రాహిత్యం, అధ్వాన నిల్వ సదుపాయాల కారణంగా ఏటా లక్షల బ్లడ్‌బ్యాగులు నేలపాలవుతున్నాయి. రక్త సేకరణ, మార్పిడి సందర్భాల్లో కనీసపాటి జాగ్రత్తలు తీసుకోని కొంతమంది ప్రబుద్ధుల పాతకాలకు ఎన్నో కుటుంబాలు నిత్యం నరకం చవిచూస్తున్నాయి!

ఈ-రక్తకోశ్‌ పోర్టల్‌ ప్రకారం, దేశవ్యాప్తంగా 4503 రక్తనిధి కేంద్రాలున్నాయి. వాటిలో అత్యధికం ప్రైవేట్‌వే. క్రియాశీలకంగా పనిచేస్తున్న ప్రభుత్వ బ్లడ్‌సెంటర్లు 1047 మాత్రమే. ఇక అందుబాటులో ఉన్న రక్తనిధి కేంద్రాల్లోనూ చాలావరకు పట్టణ, మైదాన ప్రాంతాల్లోనే కనిపిస్తాయి. దాంతో గ్రామీణులకు, రక్తసంబంధ వ్యాధులతో అధికంగా బాధపడుతున్న గిరిజనులకు ‘బీటీఎస్‌’ ప్రయోజనాలు సరిగ్గా అందట్లేదు. రక్తసేకరణ మొదలు అన్ని విషయాల్లో నిబంధనలకు నీళ్లొదులుతున్న ప్రైవేట్‌ రక్తనిధి కేంద్రాల నిర్వాహకులకూ దేశంలో లోటేమీ లేదు. ప్రజారోగ్యానికి శత్రువులైన అలాంటి స్వార్థపరులపై ప్రభుత్వాలు కఠిన చర్యలు తీసుకోవాలి. సేవాదృక్పథం కలిగిన ధార్మిక సంస్థలు రక్తనిధి కేంద్రాల నిర్వహణకు ముందుకొచ్చేలా ప్రోత్సహించాలి. ఒక్క యూనిట్‌ నెత్తురు, దాని భాగాలు మూడు ప్రాణాలను నిలబెడతాయన్న వాస్తవాన్ని విడమరుస్తూ రక్తదానంపై ప్రజావగాహన పెంచాలి!




సేవారంగంలో ఉన్నా, తయారీ రంగంలో ఉన్నా అందరికన్నా మనం ముందు ఉండాలీ అంటే- ఎవరో మనకు పోటీ వచ్చేదాకా ఆగకూడదు. మనల్ని మనమే ఓడించుకుంటూ ముందుకెళ్లాలి.

– ఆనంద్‌ మహీంద్ర

శాంతిపథం

నేటి ఉరుకులు పరుగుల జీవనపోరాటంలో ‘శాంతి’ అనే పదానికి చోటు లేకుండా పోయింది. చీకూచింతా లేకుండా ఉండటమే ‘శాంతి’ అని చెప్పవచ్చు. కానీ సంకటాలు లేని మనిషి జీవితం ఊహకందదే. తెల్లారి నిద్ర లేచింది మొదలు రకరకాల ఈతి బాధలు. సంసారం, సంపాదన, సంతానం... వీటి చుట్టూనే సమస్యలన్నీ. కోరికలే బాధలకు మూలమన్నాడు గౌతమబుద్ధుడు. బాల్యం నుంచి వృద్ధాప్యం వరకు ఎప్పుడైనా కోరిక లేకుండా గడపడం సాధారణ మనిషికి ఎలా సాధ్యం?

రకరకాల విద్యలు నేర్చుకోవాలన్న కోరిక, గొప్ప గొప్ప ఉద్యోగాలు చేయాలన్న ఆశ, మంచి పేరు తెచ్చుకోవాలన్న ఆకాంక్ష, సంసారం సుఖంగా సాగిపోవాలన్న ఇచ్ఛ, సంతానాన్ని వృద్ధిలోకి తేవాలన్న ఆశయం... ఇవేవీ లేకుంటే మనిషి మనుగడే ప్రశ్నార్థకమవుతుంది. అయితే ఈ కోరికలన్నీ ధర్మాన్ని అనుసరించాలి. ధర్మబద్ధమైన కోరిక అత్యాశకు అవకాశమివ్వదు. మనిషి పెరిగే క్రమంలో ఏర్పడే కోరికలన్నిటినీ ధర్మబద్ధంగా సాధించడానికి శ్రమించాలి. దాని ద్వారా కలిగే తృప్తి అనిర్వచనీయమైన ఆనందాన్నిస్తుంది. ఆ ఆనందమే మనశ్శాంతికి దారితీస్తుంది.



అంతర్యామి

మనశ్శాంతి ఒక్కొక్కరికి ఒక్కోవిధంగా లభిస్తుంది. తన కుటుంబ సౌఖ్యంతోపాటు పరోపకారమనే తోవలో నడిచేవారికి తృప్తి, తద్వారా మనశ్శాంతి లభిస్తాయి. శ్రీకృష్ణుడు బాల్యక్రీడలు ఆడి ఆడి అలసి మిత్రులతో ఒక చెట్టు కింద విశ్రమిస్తాడు. చెట్టును ఆదర్శంగా తీసుకోగలిగితే మానవజన్మ ధన్యమవుతుందని మిత్రులకు వివరిస్తాడు. శత్రువుకు కూడా నీడనిచ్చి ప్రేమతో చూడటం చెట్టుకే సాధ్యం. రాళ్లతో కొట్టినా పండ్లనే ఇస్తుంది, నరికినా కలపనిస్తుంది. అలా మనిషి తీరుతెన్నులు ఉంటే అది ఇచ్చే తృప్తికి వెలకట్టగలమా?

కోరిక లేనిదే అసలు లోకం ఈ విధంగా అభివృద్ధిపథాన నడవగలిగేదా? 2030 నాటికి చంద్రమండలంపైకి మానవసహిత అంతరిక్ష నౌకను పంపాలనే లక్ష్యం కొందరు శాస్త్రవేత్తలది. భయంకర రోగాలకు చికిత్స కనిపెట్టాలనే లక్ష్యం కొందరు పరిశోధకులది. కోరిక వ్యక్తిగతమైతే లక్ష్యం సామాజికమైనది. ఇవన్నీ దేశానికి గర్వకారణం! పరులకు హాని కలిగించని కోరిక సత్ఫలితాన్ని ఇస్తుంది. అలాంటి ఉత్తమ ఫలితాలను సాధించడంలోనే తృప్తి ఉంటుంది. నేటి యాంత్రిక జీవితగమనంలో నైతిక విలువలు, ఆప్యాయత, అనురాగాలు నిర్లక్ష్యానికి గురవుతున్నాయి. ఇలాంటి పరిస్థితులే వ్యక్తులకూ, సమాజానికీ అశాంతి కారకాలవుతున్నాయి. కుటుంబాలలో పెద్దలను చూసే, వారి జీవనశైలి నుంచే సచ్ఛీలత, ప్రేమానురాగాలను నేర్చుకుంటారు పిల్లలు. కాబట్టి పెద్దవాళ్ల చేతలు అనుసరణీయమైనవి కావాలి. తల్లిదండ్రులను, భార్యాబిడ్డలను వదిలి శాంతిని వెతుకుతూ వెళ్లిన విష్ణుశర్మ అసలైన శాంతి తన ధర్మాన్ని తాను నిర్వర్తించడంలోనే ఉందని ధర్మవ్యాధుని ద్వారా తెలుసుకుంటాడు. తల్లిదండ్రుల సేవ, భార్యాబిడ్డల సంరక్షణ ఇవి గృహస్థు ధర్మాలు. వాటిని ఆచరించడంలోనే మనసుకు ‘శాంతి’ లభిస్తుందని గ్రహిస్తాడు. ఇలానే కదా ఇళ్లన్నీ శాంతినివాసాలయ్యేది!

స్థూలంగా సమాజం శాంతియుతంగా ఉండాలంటే ప్రతి వ్యక్తీ తన వయసు ధర్మం, వృత్తిధర్మం పాటించాలి. ఇతరుల మేలు కోరాలి. తద్వారా కలిగే తృప్తే మనసుకు హాయినిస్తుంది. శాంతియుత జీవనమే ఆదర్శప్రాయం, ఆచరణీయం.

– మోదుకూరు రాధాకృష్ణ శర్మ

పెద్ద చిక్కులకు అణు పరిష్కారాలు

ప్రపంచవ్యాప్తంగా ఆహార అభద్రత పెరుగుతోంది. క్యాన్సర్ల దాడి తీవ్రమవుతోంది. నీటి వనరులు కాలుష్యం బారిన పడుతున్నాయి. పర్యావరణం తీవ్రంగా దెబ్బతింటోంది. ఇలాంటి ఎన్నో సమస్యలకు మేలిమి పరిష్కారంగా అణుశక్తి నిలుస్తుందన్న విశ్లేషణలు వినిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో పౌర అణు రంగంలో ప్రైవేటు పెట్టుబడులను ప్రోత్సహించాలని కేంద్రం సంకల్పించింది. దీనికి సంబంధించిన బిల్లు నిన్న లోక్‌సభ ఆమోదం పొందింది.

ఇండియా 2047 నాటికి కర్బన ఉద్గారాల తటస్థత సాధించాలని నిర్ణయించింది. ఈ నేపథ్యంలో పునరుత్పాదక ఇంధన వనరులపై ప్రత్యేక దృష్టి సారించింది. అయితే, ఆర్థిక వ్యవస్థ విస్తరించేకొద్దీ సంప్రదాయ ఇంధన వనరులు పెద్దమొత్తంలో అవసరమవుతాయి. వాటి వల్ల కాలుష్యం పెరిగిపోతుంది. అందుకే, అణు విద్యుత్‌ రంగంపై కేంద్రం దృష్టిపెట్టింది. దేశీయంగా అణు రంగం ప్రభుత్వం చేతిలోనే ఉంది. ఆ నిబంధనలను సడలించి ప్రైవేటు, విదేశీ పెట్టుబడులకు ద్వారాలు తెరిచేందుకు కేంద్రం అణుశక్తి బిల్లును తీసుకొచ్చింది. పౌర అవసరాలకు తగినట్లు ఈ రంగాన్ని పూర్తిగా నిర్వచించే లక్ష్యంతో కొత్త బిల్లుకు ‘శాంతి’ అని పేరు పెట్టింది. దేశ భావి ఇంధన అవసరాలను తీర్చడంలో ఇది కీలకం కాగలదు. ముఖ్యంగా 2047 నాటికి 100 గిగావాట్ల అణు శక్తి సామర్థ్యాన్ని సాధించాలన్న ఇండియా లక్ష్యానికి ఇది ఎంతగానో అక్కరకొస్తుంది. పైగా ఆరోగ్య సంరక్షణ నుంచి పరిశ్రమల దాకా, వ్యవసాయం నుంచి పర్యావరణ పరిరక్షణ వరకు అణుశాస్త్రం, సంబంధిత సాంకేతికతల వినియోగం విస్తృతమవుతున్న నేపథ్యంలో కేంద్రం నిర్ణయం కొత్త మార్పులకు శ్రీకారం చుట్టనుంది.



బహుళ ప్రయోజనాలు

వాతావరణ మార్పుల నివారణకు శుద్ధ, విశ్వసనీయ, చవకైన ఇంధనాల ప్రాధాన్యం పెరుగుతోంది. ఈ నేపథ్యంలో ప్రపంచ దేశాలకు అణుశక్తి ఆశాదీపంలా మారింది. త్రీ మైల్‌ ఐలాండ్‌ (1979), చెర్నోబిల్‌ (1986), ఫుకుషిమా (2011) అణు కేంద్రాల్లో ప్రమాదాల తరవాత భద్రతా ప్రమాణాలు బలోపేతమయ్యాయి. దాంతో అణు శక్తిని ఇప్పుడు వాతావరణ మార్పులను ఎదుర్కొనే సుస్థిర పరిష్కారంగా భావిస్తున్నారు. ఈ క్రమంలో ఆసియాలో కొత్త రియాక్టర్ల నిర్మాణం పెరగడం అణుశక్తి పునరుద్ధరణకు సంకేతంగా నిలుస్తోంది. చిన్న మాడ్యులర్‌ రియాక్టర్లు (ఎస్‌ఎంఆర్‌లు), అధునాతన ప్రెజరైజ్డ్‌ వాటర్‌ రియాక్టర్లు (పీడబ్ల్యూఆర్‌లు) నీటిలో ఉప్పు తొలగింపు, వైద్య రేడియో ఐసోటోప్‌ల తయారీకి ఊతమిస్తున్నాయి.

గత దశాబ్దకాలంలో వైద్యంలో అణుశాస్త్ర వినియోగం అధికమైంది. క్యాన్సర్‌ చికిత్స, నిర్ధారణలో రేడియేషన్‌ సాంకేతికత బాగా అక్కరకొస్తోంది. ప్రపంచ ఆరోగ్య సంస్థ లెక్కల ప్రకారం విశ్వవ్యాప్తంగా క్యాన్సర్‌ మరణాల్లో 70శాతం అభివృద్ధి చెందుతున్న దేశాల్లోనే సంభవిస్తున్నాయి. చికిత్స సదుపాయాల లేమే దానికి ప్రధాన కారణం. ఈ దుస్థితిని నివారించడానికి రేస్‌ ఆఫ్‌ హోప్‌ అనే కార్యక్రమాన్ని అంతర్జాతీయ అణుశక్తి సంఘం(ఐఏఈఏ) ప్రారంభించింది. దీని ద్వారా క్యాన్సర్‌ చికిత్సలో అసమానతలను తగ్గించడానికి రేడియో థెరపీ, వైద్య ఇమేజింగ్‌ పరికరాలు, శిక్షణ సదుపాయాలు కల్పిస్తోంది. ఆహార పదార్థాల సురక్షిత నిల్వ, పరిశ్రమల్లో పదార్థ పరీక్షలు వంటి వాటిలోనూ అణు సాంకేతికత ఉపయోగపడుతోంది. ప్రపంచ ఆహార, వ్యవసాయ సంస్థ అంచనాల ప్రకారం విశ్వవ్యాప్తంగా ఉత్పత్తి అయ్యే ఆహారంలో మూడో వంతు వృథా అవుతోంది. మరోవైపు ప్రపంచంలో 70 కోట్ల మందికి పైగా ఆకలితో అలమటిస్తున్నారు.

ఇలాంటి పరిస్థితుల్లో ఐఏఈఏ అణు సాంకేతికత ద్వారా ‘ఆటమ్స్‌ ఫర్‌ ఫుడ్‌’ కార్యక్రమం కింద పంటల నిల్వ సామర్థ్యాన్ని పెంచడానికి తోడ్పడుతోంది. కీటకాల నియంత్రణకు సూచనలిస్తోంది. పంట ఉత్పాదకత, పోషకాహార భద్రత పెంపు, వాతావరణ అనుకూల పంటల అభివృద్ధి వంటి అంశాల్లో సహకారం అందిస్తోంది. అణు శాస్త్రాన్ని ఉపయోగించి ప్రపంచవ్యాప్తంగా ఆహార భద్రతను మెరుగుపరచడమే ఈ కార్యక్రమ ప్రధాన ఉద్దేశం.

నీటి వనరుల నిర్వహణ, భూగర్భ జలాల పరిశీలన, ఖనిజ సంపదల అన్వేషణ, ప్లాస్టిక్‌ కాలుష్య నియంత్రణ వంటి వాటిలోనూ అణు సాంకేతికత ఉపయోగపడుతోంది. ఘనాలో ఐసోటోప్‌ హైడ్రాలజీ సాంకేతికత ద్వారా భూగర్భ జల ప్రవాహాన్ని గుర్తిస్తున్నారు. న్యూ టెక్‌ ప్లాస్టిక్స్‌ కార్యక్రమం కింద ఐఏఈఏ ప్లాస్టిక్‌ కాలుష్యాన్ని గుర్తించి, పునశ్శుద్ధి పద్ధతులను అభివృద్ధి చేస్తోంది. జంతువుల ద్వారా మనుషులకు సంక్రమించే వ్యాధుల సమర్థ నియంత్రణకు ‘జోడియాక్‌’ అనే కార్యక్రమాన్ని ఐఏఈఏ ప్రారంభించింది. ఇందులో భాగంగా సుమారు 100 దేశాల ప్రయోగశాలల సిబ్బందికి శిక్షణ ఇచ్చింది. భవిష్యత్తులో దండెత్తే మహమ్మారులను నివారించడం, ప్రజారోగ్య భద్రతను అణుశాస్త్ర సహకారంతో బలోపేతం చేయడం ‘జోడియాక్‌’ ప్రధాన లక్ష్యం.

అంతర్జాతీయ సహకారం కీలకం

ఐఏఈఏ మంత్రిత్వ స్థాయి సమావేశాలు, సాంకేతిక సహకార కార్యక్రమాలు ప్రపంచవ్యాప్తంగా అణు సాంకేతికత రంగంలో పురోగతిపై చర్చించడానికి, భద్రతా ప్రమాణాలను రూపొందించడానికి తోడ్పడుతున్నాయి. అణు సాంకేతికత ద్వారా సామాజిక-ఆర్థిక ప్రయోజనాలను పెంపొందించడానికి అవి ఉపయోగపడుతున్నాయి. ప్రపంచవ్యాప్తంగా అణు భద్రతను బలోపేతం చేయడానికి ఐఏఈఏ ప్రధాన వేదికగా పనిచేస్తోంది. అణు సాంకేతికత ఉపయోగాలు విస్తృతమవుతున్న నేపథ్యంలో అవి సుస్థిరాభివృద్ధి లక్ష్యాల్లో సగానికి పైగా నేరుగా, మిగతా వాటిని పరోక్షంగా ప్రభావితం చేస్తాయని నిపుణులు చెబుతున్నారు. ప్రగతి లక్ష్యాల సాధనలో అణుశాస్త్రం మరింత కీలక పాత్ర పోషించాలంటే పలు చర్యలు తీసుకోవాలని వారు సూచిస్తున్నారు. ముందుగా అణు రంగంలో అంతర్జాతీయ సహకారాన్ని పెంచాలి. అణు వ్యర్థాల నిర్వహణకు బలమైన మౌలిక సదుపాయాలను ఏర్పాటు చేసుకోవాలి. అభివృద్ధి చెందుతున్న దేశాల్లో అణు నిపుణులను తయారు చేసుకోవాలి. ప్రజల్లో అణు శాస్త్రంపై అవగాహన పెంచి, భయాలను తొలగించాలి. అలాగే అణు సాంకేతికతల ద్వారా ప్రపంచానికి తలెత్తే సవాళ్లను ఎలా ఎదుర్కోవాలన్న దాని గురించి అన్ని దేశాలు చర్చలు జరపడమూ అత్యవసరం.



వై.శ్రీనివాస్
విశ్రాంత ‘జీ’ గ్రేడ్‌ సైంటిఫిక్‌ ఆఫీసర్‌ (రేడియేషన్‌ సేఫ్టీ), అటామిక్‌ ఎనర్జీ విభాగం

పిల్లలూ చెబుతారు పాఠాలు!

ఏడేళ్ల యాసిన్‌ రెండో తరగతి. ఒకరోజు స్కూల్‌కి వెళ్తుండగా దారిలో ఒక పర్సు దొరికింది. తెరిచి చూస్తే దాన్నిండా నోట్లు. ‘అయ్యో! ఎవరో పారేసుకున్నారు’ అనుకుంటూ ఆ పర్సు తీసుకెళ్లి స్కూల్లో టీచర్‌కి ఇచ్చాడు. ఆమె హెడ్మాస్టర్‌కు అందిస్తే, ఆవిడ యాసిన్‌ని వెంటబెట్టుకుపోయి యాభై వేల రూపాయలు ఉన్న ఆ పర్సును జిల్లా ఎస్పీకి అప్పగించారు. ‘డబ్బులు దొరికితే ఎందుకు తీసుకోలేదు?’ అని పోలీసులు యాసిన్‌ని ప్రశ్నించారు. ‘అది నాది కాదు కదా ఎందుకు తీసుకోవాలి’ అని ఎదురు ప్రశ్నించాడా పిల్లాడు. ఆ జవాబుకు పోలీసులు ఆశ్చర్యపోయి చిన్నారిని అభినందించారు. ఈ సంగతి తెలిసి చాలామంది యాసిన్‌ను మెచ్చుకున్నారు. విషయం తెలుసుకున్న సూపర్‌ స్టార్‌ రజనీకాంత్‌ సైతం అచ్చెరువొంది యాసిన్‌ని ఇంటికి పిలిపించుకున్నారు. తల్లిదండ్రులతో పాటు వెళ్లి రజనీకాంత్‌ని కలుసుకున్నాడు యాసిన్‌. మెడలో బంగారు గొలుసు వేసి పిల్లాడి నిజాయతీని అభినందించారు రజనీకాంత్‌. యాసిన్‌ ఎంతవరకు చదువుకుంటే అంతవరకూ ఫీజులు, హాస్టల్‌ ఖర్చులతో కలిపి అన్నీ తానే పెట్టుకుంటానని హామీ ఇచ్చారు. ఏడేళ్ల క్రితం తమిళనాడులో జరిగింది ఇదంతా. విద్యార్థుల్లో నీతి నిజాయతీలు, విలువలు పెంపొందించాలని ఈ సంఘటనను ఆ రాష్ట్ర ప్రభుత్వం రెండో తరగతిలో ఒక పాఠ్యాంశంగా పెట్టింది. ఇది నిజాయతీకి దక్కిన ప్రతిఫలం.



మరో అబ్బాయి యశ్వంత్‌ది గుంటూరు. నాలుగో తరగతి చదువుతున్నాడు. నాన్న లారీ డ్రైవర్‌. అమ్మ రాధిక ప్రభుత్వ ఆసుపత్రి దగ్గర టిఫిన్‌ బండి పెట్టుకుని కుటుంబాన్ని పోషిస్తోంది. ఒకరోజు అధికారులు రోడ్డు విస్తరణ కోసం బండిని అక్కడి నుంచి తొలగించారు. జీవనాధారం కోల్పోవడంతో ఆ తల్లి తల్లడిల్లిపోయింది. ఎవర్ని కలిసినా లాభం లేకపోయింది. నిరాశతో ‘మనకిక చావు తప్ప వేరే మార్గం లేదు’ అంది కొడుకుతో. జిల్లా కలెక్టర్‌ కార్యాలయంలో ప్రతి సోమవారం ప్రజావాణి కార్యక్రమం జరుగుతుందని తెలిసింది యశ్వంత్‌కి. వీపుమీద స్కూలుబ్యాగుతో వినతిపత్రం పట్టుకుని ప్రజావాణికి హాజరయ్యాడు యశ్వంత్‌. అమ్మ చనిపోదాం అన్న మాటలతో సహా విషయమంతా అధికారులకు చెప్పాడు. వాళ్లు పిల్లాణ్ని కలెక్టర్‌ దగ్గరికి తీసుకెళ్లారు. కలెక్టర్‌ వెంటనే స్పందించి తిరిగి వాళ్ల బండిని యథాస్థానంలో పెట్టుకోనివ్వాల్సిందిగా కమిషనర్‌ను ఆదేశించారు. ఓ స్వచ్ఛంద సంస్థ రాధికకి కొత్త టిఫిన్‌ బండిని బహూకరించింది. సమస్య నుంచి బయటపడేసిన కొడుకును చూసుకుని ఆమె మురిసిపోయింది.

పిల్లలకు సంబంధించిన ఈ రెండు సంఘటనలూ పెద్దలకు విలువైన పాఠాలు చెబుతున్నాయి. నిజాయతీకి ఎప్పుడూ ఆదరణ, అభిమానం, గౌరవం, విలువ ఉంటాయనడానికి యాసిన్‌ ఉదంతమే నిదర్శనం. సమస్యలకు భయపడకుండా తెలివిగా ఎదుర్కొని పరిష్కరించుకోవచ్చని యశ్వంత్‌ రుజువు చేశాడు. ఎంత మంది పెద్దలు వీరిలా ఆలోచించగలరు?

– మొలకలపల్లి కోటేశ్వరరావు

ముప్పు ముంగిట్లో హిమాలయాలు



ట్రైబ్యునళ్లలోనూ అంతే!

నిర్దిష్ట వివాదాలను త్వరగా, ప్రత్యేక దృష్టితో పరిష్కరించే లక్ష్యంతో పలు ట్రైబ్యునళ్లను ఏర్పాటు చేశారు. సివిల్‌, నేర న్యాయస్థానాల్లో మాదిరిగానే వాటిలోనూ పెద్దయెత్తున కేసులు పేరుకుపోయాయి. 2025 నాటికి దేశవ్యాప్తంగా ట్రైబ్యునళ్లలో పెండింగ్‌లో ఉన్న కేసుల సంఖ్య...

ట్రైబ్యునల్‌	కేసులు
రుణాల రికవరీ	2,45,048
కస్టమ్స్‌, ఎక్సైజ్‌, సర్వీస్‌ ట్యాక్స్‌ అప్పిలేట్‌	71,454
సీఏటీ	69,102
ఆదాయ పన్ను అప్పిలేట్‌	42,502
నేషనల్‌ కంపెనీ లా	14,680
సెంట్రల్‌ గవర్నమెంట్‌ ఇండస్ట్రియల్‌ ట్రైబ్యునల్‌	10,644
రైల్వే క్లెయిములు	10,570
టెలికామ్‌ డిస్ప్యూట్స్‌ సెటిల్‌మెంట్‌, అప్పిలేట్‌	5,979
ఎన్‌జీటీ	5,301

(ఆధారం: లోక్‌సభలో కేంద్రం వెల్లడించిన వివరాలు)

అభివృద్ధి పేరిట హిమాలయ ప్రాంతంలో మానవ కార్యకలాపాలు ఉద్ధృతంగా సాగుతున్నాయి. దాంతో అక్కడి పర్యావరణ, జీవావరణ వ్యవస్థలు దారుణంగా దెబ్బతింటున్నాయి. పర్యవసానంగా తరచూ వరదలు పోటెత్తడం; మట్టిపెళ్లలు, కొండచరియలు విరిగిపడి తీవ్ర ప్రాణ, ఆస్తి నష్టం సంభవించడం పరిపాటిగా మారింది. ఇలాంటి తరుణంలో హిమాచల్‌ప్రదేశ్‌ పట్టణ, గ్రామీణ ప్రణాళికా విభాగం గ్రీన్‌జోన్‌గా ప్రకటించిన ప్రాంతంలో నిర్మాణాలు చేపట్టరాదని మొన్న జూన్‌లో రాష్ట్ర హైకోర్టు ఆదేశించింది. దీన్ని సవాలు చేస్తూ ఒక హోటల్‌ గ్రూపు సుప్రీంకోర్టుకు వెళ్లగా, సర్వోన్నత న్యాయస్థానం తీవ్రంగా ఆక్షేపించింది. ‘ప్రకృతి విధ్వంసం వల్ల జీవనదులకు పుట్టిల్లయిన హిమాలయాల్లోనూ నీటి కొరత ఏర్పడుతోంది. పర్యాటకుల తాకిడిని తట్టుకోవడానికి నాలుగు వరసల రోడ్లు, సొరంగాలు, బహుళ అంతస్తుల భవనాలు నిర్మిస్తున్నారు. దీంతో జీవావరణ సమతూకం దెబ్బతిని, వనరులపై ఒత్తిడి పెరుగుతోంది’ అని న్యాయమూర్తులు వ్యాఖ్యానించడాన్ని ఇక్కడ గమనించాలి. హైకోర్టు ఉత్తర్వుల్లో తాము జోక్యం చేసుకునేదేమీ లేదని సుప్రీం తేల్చిచెప్పడం ఆహ్వానించదగ్గ పరిణామం.

ఆదాయమే సర్వస్వం కాదు...

కొంతకాలంగా హిమాలయాల్లో పర్యాటకుల తాకిడి పెరుగుతోంది. టూరిస్టులు వదిలివెళ్లిన చెత్త, ప్లాస్టిక్‌ వ్యర్థాలు అక్కడి పర్వతాల్లో విపరీతంగా పేరుకుపోతున్నాయి. మరోవైపు, ఆ ప్రాంతంలో జలవిద్యుత్కేంద్రాల నిర్మాణం జోరుగా సాగుతోంది. ఈ ప్రాజెక్టుల పరిసరాల్లోని ప్రజలు నీటి ఎద్దడినీ, మట్టిపెళ్లల బెడదనూ ఎదుర్కొంటున్నారు. నేలలో భారీ పగుళ్లు ఏర్పడి ఆవాసాలు దెబ్బతింటున్నాయి. వీటన్నింటినీ గమనించిన సుప్రీంకోర్టు- జలవిద్యుత్‌ ప్రాజెక్టుల వల్ల హిమాలయ జీవనదులు చిన్నపాటి నీటిపాయల్లా మారిపోతున్నాయనీ; కనీసం ప్రాజెక్టుల నుంచైనా నీటిని విడుదల చేయడం లేదని విస్మయం వ్యక్తం చేసింది. ఆదాయమే సర్వస్వం కాదు... ఇకపై హిమాచల్‌లో విధ్వంసాలు జరగకుండా చూడాలంటూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు బాధ్యతను గుర్తుచేసింది న్యాయపాలిక.

హిమాలయాల్లో తరచూ ఉత్పాతాలు సంభవిస్తుండటం తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. మితిమీరిన మానవ కార్యకలాపాలు హిమాలయ పర్యావరణాన్నీ, జీవావరణాన్నీ మార్చేస్తుండటమే ఈ విపత్తులకు మూలకారణం. వాటి ధాటికి హిమాచల్‌ప్రదేశ్‌ ఏదో ఒకరోజు అదృశ్యమైపోయినా ఆశ్చర్యం లేదని సుప్రీంకోర్టు ఇటీవల వ్యాఖ్యానించడం పరిస్థితి తీవ్రతకు అద్దం పట్టేదే!



వాతావరణ మార్పుల కారణంగా హిమాలయాల్లో వేడి పెరిగిపోతూ హిమనదాలు కరిగిపోతున్నాయి. దాంతో దట్టమైన హిమాలయ అరణ్యాలు క్రమంగా పలుచబడిపోతున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో అక్కడ విద్యుత్కేంద్రాలు, రహదారుల నిర్మాణంలో పాటించాల్సిన పర్యావరణ నిబంధనలను తుంగలో తొక్కుతున్నారు. భారీ మౌలిక వసతుల ప్రాజెక్టులతో పాటు సొరంగాల తవ్వకాలను జోరుగా చేపడుతున్నారు. ఇలాంటి నిర్మాణాల వల్ల లాభంకన్నా నష్టమే ఎక్కువ.

కశ్మీర్‌, హిమాచల్‌, ఉత్తరాఖండ్‌లకు పర్యాటకులతో పాటు తీర్థయాత్రికులూ పోటెత్తుతున్నారు. అమర్‌నాథ్‌, వైష్ణోదేవి యాత్రలకు దేశవ్యాప్తంగా అనేక మంది తరలివెళ్తున్నారు. ఈ క్రమంలో ఉత్తరాఖండ్‌ హిమాలయాల్లో చార్‌ధామ్‌ యాత్రకు పెద్దయెత్తున కొండలు తవ్వి రహదారుల నిర్మాణం చేపట్టారు. వీటిపై తరచూ కొండచరియలు విరిగిపడుతుంటే దారులను పదేపదే మూసేయాల్సి వస్తోంది. సున్నిత ప్రాంతాల్లో రోడ్లు, హోటళ్లు, ఇతర వసతుల నిర్మాణం పెంచడం వల్ల అసలుకే మోసం వస్తోంది. రిషిగంగ నదికి 2021లో భారీగా వరద పోటెత్తడంతో దిగువనున్న జల విద్యుత్కేంద్రాలను మట్టి, రాళ్లు దెబ్బతీశాయి. 2023లో సిక్కింలో తీస్తానదికి ఉద్ధృతంగా వరద వచ్చి తీస్తా-3 డ్యామ్‌కు నష్టం కలిగించింది. చాలా వంతెనలు కొట్టుకుపోయాయి. 55మంది మరణించగా, వేలమంది నిర్వాసితులయ్యారు. పెరుగుతున్న వేడికి హిమనదాలు వేగంగా కరుగుతూ అక్కడి జల విద్యుత్కేంద్రాలకు దండిగా నీటిని అందిస్తున్నాయి కానీ, అవి పూర్తిగా కరిగిపోయాక నీటి కొరత ఏర్పడటం తథ్యం!

భవిష్యత్తులో మరింత తీవ్రంగా...


హిమాలయాల్లో ఉష్ణోగ్రత 2050కల్లా సగటున 1-2 డిగ్రీల వరకు పెరగవచ్చు. ఫలితంగా హిమాలయాల నుంచి దిగువకు ప్రవహించే నదుల్లో నీటి ప్రవాహం కొంతకాలం పెరిగినా, తరవాత తగ్గుముఖం పట్టవచ్చు. తరచూ భారీ వర్షాలు కురవడం వల్ల పెద్దయెత్తున నీరు, బురద కిందకు వచ్చి జల విద్యుత్కేంద్రాలకూ జనావాసాలకూ ముప్పు తెచ్చిపెడతాయి. 2100 కల్లా ఉత్తరాఖండ్‌ వంటి చోట్ల హిమనదాలు 70-99 శాతం దాకా కరిగిపోతాయని అంచనా. శిఖరాలు, లోయలుండే హిమాలయ ప్రాంతం రహదారులు, భారీ విద్యుత్కేంద్రాల నిర్మాణానికి అనువైనది కానేకాదు. కొండలను తొలిచి సొరంగాలు నిర్మించడం బండరాళ్లు, మట్టిపెళ్లలు విరిగిపడటానికి దారితీస్తుంది. పెరిగిన వాహనాల రద్దీ వాయు కాలుష్యాన్ని పెంచుతుంది. రైళ్ల రాకపోకలు నేల కదలిపోవడానికి దారితీస్తాయి. జలవిద్యుత్కేంద్రాల సమీపంలో నేల కుంగిపోవడం జోషీమఠ్‌ ప్రాంతంలో చూశాం. పర్యావరణానికి జరుగుతున్న నష్టాన్ని ప్రభుత్వాలు దృష్టిలో పెట్టుకుని హిమాలయాల్లో సుస్థిరాభివృద్ధి నమూనాను అనుసరించాలి.



సీపీ రాజేంద్రన్‌
భూవిజ్ఞాన శాస్త్రవేత్త, నేషనల్‌ ఇన్‌స్టిట్యూట్‌ ఆఫ్‌ అడ్వాన్స్‌డ్‌ స్టడీస్‌లో అనుబంధ ఆచార్యులు

నేర్చుకుంటా అన్నీ!


బొమ్మలు: శ్రీనివాస్‌ కథ: హరి



ఆసక్తి.. అభిరుచులతోనే విజయాలు

కరెన్సీనగర్, న్యూస్‌టుడే

మారుతున్న కాలానికి అనుగుణంగా విద్యార్థులు తమ ఆసక్తి, అభిరుచులను మార్చుకోవాలని, అప్పుడే విజయాలు అందుకోగలరని పలువురు వక్తలు సూచించారు. ఎన్టీఆర్ జిల్లా విజయవాడ లయోల దేవయ్య ఆడిటోరియంలో బుధవారం 'ఈనాడు- కేఎల్ డీమ్డ్ విశ్వవిద్యాలయం' సంయుక్తంగా 'దశ- దిశ' పేరుతో అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో కేఎల్ డీమ్డ్ యూనివర్సిటీ ప్రవేశాల డైరెక్టర్ జె.శ్రీనివాసరావు, అసిస్టెంటు డైరెక్టర్లు బొబ్బిలి సత్యన్నారాయణ మూర్తి, షణ్ముఖ కుమార్, శారద విద్యాసంస్థల ఛైర్మన్ శారదాదేవి, డైరెక్టర్ జీవీఆర్, విజయవాడ యూనిట్ ఇన్‌ఛార్జి సీహెచ్‌కే కిశోర్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



నూరు శాతం ఉత్తీర్ణత సాధించాలి



ఇబ్రహీంపట్నం గ్రామీణం: పదో తరగతిలో నూరు శాతం ఉత్తీర్ణతే లక్ష్యంగా ఉపాధ్యాయులు.. 100 రోజుల కార్యాచరణ అమలు చేయాలని డీఈవో చంద్రకళ పేర్కొన్నారు. ఇటీవల బాధ్యతలు చేపట్టిన ఆమె బుధవారం మూలపాడు జడ్పీ ఉన్నత పాఠశాలను తనిఖీ చేశారు. విద్యార్థుల సామర్థ్యాలను అంచనా వేశారు.

ఆలోచన భళా.. ఆచరిద్దాం ఇలా..



స్టెల్లా కళాశాల ఆవరణలో ప్లాస్టిక్ బాటిళ్లు ఎక్కడ పడితే అక్కడ పడేయకుండా వాటిని ఒకే చోట వేసేందుకు పెద్ద సైజు బాటిల్ రూపంలో రూపొందించిన ఈ ఇనుప ప్రేమ ఆకట్టుకుంటోంది. నగరంలో మున్సిపల్ కార్పొరేషన్ సైతం ఈ రకమైన ఏర్పాట్లు చేస్తే ఎంతో ప్రయోజనకరంగా ఉంటుంది. -ఈనాడు, అమరావతి

విరుల స్వాగతం



జాతీయ రైతు దినోత్సవం సందర్భంగా బుధవారం విజయవాడలోని మారిస్ స్టెల్లా కళాశాలలో ఫ్లోరీ ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమానికి వచ్చే అతిథులను ఇలా పూలతో గడియారం రూపు ఏర్పాటు చేసి విద్యార్థినులు వినూత్నంగా స్వాగతం పలికారు.

విజ్ఞాన వెలుగులు.. వెదజల్లే సువాసనలు





స్టెల్లా కళాశాలలో స్టోరీ ఎక్స్‌పో-2025లో భాగంగా విద్యార్థినులు ఆకర్షణీయంగా తయారు చేసిన సువాసనలు వెదజల్లే కొవ్వొత్తులివి. మైనం, లావెండర్ వాసన వెదజల్లే ప్రత్యేకమైన జిగురు వాడి వీటిని రూపొందించారు. ఎక్స్‌పోలో భాగంగా వీటిని తయారు చేసి అధ్యాపకులు, తోటి విద్యార్థులకు విక్రయిస్తున్నారు.
-ఈనాడు, అమరావతి

పంటల రక్షణకు సౌర కంచె అవశ్యం!

కలెక్టర్ల భేటీలో సీఎంను కోరిన లక్ష్మీశ

ఈనాడు, అమరావతి: ముఖ్యమంత్రి చంద్రబాబు ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన కలెక్టర్ల కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ లక్ష్మీశ పాల్గొన్నారు. వివిధ శాఖల పరిధిలో గత ఆరు నెలల్లో సాధించిన ప్రగతి నివేదికను... రానున్న ఆరు నెలల్లో అభివృద్ధి లక్ష్యాలు.. అవి చేరుకునేందుకు కార్యాచరణ సీఎంకు అందించారు.

కోతులు, అడవి పశువుల నుంచి కాపాడాలి



'విజయవాడ అర్బన్‌లో మనుషులపై కోతులు దాడి చేస్తున్నాయి. ఉద్యాన పంటలనూ నాశనం చేస్తున్నాయి. చందర్లపాడు మండలంలో పంటలను అడవి ఆవులు పాడుచేస్తున్నాయి. వాటికి మేత లేకుండా సుబాబుల్ సాగు చేస్తుండడంతో దూరంగా ఉన్న పంటలపైకి వస్తున్నాయి. వెయ్యి ఎకరాల్లో 400 మంది రైతులు నష్టపోతున్నారు. డ్రోన్ ద్వారా సర్వేలో 2 వేలకుపైగా పశువులు ఉన్నట్లు గుర్తించాం. వాటికి మేత అందుబాటులో ఉండేలా చూడడం, 25 కిమీ మేర సౌర కంచె (సోలార్ ఫెన్సింగ్) ఏర్పాటు చేయాలి. ఇందుకు రూ.1.5 కోట్లు ఖర్చవుతుంది. దీనికి నిధులు, కార్యాచరణతో కూడిన అనుమతులు కావాలని' సీఎంను కలెక్టర్ కోరారు. రాష్ట్రవ్యాప్తంగా ఈ సమస్య ఉన్న ప్రాంతాల్లో పరిష్కారం కోసం అటవీ, పశుసంవర్ధక, పురపాలక శాఖలు కమిటీగా ఏర్పడి సమన్వయంతో పరిష్కరించాలని సీఎం ఆదేశించారు.

పర్యాటక ప్రాంతాల అభివృద్ధి...

జిల్లాలో ఎక్కువ మెట్ట ప్రాంతం ఉన్నా భూగర్భ జలాల లభ్యత 3.28 మీటర్ల లోతులోనే ఉన్నట్లు చూపించడం ఆశ్చర్యంగా ఉందన్నారు. గణాంకాలు మరోసారి పరిశీలించాలని ఆదేశించారు. దీనిపై కలెక్టర్ లక్ష్మీశ స్పందిస్తూ విజయవాడ పరిధిలో కృష్ణా నది సమీపంలో తక్కువ లోతులో ఉన్నాయని.. దూరంగా ఉన్న తిరువూరు వంటి ప్రాంతాల్లో ఎక్కువ లోతు ఉందని సగటు లభ్యతనే నమోదు చేశామని వివరించారు. ★ రాష్ట్ర పర్యాటక ప్రగతిలో భాగంగా ఎన్టీఆర్ జిల్లాలో 17 ప్రాంతాలను పర్యాటకంగా అభివృద్ధి చేస్తామని ఆయా శాఖల ఉన్నతాధికారులు సీఎం దృష్టికి తీసుకువెళ్లారు. దానికి స్థలం సమీకరించి.. వేగంగా పనులు ప్రారంభిస్తామని వివరించారు.

చదువుల గుడిలో.. సేవా కమలం

పుట్టిన ఊరికి.. చదువుకున్న బడికి ఏదైనా చేయాలని చాలా మంది తపన పడుతుంటారు. అయితే ఆయనది ఈ ఊరు కాదు. ఇక్కడ చదువుకోలేదు. కానీ తన ఊరికి ఏదైనా మంచి చేద్దామన్న భార్య కోరికను తీర్చి ఆ భర్త తన ప్రేమను చాటుకున్నారు. తరవాత కొన్నేళ్లకు ఆయన చనిపోయారు. అయినా వారు అందించిన సాయం ఎంతో మంది విద్యార్థులకు ఆసరాగా నిలుస్తోంది.
- న్యూస్‌టుడే, గూడూరు



తుర్లపాటి కమల జ్ఞాపకార్థం నిర్మించిన భవనం



ప్రసాదరావు దంపతులు

హైదరాబాద్‌కు చెందిన తుర్లపాటి ప్రసాదరావు గూడూరు మండలం తరకటూరు గ్రామానికి అల్లుడు. భార్య అడిగిన వెంటనే తరకటూరు వచ్చి స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాలకు సాయం చేయాలని నిర్ణయించుకున్నారు. తొలుత బడికి కంప్యూటర్లు, టేబుల్స్ కొనుగోలుకు ఆర్థిక సహకారం అందించారు. ఈ వితరణ కార్యక్రమంలో వసతుల లేమితో సతమతమవుతున్న బడికి మరింత సహకారం అందించాలని అనుకున్నారు. దీనిపై సంప్రదింపులు జరుపుతున్న తరుణంలో ఆయన భార్య కమల అనారోగ్యంతో మృతి చెందారు.

భార్యపై ప్రేమతో బడికట్టారు..

ఆమె చివరి కోరికను తీర్చేలా అత్యాధునిక వసతులతో పాఠశాలలో అదనపు తరగతి భవనం నిర్మాణానికి రూ.30లక్షలకు పైగా వెచ్చించి తన దాతృత్వాన్ని, భార్యపై ఉన్న ప్రేమను చాటిచెప్పారు. దీంతో పాటు విద్యార్థులకు ల్యాబ్, ఇతర వసతులకు కలిపి మొత్తం రూ.40లక్షలకుపైగా సాయం అందించారు. ఇరుకు గదుల్లో చదువుకునే విద్యార్థులు విశాలమైన గదుల్లో చదువుకుంటున్నారంటే వారి సేవాతత్పరతే కారణం. వారి సాయానికి గుర్తుగా తరకటూరు జడ్పీ ఉన్నత పాఠశాల పేరును తుర్లపాటి కమల మెమోరియల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలగా నామకరణం చేశారు. భవనం నిర్మించి ఏళ్లు గడిచిపోతున్నా పాఠశాల ప్రతి సమావేశంలో వారి సాయం గుర్తుచేసుకుంటారు. ఆమె విగ్రహమూ ఏర్పాటు చేశారు. బడికి ఏ సాయం కావాలన్నా చేయడానికి తాము ఇప్పటికీ సిద్ధంగా ఉన్నామని వారి పిల్లలు ముందుకురావడాన్ని ఉపాధ్యాయులతో పాటు గ్రామస్థులూ ప్రశంసిస్తున్నారు.

ఇక అంతా ఆన్‌లైన్!

దుర్గగుడిలో అన్ని సేవలకూ డిజిటల్ చెల్లింపులే

తాజాగా రాష్ట్రంలో రెండో స్థానంలో నిలిచిన ఆలయం



విజయవాడ దుర్గగుడిలో ఇక నుంచి దర్శన టిక్కెట్లు సహా అన్ని సేవలు ఆన్‌లైన్‌లోనే పూర్తిగా అందుబాటులో ఉండబోతున్నాయి. ప్రభుత్వ ఆదేశాల మేరకు.. దేవస్థానంలో నగదు రహిత డిజిటల్ చెల్లింపులను పెంచడానికి ప్రత్యేక చర్యలు చేపడుతున్నారు. దర్శనాలు, ప్రత్యక్ష, పరోక్ష ఆర్జిత సేవలు, వసతి, ప్రసాదాలు, కేశఖండన, అన్ని విరాళాలు.. ఇకనుంచి డిజిటల్ చెల్లింపులే జరగబోతున్నాయి. భక్తులు ఈ విషయాన్ని గమనించాలని ఆలయ ఈవో శీనానాయక్ బుధవారం విజ్ఞప్తి చేశారు.

ప్రత్యేక లక్ష్యాలు నిర్దేశించారు..

రాష్ట్రంలో ప్రధాన దేవాలయాలు అన్నింటికీ ప్రత్యేకంగా లక్ష్యాలను నిర్దేశించి మరీ డిజిటల్ చెల్లింపులు జరిగేలా ప్రభుత్వం చర్యలు చేపట్టింది. దీనిలో భాగంగా ప్రతిరోజు ఏ ఆలయంలో ఎక్కువ ఆన్‌లైన్ చెల్లింపులు జరిగాయనే ర్యాంకులను ఇస్తున్నారు. తాజాగా బుధవారం 15 ప్రధాన ఆలయాలకు ఇచ్చిన ర్యాంకుల్లో శ్రీశైలం భ్రమరాంబ మల్లికార్జునస్వామి ఆలయం మొదటి స్థానంలో ఉండగా, దుర్గగుడి 947 ఆన్‌లైన్ టిక్కెట్లను విక్రయించి.. రెండో స్థానంలో నిలిచింది. భక్తులు అత్యంత తేలికగా రెండు వెబ్‌సైట్లు, యాప్, వాట్సప్ నంబరు ద్వారా టిక్కెట్లను బుక్ చేసుకోవచ్చని ఈవో శీనానాయక్ సూచించారు. – ఈనాడు, అమరావతి

చేతివాటం ఉండదిక...

టిక్కెట్ల విక్రయాల్లో అక్రమాలకు ఇక అడ్డుకట్ట పడబోతోంది. ఇప్పటివరకూ భౌతికంగానే అత్యధిక టిక్కెట్లను ఇస్తున్నారు. ఈ విధానానికి పూర్తిగా స్వస్తి పలకబోతున్నారు. ఇందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. భక్తులు వారికి నచ్చిన విధానంలో నగదు రహిత చెల్లింపులు జరిపేందుకు వీలుగా.. అన్ని డిజిటల్ పేమెంట్ ఆప్షన్లను అందుబాటులోకి తీసుకొచ్చారు.

ముందుగానే టిక్కెట్లను బుక్ చేసుకునేందుకు..

- www.kanakadurgamma.org,
- www.aptemples.ap.gov.in వెబ్‌సైట్లు,
- కనకదుర్గమ్మ ఆలయ మొబైల్ యాప్
- మనమిత్ర వాట్సప్ సేవ: 9552300009

నేటి నుంచి కేఎల్‌యూలో రాష్ట్రస్థాయి యువజనోత్సవాలు

తాడేపల్లి: రాష్ట్రస్థాయి యువజనోత్సవాలకు కేఎల్‌యూ ప్రాంగణం సిద్ధమైంది. ఈ నెల 18, 19, 20న కేఎల్ డీమ్డ్ విశ్వవిద్యాలయంలో ఏపీ యువజన సర్వీసుల శాఖ నిర్వహిస్తున్న ఈ ఉత్సవాలకు విద్యార్థులే నాయకత్వం వహిస్తున్నారు. వివిధ కళాశాలల విద్యార్థులు వంద మంది మూడు కమిటీలుగా ఏర్పడి ప్రాంగణాన్ని అందంగా తీర్చిదిద్దుతున్నారు. వివిధ జిల్లాల నుంచి యువత తరలి రానున్నారు. వివిధ దేశాల్లో స్థిరపడిన తెలుగువారిని భాగస్వాములను చేసేలా ఆన్‌లైన్ వేదిక రూపొందిస్తున్నారు. గురువారం ఉదయం 10 గంటలకు మొదలయ్యే ఉత్సవాలకు మంత్రి లోకేశ్, పలువురు మంత్రులు, జిల్లా ఉన్నతాధికారులు రానున్నారు.

ఇవీ కార్యక్రమాలు...: జానపద నృత్యాలు, గీతాలు, కథా రచన, చిత్రకళ, కవితలు తదితర పోటీలతో పాటు అతిథులు, పారిశ్రామికవేత్తలు, ఎన్ఆర్ఐలు, విద్యార్థుల స్ఫూర్తిదాయక ప్రసంగాలు ఉంటాయి. 'ఆంధ్రా యువ సంకల్ప్ 2కే25' పేరుతో ప్రత్యేక కార్యక్రమాలు, సదస్సులు ఉంటాయని నిర్వాహకులు అన్నారు.

హైదరాబాద్‌లో శివాని?

ఈనాడు - అమరావతి, న్యూస్‌టుడే - విస్సన్నపేట, రెడ్డిగూడెం, గంపలగూడెం: బోర్డు తిప్పేసిన లైఫ్ ఈజ్ బ్యూటీఫుల్ సంస్థ సీఈవో శివాని హైదరాబాద్‌లో తలదాచుకున్నట్లు సమాచారం. తాము కట్టిన సొమ్ము చెల్లించమని డిపాజిటర్ల ఒత్తిళ్లను తట్టుకోలేక అజ్ఞాతంలోకి వెళ్లినట్లు తెలిసింది. మరోవైపు ఈమె ఆచూకీ కోసం పోలీసులు గాలిస్తున్నారు. అసలు ఈ సంస్థ ఎంత మేర డిపాజిట్లు వసూలు చేసింది? ఎంత మందికి చెల్లించింది? అనే వివరాలు రాబట్టేందుకు ప్రయత్నిస్తున్నారు. సంస్థలో పనిచేసిన కొందరు ఉద్యోగులను అదుపులోకి తీసుకుని ప్రశ్నిస్తున్నట్లు తెలిసింది. వారి నుంచి ప్రాథమికంగా కొన్ని వివరాలు సేకరించారు. గతంలో పోలీసుల వద్ద వివరాల మేరకు దాదాపు 1,200 మంది నుంచి డిపాజిట్లు వసూలు చేశారు.

ఫిర్యాదుల వెల్లువ... విజయవాడ, విస్సన్నపేట, ఏలూరు, నంద్యాల తదితర ప్రాంతాల్లోని ఎల్‌బీఎఫ్ బాధితులు బుధవారం కూడా విస్సన్నపేట ఠాణాకు వచ్చి పోలీసులకు ఫిర్యాదు చేశారు. శివాని తండ్రి గోవిందరావును పోలీసులు విచారిస్తున్నట్లు తెలిసింది. రెడ్డిగూడెం మండలం మద్దులపర్వలో సంస్థ ఏజెంట్లుగా ఉన్న కొందరు డిపాజిటర్లను పోలీసులకు ఫిర్యాదు చేయొద్దని భయపెడుతున్నట్లు సమాచారం. సంస్థ స్థాపకుడైన దుర్గాప్రసాద్ ఆత్మహత్య చేసుకున్నాడనీ, అతని మృతికి డిపాజిటర్ల ఒత్తిడే కారణమని కుటుంబ సభ్యులతో కేసు పెట్టిస్తామని బెదిరిస్తున్నట్లు మద్దులపర్వవాసులు వాపోతున్నారు. ఇప్పటికి 20 మంది ఫిర్యాదు చేశారు.

అక్కరకొస్తుందని...ఆటో కార్మికులు.. చేతి వృత్తిదారులు.. వ్యవసాయ కూలీలు.. చిరు వ్యాపారులు.. ఇలా పలు వర్గాల వారు అవసరానికి అక్కరకొస్తుందని పెట్టుబడులు పెట్టారు. పేద, మధ్య తరగతి కుటుంబాలను లక్ష్యంగా చేసుకుని ఎల్‌బీఎఫ్ పెట్టుబడులు ఆకర్షించింది. కూలీలు, డ్వాక్రా సంఘాల సభ్యులతోపాటు పలువురు ఈ సంస్థలో పెట్టుబడి పెట్టినట్లు తెలుస్తోంది.

ఇల్లు కట్టేదెలా?



'ఇంటి నిర్మాణానికి ఆసరాగా ఉంటుందనీ, వడ్డీ అధికంగా వస్తుందని.. కష్టపడి సంపాదించిన రూ.2 లక్షల సొమ్మును పెట్టుబడిగా పెట్టాం. వరుసగా మూడు నెలలపాటు రూ.60 వేల వరకు తిరిగిచ్చారు. రూ.1.40 లక్షలు ఇవ్వాలి. ఏప్రిల్ నుంచి ఇవ్వడం లేదు. ఆరా తీస్తే సంస్థ మూసేసి కనిపించకుండా వెళ్లిపోయారని తెలిసింది. ఇల్లు కట్టుకోవాలనే ఆశతో పెట్టుబడి పెట్టా. మా సొమ్ము తిరిగిచ్చేలా చూడాలి'
- మారేశ్వరమ్మ (మద్దులపర్వ)

అక్షర మణిదీపం.. ఏఎన్నార్ కళాశాల

★ దేశం గర్వించే విద్యార్థులను తీర్చిదిద్దిన విద్యాలయం
★ గుడివాడ వేదికగా పూర్వ విద్యార్థుల మధుర స్మృతులు



అక్కినేని నాగేశ్వరరావు జీవిత చరిత్ర పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న నటుడు నాగార్జున, జస్టిస్ బట్టు దేవానంద్, యార్లగడ్డ లక్ష్మీప్రసాద్, ఎమ్మెల్యేలు వర్ల, వెనిగండ్ల రాము తదితరులు



గుడివాడ: గుడివాడలోని అక్కినేని నాగేశ్వరరావు కళాశాల దేశం గర్వించే విద్యార్థులను తీర్చిదిద్దిందని వక్తలు కొనియాడారు. వజ్రోత్సవ వేడుక సందర్భంగా రెండో రోజు బుధవారం పూర్వ విద్యార్థులు కళాశాలలో తమ మధుర స్మృతులను గుర్తు చేసుకున్నారు. తమకంటే ఉన్నత స్థాయికి ఎదిగి కళాశాలను రాష్ట్రంలోనే ప్రథమంగా నిలపాలని సూచించారు. కేంద్ర హోంశాఖ విశ్రాంత కార్యదర్శి, పద్మభూషణ్ అవార్డు గ్రహీత కె.పద్మనాభయ్య మాట్లాడుతూ, ఎందరికో ఉజ్వల భవితను అందించిన ఏఎన్నార్ కళాశాల మరింత అభివృద్ధి చెందాలన్నారు. ఇక్కడ ఉండే ఉన్నతమైన అధ్యాపక బృందం కృషితోనే తాను ఐఏఎస్ సాధించానని తెలిపారు. రాజ్యసభ మాజీ సభ్యుడు యలమంచిలి శివాజీ, ఎమ్మెల్యేలు వెనిగండ్ల రాము, వర్ల కుమార్‌రాజా, అక్కినేని నాగసుశీల, అక్కినేని జ్యోత్స్న తదితరులు ప్రసంగించారు. వజ్రోత్సవ కమిటీ గౌరవాధ్యక్షుడు కె.ఎస్.అప్పారావు, అధ్యక్ష, కార్యదర్శులు కొల్లి శ్రీనివాస్, డాక్టర్ సూరపనేని శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు పర్వతనేని కృష్ణప్రసాద్, కోశాధికారి పి.రాజభూషణరావు, సభ్యులు ప్రసాద్, రమణకుమార్, శాస్త్రి, ప్రిన్సిపల్ డాక్టర్ కుమార్, వైస్ ప్రిన్సిపల్ పద్మజ పాల్గొన్నారు.

శిరస్త్రాణం.. శిరోధార్యం



నగరంలో పలుచోట్ల ట్రాఫిక్ పోలీసుల ఆధ్వర్యంలో హెల్మెట్ వాడకంపై విద్యార్థులతో ప్రదర్శనలు నిర్వహించారు. ట్రాఫిక్ ముఖ్య కూడళ్లతో పాటు ప్రకాశం బ్యారేజీ వద్ద పెద్దఎత్తున విద్యార్థులు శిరస్త్రాణంపై ప్లకార్డులు ప్రదర్శించి వాహనదారులకు అవగాహన కల్పించేలా నినాదాలు చేశారు. ట్రాఫిక్ డీసీపీ షేక్ షిరీన్‌బేగం ఈ కార్యక్రమంలో పాల్గొని విద్యార్థులను అభినందించారు.
-ఈనాడు, అమరావతి



బోనస్ మాటున.. బోగస్ వేట..!

ఈనాడు, అమరావతి

అధిక వడ్డీ ఆశ చూపించి పెద్దఎత్తున డిపాజిట్లు వసూలు చేసి బోర్డు తిప్పేస్తున్న సంస్థలకు ముకుతాడు పడడం లేదు. ఈ సంస్థలు చెప్పే మాటలు, ప్రకటనలు నమ్మి పెట్టుబడి పెడుతున్నారు. చివరకు నట్టేట మునుగుతున్నారు. యూట్యూబ్, ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్‌ల ద్వారా పలువురు సోషల్ మీడియా ఇన్‌ఫ్లూయన్సర్లతో పెద్దఎత్తున ప్రచారం చేయించి ప్రజలను బోల్తా కొట్టిస్తున్నారు. గత కొంతకాలంగా ఉమ్మడి జిల్లాలో బయట పడుతున్న మోసాల తీరిది.

అధిక వడ్డీల పేరుతో..

★ పెద్దఎత్తున కొత్త ప్రాజెక్టులు వస్తున్నాయని.. భారీగా ఉద్యోగాలు వస్తాయని ఆశచూపించి దుర్గాప్రసాద్, శివానీ దంపతులు విస్సన్నపేట కేంద్రంగా లైఫ్ ఈజ్ బ్యూటీఫుల్ సంస్థ ఏర్పాటు చేశారు. అధిక వడ్డీ ఇస్తామని ఎరచూపి దాదాపు 2వేల మంది నుంచి రూ.30కోట్ల వరకు పెట్టుబడులు పోగేశారు. సొంతానికి వాడుకుని చివరకు చెల్లించలేక చేతులెత్తేశారు. ఒత్తిడి పెరిగి దుర్గాప్రసాద్ ఆత్మహత్య చేసుకున్నాడు. శివానీ అజ్ఞాతంలోకి వెళ్లిపోయింది. ★ అద్విక ట్రేడింగ్ కంపెనీని ఏర్పాటు చేసిన ఆదిత్య.. సుమారు 1,600 మంది నుంచి రూ.413కోట్లు వసూలు చేశాడు.



రోజుకో మాయాజాలం..

ఫారెక్స్ ట్రేడింగ్, ఈక్విటీల్లో పెట్టుబడుల పేరుతో ఆకర్షణీయంగా ప్రచారం చేశారు. రూ.లక్ష పెడితే నెలకు (6శాతం వడ్డీ) రూ.6వేలు ఇస్తామని ఆశచూపాడు. చివరకు చెల్లించలేక చేతులెత్తేశాడు. ★ సినిమాలకు యానిమేషన్ అందిస్తానని కిరణ్ అనే వ్యక్తి విజయవాడలో యుపిక్స్ సంస్థ ఏర్పాటు చేశాడు. రూ.లక్ష చెల్లిస్తే నెల రోజుల్లో మరో రూ.లక్ష లాభం ఇస్తానంటూ ప్రచారం చేసి రూ.300కోట్లు డిపాజిట్లు వసూలు చేశాడు. ఉద్యోగులు, వ్యాపారులు, అధికారులు పెట్టిన పెట్టుబడులకు యుపిక్స్ సంస్థ బాండ్లు ఇచ్చాడు. డిపాజిట్లు చెల్లించలేక నిర్వాహకుడు చేతులెత్తేశాడు.

పకడ్బందీ నిఘాతోనే అడ్డుకట్ట: అద్విక వ్యవహారం తేలాక జిల్లాలో అన్ని స్టేషన్లలో ఈ తరహా సంస్థల వివరాలు సేకరించారు. అప్పటివరకు సంస్థ ఎంత డిపాజిట్లు సేకరించింది? తిరిగి ఇచ్చే స్థోమత ఉందా? ఎందరు డిపాజిట్‌దారులు ఉన్నారు? వంటివి సేకరించారు. ఈమేరకు విస్సన్నపేటలో లైఫ్ ఈజ్ బ్యూటీఫుల్ సంస్థ వివరాలు తీసుకున్నారు. కొత్త డిపాజిట్లు తీసుకోవద్దని, పాతవి చెల్లించాలని హెచ్చరించి వదిలేశారు. అప్పుడే దీనిపై గట్టి నిఘా పెట్టి కఠిన చర్యలు తీసుకుని ఉంటే పేదలు నష్టపోకుండా ఉండేవారు.

కాలువలకు 4,715 క్యూసెక్కుల నీరు

ఎన్టీఆర్ కలెక్టరేట్, న్యూస్‌టుడే: నగరంలోని ప్రకాశం బ్యారేజీ నుంచి కృష్ణా డెల్టా పరిధిలోని పంట కాలువలకు బుధవారం 4,715 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. కృష్ణా తూర్పు ప్రధాన కాలువకు 2,813, కృష్ణా పశ్చిమ ప్రధాన కాలువకు 1,816, గుంటూరు ఛానల్‌కు 86 క్యూసెక్కుల చొప్పున ఇస్తున్నారు. కృష్ణా తూర్పు ప్రధాన కాలువ నుంచి రైవస్ కాలువకు 1,802, ఏలూరుకు 708, కేఈబీకు 202, బందరు కాలువకు 101 క్యూసెక్కుల చొప్పున విడుదల చేశారు.

పాడి రైతుకు రాయితీ దన్ను

పశుగ్రాస విత్తనాలు, దాణా పంపిణీతో ఊతం

ఈనాడు, అమరావతి

పాడి రైతులకు కూటమి సర్కారు రాయితీలతో దన్నుగా నిలుస్తోంది. ట్రిపుల్ ఎస్ వీర్యనాళికలను రాయితీ పంపిణీతో 90శాతం పెయ్య దూడల ఉత్పత్తి దిశగా అడుగులు వేస్తుండగా పాల దిగుబడి పెరుగనుంది. ఇదే సమయంలో దాణా, పశుగ్రాస విత్తనాలు రాయితీపై రైతులకు అందిస్తున్నారు. చాలా మందికి అవగాహన లేకపోవడంతో ఆర్థిక భారం పడుతోంది. ✦ జిల్లాలో పాడి రైతులు 1.52లక్షల మంది ఉన్నారు. గేదెలు, ఆవులు 5లక్షలకు పైగా ఉంటాయి. పాడి రైతుకు పశుపోషణలో ప్రధాన ఖర్చు ఆహారమే. దీన్ని రాయితీతో అందించేందుకు కూటమి సర్కారు ముందుకొచ్చింది. ✦ పశువులకు బలం కోసం పెట్టే దాణా 50కేజీల బస్తాపై 50శాతం రాయితీ ఇస్తున్నారు. 1,100 విలువైన దీన్ని రూ.550కే రైతులకు ఇస్తున్నారు. ఉమ్మడి జిల్లాకు 2,400 టన్నుల దాణా చేరగా ప్రస్తుతం పంపిణీ జరుగుతోంది. ✦ పశుగ్రాస విత్తనాలు కూడా 75శాతం రాయితీతో అందిస్తున్నారు. రూ.460 విలువైన 5కేజీల హైబ్రిడ్ రకం పశుగ్రాస విత్తనాల సంచి రూ.115కే అందిస్తున్నారు. ఈ గడ్డి కోసినా మళ్లీ పెరుగుతుంది. బయట కొనుగోలు చేయాల్సిన అవసరం లేదు. జిల్లాలో 95 టన్నులు సరఫరా చేశారు. ✦ మినీగోకులాలు నిర్మించి పశువులకు గూడు కల్పిస్తున్నారు. యూనిట్ విలువ 2పశువులకు రూ.1,15,000, నాలుగైతే రూ.1,85,000, 6 పశువులైతే రూ.2లక్షలు కాగా 10 శాతం చెల్లిస్తే చాలు ఏకంగా 90 శాతం రాయితీ ఇస్తున్నారు. మినీ గోకులాలు 1,799 మంజూరు కాగా ఇప్పటికే 559 నిర్మాణాలు పూర్తి చేశారు.

✦ కచ్చితమైన పెయ్యదూడల ఉత్పత్తికి రూ.300 విలువైన ట్రిపుల్‌ఎస్ వీర్య నాళికలు 50శాతం రాయితీపై పంపిణీ చేస్తున్నారు. జిల్లాలో రూ.20వేలు లక్ష్యం కాగా ఇప్పటికే దాదాపు 15వేలకు పైగా పంపిణీ చేశారు



పెట్టుబడి సాయం

రైతు దాణా బస్తా రూ.1,100కు కొనుగోలు చేయాల్సిన నేపథ్యంలో నెల సగం సొమ్ము మిగులుతుంది. ఒక్కసారి పశుగ్రాస విత్తనాలు వేస్తే చాలాకాలం పాటు గడ్డి సమస్య ఉండదు. ఒక్క పెయ్య దూడ పుడితే దూడగా ఉన్నప్పుడే రూ.10వేల ఆస్తి ఉన్నట్లే. ఇలా పాడి రైతుకు పరోక్షంగా ప్రభుత్వం పెట్టుబడి సాయం అందిస్తూనే రాబడి వచ్చే మార్గాలు చూపిస్తోంది. ఏటా ఇదే విధంగా రాయితీలు అమలవుతాయని ఎన్టీఆర్, కృష్ణా జిల్లాల జేడీలు హనుమంతరావు, నరసింహులు తెలిపారు.

భవానీ దీక్షల విరమణ ఆదాయం రూ.1.27 కోట్లు

ఇంద్రకీలాద్రి, న్యూస్‌టుడే: భవానీ దీక్షల విరమణ సందర్భంగా శ్రీదుర్గామల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానం హుండీల్లో భక్తులు సమర్పించిన కానుకలను మల్లికార్జున మహామండపం ఆరో అంతస్తులో బుధవారం లెక్కించారు. ఆలయ పరిసరాల్లో ఉన్న 240 బ్యాగులను లెక్కించగా రూ.1,27,90,645 ఆదాయం వచ్చినట్లు దేవస్థానం ఈవో శీనానాయక్ తెలిపారు. ఆలయ ప్రాంగణంలోని హుండీలను లెక్కించాల్సి ఉందని పేర్కొన్నారు. భక్తులు కానుకలతో పాటు 18 గ్రాముల బంగారం, 2.474 కిలోల వెండి వస్తువులను మొక్కుల రూపంలో చెల్లించారు. ఆలయ ఛైర్మన్ బొర్రా రాధాకృష్ణ, సభ్యులు వెలగపూడి శంకర్‌బాబు, సరోజినీ దేవి, పద్మావతి ఠాకూర్, సరిత, ఏఈవో సుధారాణి కానుకల లెక్కింపును పర్యవేక్షించారు.

బకాయిల చెల్లింపులో విశ్రాంత ఉద్యోగులకు ప్రాధాన్యం



మాట్లాడుతున్న బొప్పరాజు వెంకటేశ్వర్లు, పక్కన మోహనరావు, శాస్త్రి తదితరులు

ఎన్టీఆర్ కలెక్టరేట్, న్యూస్‌టుడే: పింఛను లేదా ఇతర బకాయిలను ముందుగా విశ్రాంత ఉద్యోగులకు చెల్లించేలా ప్రాధాన్యం ఇవ్వాల్సిన అవసరం ఉందని ఏపీ ఐకాస అమరావతి ఛైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. బుధవారం నగరంలోని స్వాతంత్ర్య సమరయోధుల భవనంలో రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డు ఎంప్లాయిస్ అసోసియేషన్(ఏపీఎస్‌జీఆర్‌ఈఏ) విజయవాడ శాఖ ఇన్‌ఛార్జి అధ్యక్షుడు, ప్రధాన కార్యదర్శి కె.ఎస్.హనుమంతరావు అధ్యక్షతన జాతీయ పింఛనర్ల దినోత్సవం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన బొప్పరాజు మాట్లాడుతూ విశ్రాంత ఉద్యోగులు పింఛను పొందడానికి డీఎస్ నకారా పోరాటమే కారణమన్నారు. ఖజానా శాఖ రాష్ట్ర డైరెక్టర్ ఎన్.మోహనరావు మాట్లాడుతూ పదవీ విరమణ పొందిన ఉద్యోగులు సులువుగా పింఛను తదితర ప్రయోజనాలు పొందడానికి డిజిటలైజేషన్ దోహద పడుతుందన్నారు. ఏపీఎస్‌జీఆర్‌ఈఏ రాష్ట్ర సంఘం అధ్యక్షుడు పీఎస్ఎస్ఎన్‌పీ శాస్త్రి మాట్లాడుతూ ఉపాధ్యాయ దినోత్సవం తరహాలో పింఛనర్ల డేను నిర్వహించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఏపీఎస్‌జీఆర్‌ఈఏ రాష్ట్ర సంఘ ప్రధాన కార్యదర్శి బి.లోవకుమార్, కోశాధికారి పి.నాగరాజు, విశ్రాంత ఉద్యోగుల సంఘం నేతలు ఎన్.నారాయణరావు, వి.ఆంజనేయశర్మ, డి.సుబ్బారావు, షాహినుద్దీన్, ఏడీ నాగేశ్వరరావు, పి.పుల్లయ్య, బి.గిరిజ, కె.రామచంద్రరావు, కె.సాయిబాబు, ఏహెచ్ఎస్ ప్రసాద్, జిల్లా ఖజానా శాఖ అధికారి ఎ.రవి, సహాయ అధికారి కె.వీరబాబు తదితరులు పాల్గొన్నారు. సూపర్ సీనియర్ పింఛనుదారులు 12 మందిని సత్కరించారు.

బ్రాయిలర్ ధరలు (కిలో 1కి రూ.లలో)



వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -120 రిటైల్ ధర 147 చికెన్ విత్ స్కిన్ - 213, చికెన్ స్కిన్‌లెస్ - 243. అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 137, 146, 157 చికెన్ విత్ స్కిన్ - 260 చికెన్ స్కిన్‌లెస్ - 270.

వీడనున్న చిక్కులు.. దక్కనున్న హక్కులు..!

మొదలైన వారసత్వ భూముల రిజిస్ట్రేషన్లు

మైలవరం, న్యూస్‌టుడే

'రెడ్డిగూడెం మండలం నాగులూరుకు చెందిన ఒకరికి సంబంధించిన ఐదెకరాల వ్యవసాయ భూమి సాగులో ఉన్నా.. రెవెన్యూ రికార్డుల్లో పూర్వీకుల పేర్లే ఉన్నాయి. పట్టాదారు పాసు పుస్తకాలను గతంలోనే తెచ్చుకున్నా.. సదరు రైతు పేరిట రికార్డుల్లో నమోదు కాలేదు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం తాజాగా విడుదల చేసిన వారసత్వ భాగస్వామ్య రిజిస్ట్రేషన్ల జీవోతో ఆ రైతు కుటుంబానికి ఊరట కలగనుంది. ఇది ఆ ఒక్క రైతు పరిస్థితే కాదు.. జిల్లా వ్యాప్తంగా వేలాది మంది రైతులకు దీని ద్వారా మేలు జరగనుంది.

సాగులో ఉన్నా.. సాయానికి నోచుకోక.. దశాబ్దాల కిందట మూజువాణి పంపకాలతోనే పట్టాదారు పాసు పుస్తకాలు దక్కాయి. అయినా ఎంతోమంది రైతుల పేర్లు నేటికీ ఆన్‌లైన్‌లో లేవు. సాగులో ఉన్నా.. రికార్డుల్లో లేకపోవడంతో సాయానికి అర్హత సాధించడం లేదు. ఈ తరుణంలో అతి తక్కువ రుసుంతో వారసత్వ భూముల రిజిస్ట్రేషన్లకు కూటమి ప్రభుత్వం పచ్చజెండా ఊపడంతో వేలాది మంది రైతులకు లబ్ధి చేకూరనుంది.

రూ.1000 చాలు.. ప్రస్తుత మార్కెట్ విలువ ఆధారంగా రూ.100, రూ.1000 వ్యయంతో వారసుల పేరిట రిజిస్ట్రేషన్లకు అవకాశం కల్పించారు. ఈ మేరకు తాజాగా ఈ నెల 5న ప్రభుత్వం ప్రత్యేక జీవో జారీ చేసింది. అందులో భాగంగా రూ.10 లక్షల లోపు డాక్యుమెంటు విలువ గల భూముల రిజిస్ట్రేషన్‌కు రూ.100, అంతకుమించి ఉన్న భూములకు రూ.1000తో రిజిస్ట్రేషన్ పూర్తి చేయాలని ఆదేశాలిచ్చింది.

కావాల్సినవి ఇవే..

- ఆస్తి కలిగిన రైతు మరణిస్తే అతని మరణ ధ్రువీకరణ పత్రం.
- కుటుంబ సభ్యుల ధ్రువీకరణ పత్రం (ఎఫ్ఎంసీ).
- 1బి, అడంగల్‌లో అతని పేరు నమోదై ఉండాలి.
- ఎఫ్ఎంసీలో ఉన్న అందరికీ వాటాలు రాసుకోవాలి.



వ్యవసాయ భూములకే..

ప్రభుత్వం తాజాగా ఇచ్చిన జీవో ప్రకారం వారసత్వ వ్యవసాయ భూములకు రిజిస్ట్రేషన్ ఛార్జీలు తగ్గించి వారసులకు భాగస్వామ్య పత్రం రిజిస్ట్రేషన్ చేస్తారు. ఒకే డాక్యుమెంట్ ద్వారా.. ఆన్‌లైన్‌లో పేరున్న వ్యక్తి వారసులందరికీ ఎంతో కొంత వాటాలుగా రాసుకోవాల్సి ఉంటుంది. ఇప్పటికే అలాంటి ఇబ్బందులున్న రైతులు సంప్రదిస్తున్నారు. అన్ని ధ్రువీకరణ పత్రాలతో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో సంప్రదించాలి. **- నరసింహారావు, సబ్ రిజిస్ట్రార్, మైలవరం**

టెండర్ నోటిఫికేషన్ రద్దు

విజయవాడ బస్‌స్టేషన్, న్యూస్‌టుడే: ఎన్టీఆర్ జిల్లాలోని బస్ స్టేషన్లలో ఖాళీ దుకాణాలను సంబంధించిన టెండర్ నోటిఫికేషన్ ఈనెల 16న ఆహ్వానించాము, అనివార్య కారణాల వల్ల రద్దు చేస్తున్నట్లు జిల్లా ప్రజారవాణా అధికారి ఎం.వై.దానం బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.

సీఎస్‌ఆర్ నిధుల మంజూరుకు కేంద్ర మంత్రికి విజ్ఞప్తి



మంత్రి హర్దీప్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఎంపీ శివనాథ్

కరెన్సీనగర్, న్యూస్‌టుడే : విజయవాడ ప్రభుత్వ ఆసుపత్రి అభివృద్ధిలో భాగంగా రూ.2.80 కోట్ల సీఎస్‌ఆర్ నిధులు తెచ్చేందుకు ఎంపీ కేశినేని శివనాథ్ కృషి చేస్తున్నారు. ఈ సందర్భంగా బుధవారం కేంద్ర పెట్రోలియం శాఖ మంత్రి హర్దీప్ సింగ్ పురితో భేటీ అయ్యారు. ఆ శాఖ పరిధిలోని ప్రభుత్వ రంగ సంస్థల నుంచి సీఎస్‌ఆర్ నిధులు ఇప్పించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. దీనికి మంత్రి సానుకూలంగా స్పందించారు. విజయవాడ జీజీహెచ్‌కు త్వరలో కార్డియాలజీ, ఆప్తాల్మాలజీ, రేడియాలజీ వంటి విభాగాలకు ఆధునిక వైద్య పరికరాలు రానున్నాయి.

పంట ఉత్పత్తులు భేష్

విజయవాడ సిటీ, న్యూస్‌టుడే : నగర విద్యార్థులకు సహజంగా వ్యవసాయం అంటే తెలియదు... పంట ఉత్పత్తుల గురించి అవగాహన ఉండదని అందరూ భావిస్తారు. కానీ వీరు సాగు చేసే విధానం నుంచి పంట ఉత్పత్తులు వరకు వివిధ ప్రాజెక్టులు రూపొందించి భళా అనిపించారు. జాతీయ రైతు దినోత్సవం సందర్భంగా



వివిధ మోడల్స్‌ను చూస్తూ..

బుధవారం విజయవాడలోని మారిస్ స్టెల్లా కళాశాలలో ఫ్లోరీ ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయంలో అనుసరించాల్సిన ఆధునిక విధానాలు, సేంద్రియ విధానంలో సాగు చేసిన ఉత్పత్తులను వివిధ స్టాల్స్‌లో ప్రదర్శించారు. వివిధ రకాల మొక్కలు ఏర్పాటు చేశారు. ఫుడ్‌స్టాల్స్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. వివిధ కళాశాలలు, పాఠశాలల విద్యార్థులు వచ్చి ఆసక్తిగా ప్రదర్శన తిలకించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ ఇన్యాసమ్మ, కరస్పాండెంట్ లీనా క్వాడ్రాస్ పాల్గొన్నారు.

దక్షిణాది రాష్ట్రాల్లో దిగ్విజయంగా మార్కెట్ పూర్తి

గోకాఫ్ 120 ఎం.ఎల్. నూతన ప్యాక్ విడుదల



గోకాఫ్ బాటిళ్లను ఆవిష్కరిస్తున్న ఛైర్మన్ కేశవరావు, సినీనటి నైనా గంగూలి, దూండీ రాకేశ్, డాక్టర్ హిమసాగర చంద్రమూర్తి

విజయవాడ సిటీ, న్యూస్‌టుడే : ఆరోగ్య పరిరక్షణ రంగంలో ప్రసిద్ధిగాంచిన ఫిజికెమ్ వారి గోకాఫ్ ఇప్పుడు మార్కెట్‌లో 120 ఎం.ఎల్. ప్యాక్‌తో అందుబాటులోకి వచ్చిందని ఛైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ సీసీ కేశవరావు తెలిపారు. గోకాఫ్ 120 ఎం.ఎల్ బాటిల్ ఆవిష్కరణ కార్యక్రమాన్ని విజయవాడ టిక్కిల్ రోడ్డులోని ఓ హోటల్‌లో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కేశవరావు మాట్లాడుతూ గోకాఫ్ 20 ఏళ్లుగా దక్షిణాది రాష్ట్రాల్లో దిగ్విజయంగా మార్కెట్ పూర్తి చేశామని, 2026లో సంపూర్ణంగా భారతదేశానికి విస్తరించే ఆలోచనలో ఉన్నామని తెలిపారు. ప్రభుత్వ ఆయుర్వేద కళాశాల విశ్రాంత ఆచార్యుడు డాక్టర్ హిమసాగర చంద్రమూర్తి మాట్లాడుతూ ఆయుర్వేద విధానంలో తయారు చేసిన గోకాఫ్ సిరప్ వాడటం అత్యంత రక్షణ అని తెలిపారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆర్య వైశ్య కార్పొరేషన్ ఛైర్మన్ దూండీ రాకేశ్, ప్రత్యేక అతిథిగా హాజరైన సినీనటి నైనా గంగూలి మాట్లాడుతూ గోకాఫ్ పూర్తిగా ఆయుర్వేదంతో కూడుకుందని, ఆరోగ్యానికి మేలు చేస్తుందని తెలిపారు.

నాణ్యమైన విద్యుత్తు అందించాలి



మాట్లాడుతున్న సీఎండీ పుల్లారెడ్డి, పక్కన మురళీకృష్ణ యాదవ్

రాఘవయ్యపార్కు కూడలి(కృష్ణలంక), న్యూస్‌టుడే: వినియోగదారులకు నిరంతరం నాణ్యమైన విద్యుత్తు అందించాల్సిందిగా ఏపీసీపీడీసీఎల్ సీఎండీ పి.పుల్లారెడ్డి.. సిబ్బందిని ఆదేశించారు. సూర్యారావుపేటలోని ఎస్ఈ కార్యాలయంలో బుధవారం ఎన్టీఆర్ జిల్లా ఎస్ఈ, ఈఈ, డీఈఈ, ఏఈఈలతో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఆధార్ సీడింగ్, పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులు, ఎస్టిమేషన్లు, పెండింగ్ బకాయిలపై సమీక్షించి వ్యవసాయ విద్యుత్తు కనెక్షన్లను త్వరితగతిన మంజూరు చేయాలన్నారు. పీఎం సూర్యఘర్ కింద ఎస్సీ, ఎస్టీ వినియోగదారులకు సోలార్ రూఫ్ టాప్స్ బిగించడం, రెవెన్యూ కలెక్షను, ఫీడర్ లెవెల్ సోలారైజేషన్, నూతన సబ్ స్టేషన్ల నిర్మాణంపై సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు. డైరెక్టర్ టెక్నికల్ మురళీకృష్ణ యాదవ్, డైరెక్టర్ ఫైనాన్స్ వెంకటేశ్వర్లు, ఎస్ఈ హనుమయ్య తదితరులు పాల్గొన్నారు.

పీఏసీఎస్ సీఈవో సస్పెన్షన్

మైలవరం, న్యూస్‌టుడే: మండలంలోని తోలుకోడు వ్యవసాయ పరపతి సహకార సంఘం(పీఏసీఎస్) సీఈవో చినవెంకటేశ్వరరావును సస్పెండ్ చేస్తూ కేడీసీసీ సీఈవో శ్యామ్ మనోహర్ ఉత్తర్వులిచ్చారు. తదుపరి ఆదేశాలిచ్చే వరకు సస్పెన్షన్ కొనసాగించాలని డీఆర్వోకు సూచించారు. సీఈవో ఆదేశాల మేరకు సస్పెండ్ చేసి.. బుధవారం నుంచి పీఏసీఎస్ కార్యాలయంలో విచారణ కొనసాగిస్తున్నారు. విధుల నిర్వహణలో అలసత్వం, నిధుల దుర్వినియోగం, రుణ లావాదేవీల్లో అక్రమాలపై పలువురు రైతుల ఫిర్యాదులతో సంఘం ద్వారా ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయడంతో ప్రాథమికంగా చర్యలు తీసుకున్నట్లు తెలిసింది. సేకరించిన వివరాల ప్రకారం.. పొరుగు గ్రామాల్లో రుణాలు అందని వారికి రుణాలిప్పిస్తూ అక్రమాలకు పాల్పడ్డారంటూ ఫిర్యాదులు.. మాదు వెంకటేశ్వరావు అనే వ్యక్తికి లాంగ్ టర్మ్ రుణంగా రూ.3 లక్షలు మంజూరు చేసినా.. చెల్లించకుండా తాత్సారం చేయడంతో సదరు రైతు రెండు నెలల కిందట ఫిర్యాదు చేయడంతో సంఘ నాయకులు విచారించారు. మరో రైతు తాను తీసుకున్న రుణాన్ని చెల్లింపు నిమిత్తం నగదును ఇచ్చినా.. జమ చేయలేదని ఫిర్యాదుల నేపథ్యంలో సంఘ అధ్యక్షుడు వెంకటేశ్వరరావు, నాయకులు కేడీసీసీ సీఈవోకు ఫిర్యాదు చేశారు. ఆయా అవకతవకల నేపథ్యంలోనే ఉన్నతాధికారులు చర్యలు తీసుకుని.. పూర్తి విచారణకు ఆదేశించారు.

చాణక్య బెయిల్ పిటిషన్‌పై ముగిసిన వాదనలు

23న వెలువడనున్న తీర్పు

ఈనాడు - అమరావతి: మద్యం కేసులో నిందితుడు చాణక్య బెయిల్ పిటిషన్‌పై వాదనలు ముగిశాయి. ఈ పిటిషన్ బుధవారం ఏసీబీ కోర్టులో విచారణకు వచ్చింది. కోర్టులో ఇరుపక్షాల వాదనలు జరిగాయి. ఉత్తర్వులు ఈనెల 23న ఇవ్వనున్నట్లు న్యాయాధికారి భాస్కరరావు వాయిదా వేశారు. ★ కోర్టుకు తీసుకు వచ్చినప్పుడు వైకాపా నేత చెవిరెడ్డిని కుటుంబ సభ్యులతో మాత్రమే మాట్లాడేలా నియంత్రించాలని సిట్ పిటిషన్‌పై అతని తరఫు న్యాయవాది కౌంటర్ వేశారు. వాదనల నిమిత్తం గురువారానికి వాయిదా పడింది. ★అనిల్ చోఖ్రా బెయిల్ పిటిషన్‌పై సిట్ బుధవారం కౌంటర్ వేసింది. వాదనల నిమిత్తం 19కి వాయిదా వేశారు. ★ జైలులో వసతులు కల్పించాలన్న వెంకటేష్ నాయుడు పిటిషన్‌పై 19కి, అనిల్ చోఖ్రా పిటిషన్‌పై 18కి కోర్టు వాయిదా వేసింది.

ఇగ్నోలో దరఖాస్తుల ఆహ్వానం

విద్యాధరపురం, న్యూస్‌టుడే: ఇందిరాగాంధీ జాతీయ సార్వత్రిక విశ్వవిద్యాలయం(ఇగ్నో)లో జనవరి 2026 నుంచి ప్రారంభం కానున్న విద్యా సంవత్సరానికి కోర్సుల్లో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు విజయవాడ ప్రాంతీయ కేంద్రం రీజనల్ డైరెక్టర్ కె.సుమలత ఒక ప్రకటనలో తెలిపారు. డిగ్రీ, పీజీ, ఎంఏ సైకాలజీ, పీజీ డిప్లమో కోర్సులకు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసేందుకు 2026 జనవరి 31 ఆఖరు తేదీ అని పేర్కొన్నారు. పీజీ రెండో సంవత్సరం, డిగ్రీ రెండు, మూడు సంవత్సరాల్లో సెమిస్టర్ విధానంలో చదివే విద్యార్థులు రీ-రిజిస్ట్రేషన్ ఫీజును ఆన్‌లైన్ ద్వారా 2026 జనవరి 15 వరకు చెల్లించేందుకు అవకాశం ఉందని తెలిపారు. వివరాలకు ఇగ్నో వెబ్‌సైట్, లేదా కొత్తపేటలోని హిందూ హైస్కూల్ ప్రాంగణంలోని ఇగ్నో ప్రాంతీయ కేంద్రాన్ని స్వయంగా లేదా 08662565253 ఫోన్ ద్వారా సంప్రదించవచ్చని వివరించారు.



తిరువూరు
• తిరువూరు • మైలవరం

ధ్యానంపై అవగాహన కలిగి ఉండాలి

కొండపల్లి, న్యూస్‌టుడే: ధ్యానంపై జ్ఞానం కలిగించడమే ధ్యాన సప్తాహం కార్యక్రమ ఉద్దేశమని



ధ్యాన అవగాహన కార్యక్రమంలో విద్యార్థులు

యోగ ఫౌండేషన్ గురువు జనార్దన్ అన్నారు. ద్వితీయ ప్రపంచ ధ్యాన కార్యక్రమాలను కొండపల్లి నాగార్జున పాఠశాలలో బుధవారం నిర్వహించారు. జనార్దన్ మాట్లాడుతూ.. ధ్యానం ఒక అభ్యాసంగా సాధన చేయాలన్నారు. అంతకుముందు విద్యార్థులందరూ ప్లకార్డులు పట్టుకుని ధ్యానంపై అవగాహన ప్రదర్శన నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఖాసింవలి తదితరులు పాల్గొన్నారు.

ఎల్బీఆర్‌సీఈ అధ్యాపకుడికి అవార్డు


అధ్యాపకుడిని అభినందిస్తున్న ప్రిన్సిపల్

మైలవరం, న్యూస్‌టుడే: లకిరెడ్డి బాలిరెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో ఎంబీఏ అధ్యాపకుడిగా విధులు నిర్వర్తిస్తున్న ఎ.ఆదిశేషారెడ్డి ఎయిమ్స్ ఇన్నోవేటివ్ స్టార్టప్ బిజినెస్ ఐడియా అవార్డు అందుకున్నట్లు ప్రిన్సిపల్ కె.అప్పారావు తెలిపారు. ఇటీవల భువనేశ్వర్‌లో ఎయిమ్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన స్టార్టప్ ఐడియా పోటీల్లో ప్రదర్శన ద్వారా అవార్డు అందుకున్నారని చెప్పారు. ఈ సందర్భంగా ఆయన్ను బుధవారం అభినందించారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM
తిరువూరు: 98853 28820 మైలవరం: 80085 74705

స్పందనకు వందనం

◆ స్థానిక పంచాయతీలోని శివాలయ సమీప ప్రాంతంలోని పీతురు కాలువలో ప్లాస్టిక్ సీసాలు, చెట్లకొమ్మలు అడ్డుపడి మురుగు ముందుకు కదలడం లేదని అందిన ఫిర్యాదు మేరకు పంచాయతీ కార్యదర్శి ఎం.డి.రఫీ స్పందించారు. బుధవారం పంచాయతీ కార్మికులతో వాటిని తొలగింపజేశారు. - న్యూస్‌టుడే, మైలవరం

◆ పట్టణ పరిధి 5వ వార్డులోని డ్రెయిన్‌లో వ్యర్థాలు పేరుకున్నాయని స్థానికుడు రమేష్ అందించిన ఫిర్యాదు మేరకు మున్సిపల్ శానిటరీ అధికారి సంతోష్ స్పందించి.. సమస్య పరిష్కరించారు. ◆ 18వ వార్డులోని డ్రెయిన్‌లో వ్యర్థాలు పేరుకున్నాయని స్థానికుడు ప్రకాష్‌రావు అందించిన ఫిర్యాదు మేరకు.. కాలువ శుభ్రం చేయించారు.

- న్యూస్‌టుడే, తిరువూరు టౌన్

విభజన పంచాయితీలు..
ప్రత్యేకత కోసం నాయకుల కుస్తీలు

న్యూస్‌టుడే, మైలవరం

పరిపాలనా సౌలభ్యం కోసం పెద్ద పంచాయతీలను విడదీసి, ఎక్కువ పంచాయతీలుగా చేయాలన్న కసరత్తులో నాయకుల మధ్య పంచాయితీలు తలెత్తుతున్నాయి. విభజనతో ఆధిపత్యం కోసం కొందరు.. ఉన్న ఆధిపత్యం తగ్గుతుందని మరికొందరు వారి మనోభీష్టాలకు అనుగుణంగా పావులు కదుపుతున్నారు. ఈ నెలాఖరులోగా విభజన తీర్మానాలను ఉన్నతాధికారులకు అందజేయాల్సిన నేపథ్యంలో భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

● నియోజకవర్గంలో గత పంచాయతీ ఎన్నికలకు ముందు 500 జనాభా కలిగిన గిరిజన తండాలను ప్రత్యేక పంచాయతీలుగా ఏర్పాటు చేశారు. దాంతో 4 గ్రామ పంచాయతీలు అదనంగా ఏర్పడ్డాయి. ప్రస్తుతం మైలవరం మండలంలో అతి పెద్ద గ్రామ పంచాయతీలుగా ఉన్న పుల్లూరు, చంద్రగూడెంల విభజన తప్పనిసరని భావిస్తున్నారు. రెడ్డిగూడెం, జి.కొండూరు, ఇబ్రహీంపట్నం మండలాల్లోనూ ఒక్కో పంచాయతీ చొప్పున విభజనకు సిద్ధంగా ఉన్నాయి. ఈ నేపథ్యంలో, రెండ్రోజుల కిందట జి.కొండూరు, రెడ్డిగూడెం మండలాల్లో విభజన చేయాల్సిన పంచాయతీల్లో, గ్రామసభల్లో పాల్గొన్న ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్‌కు.. ఆ


పుల్లూరు గ్రామ సచివాలయం

గ్రామాల ప్రజలు తమ అభీష్టాన్ని వివరించారు.

పుల్లూరులో దీర్ఘకాల సమస్య..

పుల్లూరు పంచాయతీలో 7 గ్రామాలు ఉన్నాయి. గడిచిన నలభై ఏళ్లుగా ఇక్కడ విభజన అంశం తీరని సమస్యగా మారింది. కోర్టు వివాదాలతో దాదాపు 25 ఏళ్ల పాటు ఎన్నికలకు దూరంగా ఉంది. పర్సన్ ఇన్‌ఛార్జితోనే పాలన సాగగా, గత మూడు పర్యాయాలు ఒకే పంచాయతీగా ఎన్నికలు జరిగాయి. గతంలో ఇక్కడ పర్యటించిన ఎమ్మెల్యే.. విభజన చేస్తేనే మేలని చెప్పారు. అందుకు అనుగుణంగా అభిప్రాయ సేకరణ చేస్తున్న తరుణంలో కొందరు నాయకులు వేచి చూడాలని ఎమ్మెల్యేకి విజ్ఞప్తి చేస్తుండగా.. పంచాయతీలోని కొత్తగూడెం కేంద్రంగా కొత్త పంచాయతీని ఏర్పాటు చేయాలని కొందరు కోరుతున్నారు.

● చంద్రగూడెం పంచాయతీలోనూ 5 గ్రామాలు ఉండగా.. రెండుగా చేయాలన్న విజ్ఞప్తులు బలంగా ఉన్నాయి. కానీ ఏయే గ్రామాలను కలపాలన్న విషయంలో భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

● రెడ్డిగూడెం మండలం రంగాపురం పంచాయతీలో 6 గ్రామాలు ఉండగా.. విభజనకు అంతా అంగీకరిస్తున్నారు. అయితే గ్రామాలు కలిపే అంశం కొలిక్కిరాలేదు.

● జి.కొండూరు మండలంలోని వెల్లటూరు పంచాయతీ నుంచి భీమవరప్పాడు విభజనకు దాదాపు కసరత్తులు పూర్తయినట్లు తెలుస్తోంది.

ఇంకా ప్రతిపాదనలు రాలేదు

డివిజన్ పరిధిలోని మండలాల్లో గ్రామసభల తీర్మానాలను పంపితే, డీపీవో ద్వారా కలెక్టర్‌కు చేరుతాయి. అక్కడ ఆమోదం అనంతరం కొత్త పంచాయతీల ఏర్పాటు జరుగుతుంది. ఇప్పటి వరకు ఆలోచనలున్నా.. తీర్మానాలు మా వరకు రాలేదు.

- జీఎల్‌వీఎన్ రాఘవన్, డివిజనల్ పంచాయతీ అధికారి, విజయవాడ

పారదర్శక పాలన కోసమే ప్రజాదర్బార్



ఐసీడీఎస్ సిబ్బందికి స్మార్ట్ ఫోన్లు అందజేస్తున్న ఎమ్మెల్యే కృష్ణప్రసాద్

ఇబ్రహీంపట్నం, న్యూస్‌టుడే: ప్రజాస్వామ్య పాలనకు ప్రజాదర్బార్ నిదర్శనమని ఎమ్మెల్యే కృష్ణప్రసాద్ అన్నారు. ఇబ్రహీంపట్నం మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ప్రజాదర్బార్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే హాజరై మాట్లాడుతూ.. ప్రజల నుంచి స్వీకరించిన అర్జీలను ఆన్‌లైన్‌లో నమోదు చేసి పరిష్కరించనున్నామని చెప్పారు. ఈ కార్యక్రమం నిర్వహించడం ద్వారా సమస్యల తీవ్రత స్పష్టమవుతుందన్నారు. రూ.55 కోట్లతో ఇంటింటికి కుళాయి ఇచ్చేందుకు టెండర్లు పూర్తయ్యాయని తెలిపారు. ఇబ్రహీంపట్నం పరిధిలో 220కి పైగా వినతులు వచ్చాయని పేర్కొన్నారు. అనంతరం 292 మంది ఐసీడీఎస్ సిబ్బందికి ఆయన 5జీ ఫోన్లు అందజేశారు. మాజీ ప్రధాని వాజ్‌పేయీ విగ్రహాల ఏర్పాటుకు అనుమతులు ఇప్పించాలని భాజపా నాయకులు, విలేకరులకు ఇళ్ల స్థలాలను ఇవ్వాలని ఆయా యూనియన్ల నాయకులు ఎమ్మెల్యేకు వినతిపత్రాలను అందించారు. పురపాలిక ఛైర్మన్ చిట్టిబాబు, వివిధ డివిజన్ల కౌన్సిలర్లు, తహసీల్దారు వెంకటేశ్వర్లు, ఎంపీడీవో శకుంతల, తెదేపా నాయకులు సీతారామయ్య, కూటమి నాయకులు పాల్గొన్నారు.

మత్తు పదార్థాల వినియోగంతో జీవితాలు నాశనం

కొండపల్లి, న్యూస్‌టుడే: మత్తు పదార్థాల వినియోగం జీవితాలను నాశనం చేస్తుందని మానసిక వికాస కేంద్రం జోనల్ కోఆర్డినేటర్ జాకబ్‌రాజు అన్నారు. నవజీవన్ బాలభవన్ ఆధ్వర్యంలో కొండపల్లి జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో మత్తు పదార్థాల వినియోగంతో వచ్చే అనర్థాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

విజేతలైన ఉపాధ్యాయులకు అభినందన


క్రికెట్ విజేతలతో ఎంఈవో కేశవరావు, హెచ్ఎం ప్రసాదరావు

ఎ.కొండూరు, గంపలగూడెం, న్యూస్‌టుడే: ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులకు తిరువూరు రెవెన్యూ డివిజన్ స్థాయిలో నిర్వహించిన ఆటల పోటీల్లో ఎ.కొండూరు మండలం ప్రథమ స్థానంలో నిలిచింది. ప్రభుత్వ ఆదేశాల మేరకు తిరువూరు, రెడ్డిగూడెం, విస్సన్నపేట, ఎ.కొండూరు, గంపలగూడెంలో మండల స్థాయిలో పురుషులకు క్రికెట్, మహిళలకు త్రోబాల్ పోటీలు నిర్వహించారు. విస్సన్నపేట మండలం నరసాపురం జడ్పీ ఉన్నత పాఠశాలలో సోమ, మంగళవారం డివిజన్ స్థాయి పోటీలు నిర్వహించగా.. రెండు విభాగాల్లో ఎ.కొండూరు మండల ఉపాధ్యాయులు విజయం సాధించారు. బుధవారం ఎ.కొండూరు ఉన్నత పాఠశాలలో ఎంఈవో కేశవరావు, హెచ్ఎం డీజేఎండీ.ప్రసాదరావు, టీం కెప్టెన్లు లక్ష్మీదుర్గ, రాజారావు ఆధ్వర్యంలో ప్రథమ స్థానం సాధించిన రెండు జట్ల ఉపాధ్యాయులకు అభినందన కార్యక్రమం నిర్వహించారు.

మొక్కజొన్నలో సస్యరక్షణ చర్యలు తప్పనిసరి



రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏవో సూరిబాబు, మోనీషా తదితరులు

జి.కొండూరు, న్యూస్‌టుడే: మొక్కజొన్నలో మెరుగైన సస్యరక్షణ చర్యలు చేపడితే అధిక లాభాలు సాధించవచ్చని జిల్లా ఏడీఏ మోనీషా పేర్కొన్నారు. చెవుటూరులోని రైతు సేవా కేంద్రం ఆవరణలో రైతులకు బుధవారం నిర్వహించిన అవగాహన కార్యక్రమానికి ఆమె హాజరై మాట్లాడారు. ఏవో సూరిబాబు మాట్లాడుతూ.. రబీలో మొక్కజొన్న పంటను ఆశించే కత్తెర పురుగు, లద్దె పురుగు, రెక్కల పురుగుల నుంచి ఏ విధంగా పంటను కాపాడుకోవాలో రైతులకు వివరించారు. కార్యక్రమంలో మైలవరం ఏడీఏ ఎం.శ్రీనివాసరావు, మైలవరం ఏవో వాసుదేవ్, జి.కొండూరు ఏవో సూరిబాబు, వైస్ ఎంపీపీ పుప్పాల సుబ్బారావు, పీఏసీఎస్ ఛైర్మన్ మురళి, రైతులు తదితరులు పాల్గొన్నారు.

గద్దె అనూరాధను మర్యాదపూర్వకంగా కలిసిన తెదేపా శ్రేణులు

విస్సన్నపేట, న్యూస్‌టుడే: తెదేపా ఎన్టీఆర్ జిల్లా నూతన అధ్యక్షురాలిగా నియమితులైన గద్దె అనూరాధను తెదేపా మండల అధ్యక్షుడు రాయల శేషగిరిరావు ఆధ్వర్యంలో పార్టీ శ్రేణులు విజయవాడలో మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు.


శుభాకాంక్షలు తెలుపుతున్న నాయకులు

ఇంటి పన్నుల వసూళ్లు వేగవంతం చేయండి


మాట్లాడుతున్న డీఎల్‌డీవో రమణి

తిరువూరు టౌన్, న్యూస్‌టుడే: తిరువూరు డీఎల్‌డీవో ఆధ్వర్యంలో ఇంటి పన్నులు ఆన్‌లైన్లో వసూలుపై ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. డీఎల్‌డీవో రమణి మాట్లాడుతూ.. కమిషనర్ ఆదేశాల మేరకు ఇంటి పన్నుల వసూళ్లను సులభంగా ఆన్‌లైన్లో చెల్లించే విధంగా.. వసూళ్లను వేగవంతం చేసి డిసెంబరు చివరి నాటికి పూర్తి చేయడం వంటి అంశాలపై సూచనలు చేశారు. దీనిపై ప్రజలకు సరైన అవగాహన కల్పించాలని.. అవసరమైన సాంకేతిక సాయం అందించాలని అధికారులను ఆదేశించారు. కార్యాచరణ ప్రణాళిక రూపొందించి అమలు చేయాలని సూచించారు. డివిజన్‌లోని అయిదు మండలాల డిప్యూటీ ఎంపీడీవోలు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

సైన్స్ ఫెయిర్‌లో ఆకట్టుకున్న ప్రాజెక్టులు

గంపలగూడెం, తిరువూరు, ఎ.కొండూరు, న్యూస్‌టుడే: తిరువూరు, గంపలగూడెం, ఎ.కొండూరు మండల కేంద్రాల్లోని జడ్పీ ఉన్నత పాఠశాలల్లో బుధవారం మండల స్థాయి సైన్స్ ఫెయిర్ నిర్వహించారు. పలు ప్రాథమికోన్నత, జడ్పీ ఉన్నత పాఠశాలల విద్యార్థులు పాల్గొని తాము తయారు చేసిన ప్రాజెక్టులను ప్రదర్శనలో ఉంచారు. మండల విద్యాశాఖ అధికారులు, ఉపాధ్యాయులు సందర్శించి సదరు విద్యార్థులను అభినందించారు. జిల్లా స్థాయి సైన్స్ ఫెయిర్‌కు కొన్ని ప్రాజెక్టులను ప్రతిపాదించారు.

ఉద్యోగులకు వేతనాలు పెంచాలి

గొల్లపూడి, న్యూస్‌టుడే: సాంఘిక సంక్షేమ వసతి గృహాల్లో పనిచేసే పొరుగు సేవల ఉద్యోగులకు వేతనాలు పెంచాలని ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.వెంకటసుబ్బయ్య కోరారు. గొల్లపూడిలోని ఏఐటీయూసీ రాష్ట్ర కార్యాలయంలో బుధవారం సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. వసతి గృహాల్లో ఉండే విద్యార్థులకు సేవలందిస్తున్న ఉద్యోగులకు సరైన వేతనాలు ఇవ్వకపోవడం దారుణమన్నారు.

ఘనంగా పింఛనర్ల దినోత్సవం

మైలవరం, న్యూస్‌టుడే: జాతీయ పింఛనర్ల దినోత్సవాన్ని స్థానిక విశ్రాంత ఉద్యోగుల సంఘ కార్యాలయంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా 75 సంవత్సరాలు పైబడిన విశ్రాంత ఉద్యోగులు జి.శ్రీరాములు, ఎన్.నాగభూషణం, ఎం.లక్ష్మీనారాయణ, ఆండాలమ్మలను ప్రవాస భారతీయుడు హనిమిరెడ్డి, ఉప ఖజానాధికారి సత్యనారాయణ ఘనంగా సన్మానించారు.


మాట్లాడుతున్న పూర్ణచంద్రరావు

సంఘం తాలూకా అధ్యక్షుడు నాగిరెడ్డి, సభ్యులు పూర్ణచంద్రరావు, సుదర్శనరావు, తదితరులు పాల్గొన్నారు.

విస్సన్నపేట: భారతదేశంలో పింఛనుదారుల హక్కుల కోసం పోరాడిన యోధుడు డీఎస్ నకారా అని ఎంపీడీవో చేకు చిన్నరాట్నాలు అన్నారు. స్థానిక కార్యాలయం ఆవరణలో పెన్షనర్స్ డే వేడుకలు నిర్వహించారు.

దారంతా గుంతలు.. స్పందించరా మీరు?

న్యూస్‌టుడే, విస్సన్నపేట

విస్సన్నపేట మండలంలోని పలు రహదారులు ఏళ్ల తరబడి మరమ్మతులకు నోచుకోక అధ్వానంగా తయారయ్యాయి. ముఖ్యంగా కొండపర్వ ప్రధాన రహదారి, కొండపర్వ- చిత్తపూరు, నరసాపురం- చిన్నంపేట, చాత్రాయి వెళ్లే ఆర్అండ్‌బీ రోడ్డు తదితర మార్గాల్లో గుంతలు ఏర్పడ్డాయి. ఈ నేపథ్యంలో ద్విచక్ర వాహనదారులు, ప్రయాణికులు, పంట పొలాలకు వెళ్లే రైతులు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దీనికి తోడు పలు గ్రామాల్లోని అంతర్గత రోడ్లను అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోక పోవడంతోనే ఈ పరిస్థితి నెలకొందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తాతకుంట్ల యాదవుల బజారు, విస్సన్నపేట పరిధిలోని కమ్మటూరు, చింతల బజారు, ప్రగతి నగర్, టీచర్స్


అధిక లోడు గల లారీల రాకపోకలతో పాడవుతున్న రోడ్డు

కాలనీ తదితర ప్రాంతాల్లోని అంతర్గత రహదారులకు మరమ్మతులు చేయించే వారే లేరని ప్రజలు వాపోతున్నారు. మండల కేంద్రంలోని కమ్మటూరు యాదవులు ఉంటున్న ఏరియాకు ఇంత వరకు బాట ఏర్పాటు చేయలేదని 50 కుటుంబాల వారు ఆవేదన చెందారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి రోడ్లను బాగు చేయించి, డ్రెయిన్లు నిర్మించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

ప్రభుత్వానికి నివేదించాం

రహదారుల మరమ్మతులు, నిర్మాణం కోసం అంచనాలు రూపొందించి ఉన్నతాధికారులకు నివేదిక పంపించాం. ప్రభుత్వం నుంచి జీవో విడుదల అయిన వెంటనే నిర్మాణ పనులు ప్రారంభిస్తాం. ప్రజల రాకపోకలకు ఇబ్బందులు లేకుండా చూస్తాం. - గాయత్రి దేవి, ఆర్అండ్‌బీ ఏఈ

గోవుల సంచారం.. కట్టడిలో విఫలం



విస్సన్నపేటలోని రోడ్లపై నిత్యం గోవుల సంచారం అధికంగా ఉంటుంది. దీంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడుతుంది. ఈ క్రమంలో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని వాహనదారులు, ప్రయాణికులు, పాఠశాల విద్యార్థులు రహదారులపై రాకపోకలు సాగించడానికి భయపడుతున్నారు. వీటిని కట్టడి చేయడంలో సంబంధిత అధికారులు, సిబ్బంది విఫలమయ్యారని విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పటికైనా తగు చర్యలు తీసుకుని సమస్యను పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు. - న్యూస్‌టుడే, విస్సన్నపేట

మహిళా కానిస్టేబుళ్లకు అభినందన

జి.కొండూరు, ఇబ్రహీంపట్నం గ్రామీణం, న్యూస్‌టుడే: ఇటీవల కూటమి ప్రభుత్వం నిర్వహించిన పరీక్షల్లో ప్రతిభచాటి కానిస్టేబుళ్లుగా ఎంపికైన అక్కా చెల్లెళ్లను ఎమ్మెల్యే వసంత వెంకటకృష్ణప్రసాద్ బుధవారం ఇబ్రహీంపట్నంలో అభినందించారు. జి.కొండూరు



రత్నశ్రీ, జయశ్రీలను అభినందించిన ఎమ్మెల్యే కృష్ణప్రసాద్ తదితరులు

మండలం వెల్లటూరు గ్రామ శివారు భీమవరప్పాడుకు చెందిన అక్కాచెల్లెళ్లు వంగూరి రత్నశ్రీ, జయశ్రీలు కానిస్టేబుల్ ఉద్యోగం సాధించి మంగళవారం నియామక పత్రాలు అందుకున్నారు. ఈ సందర్భంగా వారిని ఎమ్మెల్యే శాలువాతో సత్కరించి జ్ఞాపికలు అందజేశారు. చిట్టిబాబుకు ముగ్గురు కుమార్తెలు కాగా వారిలో ఒకరికి వివాహమైంది.. మిగిలిన ఇద్దరిని బాగా చదివించి కానిస్టేబుళ్లుగా తీర్చిదిద్దినందుకు పలువురు ఆయనకు అభినందనలు తెలియజేశారు.

రైతుల సంక్షేమానికి కృషి

మైలవరం, న్యూస్‌టుడే: రాష్ట్రంలో రైతుల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందని ఏఎంసీ ఛైర్మన్ పొనకళ్ల నవ్యశ్రీ పేర్కొన్నారు. ప్రభుత్వం రాయితీపై అందించిన వ్యవసాయ డ్రోన్‌ను బుధవారం స్థానిక పంచాయతీ పరిధిలోని కొత్త గుర్రాజుపాలెంలో ఆమె ప్రారంభించారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత

విస్సన్నపేట, న్యూస్‌టుడే: స్థానిక తెదేపా కార్యాలయంలో కలగర గ్రామానికి చెందిన వేముల దుర్గాభవానికి మంజూరైన రూ.76,992 విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కును నాయకులు అందజేశారు. కార్యక్రమంలో పట్టణ, మండల అధ్యక్షులు కొంగల శ్రీనివాసరావు, రాయల సుబ్బారావు, గోటేటి సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

విద్యతో అన్ని రంగాల్లో రాణింపు

విస్సన్నపేట, న్యూస్‌టుడే: విద్యను అభ్యసించడం ద్వారా అన్ని రంగాల్లో రాణించవచ్చని ఎంఎన్ఆర్ ఫౌండేషన్ అధ్యక్షుడు ముప్పిడి నాగేశ్వరరెడ్డి అన్నారు. విస్సన్నపేట మండలం కొండపర్వ ట్రైబల్ వెల్ఫేర్ పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు యూటీఎఫ్ రూపొందించిన స్టడీ మెటీరియల్ ఆయన ఉచితంగా అందజేశారు. యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి టీసీహెచ్‌వీ సూర్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

నాలుగో రోజు కొనసాగిన ఆందోళన


విభజన కోరుతూ నిరసన..

ఎ.కొండూరు, గంపలగూడెం, న్యూస్‌టుడే: ఎ.కొండూరు మండలం రేపూడి గ్రామ పంచాయతీ విభజనకు పాత రేపూడిలో జరుగుతున్న ఉద్యమంలో అనుకూల, ప్రతికూల వర్గాలుగా విడిపోవడంతో గ్రామస్థులు ఆందోళన చెందుతున్నారు. ఎన్నెస్పీ ఎడమ కాలువ డీసీ ఛైర్మన్, మాజీ సర్పంచి కఠారి కోటేశ్వరరావు ఆధ్వర్యంలో పాత రేపూడిని ప్రత్యేక గ్రామ పంచాయతీగా విభజించాలని కోరుతూ గ్రామస్థులు దీక్ష చేస్తున్నారు. ప్రభుత్వ ఉత్తర్వులు అమలవ్వకుండా.. విభజన జరగకుండా అడ్డుకుంటున్న కొందరు నాయకులకు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ నిరసన వ్యక్తం చేశారు. రేపూడి గ్రామస్థులను పాత రేపూడికి తీసుకువచ్చి తమకు వ్యతిరేకంగా ఆందోళన చేయిస్తున్నారని కోటేశ్వరరావు ఆరోపించారు.

విభజన వద్దని మరో వర్గం...

మరోవైపు రేపూడి, పాత రేపూడి గ్రామాలు కలిసే ఉండాలని.. పంచాయతీ విభజన వద్దని కోరుతూ బుధవారం మాజీ సర్పంచి బి.జమలయ్య, సొసైటీ అధ్యక్షుడు బి.కృష్ణ, ఎంపీటీసీ మాజీ సభ్యురాలు ఎం.మార్తమ్మ, సీహెచ్.కుటుంబరావు ఆధ్వర్యంలో నిరసన దీక్ష ఏర్పాటు చేశారు. ఎప్పటి నుంచో అన్నదమ్ములుగా ఉంటున్న రెండు గ్రామాల ప్రజలు కలిసే ఉండాలని కోరారు.

కౌన్సిల్ సమావేశాల కరపత్రాల ఆవిష్కరణ

రెడ్డిగూడెం, న్యూస్‌టుడే: ఈ నెల 21న తిరువూరులో నిర్వహించే యూటీఎఫ్ జిల్లా నాలుగవ కౌన్సిల్ సమావేశాలను జయప్రదం


కరపత్రాలు ఆవిష్కరిస్తున్న యూటీఎఫ్ నాయకులు

చేయాలని కోరుతూ బుధవారం రెడ్డిగూడెం జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో యూటీఎఫ్ నాయకులు కరపత్రాలు ఆవిష్కరించారు. ఆ శాఖ జిల్లా కార్యదర్శి పి.భవాని, మండల ప్రధాన కార్యదర్శి డి.ప్రకాష్, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

వృద్ధుడి నేత్రదానం

గంపలగూడెం, న్యూస్‌టుడే: మండల కేంద్రంలో బొడ్డు పాండురంగారావు (71) బుధవారం మృతి చెందగా.. అతని నేత్రాలను కుటుంబ సభ్యులు విజయవాడ ఎల్వీప్రసాద్ కంటి ఆసుపత్రికి దానం చేశారు. లయన్స్‌క్లబ్ ప్రతినిధి జి.కృష్ణారెడ్డి చొరవతో నేత్రదానంపై అవగాహన కల్పించడంతో కుటుంబ సభ్యులు అంగీకరించారు. వైద్యులు అతని కళ్లలోని కార్నియాను సేకరించి తీసుకెళ్లారు.


బి.పాండురంగారావు (పాత చిత్రం)

శిరస్త్రాణం ధరించడంపై అవగాహన

ఇబ్రహీంపట్నం, న్యూస్‌టుడే: మనకోసం మన కుటుంబ సభ్యులు ఎదురు చూస్తుంటారనే విషయం ద్విచక్ర వాహనదారులు గుర్తుంచుకోవాలని సీఐ చంద్రశేఖర్ అన్నారు. శిరస్త్రాణం ధరించడంపై ఇబ్రహీంపట్నం రింగు కూడలిలో ట్రాఫిక్ సిబ్బంది బుధవారం వాహనదారులకు అవగాహన కల్పించారు.

ప్రమాదాల నివారణకు చర్యలు

మైలవరం, న్యూస్‌టుడే: జాతీయ రహదారి 30పై. మండలంలోని చంద్రగూడెం బైపాస్‌లో క్రాసింగ్‌లు, సర్కిళ్లలో ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకుంటామని ఆ శాఖ అధికారులు తెలిపారు. గ్రామంలోని బైపాస్‌లో రోడ్డు దాటే సమయంలో ప్రమాదాలు జరుగుతున్నాయని.. కూడళ్లలో దీపాలు లేక ఇబ్బందిగా ఉందంటూ ఇటీవల గ్రామానికి వచ్చిన ఆర్డీవో చైతన్యకు జనసేన మండల అధ్యక్షుడు శీలం బ్రహ్మయ్య, ఏఎంసీ ఛైర్మన్ నవ్యశ్రీల ఆధ్వర్యంలో గ్రామస్థులు ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో ఎన్‌హెచ్ అధికారులు రహదారిని బుధవారం పరిశీలించారని బ్రహ్మయ్య తెలిపారు. దీపాల ఏర్పాటు, రోడ్డు పక్కన సూచిక బోర్డులను త్వరలోనే ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చినట్లు పేర్కొన్నారు.

ఆర్థిక సాయం అందజేత

ఎ.కొండూరు, గంపలగూడెం, న్యూస్‌టుడే: ఎ.కొండూరు మండలం కృష్ణారావుపాలెం వినాయకుడి గుడి అర్చకులు వేదాంతం పురంధర్ కుమారుడి వైద్యం కోసం ప్రయివేటు అర్చక, పురోహిత సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో బుధవారం రూ.15 వేలు ఆర్థికసాయం అందించినట్లు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఈశ్వరప్రగడ విజయ్‌కుమార్‌రాజా తెలిపారు.

అందుబాటులో గోనె సంచులు

రెడ్డిగూడెం, న్యూస్‌టుడే: ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో గోనె సంచులు అందుబాటులో ఉన్నాయని ఏవో డి.శ్రీనివాసరావు పేర్కొన్నారు. బుధవారం రెడ్డిగూడెం, అన్నేరావుపేట గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. వరి నారుమడులు పరిశీలించి నీటి యాజమాన్యం, ఎరువుల వినియోగంపై అవగాహన కల్పించారు. వ్యవసాయ శాఖ సిబ్బంది శివరాణి, ప్రేమ్ చందు, రైతులు పాల్గొన్నారు.

1190 క్యూసెక్కుల సాగర్ జలాలు విడుదల

గంపలగూడెం, న్యూస్‌టుడే: ఎన్నెస్పీ రెండో జోన్‌లోని మధిర బ్రాంచి కెనాల్‌కు ఖమ్మం జిల్లా కల్లూరు మండలం కప్పలబంధం నియంత్రిక 72వ కి.మీ. నుంచి బుధవారం 1190 క్యూసెక్కుల సాగర్ జలాలు విడుదలైనట్లు ఏఈ మహేష్‌బాబు తెలిపారు. గంపలగూడెం మండల సరిహద్దులోని 23వ కి.మీ. వద్దకు 541 క్యూసెక్కులు చేరాయని, అక్కడ నుంచి దిగువన మేజర్ల వారీగా గంపలగూడెం 30, ఊటుకూరు-1కి 60, పెదకొమిర 30, మధిర 60, నిదానపురం 60 క్యూసెక్కులు సరఫరా చేస్తున్నట్లు తెలిపారు.

ఈ పంట నమోదు చేయించుకోండి

విస్సన్నపేట, న్యూస్‌టుడే: రబీ సీజన్లో సాగుచేసిన పంటలను ఈ-పంటగా నమోదు చేయించుకోవాలని మండల వ్యవసాయ అధికారి షేక్ టిప్పుసుల్తాన్ కోరారు. బుధవారం కొండపర్వలో నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. ఈ సీజన్లో సాగుచేసిన వరి, మొక్కజొన్న పంటల బీమా కొరకు ఎకరానికి రూ.126 చెల్లించి కామన్ సర్వీస్ సెంటర్‌లో నమోదు చేయించుకోవాలని తెలిపారు. ఆర్ఎస్‌కే సిబ్బంది విజయ, దివ్య, రైతులు పాల్గొన్నారు.

తిరుపతమ్మ రంగులోత్సవానికి పటిష్ఠ బందోబస్తు

పెనుగంచిప్రోలు, న్యూస్‌టుడే: పెనుగంచిప్రోలులోని శ్రీతిరుపతమ్మ అమ్మవారి దేవాలయం రంగులోత్సవానికి పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేస్తా



అర్చకులతో మాట్లాడుతున్న డీసీపీ లక్ష్మీనారాయణ, పక్కన సీఐ వెంకటేశ్వర్లు

మని డీసీపీ లక్ష్మీనారాయణ తెలిపారు. అమ్మవారి ఆలయాన్ని ఆయన బుధవారం సందర్శించి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం జనవరి 5న జరగనున్న రంగులోత్సవం గురించి ఆలయ ప్రధాన అర్చకుడు మర్రెబోయిన గోపీబాబు, ఏఈవో జంగం శ్రీనివాసరావు, ఏఈ రాజులను అడిగి తెలుసుకున్నారు. ఉత్సవాలు విజయవంతం చేసేందుకు అందరూ సహకరించాలని కోరారు. జగ్గయ్యపేట సీఐ వెంకటేశ్వర్లు, ఎస్సై అర్జున్ తదితరులు పాల్గొన్నారు.

దశ మారాలంటే.. నిర్దిష్ట దిశ అవసరం

కరెన్సీనగర్, న్యూస్‌టుడే: మారుతున్న ప్రపంచంలో ఆధునిక సాంకేతికతకు అనుగుణంగా లక్ష్యాలను మార్చుకోవాలని పలువురు వక్తలు పేర్కొన్నారు. విజయవాడ ఆంధ్ర లయోలా కళాశాల వేదిక ఆడిటోరియంలో బుధవారం 'ఈనాడు- కేఎల్ డీమ్డ్ విశ్వ విద్యాలయం' సంయుక్తంగా 'దశ- దిశ' పేరిట అవగాహన సదస్సు నిర్వహించారు. ఇంటర్ చదివేటప్పుడే జీవితంలో ఉన్నతంగా ఎదిగేందుకు సరైన నిర్ణయం తీసుకోవాలని, ప్రస్తుత పోటీ ప్రపంచానికి తగినట్టుగా నైపుణ్యాలు పెంపొందించుకుని, ఉన్న అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలంటూ విద్యార్థులకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. అనంతరం విద్యార్థులకు యూనివర్సిటీ కిట్లు, కూపన్లు అందజేశారు. లక్కీడిప్‌లో ఎంపికైన బి.పుష్పజ్, గోపీచంద్‌లతో పాటుగా సదస్సులో మాట్లాడిన సుమన్య, గోపాలకృష్ణ స్పాన్సర్ చేసిన అందజేశారు. కార్యక్రమంలో 'ఈనాడు' విజయవాడ యూనిట్ ఇన్‌ఛార్జ్ సీహెచ్ కిశోర్ కుమార్, శారద విద్యాసంస్థల డైరెక్టర్ జీవీఆర్, కేఎల్ డీమ్డ్ యూనివర్సిటీ ప్రవేశాల విభాగం డైరెక్టర్ జె.శ్రీనివాసరావు, అసిస్టెంట్ డైరెక్టర్ బొబ్బిలి సత్యనారాయణ మూర్తి, షణ్ముఖ కుమార్ పాల్గొన్నారు.



సదస్సులో పాల్గొన్న విద్యార్థులు

నైపుణ్యం, ఉద్యోగ కల్పనే లక్ష్యం



యువతలో నైపుణ్యాలను పెంపొందించడం, పరిశోధనలు, ఉద్యోగ అవకాశాలు కల్పించడమే మా లక్ష్యం. కేఎల్ విశ్వ విద్యాలయం ప్రాంగణంలో పరిశ్రమలు ఏర్పాటు చేస్తున్నాం. అంతర్జాతీయ పరిశోధనలకు పెద్దపీట వేస్తున్నాం. కేంద్ర ప్రభుత్వ విద్యాలక్ష్మీ పోర్టల్‌లో నమోదు చేసుకుంటే రుణాలు లభిస్తున్నాయి. ఆహ్లాదకర వాతావరణం కేఎల్ విశ్వ విద్యాలయానికి గొప్ప వరం. కొత్తగా వచ్చిన ఛాయిస్ బేస్డ్ కరిక్యులమ్ విద్యార్థి అభిరుచి మేరకు ఉంటుంది. ఇంటర్ తర్వాత ఎంచుకునే కోర్సుపై పూర్తిస్థాయి అవగాహన లేక చాలామంది సతమతమవుతున్నారు. ఇంజినీరింగ్ విద్య అభ్యసిస్తూనే డ్యూయల్ డిగ్రీ కోర్సులపై పట్టు సాధించవచ్చు. ప్రస్తుత విద్యారంగాన్ని కుదిపేస్తున్న కృత్రిమ మేధ పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకునే కోర్సులపై దృష్టి పెట్టండి. ఇంజినీరింగ్ చదువుతూనే వివిధ షార్ట్ కోర్సులు పూర్తి చేసే అవకాశాన్ని కేఎల్ విశ్వ విద్యాలయం కల్పిస్తుంది. -డాక్టర్ జె.శ్రీనివాసరావు, డైరెక్టర్ ఆఫ్ అడ్మిషన్స్, కేఎల్ డీమ్డ్ విశ్వ విద్యాలయం

ఉన్నత లక్ష్యాలే కీలకం



ప్రస్తుత ప్రపంచంలో ఉన్నత లక్ష్యాలను ఎంచుకోవాల్సిన సమయమిది. కాలానికి అనుగుణంగా నైపుణ్యాలను పెంపొందించుకుని టెక్ పోటీ ప్రపంచంలో రాణించగలం. ప్రపంచాన్ని తట్టి లేపుతున్న సాంకేతిక పరిజ్ఞానంపై విద్యార్థుల ఆలోచనా విధానం మారాలి. భవిష్యత్తు ఏఐ సాంకేతికతదే. ఇంజినీరింగ్‌లో ఇలాంటి కోర్సుల ఎంపికపై విద్యార్థులు దృష్టి పెట్టాలి. ఇతర కోర్ కోర్సులు చదువుతూనే కంప్యూటర్ రంగానికి సంబంధించిన సర్టిఫికెట్లు నేర్చుకోవచ్చు. -డాక్టర్ కేవీ షణ్ముఖ కుమార్, అసిస్టెంట్ డైరెక్టర్ ఆఫ్ అడ్మిషన్స్, కేఎల్ డీమ్డ్ విశ్వ విద్యాలయం

కంపెనీల అవసరాలకు దీటుగా..




నాలుగేళ్ల ఇంజినీరింగ్ విద్య ముందుగా పూర్తి చేసే నైపుణ్యాల అభివృద్ధికి సమయం ఉంటుంది. ఇంటర్‌లో ఎటువంటి ఇంజినీరింగ్ కోర్సులు చేయాలో అవగాహన కల్పిస్తున్నాం. ఉద్యోగంతో పాటు ప్యాకేజీ కీలకం. ప్రస్తుత కంపెనీల అవసరాలకు దీటుగా నైపుణ్యాలు పెంచుకుంటే మంచి కంపెనీల్లో ఉద్యోగాలు వస్తాయి. దాదాపు 600 కంపెనీలు ప్లేస్‌మెంట్లకు వస్తుంటాయి. ఈ ఏడాది జనవరి 8న విశ్వ విద్యాలయం నిర్వహించే పరీక్షలో ప్రతిభ సాధించిన వారికి రాయితీలు కల్పిస్తాం. - బొబ్బిలి సత్యనారాయణ మూర్తి, అసిస్టెంట్ డైరెక్టర్ ఆఫ్ అడ్మిషన్స్, కేఎల్ డీమ్డ్ విశ్వ విద్యాలయం

విశ్వ విద్యాలయంలో కోర్సులకు భవిష్యత్తు



భవిష్యత్తు నిర్దేశించేది ఇంజినీరింగ్ విద్య. ఇంటర్‌లో మంచి మార్కులు సాధిస్తే కలలను సాకారం చేసుకోవచ్చు. ఇంటర్ విద్యను షార్ట్ టర్మ్ కోచింగ్‌గా భావిస్తే, ఇంజినీరింగ్‌ను లాంగ్ టర్మ్‌గా భావించాలి. ఈ దిశగా నాణ్యత కలిగిన విశ్వ విద్యాలయాలను ఎంచుకోవాలి. మౌలిక వసతులు, బోధన, ప్లేస్‌మెంట్స్, పరిశోధనలు దృష్టిలో ఉంచుకుని కళాశాల ఎంపిక చేసుకోవాలి. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంలో భాగంగా ఏఐ, రోబోటిక్స్, మిషన్ లెర్నింగ్, క్వాంటమ్, సైబర్ సెక్యూరిటీ రంగాలను ఎంచుకోవాలి. అంతరిక్ష పరిశోధనకు పెద్దపీట వేస్తున్న విశ్వ విద్యాలయాల్లో కోర్సులకు భవిష్యత్తు ఉంటుంది. -వై.శారదాదేవి, ఛైర్మన్, శారద విద్యాసంస్థలు

కలల సాకారానికే ప్రాధాన్యం



తల్లిదండ్రుల ఆకాంక్షలు, కలలను సాకారం చేసేలా విద్యార్థులు నిర్ణయాలు తీసుకోవాలి. ప్రస్తుతం ఇంటర్ విద్య ఎంతో కీలకం. పోటీ పరీక్షల్లో మంచి మార్కులు సాధిస్తే రాయితీలతో కూడిన ఇంజినీరింగ్ విద్య సాకారం అవుతుంది. విద్యార్థులు మంచి సమయపాలన, నాణ్యత ప్రమాణాలతో కూడిన విద్య అందుకుంటే ఉజ్వల భవిష్యత్తు సాకారం అవుతుంది. -జీవీఆర్, డైరెక్టర్, శారద విద్యాసంస్థలు

21న శ్రీమతి అమరావతి సీజన్- 10 పోటీలు

కరెన్సీనగర్, న్యూస్‌టుడే: శ్రీమతి అమరావతి సీజన్- 10 ఆడిషన్స్ ఈనెల 21న నోవాటెల్‌లో నిర్వహిస్తున్నట్లు సీఈవో ప్రదీప్ చౌదరి తెలిపారు. అమరావతి



గోడపత్రికలు ఆవిష్కరిస్తున్న డాక్టర్ కల్యాణి, శ్రీలక్ష్మి తదితరులు

అభివృద్ధిలో పోటీ పడుతూ.. తేజస్ ఎలైట్ ఈవెంట్స్ ఆధ్వర్యంలో నిర్వహించే శ్రీమతి అమరావతి గోడపత్రికలను మహానాడు రోడ్డులోని ఓ ప్రైవేట్ హోటల్‌లో బుధవారం డాక్టర్ కల్యాణి, ఇన్నర్ వీల్ క్లబ్ ప్రెసిడెంట్ శ్రీలక్ష్మి, ఫోర్చ్యూన్ గ్రీన్ వ్యాలీ అధినేత నాగామృతరావు సమక్షంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సీఈవో ప్రదీప్ మాట్లాడుతూ 9 సీజన్లు దిగ్విజయంగా పూర్తి చేసుకుని 10వ సీజన్‌లోకి అడుగు పెట్టడం ఆనందంగా ఉందన్నారు. భారత దేశ సంస్కృతి, సంప్రదాయాల మేళవింపుతో చీరకు ఉన్న సంప్రదాయాన్ని వెలికి తీసేందుకు శ్రీమతి అమరావతి వేదికగా మారనుందన్నారు. ఈ పోటీల్లో విజేతలు దేశ, విదేశాల్లో జరిగిన పలు కార్యక్రమాల్లో విజేతలుగా నిలిచారని చెప్పారు. ఆసక్తి ఉన్న 35 ఏళ్ల లోపు మహిళలు 96408-93406 నంబరులో సంప్రదించాలని కోరారు.

దుర్గగుడికి రూ.10.13 లక్షల కంప్యూటర్లు.. ప్రింటర్లు బహూకరణ

ఇంద్రకీలాద్రి, న్యూస్‌టుడే: దుర్గమ్మ భక్తుల ఆన్‌లైన్ సేవల కోసం నెల్లూరు జిల్లా వరికుంటపాడు మండలం తూర్పు రొంపిదొడ్ల గ్రామానికి చెందిన దాత తూండ్ల లక్ష్మీనరసయ్య చౌదరి రూ.10.13 లక్షల విలువ చేసే కంప్యూటర్లు, ప్రింటర్లు, యూపీఎస్‌లను బుధవారం విరాళంగా అందజేశారు. దాత కుటుంబానికి దేవస్థానం సిబ్బంది ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అనంతరం వారికి దేవస్థానం పాలకమండలి ఛైర్మన్ బొర్రా రాధాకృష్ణ, ఈవో శీనానాయక్ సమక్షంలో దాత కుటుంబ సభ్యులు అప్పగించారు. ఈసందర్భంగా ఛైర్మన్



ఛైర్మన్ రాధాకృష్ణ, ఈవో శీనానాయక్‌లకు వస్తువులు అప్పగిస్తున్న దాత లక్ష్మీనరసయ్య చౌదరి కుటుంబ సభ్యులు

రాధాకృష్ణ మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి చంద్రబాబు దేవాలయాల్లో భక్తులకు పారదర్శకంగా సేవలు అందించడానికి ఆన్‌లైన్ విధానాన్ని అమలు చేయాలని ఆదేశించారన్నారు. దాతలు కూడా స్పందించి లక్ష్మీనరసయ్య చౌదరి దేవస్థానానికి కంప్యూటర్లు విరాళంగా ఇవ్వడం ప్రశంసనీయమన్నారు. దుర్గగుడిలో మెరుగైన సేవలు అందించేందుకు సహకరిస్తున్న దాతలకు ఈవో శీనానాయక్ కృతజ్ఞతలు తెలిపారు. దేవస్థానం ఉద్యోగులు దసరా, భవానీ దీక్షల విరమణలో భక్తులకు అందించిన సేవలను అభినందించారు. కార్యక్రమంలో తెదేపా నాయకులు చిననుబ్బయ్య, పాలకమండలి సభ్యులు వెంగాయమ్మ శంకరబాబు, సరోజినిదేవి, పద్మావతి ఠాకూర్, సరిత తదితరులు పాల్గొన్నారు.

జాతీయ పాఠశాలల క్రీడా పోటీలకు ఎంపిక

విజయవాడ క్రీడలు, న్యూస్‌టుడే: పటమటలోని కేబీసీ జడ్పీహెచ్ పాఠశాలకు చెందిన 13 మంది క్రీడాకారులు జాతీయ స్కూల్ గేమ్స్ క్రీడా పోటీలకు ఎంపికయ్యారని ప్రధానోపాధ్యాయుడు వీవీఎన్ సత్యనారాయణ తెలిపారు. అండర్- 14, 17 హ్యాండ్‌బాల్ (బాలికలు), అండర్- 17 నెట్‌బాల్ (బాల, బాలికలు), అండర్- 19 నెట్‌బాల్ (బాలురు) 69వ జాతీయ స్కూల్ గేమ్స్ పోటీలకు ఎంపికవడం అభినందనీయమని సమగ్ర శిక్ష రాష్ట్ర ప్రాజెక్ట్ డైరెక్టర్ బి.శ్రీనివాసరావు కొనియాడారు. జాతీయ పోటీలకు ఎంపికైన క్రీడాకారులందరూ సమగ్ర శిక్ష రాష్ట్ర కార్యాలయంలో రాష్ట్ర ప్రాజెక్ట్ డైరెక్టర్ (ఎస్పీడీ) బి.శ్రీనివాసరావును డీఈవో ఎల్.చంద్రకళ ఆధ్వర్యంలో బుధవారం కలిశారు. ఈ సందర్భంగా ఎస్పీడీ క్రీడాకారులను అభినందిస్తూ.. విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో ఆసక్తి చూపాలని, జాతీయ స్థాయిలో పతకాలు సాధించి రాష్ట్రానికి పేరు తేవాలని ఆకాంక్షించారు. పాఠశాల ఎస్ఎంసీ ఛైర్మన్, జిల్లా స్కూల్ గేమ్స్ సమాఖ్య కార్యనిర్వాహక కార్యదర్శి ఎల్.దుర్గారావు పాల్గొన్నారు. అండర్- 17 హ్యాండ్‌బాల్ బాలికల విభాగంలో పి.సకియా, ఎస్.లేపాక్షి, సీహెచ్ శ్రావణి, జి.ఆశ్విత, అండర్- 14 హ్యాండ్‌బాల్ బాల, బాలికల విభాగాల్లో వి.అఖిల, వి.సాహిక, జి.జాహ్నవి, పి.యశ్వంత్, అండర్- 17 నెట్‌బాల్ బాల, బాలికల విభాగాల్లో ఎల్.జశ్వంత్, జి.రాము, ఇ.షర్మిల, షేక్ భూస్రా, అండర్- 19 నెట్‌బాల్ బాలుర విభాగంలో ఎస్.నాగశ్రీ చైతన్య రాజు జాతీయ స్కూల్ గేమ్స్ పోటీల్లో పాల్గొనే రాష్ట్ర జట్లకు ప్రాతినిధ్యం వహిస్తారు.



క్రీడాకారులతో ఎస్పీడీ శ్రీనివాసరావు, డీఈవో చంద్రకళ, ప్రధానోపాధ్యాయుడు వీవీఎన్ సత్యనారాయణ, పీడీ దుర్గారావు

ఏసీబీ కోర్టులో పాస్‌పోర్టు అప్పగించిన సంజయ్

ఈనాడు - అమరావతి: ఐపీఎస్ అధికారి సంజయ్ తన పాస్‌పోర్టును విజయవాడ ఏసీబీ కోర్టులో బుధవారం అప్పగించారు. ఈ-మెయిల్, ఫోన్‌నంబరు వివరాలను కూడా ఇచ్చారు. అగ్నిమాపక శాఖ, సీఐడీ డీజీగా ఉన్న సమయంలో నిధుల దుర్వినియోగం కేసులో బెయిల్‌పై విడుదలైన తర్వాత బెయిలు షరతుల మేరకు కోర్టుకు హాజరయ్యారు. బెయిల్ షరతుల మేరకు ప్రతి శుక్రవారం దర్యాప్తు అధికారి ఎదుట హాజరుకావాల్సి ఉండగా, 19న తనకు హైదరాబాద్‌లో వైద్యుడి అపాయింట్‌మెంట్ ఉందని కోర్టు దృష్టికి తీసుకొచ్చారు. ఈ కారణంగా మినహాయింపు ఇవ్వాలని కోరారు. దీనికి న్యాయాధికారి అనుమతి తెలిపారు. తర్వాత శుక్రవారం క్రిస్మస్ మరుసటి రోజు వచ్చిందని.. ఆరోజు దర్యాప్తు అధికారి ఎదుట హాజరు మినహాయింపు ఇవ్వాలని కోరారు. సంబంధిత పిటిషన్‌పై కౌంటరు వేయాలని ప్రాసిక్యూషన్‌ను న్యాయాధికారి ఆదేశించారు. తదుపరి విచారణ నిమిత్తం ఈనెల 26కి వాయిదా వేశారు.

సత్యవర్ధన్ కేసులో.. నలుగురు నిందితుల కస్టడీకి కోర్టు అనుమతి

ఈనాడు - అమరావతి: సత్యవర్ధన్ అపహరణ, దాడి కేసులో నలుగురు నిందితులను కోర్టు కస్టడీకి అనుమతించింది. కొమ్మా కోట్లు, తేల్లపోల రాము, వజ్రకుమార్, యర్రంశెట్టి రామాంజనేయులును 18, 19 తేదీల్లో రెండు రోజులపాటు కస్టడీకి ఇస్తూ ఎస్సీ, ఎస్టీ కోర్టు న్యాయాధికారి భాస్కరరావు ఉత్తర్వులు ఇచ్చారు. ★ తేల్లపోల రాము, వజ్రకుమార్, రామాంజనేయులు బెయిల్ పిటిషన్లపై వాదనల కోసం 18కి వాయిదా పడింది. ★ పటమట స్టేషన్‌లోని సీసీ ఫుటేజీని భద్రపరచాలని వంశీ పిటిషన్‌పై తదుపరి విచారణ గురువారానికి వాయిదా వేశారు. ★ కొమ్మా కోట్లు దాఖలు చేసిన బెయిల్ పిటిషన్‌పై ప్రాసిక్యూషన్ కౌంటరు దాఖలు కోసం 18కి న్యాయాధికారి వాయిదా వేశారు.

నేటి నుంచి వర్సిటీ అంతర్ కళాశాలల ఫుట్‌బాల్ టోర్నీ

విజయవాడ క్రీడలు, న్యూస్‌టుడే: స్థానిక ఆంధ్ర లయోలా కళాశాల ఆధ్వర్యంలో ఈ నెల 18, 19 తేదీల్లో కృష్ణా విశ్వ విద్యాలయం అంతర్ కళాశాలల ఫుట్‌బాల్ పోటీలు, వర్సిటీ జట్టు ఎంపికలు నిర్వహిస్తామని కళాశాల ప్రిన్సిపల్, పోటీల కార్య నిర్వాహక కమిటీ ఛైర్మన్ ఫాదర్ ఎస్.మెల్కియోర్ తెలిపారు. అంతర్ కళాశాలల పోటీలో పాల్గొనే జట్లు 18న ఉదయం 9 గంటల్లోపు మూడు సెట్ల అర్హతా పత్రాలు, క్రీడాకారుల గుర్తింపు కార్డులతో పోటీల కార్య నిర్వాహక కార్యదర్శి ఎం.చౌదయ్యకు రిపోర్టు చేయాలన్నారు. జట్టు లేకుండా వ్యక్తిగతంగా వర్సిటీ జట్టు ఎంపిక పోటీలో పాల్గొనే క్రీడాకారులు 19న ఉదయం 9 గంటలకు అర్హతా పత్రాలతో హాజరు కావాలని కోరారు. వివరాలకు 87902 14841 నంబరులో సంప్రదించాలన్నారు.

ప్రయోగం ఫలవంతం!

ఆర్‌జీఎల్(రాగోలు) 7034 వరి రకం సాగుతో సత్ఫలితాలు

ఘంటసాల, న్యూస్‌టుడే

బీపీటీకి ప్రత్యామ్నాయంగా చిట్టిముత్యాలు, ఎన్‌ఎల్‌ఆర్(నెల్లూరు)34449 రకాలను సంకరణం(క్రాస్) చేసి రూపొందించిన ఆర్‌జీఎల్-7034 సన్న రకం వంగడాన్ని అన్ని కృషి విజ్ఞాన కేంద్రాలు, డాట్ సెంటర్లు, వ్యవసాయ శాఖల ద్వారా ఆసక్తి ఉన్న రైతులకు కిలో చొప్పున పంపిణీ చేశారు. ఘంటసాలకు చెందిన ఆదర్శ రైతు అయినపూడి విజయకుమార్‌కు అందజేయగా.. నారుపోసి 10 సెంట్లలో వరినాట్లు వేశారు. ఇటీవల వచ్చిన మొంథా తుపాను, వర్షాలకు పంట నేలవాలకుండా దృఢంగా ఉంది. ఆ పైరును ఘంటసాల కేవీకే సమన్వయకర్త డి.సుధారాణి, శాస్త్రవేత్త కె.రేవతి పరిశీలించారు. ఎకరానికి 35 బస్తాలకు పైగా దిగుబడి వస్తుందని అంచనా వేశారు. ఇది బీపీటీ రకం కన్నా ఎక్కువ అని చెప్పారు. దోమపోటు, ఉల్లికోడు, ఎండు ఆకు తెగుళ్లను సైతం తట్టుకుంటుందని గుర్తించారు. కాండం దృఢంగా ఉండటంతో గాలులు, వర్షాలకు పంట పడిపోదన్నారు. ఈ



వరి పంటను చూపుతున్న రైతు విజయకుమార్

పంట కాలపరిమితి 140 రోజులు. ఈ నూతన రకం రెండో సంవత్సరం చిరు సంచుల(మినీ కిట్) దశలో ఉంది. ఆదర్శ రైతు విజయకుమార్ గతంలో నల్ల బియ్యం(కాలాబట్టి), ఎర్ర బియ్యం(నవారా), పలు నూతన వంగడాలు, కొర్రలు సేంద్రియ పద్ధతిలో పండించారు. పంటకు పురుగులు సోకకుండా గట్లపై బంతి, అలసంద, పసుపు, కంది మొక్కలు పెంచుతున్నారు. ఘంటసాల కేవీకే శాస్త్రవేత్తలు కిలో విత్తనం అందజేయగా.. నారుపోసి అభివృద్ధి చేశానని, వచ్చే ఖరీఫ్‌లో ఆర్‌జీఎల్-7034 రకాన్ని మరిన్ని ఎకరాల్లో సాగు చేస్తానని రైతు పేర్కొన్నారు.

పెరటి కోళ్లలో అంతర పరాన్న జీవులు

చల్లపల్లి, న్యూస్‌టుడే: పెరటిలో పెంచే కోళ్లు ఆరు బయట తిరుగుతుంటాయి. గడ్డి, గింజలు తింటున్నప్పుడు వివిధ రకాలు అంతర పరాన్నజీవులు వాటిని ఎక్కువగా ఆశిస్తాయి. ఈ నేపథ్యంలో క్రమం తప్పకుండా నట్టల మందు తాగిస్తే మంచిదని ఘంటసాల కేవీకే శాస్త్రవేత్తలు నవీన్, సుధారాణి సూచిస్తున్నారు. ఈ కార్యక్రమాన్ని రైతులంతా ఒకేసారి చేస్తే మంచి ఫలితం ఉంటుంది. క్రమం తప్పకుండా నట్టల నివారణ మందు తాగించడం ద్వారా కేవలం నట్టలనే కాకుండా అనేక రకాల వ్యాధులు సోకకుండా కాపాడుకోవచ్చు. దీని కోసం పైపరజిన్ సిట్రేట్ అనే మందు చెంచాడు అర లీటరు నీటిలో కలిపి(10 కోళ్లకు సరిపోతుంది) కోళ్లకు ఇవ్వాలి. ఈ పద్ధతిని 15 నుంచి 20 రోజుల వయసు పిల్లల నుంచి క్రమం తప్పకుండా పాటించాలి.

రైతేరాజు

కందిలో చీడపీడల నివారణ

కంచికచర్ల, న్యూస్‌టుడే: మెట్ట ప్రాంతాల్లో రైతులు అత్యధికంగా సాగుచేసే పంట కంది. పూత దశలో పంటను వివిధ రకాల చీడపీడలు ఆశిస్తాయి. ఈ కారణంగా దిగుబడులు తగ్గే అవకాశముంది. సమగ్ర సస్యరక్షణ పద్ధతులు పాటించడం ద్వారా అధిక దిగుబడులు సాధించవచ్చని కంచికచర్ల మండల వ్యవసాయాధికారి కె.విజయ్‌కుమార్ సూచించారు.



శనగపచ్చ పురుగు: పంట మొగ్గ, పూత దశలో ఉన్నప్పుడు గుడ్లు పెడుతుంది. లార్వా మొగ్గ, పూతను తినడం ద్వారా దిగుబడులపై ప్రభావం పడుతుంది. నివారణకు 2.5 ఎంఎల్ క్లోరిఫైరిఫాస్ లేదా 2 ఎంఎల్ క్వినాల్‌ఫాస్ లేదా 1.5గ్రా ఎసిఫేట్‌ను లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలి.

మారుకా మచ్చల పురుగు: పూత, పిందెలను కలిపి గూడు కట్టి అందులో ఉంటూ, వాటిని తింటూ దిగుబడిపై ప్రభావం చూపిస్తుంది. నివారణకు పూత ప్రారంభ దశలో వేప నూనె లేదా వేప కషాయం పిచికారీ చేయాలి. లేదా 2.5 ఎంఎల్ క్లోరిఫైరిఫాస్‌ను లీటరు నీటిలో కలిపి వారానికోరోజు పిచికారీ చేయాలి.

కాయ ఈగ: కాయలు ప్రారంభ దశలో ఉన్నప్పుడు వాటిని తింటూ పంటకు నష్టం కలిగిస్తాయి. నివారణకు 2 ఎంఎల్ డైమిథోయేట్ లేదా 2 ఎంఎల్ ప్రొఫినోఫాస్ లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలి.

రసం పీల్చే పురుగు: ముదురు బూడిద రంగులో ఉండి కాయల్లోని రసాన్ని పీల్చి నాశనం చేస్తుంది. ఈ కారణంగా దిగుబడులు భారీగా పడిపోతాయి. నివారణకు 2 ఎంఎల్ డైమిథోయేట్‌ను లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలి.

బీర సాగులో మెలకువలు, సస్యరక్షణ చర్యలు

తోట్లవల్లూరు, న్యూస్‌టుడే: బీర సాగు లాభదాయకమని, నీటి వసతిని ఉపయోగించుకుని కొద్దిపాటి భూమిలో సాగుచేసి అధిక దిగుబడులు పొందవచ్చని ఉద్యానశాఖాధికారిణి మానస తెలిపారు.

నల్లరేగడి, సేంద్రియ ఎరువు సమృద్ధిగా ఉన్న నేలలు అనుకూలం. హెక్టారుకు 5 నుంచి 7 కిలోల విత్తనం అవసరం. మొక్కల మధ్య 1.5 నుంచి 3 మీటర్ల దూరం ఉండాలి. బారులు 60 నుంచి 120 సెం.మీ ఉండాలి. విత్తిన 20 రోజుల తర్వాత మొదటి కలుపు తీయాలి. అనంతరం 35 నుంచి 45 రోజులలోపు మరోసారి తీయాలి. నాటిన 60 రోజుల తర్వాత పంట చేతికొస్తుంది. ఎకరాకు 5 టన్నుల వరకు దిగుబడి వస్తుంది.



సస్యరక్షణ చర్యలు: చలికాలంలో బీర తోటలను బూజు, లీఫ్‌బ్లైట్స్ తెగుళ్లు ఆశిస్తాయి. వీటి నివారణకు అమిస్టార్ టాప్ మి.లీ. లీటరు నీటిలో లేదా శాఫ్ పొడి మందు 2 గ్రాములు లీటరు నీటిలో కలిపి మొక్కలు తడిసేలా పిచికారీ చేయాలి. ఆకు పురుగు నివారణకు ఫిప్రోనిల్ 2 మి.లీ. లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలి. రసం పీల్చే పురుగు నివారణకు థయోమిథాక్సిన్ 0.3 మి.లీ లీటరు నీటిలో కలిపి 15 రోజులకోసారి పిచికారీ చేయాలి.



ప్రశ్న: క్యాలీఫ్లవర్ విత్తన మోతాదు, విత్తే దూరం, ఎరువుల యాజమాన్యం, దిగుబడి గురించి వివరించండి? -డి.శ్రీనివాస్, రైతు, కొడాలి

సమాధానం: క్యాలీఫ్లవర్ స్వల్ప కాలిక రకాలైతే హెక్టారుకు 600 నుంచి 700 గ్రాములు, దీర్ఘకాలిక రకాలైతే 350 నుంచి 400 గ్రాముల వరకు విత్తనాలు సరిపోతాయి. సన్నని ఇసుకలో కలిపి మడుల్లో నారు పోసి, 30-35 రోజుల తరువాత నాటాలి. విత్తే దూరం స్వల్ప కాలిక రకాలకు 45×45 సెం.మీ, దర్ఘకాలిక రకాలకు 60×45 సెం.మీ. అంతర కృషిలో భాగంగా భూమిలో తేమను బట్టి వారానికోసారి నీరు కట్టాలి. నాట్లు వేసిన 15 రోజుల్లో మొక్కలు బాగా కుదురుకుంటాయి. అనంతరం కలుపు తీసి, మట్టిని ఎగతోయాలి. హెక్టారుకు దాదాపు 20 టన్నుల దిగుబడి పొందవచ్చు.

-వి.మంజువాణి, ఉద్యాన శాస్త్రవేత్త, కేవీకే, ఘంటసాల. -చల్లపల్లి, న్యూస్‌టుడే

తెలుగు జాతి ముద్దుబిడ్డలు.. నాటి పూర్వ విద్యార్థులు

గుడివాడ, న్యూస్‌టుడే: తెలుగు జాతి గర్వించదగ్గ ముద్దుబిడ్డలను గుడివాడ అక్కినేని నాగేశ్వరరావు కళాశాల దేశానికి అందించింది. ఈ కళాశాల నుంచి తీసుకున్న డిగ్రీ పట్టాలతో పేద కుటుంబాలకు చెందిన రైతు బిడ్డలు నేడు ఖండాంతరాల్లో రాణిస్తున్నారు. వివిధ రంగాలలో సేవలు అందించి పద్మ అవార్డులను సైతం సొంతం చేసుకున్నారు. కొందరు ఐఏఎస్, ఐపీఎస్‌లుగా, మరికొందరు శాస్త్రవేత్తలుగా పలు రంగాలలో విశిష్ట సేవలు అందిస్తున్నారు. వారిలో కొందరు మంగళవారం జరిగిన కళాశాల వజ్రోత్సవ పూర్వ విద్యార్థుల సమ్మేళనానికి హాజరై గత స్మృతులను నెమరు వేసుకున్నారు. వారి అభిప్రాయాలు ఇలా.



వజ్రోత్సవానికి హాజరైన 1970-75 నాటి పూర్వ విద్యార్థుల బృందం చిత్రం




తరలివచ్చిన పూర్వ విద్యార్థులు, అతిథులు



విజయ చిహ్నం చూపుతున్న పూర్వ విద్యార్థులు

అధ్యాపకుల మార్గదర్శకత్వంలోనే శాస్త్రవేత్తగా ఎదిగా



గుడివాడ కళాశాలలో 1959 నుంచి 1963 వరకూ చదివిన నాకు అధ్యాపకుల స్ఫూర్తితోనే శాస్త్రవేత్తగా ఎదిగాను. నేడు హెపటైటిస్ వ్యాక్సిన్ అభివృద్ధి చేయగలిగాను. రానున్న కాలంలో మరిన్ని వ్యాక్సిన్లను తయారు చేస్తున్నాం. అమెరికాలోని యూనివర్సిటీ ఆఫ్ టెన్నెస్సీ హెల్త్ సైన్సు సెంటర్‌లో ఎమిరిటస్ ప్రొఫెసర్‌గా సేవలు అందిస్తున్నాను. నా ఈ ఉన్నతికి కారణం ఏఎన్నార్ కళాశాల. - డాక్టర్ జి.వి.రామిరెడ్డి, హెపటైటిస్ వ్యాక్సిన్ రూపకర్త, శాస్త్రవేత్త

అద్భుతమైన అధ్యాపకులు ఉన్నారు




గుడివాడ అక్కినేని నాగేశ్వరరావు కళాశాలలో 1994 నుంచి 1999 వరకూ ఇంటర్, బీఎస్సీలను చదివాను. ఆనాడు నా అధ్యాపకులు నేర్పిన విద్య నన్ను ఈ స్థాయికి తీసుకుని వచ్చింది. ఐపీఎస్ పూర్తి చేసి కర్ణాటక రాష్ట్రంలోని గుల్బర్గాలోని పోలీసు ట్రైనింగ్ సెంటర్ ఎస్పీగా ప్రస్తుతం విధులు నిర్వర్తిస్తున్నాను. కళాశాల నాకు నేర్పిన విద్యతో నేను ఈ స్థాయికి ఎదిగాను. అందుకే నాకు కళాశాల అంటే మక్కువ. దీని రుణం తీర్చు కోలేను. -డి.కిషోర్ బాబు, ఐపీఎస్

అమెరికా వెళ్లాలనుకున్నా...



గుడివాడ ఏఎన్నార్ కళాశాలలో బీఎస్సీ చదివి పోస్టు గ్రాడ్యుయేషన్ పూర్తి చేసుకుని అమెరికా వెళ్లి స్థిరపడాలని అనుకున్నాను. కానీ కొసరాజు వెంకటేశ్వరరావు సూచనతో నేను చదివిన ఏఎన్నార్ కళాశాలలోనే అధ్యాపకునిగా జీవితం ప్రారంభించి ప్రిన్సిపల్ స్థాయికి ఎదిగాను. ఎందరో విద్యార్థులకు ఉత్తమ జీవితాలను అందించాననే తృప్తి ఉంది. రాష్ట్రం చరిత్రలోనే కళాశాల అధ్యాపకులకు పలు క్రీడా టోర్నమెంట్లు ప్రారంభించాము. - మాగంటి వీరభద్రరావు, విశ్రాంత ప్రిన్సిపల్

కళాశాల విద్యార్థి సంఘ కార్యదర్శిగా సేవలు అందించా




గుడివాడ ఏఎన్నార్ కళాశాలలో 1966-69 వరకూ బీకాం డిగ్రీ పూర్తి చేశాను. ఆనాడు కళాశాల స్టూడెంట్ సెక్రటరీగా గెలిచాను. ఎన్‌సీసీలో జనరల్ కెప్టెన్‌గా పనిచేశాను. నేడు కాళ్లు పనిచేయక పోయినా హైదరాబాద్‌లో ఉన్న నేను బంధువుల సాయంతో ఇక్కడికి వచ్చాను. ఇది నాకు ఇంకొంత ఆయుష్షు ఇస్తుంది. నా స్నేహితులతో కలయిక ఎంతో ఆనందంగా ఉంది. - బి.రాధాకృష్ణ, పూర్వ విద్యార్థి

వైద్య కళాశాల ఏర్పాటు చేయాలి



విద్య, వైద్యం ప్రైవేటు పరం అయ్యాక.. వ్యాపారంగా మారి ఖరీదైపోయింది. ఎంతో ప్రాముఖ్యం కలిగిన గుడివాడలో వైద్య కళాశాల ఏర్పాటు చేసి పేదల బాధలు తీర్చాలి. కృష్ణా జిల్లాలో గుడివాడ ఎంతో ప్రాముఖ్యమైంది. ఇక్కడే ఎన్టీఆర్, ఏఎన్నార్ లాంటి మహనీయులు పుట్టారు. ఈ ప్రాంతానికి గాంధీజీ మూడుసార్లు వచ్చారు. ఆయన స్ఫూర్తితో చాలా మంది స్వాతంత్ర్య ఉద్యమంలో పాల్గొన్నారు. గాంధీ తిరిగినన్ని గ్రామాలు ఏ రాజకీయ నాయకుడు తిరగలేదు. ఆ మహనీయుడిని ఆదర్శంగా తీసుకోవాలి. కళాశాల వేడుకలో ఇలా మిత్రులను కలుసుకోవడం ఆనందంగా ఉంది. - యలమంచిలి శివాజీ, రాజ్యసభ మాజీ సభ్యుడు

మూలకణాల దానానికి ముందుకు రావాలి



ఎందరో దాతల సహకారంతో ఏర్పడిన ఈ కళాశాలలో ఎందరో మహనీయులుగా ఎదిగారు. నేనూ ఈ స్థాయికి రావడానికి ఇక్కడ నేర్చుకున్న విద్యాబుద్ధులే కారణం. అనారోగ్యంతో బాధపడే వారికి కళాశాల విద్యార్థులు మూలకణాల దానానికి ముందుకు రావాలి. పేర్లు రిజిస్టర్ చేసుకొని కళాశాలకు మంచి గుర్తింపు తేవాలి. - వెనిగండ్ల రాము, గుడివాడ ఎమ్మెల్యే

తరతరాలు గుర్తుండే వ్యక్తి ఏఎన్ఆర్



కళాశాల కోసం విరాళం ఇచ్చి ఎందరో మహనీయులను ఏఎన్ఆర్ తీర్చిదిద్దారు. ఆయన వారసులు విద్యార్థులకు ఉపకార వేతనాలు అందించి ఏఎన్ఆర్‌ను తరతరాలకు గుర్తుండిపోయేలా కృషి చేస్తున్నారు. - వర్ల కుమార్ రాజా, పామర్రు ఎమ్మెల్యే

కళాశాల అంటే... నాన్నే గుర్తుకు వస్తారు



ఏఎన్ఆర్ కళాశాల అనగానే మా నాన్న గుర్తుకు వస్తారు. ఇక్కడ మరిన్ని కోర్సులతో దేశవ్యాప్తంగా పేరు పొందాలి.

- అక్కినేని నాగసుశీల

ఏవీఎన్‌ఎల్‌లో మేనేజర్లు

ఆర్మ్‌డ్ వెహికల్ నిగమ్ లిమిటెడ్, అవడి.. హెవీ వెహికల్ ఫ్యాక్టరీలో ఫిక్స్‌డ్ టర్మ్ ప్రాతిపదికన పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- సీనియర్ కన్సల్టెంట్: 01
- కన్సల్టెంట్ (జీసీఎస్, వెక్ట్రోనిక్స్): 02
- సీనియర్ మేనేజర్ (టీడబ్ల్యూఎస్): 01
- సీనియర్ మేనేజర్ (ఇంజిన్): 01
- జూనియర్ మేనేజర్ (ట్రెయినింగ్ అండ్ డెవలప్‌మెంట్): 01

అర్హత: పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో డిప్లొమా/డిగ్రీ, బీటెక్/బీఈ, పీజీ డిప్లొమా, ఎంబీఏతో పాటు ఉద్యోగానుభవం ఉండాలి.

మూల వేతనం: నెలకు సీనియర్ కన్సల్టెంట్, కన్సల్టెంట్ పోస్టులకు రూ.1,20,000; సీనియర్ మేనేజర్‌కు రూ.70,000; జూనియర్ మేనేజర్‌కు రూ.30,000.

వయసు: సీనియర్ కన్సల్టెంట్, సీనియర్ మేనేజర్‌కు 65 ఏళ్లు; కన్సల్టెంట్‌కు 67 ఏళ్లు; జూనియర్ మేనేజర్‌కు 27 ఏళ్లు మించకూడదు.

ఎంపిక: విద్యార్హతలు, పని అనుభవం, ఇంటర్వ్యూలతో.

దరఖాస్తు ఫీజు: రూ.300. ఎస్సీ/ ఎస్టీ/ దివ్యాంగులు/ ఈడబ్ల్యూఎస్/ మహిళలకు ఫీజు లేదు.

పోస్టు ద్వారా దరఖాస్తుల స్వీకరణకు చివరి తేదీ: 06-01-2026.

చిరునామా: జనరల్ మేనేజర్, ఏవీఎన్‌ఎల్, హెచ్‌వీఎఫ్ రోడ్, అవడి, చెన్నై.

వెబ్‌సైట్: https://avnl.co.in/

ఆయిల్ ఇండియా లిమిటెడ్‌లో

ఆయిల్ ఇండియా లిమిటెడ్, నోయిడా.. ఒప్పంద ప్రాతిపదికన కెమిస్ట్ పోస్టుల భర్తీకి ఇంటర్వ్యూలు నిర్వహిస్తోంది.

- కెమిస్ట్ (ఫీల్డ్): 05
- కెమిస్ట్ (ల్యాబొరేటరీ): 03

అర్హత: ఎమ్మెస్సీ కెమిస్ట్రీతో పాటు ఉద్యోగానుభవం ఉండాలి.

వేతనం: నెలకు రూ70,000.

వయసు: 18 నుంచి 48 ఏళ్ల మధ్య ఉండాలి.

ఇంటర్వ్యూ తేదీ: 07-01-2026.

వేదిక: ఆయిల్ హ్యూమన్ రిసోర్సెస్ ఆఫీస్, ఐదో అంతస్తు, దులియంజల్, ఆయిల్ ఇండియా లిమిటెడ్, అసోం.

వెబ్‌సైట్: https://www.oil-india.com/



ఎవరూ చెప్పని విజయ రహస్యం!

కార్పొరేట్ స్కిల్స్

కార్పొరేట్ సంస్థల్లో కొలువులు ఆశించే యువతలో ఎక్కువ మందికి తగిన విద్యార్హతలూ, నైపుణ్యాలూ ఉండటంతో నియామక పత్రాలు చేతికందుతున్నాయి. అయితే ఉద్యోగంలో చేరిన తర్వాత కొంత మందే ఉన్నత స్థాయికి చేరుకుంటున్నారు. మిగిలినవారు ఉన్న స్థితి నుంచి ముందుకెళ్లలేకపోవడానికి ప్రధాన కారణం 'అలిఖిత నాయకత్వ లక్షణాలను' అర్థం చేసుకోలేకపోవడమే. ఇవి పాఠ్య పుస్తకాల్లో ఉండవు. అధికారిక శిక్షణలోనూ నేర్పించరు. అనుభవం, నిశిత పరిశీలనల ద్వారా తెలుసుకోవాలి.

మన్నించే లక్షణం

జట్టుగా పనిచేస్తున్నప్పుడు కొన్ని సార్లు తప్పులు దొర్లడం సహజం. అందుకు బాధ్యులు దాన్ని సరిదిద్దుకున్న తర్వాత వారిని తప్పుచేసే ఉద్యోగి అనే దృష్టికోణంలో చూడకూడదు. పూర్తిగా విశ్వసించగలిగితే, ఆ ఉద్యోగి మరింత ఉత్సాహంతో పనిచేయడం వీలవుతుంది. పొరపాటును పదేపదే గుర్తుచేస్తే, అభద్రతా భావంతో రిస్క్ తీసుకోవడం మానేస్తారు. బృంద సారథి తనను మన్నించారని భావించినప్పుడు, ఆ ఉద్యోగి నైపుణ్యాలను పూర్తి స్థాయిలో వినియోగించగలుగుతారు.

ఒక సాఫ్ట్‌వేర్ సంస్థలో రాధిక ట్రెయినీగా చేరింది. ఆమెకు కేటాయించిన ఒక ముఖ్యమైన ప్రాజెక్ట్‌లో జరిగిన చిన్న పొరపాటు కారణంగా క్లయింట్‌కు తీవ్ర ఆర్థిక నష్టం వాటిల్లింది. టీమ్ లీడర్ రాధిక అనుసరించిన పని పద్ధతినీ, క్లయింట్‌కు ఆర్థిక నష్టం కలగడానికి దారితీసిన కారణాలనూ విశ్లేషించారు. ఆర్థిక నష్టానికి కారణమైన పని విధానాన్ని సరిదిద్దే ప్రణాళికను ఆమెకు అర్థమయ్యేలా వివరించి, క్లయింట్‌కు జరిగిన నష్టాన్ని జట్టు సమావేశాల్లో ప్రస్తావించకుండా తగిన జాగ్రత్తలు తీసుకున్నారు. దీంతో ఆమె చేసిన తప్పు గురించి ఆలోచిస్తూ కుంగిపోకుండా మరింత బాధ్యతతో, జాగ్రత్తగా విధులు నిర్వర్తించింది. రాధిక పని విధానాన్ని పరిశీలించిన టీమ్ లీడర్ మరో రెండు నెలల తర్వాత మరింత కీలకమైన అంతర్గత ప్రాజెక్టుకు నాయకత్వం వహించే అవకాశం కల్పించారు. ఈ పరిణామం ఆమె సామర్థ్యంపై టీమ్ లీడర్‌కు ఉన్న విశ్వాసాన్ని నిరూపించింది. ఊహించని అవకాశం రావడంతో ఆమె అంకితభావంతో పనిచేసి, ఆ ప్రాజెక్టును విజయవంతం చేసింది.

- నాయకుడి మన్నించే లక్షణంతో ఉద్యోగి ఆత్మవిశ్వాసం, సంస్థ పట్ల విధేయత మరింత పెరుగుతాయి.



ప్రతిఫలం ఆశించని మద్దతు

నిజమైన నాయకత్వమంటే టీమ్‌కు ఒక రక్షణ కవచంలా నిలవడమే. ఎదురు చూడని సందర్భంలో ఉద్యోగులకు మీరందించే మద్దతు ఎంతో విలువైంది. టీమ్ సభ్యులపై క్లయింట్ అసంతృప్తిగా ఉన్నా, సీనియర్ మేనేజ్‌మెంట్ నుంచి సమస్యలు ఎదురైనా.. బృందాన్ని రక్షించడానికి ప్రాధాన్యం ఇవ్వడం సమర్థ నాయకుడి లక్షణం. ఉద్యోగులకు మద్దతు ఇవ్వడం కర్తవ్యంగా భావించినవారే నాయకులు.

- ఈ అలిఖిత నాయకత్వ లక్షణం ఉద్యోగుల్లో భద్రతా భావాన్నీ, సంస్థ పట్ల విధేయతనూ పెంచుతుంది.

అన్నీ మీరే కావద్దు

నిర్ణయాలు తీసుకోవడం నాయకత్వ లక్షణాల్లో ప్రధానమైన అంశం. అయితే వాటిని ఎవరు తీసుకోవాలని నిర్ణయించడం అంతకంటే విలువైంది. ప్రభావవంతమైన నాయకులు ప్రతి నిర్ణయం వెనకా వారే ఉండాలనుకోరు. సమస్యకు దగ్గరగా ఉన్నవారే సరైన పరిష్కారాన్ని సూచించగలరన్న సత్యాన్ని గుర్తించగలగడం సమర్థ నాయకుల లక్షణం. నిర్ణయం తీసుకోవాల్సి వచ్చినప్పుడు, 'నేను నిర్ణయం తీసుకునే వ్యక్తిని కాను, సరైన వ్యక్తి ఎవరో నిర్ణయించే వ్యక్తిని' అని భావించేవారు గొప్ప నాయకులవుతారు. ఫలితంగా బృందంలోని ప్రతి సభ్యుడిలోనూ యాజమాన్య భావన పెరుగుతుంది.

- నాయకత్వ బాధ్యతను 'ఇతరులను శక్తిమంతం చేసే అవకాశంగా' చూడగలిగే లక్షణం ఉన్నవారు మంచి నాయకులుగా విజయం సాధించగలరు.

రాహుల్ ఒక ఐటీ సంస్థలో టీమ్ లీడర్. బృందంలో ఎవరికి ఏ సమస్య వచ్చినా వెంటనే పరిష్కారం చూపేవాడు. మొదట్లో టీమ్ సభ్యులు అతడిని హీరోగా భావించేవారు. ప్రతి సమస్యకూ పరిష్కారం చూపడంతో క్రమేణా సభ్యులు సొంత నిర్ణయాలు తీసుకొనే శక్తినీ, ఆత్మవిశ్వాసాన్ని కోల్పోయారు. సమస్యను అర్థం చేసుకున్న రాహుల్ బృందానికి నిర్ణయాధికారాన్ని అప్పగించి, వారిని అనుచరుల స్థాయి నుంచి భవిష్యత్తు నాయకులుగా తీర్చిదిద్దాడు.

- కార్పొరేట్ సంస్థల్లో నేర్చుకోవలసిన పాఠాలు మీ ఉద్యోగ వివరణ పత్రం (జాబ్ డిస్క్రిప్షన్)లో ఉండవు. పై అధికారులూ, విజయవంతమైన సహోద్యోగులూ 'ఏం మాట్లాడుతున్నారు', 'ఎలా ప్రవర్తిస్తున్నారు' అన్న అంశాలను గమనించండి. ఈ లక్షణాలను అలవరచుకుంటే మీరు సమర్థ నాయకుడిగా ఎదగగలరు. సాంకేతిక నైపుణ్యాలు మిమ్మల్ని ఉద్యోగంలో నిలబెడితే, అలిఖిత నాయకత్వ లక్ష్యాలు కార్పొరేట్ ఉద్యోగాల్లో ఉన్నత స్థాయికి ఎదిగేందుకు సహకరిస్తాయి.

వ్యూహాత్మక విశ్లేషణ

ఎంబీఏ చదివి ఒక సంస్థలో ట్రెయినీగా చేరిన వినయ్ అక్కడ ఉద్యోగుల వలస పెద్ద సమస్యగా ఉందని టీమ్ మీటింగ్‌లో విన్నాడు. ఈ సమస్యను పరిష్కరించే దిశగా వ్యూహాత్మక పరిష్కార మార్గాలు అన్వేషించే ప్రయత్నంలో భాగంగా స్వచ్ఛందంగా బాధ్యత తీసుకోవాలని సభ్యులకు టీమ్ లీడర్ అవకాశం ఇచ్చారు. సీనియర్స్ ఎవరూ ముందుకు రాకపోయినా, తాను పరిష్కరిస్తానని వినయ్ బాధ్యత తీసుకున్నాడు. ప్రతి ఉద్యోగితోనూ మాట్లాడి.. మెంటర్‌షిప్, తగిన శిక్షణ అందించాలని మేనేజ్‌మెంట్‌కు ప్రతిపాదించి ఆమోదింపచేశాడు. ఈ చర్యతో టీమ్‌లోని ప్రతి ఒక్కరి పనికీ గుర్తింపు వచ్చి సంస్థలో ఉద్యోగుల వలసలు తగ్గి, ఉత్పాదకత పెరిగింది.

- ఉద్యోగులను భవిష్యత్తు నాయకులుగా తీర్చిదిద్దే కార్యక్రమాలు చేపడితే వారు అంకిత భావంతో పనిచేసేలా చేయవచ్చని వినయ్ నిరూపించాడు. అతడిలో ఉన్న నాయకత్వ లక్షణాలను గుర్తించిన యాజమాన్యం టీమ్ లీడర్‌గా పదోన్నతి కల్పించింది.



– దొరైరాజ్,
సీనియర్ జనరల్ మేనేజర్,
ఎలక్ట్రో స్టీల్ కాస్టింగ్స్ లిమిటెడ్

పాత అడ్మిషన్ చెల్లుబాటు అవుతుందా?

ఎమ్మెస్సీ ఆర్గానిక్ కెమిస్ట్రీ పూర్తిచేసి ఏపీ జెన్‌కోలో కాంట్రాక్ట్ కెమిస్ట్‌గా పనిచేస్తున్నాను. ఉద్యోగం చేస్తూ, బీఈడీలో అడ్మిషన్ తీసుకొని మొదటి సెమిస్టర్ పరీక్షలు రాశాను. కొన్ని కారణాలతో రెండో సెమిస్టర్ పరీక్షలు రాయలేకపోయాను. ఉద్యోగాన్ని మానేసి, వచ్చే విద్యా సంవత్సరంలో బీఈడీ రెండో సెమిస్టర్ కొనసాగించాలనుకుంటున్నాను. అయితే, పాత అడ్మిషన్ చెల్లుబాటు అవుతుందా? మళ్లీ ఇప్పుడు కొత్తగా బీఈడీ మొదటి సెమిస్టర్‌లో అడ్మిషన్ తీసుకోవాలా? - వీరారెడ్డి.

మీరు ఉద్యోగం చేస్తూనే బీఈడీలో ప్రవేశం పొంది, తరగతులకు హాజరు కాకుండా మొదటి సెమిస్టర్ పరీక్షలు రాయడం వల్ల ఆ సెమిస్టర్ చెల్లుబాటు కాదు.

■ ప్రపంచ వ్యాప్తంగా ఉన్న అన్ని వృత్తుల్లోనూ బోధన రంగం అత్యంత పవిత్రమైనది. దేశ భవిష్యత్తును ప్రభావితం చేయగలిగే ఉత్తమ పౌరులుగా విద్యార్థులను మలచడంలో ఉపాధ్యాయుల పాత్ర అత్యంత కీలకమైనది. దురదృష్టవశాత్తూ మన దేశంలో ఉపాధ్యాయ విద్యలో ప్రమాణాలు రోజు రోజుకీ దిగజారుతున్నాయి.



✦ రెండేళ్ల వ్యవధితో ఉండే బీఈడీ ప్రోగ్రాంను గరిష్ఠంగా మూడు సంవత్సరాల లోపు పూర్తి చేసుకునే అవకాశం ఉంది. కానీ, మీరు పరీక్షలు రాసిన మొదటి సెమిస్టర్ చెల్లుబాటు కాదు కాబట్టి, మీకు మూడేళ్ల వెసులుబాటు లేదు. రెగ్యులర్‌గా ఉద్యోగం చేస్తూ, రెగ్యులర్ బీఈడీలో ప్రవేశం తీసుకొని, నాలుగు సెమిస్టర్ల పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించి బీఈడీ పూర్తిచేసినా, అది నిబంధనలకు విరుద్ధం. అందుకని ఆ సర్టిఫికెట్ చెల్లుబాటు కాదు. అలాంటి బీఈడీతో ప్రభుత్వ ఉపాధ్యాయ ఉద్యోగం పొందినప్పటికీ భవిష్యత్తులో చట్టపరమైన సమస్యలు ఎదురుకావచ్చు. అందువల్ల మీరు ప్రస్తుతం చేస్తున్న కాంట్రాక్ట్ ఉద్యోగాన్ని వదిలేసి, మళ్లీ బీఈడీ ప్రవేశ పరీక్ష రాసి, మంచి కళాశాలలో ప్రవేశం పొందాలి. రెగ్యులర్‌గా తరగతులకు హాజరై బీఈడీ కోర్సును పూర్తి చేస్తేనే భవిష్యత్తులో ఒక ఉత్తమమైన, బాధ్యతాయుతమైన ఉపాధ్యాయుడిగా రూపుదిద్దుకొనే అవకాశం ఉంది.

– ప్రొ. బెల్లంకొండ రాజశేఖర్,
కెరియర్ కౌన్సెలర్

ఇంటర్న్‌షిప్స్

హైదరాబాద్‌లో

హ్యూమన్ రిసోర్సెస్ (హెచ్‌ఆర్)

సంస్థ: హారిజన్ బీమ్
నైపుణ్యాలు: ఎఫెక్టివ్ కమ్యూనికేషన్, ఇంగ్లిష్ మాట్లాడటం, లీడ్ జనరేషన్, రిక్రూట్‌మెంట్
స్టైపెండ్: రూ.17,000-22,000
దరఖాస్తు గడువు: జనవరి 9
☛ https://shorturl.at/xcY6h

ప్రైసింగ్ అనలిస్ట్

సంస్థ: జీగ్లర్ ఏరోస్పేస్
నైపుణ్యాలు: డేటా ఇంటర్‌ప్రెటేషన్, ఇంగ్లిష్ మాట్లాడటం, రాయడం, ఫైనాన్షియల్ లిటరసీ, హ్యూమన్ రిసోర్సెస్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్ (హెచ్‌ఆర్‌ఐఎస్), ఎంఎస్-ఎక్సెల్, ఎంఎస్-ఆఫీస్ స్టైపెండ్: రూ.8,000
దరఖాస్తు గడువు: జనవరి 9
☛ https://tinyurl.com/4j4df65n

కాపీరైటింగ్

సంస్థ: 8వ్యూస్ నైపుణ్యాలు: కంటెంట్ ఎడిటింగ్, కంటెంట్ మేనేజ్‌మెంట్, కంటెంట్, డిజిటల్, సోషల్ మీడియా మార్కెటింగ్, కంటెంట్ రైటింగ్, కాపీ రైటింగ్, క్రియేటివ్ రైటింగ్, ఇంగ్లిష్ మాట్లాడటం, హ్యూమన్ రిసోర్సెస్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్ (హెచ్‌ఆర్‌ఐఎస్), హ్యూమన్ రిసోర్సెస్, పర్ఫార్మెన్స్ మేనేజ్‌మెంట్, ట్యాలెంట్ మేనేజ్‌మెంట్ స్టైపెండ్: రూ.10,000-15,000
దరఖాస్తు గడువు: జనవరి 7
☛ https://tinyurl.com/48dav8pv

ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్

సంస్థ: సత్యజన్ ఎనర్జీ సొల్యూషన్స్ ప్రై.లి.
నైపుణ్యాలు: సర్క్యూట్ డిజైన్, మెషీన్ లెర్నింగ్ ఆపరేషన్స్, పవర్ సిస్టమ్స్
స్టైపెండ్: రూ.7,500-12,500
దరఖాస్తు గడువు: జనవరి 4
☛ https://shorturl.at/XzCLT

బిజినెస్ ఔట్‌రీచ్ ఎగ్జిక్యూటివ్

సంస్థ: గ్లోబల్ డిగ్రీస్
నైపుణ్యం: ఇంటర్‌పర్సనల్ స్కిల్స్
స్టైపెండ్: రూ.7,000-15,000
దరఖాస్తు గడువు: జనవరి 8
☛ https://tinyurl.com/z5x7j7wk

గ్రాఫిక్ డిజైన్

సంస్థ: స్నాప్‌బోట్ - స్టూడియో ఛాయ
నైపుణ్యాలు: అడోబ్ క్రియేటివ్ సూట్, ఇలస్ట్రేటర్, ఫొటోషాప్ స్టైపెండ్: రూ.10,000
దరఖాస్తు గడువు: జనవరి 2
☛ https://tinyurl.com/4fvpubw3

ఈవెంట్ మేనేజ్‌మెంట్

సంస్థ: సెలిబ్రనో ఈవెంట్ అండ్ ఎంటర్‌టైన్‌మెంట్స్ ప్రై.లి.
నైపుణ్యాలు: క్లయింట్ రిలేషన్‌షిప్, క్రియేటివ్ థింకింగ్, క్రియేటివిటీ, ఇంగ్లిష్ మాట్లాడటం, ఈవెంట్ మేనేజ్‌మెంట్, ఎంఎస్-ఎక్సెల్, ఎంఎస్-పవర్‌పాయింట్, ప్రాబ్లమ్ సాల్వింగ్, ప్రొడక్షన్ మేనేజ్‌మెంట్, ప్రొడక్షన్ ప్లానింగ్, సేల్స్, వెండర్ మేనేజ్‌మెంట్
స్టైపెండ్: రూ.11,000-20,000
దరఖాస్తు గడువు: జనవరి 8
☛ https://tinyurl.com/4y88dmxj

రామగుండం ఫెర్టిలైజర్స్‌లో..

రామగుండం ఫెర్టిలైజర్స్ అండ్ కెమికల్స్ లిమిటెడ్ (ఆర్‌ఎఫ్‌సీఎల్).. రామగుండం, నోయిడా కార్పొరేట్ కార్యాలయాల్లో ఉద్యోగాల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తోంది.

పోస్టులు: జనరల్ మేనేజర్, అసిస్టెంట్, డిప్యూటీ మేనేజర్, చీఫ్ మేనేజర్, మేనేజర్, సీనియర్ మేనేజర్, డిప్యూటీ జనరల్ మేనేజర్.

విభాగాల వారీ ఖాళీలు: ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్: 01, కెమికల్: 10, మెకానికల్: 03, ఇన్‌స్ట్రుమెంటేషన్: 04, సివిల్: 01, కెమికల్ ల్యాబ్: 02, మెటీరియల్స్: 05, ట్రాన్స్‌పోర్టేషన్: 01, హ్యూమన్ రిసోర్సెస్: 05, ఫార్మసీ: 01, ఫైనాన్స్ అండ్ అకౌంట్స్: 02, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ: 01.

అర్హత: పోస్టును అనుసరించి సంబంధిత విభాగాల్లో బీఈ/బీటెక్/బీఎస్సీ, ఎంబీఏ, సీఏ/సీఎంఏ, ఎమ్మెస్సీ, పీజీ డిప్లొమా, బీఫార్మసీతో పాటు సంబంధిత ఉద్యోగానుభవం ఉండాలి.

వేతన శ్రేణి: అసిస్టెంట్ మేనేజర్‌కు రూ.50,000 - రూ.1,60,000; డిప్యూటీ మేనేజర్‌కు రూ.60,000 - రూ.1,80,000; మేనేజర్‌కు రూ.70,000 - రూ.2,00,000; సీనియర్ మేనేజర్‌కు రూ.80,000 - రూ.2,20,000; చీఫ్ మేనేజర్‌కు రూ.90,000 - రూ.2,40,000; డిప్యూటీ జనరల్ మేనేజర్‌కు రూ.1,00,000 - రూ.2,60,000; జనరల్ మేనేజర్‌కు రూ.1,20,000 - రూ.2,80,000.

వయసు: అసిస్టెంట్/డిప్యూటీ మేనేజర్లకు 40 ఏళ్లు; మేనేజర్/ సీనియర్ మేనేజర్‌కు 45 ఏళ్లు; చీఫ్ మేనేజర్/డీజీఎంకు 50 ఏళ్లు; జనరల్ మేనేజర్‌కు 55 ఏళ్లు మించకూడదు. **ఎంపిక:** షార్ట్‌లిస్టింగ్, సీబీటీ, ఇంటర్వ్యూలతో.

దరఖాస్తు: ఆన్‌లైన్‌లో వివరాలు నింపి, ప్రింట్ తీసుకొని అవసరమైన ధ్రువపత్రాలతో నోయిడా కార్పొరేట్ కార్యాలయానికి పోస్టు ద్వారా పంపాలి.

దరఖాస్తు ఫీజు: పోస్టు ప్రకారం రూ.700 - రూ.1000. ఎస్సీ/ఎస్టీ/దివ్యాంగులు/ఎక్స్ సర్వీస్‌మెన్‌లకు ఫీజు లేదు.

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: 15.01.2026.

హార్డ్‌కాపీలు స్వీకరించడానికి చివరి తేదీ: 22.01.2026.

వెబ్‌సైట్: https://www.rfcl.co.in/

ఆర్‌బీఐలో నిపుణులు

రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) ఒప్పంద ప్రాతిపదికన వివిధ విభాగాల్లో ఎక్స్‌పర్ట్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- ఎక్స్‌పర్ట్స్ 93 ఖాళీలు

అర్హత: పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో యూజీ లేదా పీజీతో పాటు పని అనుభవం ఉండాలి. **వయసు:** 21 ఏళ్ల నుంచి 62 ఏళ్లలోపు ఉండాలి. ఎస్సీ, ఎస్టీకి ఐదేళ్లు, ఓబీసీకి మూడేళ్లు, పీడబ్ల్యూబీడీలకు పదేళ్లు గరిష్ఠ వయసులో సడలింపు ఉంటుంది. **వేతనం:** పోస్టు ప్రకారం నెలకు రూ.3.10 లక్షల నుంచి రూ.6 లక్షల వరకు చెల్లిస్తారు. **దరఖాస్తు ఫీజు:** జనరల్/ ఓబీసీ/ ఈడబ్ల్యూఎస్‌లకు రూ.600. ఎస్సీ, ఎస్టీ, పీడబ్ల్యూబీడీలకు రూ.100.

ఎంపిక: ఇంటర్వ్యూతో.

వెబ్‌సైట్: https://opportunities.rbi.org.in/scripts/vacancies.aspx

హెచ్‌ఏఎల్‌లో ఆపరేటర్లు

హిందుస్థాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్ వివిధ విభాగాల్లో ఆపరేటర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- ఆపరేటర్: 156 పోస్టులు

విభాగాలు: ఫిట్టింగ్, ఎలక్ట్రానిక్స్, గ్రైండింగ్, ఇన్‌స్ట్రుమెంట్ మెకానిక్/ ఇన్‌స్ట్రుమెంటేషన్, మెషినింగ్, టర్నింగ్.

అర్హత: సంబంధిత విభాగంలో ఐటీఐ ఉండాలి.

వయసు: నవంబరు 25, 2025 నాటికి జనరల్, ఈడబ్ల్యూఎస్‌లకు 28 ఏళ్లు, ఎస్సీ, ఎస్టీలకు 33 ఏళ్లు, ఓబీసీలకు 31 ఏళ్లు ఉండాలి.

వేతనం: నెలకు రూ.22,000.

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: 25.12.2025. **ఎంపిక:** రాత పరీక్షతో.

వెబ్‌సైట్: https://hal-india.co.in/home

విద్యలో విరామం.. వరమా? వ్యర్థమా?

నేటి పోటీ ప్రపంచంలో మేటి సంస్థలో సీటు కోసం ఎంతో శ్రమించాల్సి వస్తోంది. అయినప్పటికీ కొద్ది మందికే అవకాశం దక్కుతోంది. మిగిలినవారిలో ఎక్కువ మంది వచ్చే విద్యా సంవత్సరంలోనైనా సాధిద్దాం అనే సంకల్పంతో అకడమిక్ గ్యాప్ తీసుకుంటున్నారు. మరి కొంత మంది మరింత మెరుగుపడాలనే లక్ష్యంతో విద్యలో విరామాన్ని ఎంచుకుంటున్నారు. ఉత్తీర్ణత సాధించలేకపోవడంతో కొందరికి ఈ గ్యాప్ తప్పడం లేదు. ఇలా కారణాలు ఏవైనా సరే.. అకడమిక్ గ్యాప్ తీసుకునేవారి సంఖ్య పెరుగుతోంది. దీంతో సత్ఫలితాలు సొంతమవుతాయా?



చదువులో విరామం తీసుకోవడం విదేశాల్లో సాధారణ వ్యవహారం. మన దగ్గర విలువైన సమయం వృథా అనే భావన ఎక్కువ మందిలో బలంగా నాటుకుపోయింది. అయితే ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని, వాటిని అందుకోవడానికి విరామం తీసుకోవడం ఎక్కడైనా మంచిదే. కానీ, సమయాన్ని సద్వినియోగం చేసుకున్నప్పుడే విలువైన ఫలితం దక్కుతుంది. గ్యాప్ తీసుకుని, తక్కువ మార్కులు తెచ్చుకుంటే లాభం లేదు. విరామ సమయాన్ని ఏం చేయాలనుకుంటున్నారో ఒక నిర్దిష్ట ఆలోచన లేకపోయినా, నైపుణ్యాలను పెంచుకోలేకపోయినా, ఉద్యోగ అనుభవం పొందకున్నా గ్యాప్ ఇయర్‌తో ప్రయోజనం లేనట్లే.



హైస్కూల్ విద్య పూర్తికాగానే ఏడాది విరామం తీసుకోవడం సాధారణ వ్యవహారమే. ఆ గ్యాప్‌లో నచ్చిన ప్రదేశాలు చూడటం, ట్రావెలింగ్, ప్రోగ్రామింగ్‌లో చేరడం, ఇంటర్న్‌షిప్పులు.. లాంటివి చేస్తుంటారు. ఉద్యోగ రంగంలోని అనుభవం పొందడానికీ, ఆన్‌లైన్ కోర్సులు పూర్తిచేసుకోవడానికీ, తగిన నైపుణ్యాలను నేర్చుకోవడానికీ ఇదొక అద్భుత అవకాశం. కొంత మంది డబ్బు సంపాదించి, ఆ తర్వాత ఉన్నత విద్యలో చేరడానికి గ్యాప్ ఇయర్‌ను ఎంచుకుంటారు. ఇలాంటి వారు పార్ట్ టైమ్ కొలువు, ఉన్నత విద్యకు సిద్ధం కావడానికి సరైన ప్రణాళిక రూపొందించుకోవాలి. విద్యలో విరామం కోరుకునేవారు మెంటర్ సాయాన్ని పొందితే మరింత మంచిది.

ఏం చేయవచ్చు?

మీ అకడమిక్/ కెరియర్/ జీవిత లక్ష్యాల ఆధారంగా ఏం చేయాలో ఒక నిర్ణయానికి రావచ్చు. పోటీ పరీక్షలకు సిద్ధమవడం, కోడింగ్, స్పోకెన్ ఇంగ్లిష్ నేర్చుకోవడం, ఐఐటీలో సీటు పొందడం, క్రీడా శిక్షణ, యూఎస్‌లో ఉన్నత విద్య.. ఇలా మీ లక్ష్యాల ప్రకారం సమయాన్ని సద్వినియోగం చేసుకోవాలి. విదేశాల్లో

కెరియర్ ప్లానింగ్

ఉన్నత విద్యలో ఏం చదవాలనుకుంటున్నారు, ఏ కళాశాలలో చేరాలనుకుంటున్నారో నిర్ణయించుకుని, వాటి ప్రవేశ పరీక్షలకు సన్నద్ధం కావాలి. ఉదాహరణకు డాక్టర్ కావాలనుకుంటే నీట్ కోసం తయారు కావచ్చు. ఇలా మీ లక్ష్యాలకు అనుగుణంగా ప్రణాళిక రూపొందించుకోవాలి. అదే పట్టభద్రులైతే పోటీ పరీక్షలకు సిద్ధం కావచ్చు. ఏదైనా సంస్థలో ఇంటర్న్‌షిప్ కోసం ప్రయత్నించవచ్చు. దీంతో పని అనుభవం, ఆత్మవిశ్వాసం సొంతమవుతాయి. నేర్చుకుంటూనే కొంత ఆదాయాన్నీ పొందవచ్చు. అక్కడి పరిచయాలతో కొత్త అవకాశాలకూ మార్గం ఏర్పడుతుంది.

వాలంటీర్‌గానూ..

విద్యలో విరామం తీసుకున్న విద్యార్థులను దృష్టిలో ఉంచుకొని కొన్ని ఎన్జీవోలు అనేక కార్యక్రమాలు చేపడుతున్నాయి. అలాంటి వాటిలో చేరి.. లీడర్‌షిప్, టీమ్ వర్క్ నైపుణ్యాలు పెంపొందించుకోవచ్చు. వీటి ద్వారా సామాజిక అవగాహన పెరుగుతుంది. ఉపాధి అవకాశాలూ పొందొచ్చు. వీటిలో భాగమైనవారికి ధ్రువీకరణ పత్రాలు అందుతాయి. అవి ఉద్యోగ ప్రయత్నాల్లో ఉపయోగ పడతాయి.

నైపుణ్యాలకు నగిషీలు..

గ్యాప్ సంవత్సరం నైపుణ్యాలను మెరుగుపరచుకోవడానికి అద్భుతమైన అవకాశం. ఏవైనా స్కిల్ డెవలప్‌మెంట్ కోర్సులు నేర్చుకోవచ్చు. కోడింగ్/కంప్యూటర్ ప్రోగ్రామింగ్, డిజిటల్ మార్కెటింగ్, గ్రాఫిక్ డిజైనింగ్, వీడియో ఎడిటింగ్.. ఇలా ఇష్టమైన వాటిలో ప్రావీణ్యానికి సమయాన్ని వెచ్చించాలి. పొందిన నైపుణ్యాలను రెజ్యూమెలో చేర్చుకోవచ్చు. దీంతో నియామక సంస్థలకూ మీపై సానుకూల అభిప్రాయం ఏర్పడటానికి అవకాశం ఉంది. నైపుణ్యాల ద్వారా ఆత్మవిశ్వాసమూ పెరుగుతుంది.

హాబీలకూ అవకాశం

పాటలు, ఆటలు, చిత్రలేఖనం, పుస్తకాలు చదవడం, కొత్త భాషలు నేర్చుకోవడం, ఫొటోగ్రఫీ.. ఇలా ఇష్టమైన వ్యాపకాల కోసం సమయం వెచ్చించి, అందులో ఆనందంతోపాటూ నైపుణ్యాన్నీ పెంచుకోవచ్చు.

ఉదాహరణకు మీరు ఇన్‌ఫ్లుయెన్సర్ కావాలనుకుంటే.. సోషల్ మీడియాను ఎలా ఉపయోగించుకోవాలో తెలుసుకోవాలి. భావ వ్యక్తీకరణ నైపుణ్యాలు పెంపొందించుకోవాలి. ఎస్‌ఈవో, డిజిటల్ మార్కెటింగ్.. లాంటి వాటిలో ప్రావీణ్యం పొందాలి. ప్రపంచ స్థాయిలో మేటి వక్తల ఉపన్యాసాలను శ్రద్ధగా వినాలి. భాషపై గట్టి పట్టు పొందాలి.

- మీరు ఏ విభాగంలో గుర్తింపు పొందాలనుకుంటున్నారో నిర్ణయించుకుని, అందుకు సంబంధించిన పరిజ్ఞానం కోసం పుస్తకాలు విస్తృతంగా చదవాలి. అవసరమైతే సర్టిఫికేషన్ కోర్సులూ పూర్తిచేయాలి. ఇవన్నీ చేస్తే కచ్చితంగా ఏడాది తిరిగేసరికల్లా కోరుకున్న అంశంలో ప్రావీణ్యం పొందవచ్చు.

ఇలా గ్యాప్ ఇయర్‌ను ప్రణాళికతో ఉపయోగించుకుంటే వరమే అవుతుంది. సమయాన్ని సద్వినియోగం చేసుకోలేకపోతే వ్యర్థమే. కొంచెం ఆలస్యం అయినప్పటికీ, అద్భుతంగా రాణించాలనే సంకల్పం ఉన్నవారికి విద్యలో విరామం వరమే!

బిహార్‌లో మగాళ్ల ఖాతాల్లోకి
'రూ.10 వేలు' పథకం డబ్బులు

"అసెంబ్లీ ఎన్నికల ముందు నా ఖాతాలోకి రూ.10 వేలు వచ్చాయి. నేను దివ్యాంగుడిని. ప్రభుత్వం ఇచ్చింది కాబోలని ఖర్చు చేశా. ఇప్పుడు ఆ డబ్బు తిరిగి ఇవ్వాలని నోటీసు వచ్చింది. ఎక్కడి నుంచి తేవాలి?" అని బిహార్‌కు చెందిన ఓ దివ్యాంగుడు ఆవేదన వ్యక్తం చేశారు. "ఛర్ పూజకు ముందు నా ఖాతాలోకి డబ్బులొచ్చాయి. పూజకు ఖర్చు చేశా. ఇప్పుడు ఎలా తేవాలి?" అన్నది మరో వ్యక్తి ప్రశ్న. వచ్చిన డబ్బుతో బాతులు, మేకలు కొనుగోలు చేశామని.. మరికొందరు చెబుతున్నారు. ఇలా ఒకరిద్దరు కాదు.. బిహార్‌లో చాలామంది పురుషులకు నగదు వెనక్కు ఇవ్వాలని నోటీసులు వచ్చాయి. ఇటీవల ముగిసిన అసెంబ్లీ ఎన్నికల ముందు నీతీశ్ సర్కారు 'ముఖ్యమంత్రి మహిళా ఉపాధి పథకం' కింద సుమారు 75 లక్షల మందికి నేరుగా వారి వారి ఖతాల్లోకి రూ.10 వేలు చొప్పున జమ చేసిన విషయం తెలిసిందే.


పురుషులకు అందిన నోటీసులు

సాంకేతిక లోపంతో ఈ నిధులు పలు చోట్ల మహిళలకు బదులుగా పురుషుల ఖాతాల్లో జమ అయ్యాయని అధికారులు తలలు పట్టుకొంటున్నారు.

ఈటీవీ భారత్

సంకేత భాషలో మాట్లాడే
స్మార్ట్ చేతి తొడుగులు





చెవిటి, మూగ సమస్యలు ఉన్నవారితోపాటు మంచం పట్టిన వ్యక్తులకు వరంగా చెప్పదగిన స్మార్ట్ చేతి తొడుగులను గుజరాత్‌లోని భావ్‌నగర్ విద్యార్థులు రూపొందించారు. దివ్యాంగులు, రోగులు ఈ స్మార్ట్ గ్లవ్స్‌ను చేతులకు ధరించి వేళ్ల కదలికల ద్వారా నీరు, ఆహారం కావాలని.. బాత్ రూముకు వెళ్లాలని తమ అవసరాలను ఎదుటి వ్యక్తులకు తెలియజేయవచ్చు. భావ్‌నగర్‌లోని సర్ భావ్‌సింగ్‌జీ పాలిటెక్నిక్ కళాశాల ఫైనలియర్ విద్యార్థి విరాజ్ చౌహాన్ వీటి పనితీరును వివరించాడు. "మెకానికల్ ఇంజినీరింగ్ విభాగంలోని అడ్వాన్స్‌డ్ మాన్యుఫాక్చరింగ్ విధానాల్లో ఓ మైక్రో ప్రాజెక్టును నేను చేస్తున్నాను. ఆర్డీ నానో వినియోగంతో సంకేత భాషలో మాట్లాడే చేతి తొడుగు ఇందులో భాగమే. గ్లవ్స్‌లోని ప్రతి వేలుకు సెన్సర్ అనుసంధానమై ఉంటుంది. వేళ్ల కదలికతో మన అవసరం ఏమిటో పైభాగాన ఉన్న తెరపై అక్షర రూపంలో కనిపిస్తుంది. నిరక్షరాస్యుల కోసం దీనికి స్వీకర్లను చేర్చే ఆలోచన కూడా ఉంది" అని తెలిపాడు. ఈ ప్రాజెక్టు ఎంతోమంది అభాగ్యులకు వరంగా మారనుందని కళాశాల ప్రిన్సిపల్ జె.ఆర్.వఘేలా అభిప్రాయపడ్డారు.

బంగ్లాదేశ్‌లోని భారత దౌత్య కార్యాలయం భద్రతపై ఆందోళన
ఆ దేశ రాయబారిని పిలిచి నిరసన తెలిపిన భారత్

దిల్లీ: బంగ్లాదేశ్‌లోని భారత దౌత్య కార్యాలయం భద్రతపై మన దేశం తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. ఢాకాలోని ఆ కార్యాలయంవద్ద నిరసనలు చేపట్టాలని కొన్ని సంస్థలు పిలుపునిచ్చిన నేపథ్యంలో భారత విదేశీ వ్యవహారాల శాఖ (ఎంఈఏ) స్పందించింది. బంగ్లాదేశ్ రాయబారి రియాజ్ హమీదుల్లాను బుధవారం పిలిపించి నిరసనను తెలియజేసింది. మధ్యాహ్నం 'జులై ఐక్య' (జులై యూనిటీ) పేరుతో బ్యానర్లు పట్టుకుని ఓ బృందం ఢాకాలోని భారత హైకమిషన్‌వైపు మార్చ్‌ను నిర్వహించింది. మాజీ ప్రధాని హసీనాను, భారత్‌లో తలదాచుకుంటున్న నిషేధిత అవామీ లీగ్ సభ్యులను తిరిగి బంగ్లాదేశ్‌కు అప్పగించాలని నినాదాలు చేశారు. రాంపూర వంతెన నుంచి ప్రారంభమైన నిరసనకారులను పోలీసులు అడ్డుకున్నారని అధికారులు వెల్లడించారు. మరోవైపు.. ఢాకాలోని జమునా ఫ్యూచర్ పార్క్‌లో ఉన్న వీసా దరఖాస్తు కేంద్రాన్ని (ఐవీఏసీ) భద్రతాపరమైన కారణాలతో భారత్ మూసివేసింది. దీంతో బుధవారం అపాయింట్‌మెంట్లను మరో రోజుకు వాయిదా వేశామని, ఆ వివరాలను త్వరలోనే ప్రకటిస్తామని ఐవీఏసీ వెల్లడించింది.



విక్రయాలతో కమ్యూనికేషన్ నైపుణ్యాలు

వ్యాపార నిర్వహణ ఓ ఉత్తమ వ్యక్తిత్వవికాస కార్యక్రమం. ఎలా అంటే.. విక్రయాలు కమ్యూనికేషన్ నైపుణ్యాలను నేర్పుతాయి. మార్కెటింగ్‌తో వ్యూహాత్మక ఆలోచనలు అలవడతాయి. వ్యాపారాన్ని అభివృద్ధి పరిచే క్రమం..మీ మానసిక స్థితి, నాయకత్వ లక్షణాలను ఉన్నతీకరిస్తుంది.
– డాన్ మార్టెల్, రచయిత

అణుబిల్లుకు లోక్‌సభ ఆమోదం

- జేపీసీ ఏర్పాటుకు నిరాకరణతో విపక్షం వాకౌట్

దిల్లీ: అణుఇంధన రంగంలో ప్రైవేటు భాగస్వామ్యాన్ని అనుమతించే బిల్లుకు లోక్‌సభ బుధవారం మూజువాణి ఓటుతో ఆమోదం తెలిపింది. 'భారత రూపాంతరీకరణ కోసం అణు ఇంధన సుస్థిర వినియోగం-అభివృద్ధి' (సస్టెయినబుల్ హార్నెసింగ్ అండ్ అడ్వాన్స్‌మెంట్ ఆఫ్ న్యూక్లియర్ ఎనర్జీ ఫర్ ట్రాన్స్‌ఫార్మింగ్ ఇండియా.. శాంతి) పేరుతో రూపొందించిన ఈ బిల్లులోని అంశాలను క్షుణ్ణంగా అధ్యయనం చేయడానికి 'సంయుక్త పార్లమెంటరీ సంఘాని'కి (జేపీసీకి) నివేదించాలని విపక్షాలు చేసిన డిమాండును ప్రభుత్వం తోసిపుచ్చింది. దాంతో సభ నుంచి అవి వాకౌట్ చేశాయి. భద్రతపరమైన పలు సందేహాలను విపక్షాలు లేవనెత్తాయి. చర్చకు మంత్రి జితేంద్రసింగ్ సమాధానమిస్తూ.. అణు జవాబుదారీ చట్టంలో కీలక నిబంధనల వల్ల పరిశ్రమ వర్గాల్లో 'సైలెంట్ పోలియో' ఉండేదని చెప్పారు. దానిని పోగొట్టేందుకు బిల్లు తీసుకువచ్చామని, బాధితులకు పూర్తిస్థాయి పరిహారం అందేలా నిబంధనలు చేర్చామని వివరించారు. ప్రభుత్వ సాయంతో 'అణు జవాబుదారీ నిధి' ఏర్పాటవుతుందని, అంతర్జాతీయంగానూ అదనపు పరిహారం అందేలా చూస్తామన్నారు. ప్రస్తుత సాంకేతిక, మారుతున్న ప్రపంచ అవసరాలకు తగ్గట్టు ఉన్న ఈ బిల్లు ఓ మైలురాయిగా నిలిచిపోతుందన్నారు. 2047 నాటికి 100 గిగావాట్ల అణు విద్యుత్తును సాధించాల్సి ఉందని చెప్పారు. అత్యంత నియంత్రణ ఉండే పౌర అణుఇంధన రంగంలోకి ప్రైవేటు భాగస్వామ్యాన్ని అనుమతించడం వల్ల పెట్టుబడులు, ఉద్యోగావకాశాలు పెరుగుతాయని అధికారపక్ష సభ్యులు చెప్పారు.

బీమా బిల్లుతో ఉపాధి మెరుగు: నిర్మల



బీమా రంగంలో 100% ఎఫ్‌డీఐని (విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులను) అనుమతించే బిల్లుకు రాజ్యసభ ఆమోదం కూడా లభించింది. విపక్షాలు ప్రతిపాదించిన సవరణల్ని పార్లమెంటు తిరస్కరించింది. ఉపాధి అవకాశాలు తగ్గిపోతాయన్న భయాలను ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ తోసిపుచ్చారు. నిజానికి ఎక్కువ ఉద్యోగాలు వస్తాయని చెప్పారు. బిల్లును జేపీసీకి పంపాలని విపక్షాలు డిమాండ్ చేశాయి. సైబర్ దాడులు పెరిగిన రోజుల్లో ఆధార్, పాన్ వంటి వ్యక్తిగత వివరాలను విదేశీ కంపెనీలకు ఎలా అప్పగిస్తామని ప్రశ్నించాయి. కాలంచెల్లిన 71 చట్టాల రద్దు/ సవరణకు రాజ్యసభ కూడా ఆమోదం తెలిపింది.

ప్రయోజనాలు పణంగా పెట్టొద్దు

కాంగ్రెస్ సభ్యుడు మనీశ్ తివారీ ఈ బిల్లును వ్యతిరేకించారు. అణుఇంధన పరికరాల సరఫరాదారులను జవాబుదారీ నుంచి మినహాయించే నిబంధనను తప్పుబట్టారు. ప్రమాదాలు సంభవిస్తే తీరని నష్టం వాటిల్లుతుందని ఆందోళన వ్యక్తంచేశారు. ఇది న్యూక్లియర్ బిల్లు కాదు అన్‌క్లియర్ బిల్లు అని మాజీ మంత్రి శశిథరూర్ అన్నారు. దేశ ప్రయోజనాలను పణంగా పెట్టి విదేశీ కంపెనీలకు ఎర్ర తివాచీ పరవడం ఏమాత్రం సబబు కాదని చెప్పారు.

మెహుల్ చోక్సీ అభ్యర్థనను తోసిపుచ్చిన బెల్జియం కోర్టు

దిల్లీ: పరారీలో ఉన్న వజ్రాల వ్యాపారి మెహుల్ చోక్సీ తనను భారత్‌కు అప్పగించవద్దంటూ చేసుకున్న అభ్యర్థనను బెల్జియంకు చెందిన అత్యున్నత న్యాయస్థానం బుధవారం తిరస్కరించింది. భారత్‌లో తనకు న్యాయం లభించదని, చిత్రహింసలకు గురి చేస్తారని చోక్సీ చేసిన వాదనను తోసిపుచ్చింది. తనను యాంటిగ్వా నుంచి కిడ్నాప్ చేసే ప్రయత్నం జరిగిందంటూ చోక్సీ చేసిన వాదన కోర్టులో చెల్లుబాటు కాలేదు. నేర నిరూపణ జరిగే వరకూ ఒక వ్యక్తిని నిర్దోషిగా పరిగణించాలన్న న్యాయసూత్రం భారత్ తనకు వర్తించబోదంటూ చోక్సీ చేసిన విన్నపాన్ని కూడా కోర్టు ఆమోదించలేదు.

భారత్‌లో తయారీ రంగం వెనుకంజ: రాహుల్
జర్మనీలో బీఎండబ్ల్యూ ప్లాంట్ సందర్శన

దిల్లీ: బలమైన ఆర్థిక వ్యవస్థలకు తయారీ రంగం వెన్నెముకలాంటిదని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ పేర్కొన్నారు. భారత్‌లో మాత్రం ఈ రంగం వెనుకంజలో ఉందని, దేశం అభివృద్ధి పథంలో పయనించాలంటే ఉత్పత్తిని మరింత పెంచాల్సిన అవసరముందని అన్నారు. జర్మనీ పర్యటనలో ఉన్న ఆయన మ్యూనిక్‌లోని బీఎండబ్ల్యూ ప్లాంట్‌ను బుధవారం సందర్శించారు. ఆ సంస్థ సహకారంతో తయారవుతున్న టీవీఎస్ 450సీసీ బైక్


బైక్‌ను పరిశీలిస్తున్న రాహుల్

సహా లేటెస్ట్ మోడల్ కార్లు, బైక్‌లను పరిశీలించారు. "బీఎండబ్ల్యూ ఫ్యాక్టరీకి వెళ్లాం. అద్భుతంగా ఉంది. ముఖ్యంగా వాళ్ల దగ్గర టీవీఎస్ 450సీసీ బైక్ చూసి సంతోషించా. భారత ఇంజినీరింగ్ ప్రతిభను చూసి గర్విస్తున్నా" అని రాహుల్ పేర్కొన్నారు.

■ ప్రతి రంగంలోనూ ఒకట్రెండు సంస్థలే గుత్తాధిపత్యం చెలాయిస్తున్నాయని దీనికి మోదీ ప్రభుత్వమే కారణమని రాహుల్ నిందించారు. పార్లమెంటు ప్రాంగణంలో చిన్న, మధ్యతరహా సంస్థల ఐస్‌క్రీం ఉత్పత్తిదారులను రాహుల్ ఇటీవల కలిశారు. ఆ వివరాలను రాహుల్ తన వాట్సప్ ఛానల్‌లో పంచుకున్నారు. తయారీరంగం వెనకంజలో ఉందని రాహుల్ చేసిన వ్యాఖ్యలపై భాజపా మండిపడింది. దేశంలో తయారీ రంగం ఎదుగుతోందని, విదేశీ గడ్డపై కాంగ్రెస్ నేత భారత వ్యతిరేక వ్యాఖ్యలు చేశారని పేర్కొంది.

ఒమన్ చేరుకున్న ప్రధాని మోదీ


మస్కట్‌లో బుధవారం తనకు స్వాగతం పలికిన కళాకారులతో ముచ్చటిస్తున్న ప్రధాని మోదీ

మస్కట్: ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఇథియోపియా పర్యటనను ముగించుకొని బుధవారం ఒమన్ చేరుకున్నారు. ఉప ప్రధాని (రక్షణ వ్యవహారాలు) సయ్యిబ్ షిహాబ్ బిన్ తారిక్ అల్ సయిద్‌తో సమావేశమై పలు ద్వైపాక్షిక, ప్రాంతీయ అంశాలపై చర్చించారు. ఇరు దేశాల మధ్య ఉన్న మైత్రీ బంధాన్ని మరింత బలోపేతం చేసుకునే దిశగా సమాలోచనలు జరిపారు. భారత్-ఒమన్ మధ్య దౌత్య సంబంధాలు ఏర్పడి 70 ఏళ్లవుతుండటాన్ని పురస్కరించుకొని ఏర్పాటుచేసిన ఓ ఎగ్జిబిషన్‌ను మోదీ తిలకించారు. ఆయన ఒమన్‌లో పర్యటించడం ఇది రెండోసారి. ఈ పర్యటనలో భాగంగా ఒమన్ సుల్తాన్ తారిక్‌తో ప్రధాని భేటీ అవుతారు. భారత సంతతి ప్రజలను ఉద్దేశించి ప్రసంగిస్తారు. మోదీ పర్యటనలో ఇరు దేశాల మధ్య స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం కుదిరే అవకాశాలు ఉన్నాయి.

మరో 20 దేశాలపై ప్రయాణ నిషేధం

- అమెరికా నిర్ణయం



న్యూయార్క్, వాషింగ్టన్: అమెరికా ప్రభుత్వం మరో 20 దేశాలపై ప్రయాణ నిషేధం, ఆంక్షలను విధించింది. వాటిలో కొన్నింటిపై పూర్తిగా, మరికొన్నింటిపై పాక్షికంగా నిషేధాజ్ఞలు జారీ చేసింది. పాలస్తీనా అథారిటీపైనా ఆంక్షలను విధించింది. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మంగళవారం ఈ ఆంక్షల ఉత్తర్వులపై సంతకం చేశారు. ఈ దేశాల వారిపై వెట్టింగ్ కష్టతరమని, వారి గురించి సరైన సమాచారం లభించడం లేదని, వారి నుంచి పొంచి ఉండే ముప్పును అంచనా వేయడానికి సంబంధిత ప్రభుత్వాల నుంచి సరైన సహకారం లేదని ఆ ఉత్తర్వుల్లో ట్రంప్ ప్రభుత్వం స్పష్టం చేసింది.

పాక్షికంగా ఆంక్షలు విధించిన దేశాలు

అంగోలా, ఆంటిగ్వా అండ్ బార్బుడా, బెనిన్, కోట్ డెల్‌వాయిర్, డొమినికా, గబోన్, దగాంబియా, మలావీ, మారిటానియా, నైజీరియా, సెనెగల్, టాంజానియా, టోంగా, జాంబియా, జింబాబ్వే.

గతంలో 12 దేశాలపై..

ఈ ఏడాది జూన్‌లో 12 దేశాలపై అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రయాణ నిషేధం, ఆంక్షలు విధించారు. వాటిలో అఫ్గానిస్థాన్, మయన్మార్, చాద్, రిపబ్లిక్ ఆఫ్ కాంగో, ఈక్వెటోరియల్ గినీ, ఎరిత్రియా, హైతీ, ఇరాన్, లిబియా, సోమాలియా, సుడాన్, యెమెన్ ఉన్నాయి.

వీటిపై పూర్తిగా ఆంక్షలు

■ బుర్కినా ఫాసో, మాలి, నైగర్, దక్షిణ సుడాన్, సిరియా.


■ పాలస్తీనా అథారిటీ జారీ చేసిన ధ్రువీకరణ పత్రాలు కలిగిన వారిపైనా పూర్తి ఆంక్షలు అమల్లోకి వస్తాయి. అమెరికా ఉగ్రవాద గ్రూపులుగా ప్రకటించిన చాలా గ్రూపులు వెస్ట్‌బ్యాంకు, గాజా నుంచి పని చేస్తున్నాయని, అమెరికా పౌరులను అవి హత్య చేస్తున్నాయని ప్రభుత్వం వెల్లడించింది.

■ గతంలో పాక్షిక ఆంక్షలు విధించిన దేశాలైన లావోస్, సియర్రా లియోన్‌లపై తాజాగా పూర్తి ఆంక్షలను ట్రంప్ ప్రభుత్వం విధించింది.

■ గతంలో పాక్షిక ఆంక్షలు విధించిన దేశాలైన బురుండీ, క్యూబా, టోగో, వెనెజువెలాలపై అవే ఆంక్షలు కొనసాగుతాయి.

రాష్ట్రపతిగా వాజ్‌పేయీ, ప్రధానిగా ఆడ్వాణీ పేర్లు

- ..నాడు ప్రతిపాదనలు వచ్చాయి
- పుస్తకంలో వెల్లడించిన మాజీ ప్రధాని మీడియా సలహాదారు





దిల్లీ: భారత రాష్ట్రపతి అభ్యర్థిగా ఏపీజే అబ్దుల్ కలామ్‌ను ఎన్నుకోవడానికి ముందు ఆ పదవికి అటల్ బిహారీ వాజ్‌పేయీ పేరును భాజపా ప్రతిపాదించిందట! ఆ సమయంలో వాజ్‌పేయీ మీడియా సలహాదారుగా ఉన్న అశోక్ టాండన్ రాసిన పుస్తకం 'అటల్ సంస్మరణ్'లో ఈ విషయాన్ని వెల్లడించారు. వాజ్‌పేయీ పేరును రాష్ట్రపతి పదవికి ప్రతిపాదించి, ప్రధాని స్థానంలో ఆ పార్టీ అగ్రనేత ఎల్.కె.ఆడ్వాణీని ఎన్నుకోవాలని భాజపా సూచనలు చేసినట్లు టాండన్ పేర్కొన్నారు. అయితే పార్టీ చేసిన ఈ ప్రతిపాదనను వాజ్‌పేయీ నిరాకరించినట్లు వివరించారు. అప్పటికే ప్రధానిగా ఉన్న తాను రాష్ట్రపతి పదవికి మారడం సరైన చర్య కాదని ఆయన అభిప్రాయం వ్యక్తం చేశారన్నారు. తాను ఎంతటి ప్రజాదరణ పొందిన నాయకుడిని అయినప్పటికీ.. మెజారిటీ ఆధారంగా రాష్ట్రపతి పదవిని పొందలేనని వాజ్‌పేయీ పేర్కొన్నట్లు అశోక్ టాండన్ తెలిపారు. రాష్ట్రపతి అభ్యర్థి విషయంలో ఏకాభిప్రాయం కుదిరేలా చర్చలు జరపడానికి ప్రధాన ప్రతిపక్షమైన కాంగ్రెస్ అగ్ర నేతలు సోనియా గాంధీ, ప్రణబ్ ముఖర్జీ, మన్మోహన్ సింగ్‌లను వాజ్‌పేయీ ఆహ్వానించారని చెప్పారు. అనంతరం రాష్ట్రపతి స్థానానికి ఎన్డీయే తరఫున కలామ్‌ను అభ్యర్థిగా ప్రతిపాదిస్తున్నట్లు ప్రకటించారన్నారు. దీనికి కాంగ్రెస్ కూడా మద్దతు తెలపడంతో 2002లో అప్పటి ఎన్డీయే ప్రభుత్వం, ప్రతిపక్షాల మద్దతుతో అబ్దుల్ కలామ్‌ను భారత రాష్ట్రపతిగా ఎన్నుకున్నట్లు తెలిపారు. వాజ్‌పేయీ ప్రధానమంత్రిగా ఉన్న సమయంలోని అనేక ఘటనలను అశోక్ టాండన్ తన పుస్తకంలో వివరించారు. అటల్-ఆడ్వాణీలకు విధానపరమైన అంశాలపై విభేదాలు ఉన్నప్పటికీ.. భారత రాజకీయాల్లో వారి భాగస్వామ్యం, సహకారం సమతుల్యతకు చిహ్నంగా ఉండేదన్నారు. వారి దిశానిర్దేశంలో భాజపా మరింత అభివృద్ధి చెందినట్లు రాసుకొచ్చారు.

దీర్ఘకాలిక అలసటతో
వ్యాధి నిరోధకతకు ముప్పు!

దిల్లీ: దీర్ఘకాలిక తీవ్ర అలసట (క్రానిక్ ఫ్యటీగ్ సిండ్రోమ్-సీఎఫ్ఎస్) మనిషిలో రక్త ప్రసరణ వ్యవస్థను, రోగనిరోధక శక్తిని అతలాకుతలం చేస్తుందని తాజా అధ్యయనమొకటి తెలియజేసింది. సీఎఫ్ఎస్ బాధితుల రక్తంలోని ప్రొటీన్‌లను అధ్యయనం చేసినప్పుడు ఈ విషయం వెల్లడైందని సెల్ రిపోర్ట్స్ మెడిసిన్ అనే జర్నల్ ప్రచురించిన నివేదిక వెల్లడించింది. సీఎఫ్ఎస్ అనేది జీవశాస్త్ర పరంగా అత్యంత సంక్లిష్టమైన స్థితి అని ఆస్ట్రేలియాకు చెందిన మ్యాక్‌క్వారీ విశ్వవిద్యాలయానికి చెందిన పరిశోధకులు అంటున్నారు. ఈ అనారోగ్య స్థితిలో ఉన్న వ్యక్తుల తెల్ల రక్తకణాలు తక్కువ శక్తిని ఉత్పత్తి చేస్తున్నట్టు వారు కనుగొన్నారు. సీఎఫ్ఎస్‌తో బాధపడుతున్న 61 మందికి చెందిన రక్త నమూనాలను ఆరోగ్యంగా ఉన్న వారి రక్త నమూనాలతో ఈ అధ్యయనంలో భాగంగా పోల్చి చూశారు. మయాల్జిక్ ఎన్సెఫలోమయెలిటిస్ అన్న శాస్త్రీయ నామం కలిగివున్న సీఎఫ్ఎస్ అనే అనారోగ్య స్థితిలో ఉన్న వ్యక్తి ఎంత విశ్రాంతి తీసుకున్నా వీడని అలసటతో బాధపడుతుంటాడు. ఈ స్థితిలో నిద్రలేమి, ఏకాగ్రత లోపం సర్వసాధారణం.



మనిషిలోని అనేక జీవ వ్యవస్థల్లో తలెత్తే విషమ పరిస్థితులు సీఎఫ్ఎస్‌కు దారితీస్తుంటాయి. అయితే ఒక రోగిలో ఏయే పరిణామాలు సీఎఫ్ఎస్‌కు దారితీస్తాయన్న దానిపై అధ్యయనం జరగలేదని అధ్యయన నివేదిక ప్రధాన రచయిత బెంజమిన్ హెంగ్ అన్నారు. ఈ అనారోగ్య స్థితికి గురైన రోగుల్లో శక్తిహీనత అధికంగా ఉంటుంది. ఈ స్థితిలో ఉన్న రోగుల్లో వ్యాధి నిరోధకతకు సాయపడే టీ లింఫోసైట్ వంటి కణాల ఉత్పత్తి కూడా తక్కువగా ఉన్నట్టు గుర్తించారు. అలాగే ఈ స్థితిలో ఉన్న రోగుల్లో రక్త ప్రసరణ వ్యవస్థ కూడా సమతుల్యత కోల్పోయినట్టు గుర్తించారు.

ఛత్తీస్‌గఢ్ మద్యం కుభకోణంలో సీఎంవో మాజీ కార్యదర్శి అరెస్ట్

రాయ్‌పుర్: సస్పెండ్ అయిన అడ్మినిస్ట్రేటివ్ అధికారిణి సౌమ్యా చౌరాసియాను ఛత్తీస్‌గఢ్ మద్యం కుంభకోణం కేసులో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) మంగళవారం సాయంత్రం అరెస్ట్‌చేసింది. ఈ కేసులో ఇంతకుముందే కాంగ్రెస్ ఎమ్మెల్యే, ఎక్సైజ్ మాజీ మంత్రి కవాసీ లఖ్మా, మాజీ ముఖ్యమంత్రి భూపేశ్ బఘేల్ కుమారుడు చైతన్య బఘేల్‌లు అరెస్టయ్యారు. ఈ కుంభకోణంలో లఖ్మా ప్రధాన లబ్ధిదారుడని ఈడీ ఆరోపించింది. దీనికోసం ఏర్పడిన సిండికేట్‌కు చైతన్య బఘేల్ నాయకత్వం వహించారని చెప్పింది. ఈ కుంభకోణం వల్ల రాష్ట్ర ఖజానాకు రూ.2,500 కోట్లు నష్టం వాటిల్లిందని తెలిపింది. బొగ్గు లెవీ కుంభకోణం కేసులోనూ 2022లో చౌరాసియా అరెస్టయ్యారు. భూపేశ్ బఘేల్ ఛత్తీస్‌గఢ్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ఆయన కార్యాలయంలో సౌమ్యా ఉపకార్యదర్శిగా పనిచేశారు.

భారత విమానాలకు గగనతల నిషేధాన్ని పొడిగించిన పాక్

ఇస్లామాబాద్: భారత్‌పై విధించిన గగనతల నిషేధాన్ని పాకిస్థాన్ మరో నెల పాటు పొడిగించింది. గతంలో విధించిన నిషేధం ఈ నెల 24తో ముగియనుండగా.. జనవరి 23 వరకు దాన్ని పొడిగిస్తున్నట్లు పాకిస్థాన్ ఎయిర్‌పోర్ట్స్ అథారిటీ(పీఏఏ) వెల్లడించింది.

మరోసారి ఎరుపెక్కిన తీరం

టెహ్రాన్: ఇరాన్‌లోని ద్వీపమైన హోర్ముజ్ తీరం మరోసారి ఎర్రబారింది. ఇటీవల కురిసిన భారీ వర్షాలతో వచ్చిన వరదలతో మంగళవారం రాత్రి తీరం ఎరుపెక్కింది. పర్షియన్ గల్ఫ్ సమీపంలో ఉన్న ఈ ద్వీపం ఇప్పటికే పచ్చిక బయళ్లకు, రంగురంగుల నేలలకు ప్రసిద్ధి. ఇనుప ఖనిజం, ఎర్ర



మట్టి నేలలు అధికంగా ఉండే హోర్ముజ్ కొండల నుంచి వర్షపు నీరు వచ్చి తీర ప్రాంతాన్ని ఎర్రగా మార్చింది. ఆకర్షణీయంగా మార్చింది. ఈ ద్వీపంలోని రాళ్లలో అధికంగా ఉండే ఐరన్ ఆక్సైడ్, ప్రత్యేకించి హెమటైట్ వల్ల ఇలా వర్షపు నీరు ఎర్రగా మారుతుందని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. వర్షంతో ఈ ఖనిజాలు నీటిలో కలుస్తున్నాయని.. ఇసుకతో పాటు అవి వచ్చి నీటిని ఎర్రగా మారుస్తున్నాయని వివరించారు.

నేషనల్ హెరాల్డ్ కేసులో దిల్లీ కోర్టు నిర్ణయం..
మోదీ, షాలకు చెంపపెట్టు

- వారిద్దరూ రాజీనామా చేయాలి
- కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గే డిమాండ్
- దేశవ్యాప్తంగా భాజపా కార్యాలయాల ఎదుట హస్తం పార్టీ నేతల నిరసనలు


ఝార్ఖండ్ రాజధాని రాంచీలో భాజపా కార్యాలయం వద్ద కాంగ్రెస్ శ్రేణుల ఆందోళన

దిల్లీ: నేషనల్ హెరాల్డ్ కేసులో తమ పార్టీ అగ్రనేతలు సోనియాగాంధీ, రాహుల్‌గాంధీలపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) దాఖలు చేసిన ఛార్జిషీటును దిల్లీ కోర్టు పరిగణనలోకి తీసుకోకపోవడం ప్రధాని మోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్ షాలకు చెంపపెట్టు అని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే పేర్కొన్నారు. తాజా పరిణామం నేపథ్యంలో మోదీ, షా రాజీనామా చేయాలని ఆయన డిమాండ్ చేశారు. నేషనల్ హెరాల్డ్ కేసులో సోనియా, రాహుల్‌లకు మంగళవారం ఊరట లభించడంతో.. కాంగ్రెస్ దేశవ్యాప్తంగా భాజపా కార్యాలయాల ఎదుట బుధవారం నిరసనలు చేపట్టింది. ప్రతీకార రాజకీయాల కోసం దర్యాప్తు సంస్థలను మోదీ సర్కారు వాడుకుంటోందని ఆరోపించారు. దాని తీరుపై పార్లమెంటు లోపల, వెలుపల పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేసింది. దిల్లీలో ఖర్గే విలేకర్లతో మాట్లాడుతూ.. గత 11 ఏళ్లలో 50 మందికి పైగా కీలక విపక్ష నేతలను ఆదాయపు పన్ను విభాగం, ఈడీ, సీబీఐల దుర్వినియోగంతో భయపెట్టేందుకు మోదీ ప్రభుత్వం ప్రయత్నించిందని ఆరోపించారు. కె.సి.వేణుగోపాల్, ముకుల్ వాస్నిక్, శశి థరూర్, తారిక్ అన్వర్, కుమారి శెల్జా, కె.సురేష్, మాణికం ఠాగూర్ తదితర నేతలు 'సత్యమేవ జయతే' అనే బ్యానరుతో పార్లమెంటు మకరద్వారం మెట్ల వద్ద నిరసన ప్రదర్శనలో పాల్గొన్నారు.

కాంగ్రెస్‌ది తప్పుడు ప్రచారం: భాజపా

నేషనల్ హెరాల్డ్ కేసులో దిల్లీ కోర్టు మంగళవారం వెలువరించిన ఉత్తర్వులపై కాంగ్రెస్ తప్పుడు ప్రచారం చేస్తోందని భాజపా పేర్కొంది. కేసును న్యాయస్థానం పూర్తిగా పక్కన పెట్టేయలేదని గుర్తుచేసింది. పార్టీ జాతీయ అధికార ప్రతినిధి గౌరవ్ భాటియా దిల్లీలో బుధవారం విలేకర్ల సమావేశంలో ఈ మేరకు మాట్లాడారు. ఈ కేసులో ఈడీ తన దర్యాప్తును కొనసాగించవచ్చని కోర్టు పేర్కొందని గుర్తుచేశారు.

50% మందికి ఇంటినుంచే పని

- ప్రభుత్వ, ప్రైవేట్ సంస్థలకు దిల్లీ ప్రభుత్వం ఆదేశం
- వాయు కాలుష్యం కోరల్లో దేశ రాజధాని


కర్తవ్యపథ్‌ను కమ్ముకున్న మంచు

దిల్లీ: దేశ రాజధానిలో వాయు కాలుష్యం తీవ్రతరమవుతుండటంతో దిల్లీ ప్రభుత్వం కొన్ని కీలక ఆదేశాలను జారీ చేసింది. దిల్లీలోని ప్రభుత్వ, ప్రైవేటు సంస్థల కార్యాలయాలు.. గరిష్ఠంగా 50 శాతం ఉద్యోగులతో మాత్రమే పనిచేయాలని పేర్కొంది. కాలుష్య నియంత్రణకు సంబంధించిన జీఆర్ఏపీ-3, జీఆర్ఏపీ-4 నిబంధనల కారణంగా ఉపాధి కోల్పోయినవారికి నష్టపరిహారంగా రూ.10 వేలు చెల్లిస్తామని కూడా తెలిపింది. "అన్ని ప్రభుత్వ, ప్రైవేటు సంస్థలు తమ సిబ్బందిలో 50 శాతం మందికి తప్పనిసరిగా వర్క్ ఫ్రమ్ హోమ్ సౌకర్యం కల్పించాలి. అత్యవసర సేవల విభాగాలకు మినహాయింపు ఉంటుంది. గతంలో 16 రోజులు జీఆర్ఏపీ-3 నిబంధనలు అమల్లో ఉన్నాయి. వాటి కారణంగా ప్రభావితమైన కార్మికులకు రూ.10వేలు పరిహారం ఇస్తాం'' అని దిల్లీ కార్మిక శాఖ మంత్రి కపిల్ మిశ్ర తెలిపారు.

■ కాలుష్య నియంత్రణ ధ్రువపత్రం లేని వాహనాలకు దిల్లీ పెట్రోల్ స్టేషన్లలో గురువారం నుంచి ఇంధనం నిరాకరిస్తారు. అంతేకాదు.. దిల్లీ బయట రిజిస్టరైన బీఎస్-4 ప్రమాణాలు పాటించని ప్రైవేటు వాహనాలకు రాజధానిలోకి ప్రవేశం ఉండదు. దిల్లీ సరిహద్దుల్లోని 9 టోల్ ప్లాజాలను మూసివేసే లేదా తాత్కాలికంగా వేరే ప్రదేశానికి తరలించే అవకాశాన్ని పరిశీలించాలని సంబంధిత అధికారులకు సుప్రీంకోర్టు సూచించింది.

ఎంజీనరేగా పేరు మార్చడమంటే గాంధీని రెండోసారి హత్య చేసినట్లే
చిదంబరం సంచలన వ్యాఖ్య

దిల్లీ: 'మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం చట్టం (ఎంజీనరేగా)' పేరును మార్చడమంటే జాతిపిత మహాత్మా గాంధీని రెండోసారి హత్య చేసినట్లేనని కేంద్ర మాజీ మంత్రి, కాంగ్రెస్ సీనియర్ నేత పి.చిదంబరం పేర్కొన్నారు. చాలా ఏళ్లుగా మాజీ ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూను దూషించిన భాజపా నేతలు ఇప్పుడు గాంధీజీని లక్ష్యంగా చేసుకున్నారని ఓ జాతీయ మీడియాతో ముఖాముఖిలో ఆయన అన్నారు. ''మహాత్మా గాంధీ భారతీయుల జ్ఞాపకాల నుంచి మాయమైపోవాలి.. పిల్లలకు ఆయన గురించి తెలియకూడదు.. ప్రజల పెదవులపై ఆ పేరు వినిపించకూడదు.. కేంద్రంలోని భాజపా సర్కారు కోరుకుంటున్నది ఇదే. ఇందుకోసమే ప్రయత్నిస్తోంది'' అని చిదంబరం వ్యాఖ్యానించారు.

పీవోకే నుంచి భారత్‌లోకి ప్రవేశించిన మహిళ

ఇంటర్నెట్ డెస్క్: పాకిస్థాన్ ఆక్రమిత కశ్మీర్ (పీవోకే) నుంచి భారత్‌లోకి అక్రమంగా ప్రవేశించిన ఓ మహిళను ఆర్మీ అధికారులు కస్టడీలోకి తీసుకున్నారు. కోట్లి పట్టణానికి చెందిన షెహ్నాజ్ అఖ్తర్ (35) అనే పాకిస్థానీ మహిళ నియంత్రణ రేఖ వెంబడి జమ్మూకశ్మీర్‌లోని పూంఛ్ జిల్లాలోకి ప్రవేశించినట్లు అధికారులు వెల్లడించారు. సరిహద్దులోని బాలాకోట్ సెక్టారులో అనుమానాస్పదంగా తచ్చాడుతుండటంతో ఆమెను అరెస్టు చేసినట్లు పేర్కొన్నారు. విచారణలో.. తండ్రితో గొడవపడి ఇంటి నుంచి పారిపోయి భారత్‌లోకి ప్రవేశించినట్లు ఆమె తెలిపిందన్నారు. విచారణ అనంతరం మహిళను పోలీసులకు అప్పగిస్తామన్నారు.

ఝార్ఖండ్‌లో ఐదుగురిని బలిగొన్న ఏనుగు మందలు

రాంచీ: ఝార్ఖండ్‌లో వివిధ సంఘటనల్లో అడవి ఏనుగుల కాళ్ల కింద నలిగి ఇద్దరు మహిళలతో సహా మొత్తం ఐదుగురు మృతి చెందారని అధికారులు బుధవారం వెల్లడించారు. ఝార్ఖండ్‌లోని రామ్‌గఢ్ జిల్లా ముండా బ్లాక్‌లోని అటవీ ప్రాంతంలో ఏనుగుల బారిన పడి నలుగురు మృతిచెందగా, రాంచీలోని అంగారా ప్రాంతం జిడు గ్రామం వద్ద మరో 36 ఏళ్ల వ్యక్తి మరణించాడు. రామ్‌గఢ్‌లో ఒక ఏనుగు మందను చూసిన రాజ్వర్ వాటి వీడియోను చిత్రీకరించడానికి ప్రయత్నించాడు. బెదిరిపోయిన ఏనుగులు అతణ్ని కాళ్లకింద నలిపేసినట్టు అధికారులు తెలిపారు. మృతుణ్ని సెంట్రల్ కోల్ ఫీల్డ్స్ లిమిటెడ్ సెక్యూరిటీ గార్డుగా గుర్తించారు.

ఎస్‌బీఐ ఎండీ అశ్వని కుమార్ పదవీకాలం మళ్లీ పొడిగింపు

స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) మేనేజింగ్ డైరెక్టరుగా అశ్వని కుమార్ తివారీ పదవీ కాలాన్ని మరో రెండేళ్లు ప్రభుత్వం పొడిగించింది. ఆయన ప్రస్తుత పదవీకాలం 2026 జనవరి 27న ముగియనుంది. 2027 డిసెంబరు 31 లేదా పదవీ విరమణ తేదీ.. ఏది ముందైతే అప్పటివరకు ఈ పదవిలో కొనసాగేలా ఆయన్ను కేంద్ర ప్రభుత్వం పునర్నియమించినట్లు ఎస్‌బీఐ వెల్లడించింది. తివారీకి పదవీ కాలాన్ని పొడిగించడం ఇది రెండో సారి.

ఫండ్‌లలో మరింత పారదర్శకత

మరిన్ని సంస్కరణలకు సెబీ ఆమోదం



ముంబయి: మార్కెట్ నియంత్రణాధికార సంస్థ సెబీ, బుధవారం నిర్వహించిన బోర్డు సమావేశంలో విస్తృత స్థాయి సంస్కరణలకు ఆమోద ముద్ర వేసింది. మ్యూచువల్ ఫండ్ నియంత్రణల్లో భారీ మార్పులకు అనుమతులు ఇచ్చింది. వ్యయాల నిష్పత్తి విధానం, బ్రోకరేజీ ఛార్జీలపై పరిమితుల ద్వారా, ఫండ్‌ల నిర్వహణలో పారదర్శకత పెంచనుంది. నియంత్రణల పరంగా స్పష్టత తీసుకురావడానికి, సులభతర నియమాల అమలుకు ఈ ప్రతిపాదనలు తీసుకొచ్చింది. తుహిన్ కాంత పాండే సెబీ ఛైర్మన్‌గా మార్చి 1న బాధ్యతలు స్వీకరించిన అనంతరం జరిగిన నాలుగో బోర్డు సమావేశంలో తీసుకున్న నిర్ణయాలు ఇవే..

ఫండ్‌ల వ్యయాలపై..: మ్యూచువల్ ఫండ్‌లకు చెందిన టోటల్ ఎక్స్‌పెన్స్ రేషియో (టీఈఆర్) నుంచి సెక్యూరిటీస్ లావాదేవీల పన్ను(ఎస్‌టీటీ), స్టాంప్ డ్యూటీ, జీఎస్‌టీ, సీటీటీ వంటి అన్ని ఛార్జీలను విడదీస్తారు. ఇకపై టీఈఆర్ పరిమితి లెక్కింపులో ఇవి భాగంగానే ఉంటాయి. ఫండ్ పనితీరును బట్టి ఎక్స్‌పెన్స్ రేషియోను విధిస్తారు. స్థిరాస్తి మ్యూచువల్ ఫండ్‌లు, ఇన్‌ఫ్రా డెట్ ఫండ్ స్కీమ్‌లలో పలు చాప్టర్లను తీసేసింది. ఫండ్ స్పాన్సర్ల అర్హతలనూ సరళీకరించనున్నారు.

ఆమోదించిన ఇతర ప్రతిపాదనలు..

✦ స్టాక్ బ్రోకర్లకు ఇప్పటిదాకా వర్తిస్తున్న 30 ఏళ్ల నాటి పాత నిబంధనల స్థానంలో సరళ భాషతో కొత్తవి తీసుకురానున్నారు. కాలం తీరిన నిబంధనలకు చెల్లుచీటీ ఇచ్చారు.

✦ నిధుల సమీకరణకు వచ్చే కంపెనీల ఆఫర్ పత్రాన్ని సరళీకరించే ప్రతిపాదనా ఉంది. తద్వారా తమ పెట్టుబడుల విషయంలో మదుపర్లు నిర్ణయాలు తీసుకోవడం సులభతరం అవుతుంది.

✦ కొన్ని విభాగాల మదుపర్లకు పబ్లిక్ ఇష్యూల్లో ప్రోత్సాహకాలు ఇవ్వడానికి డెట్ ఇష్యూవర్లకు అనుమతినిచ్చింది.

✦ హై వేల్యూ డెట్ లిస్టెడ్ కంపెనీ(హెచ్‌వీడీఎల్ఈలు)లను గుర్తించే పరిమితిని రూ.1000 కోట్ల నుంచి రూ.5000 కోట్లకు పెంచారు. తద్వారా కంపెనీలకు నియంత్రణల భారాన్ని తగ్గించింది.

వచ్చే సమావేశంలో అత్యున్నత స్థాయి కమిటీ ప్రతిపాదనలపై ఉన్న అనుమానాలపై చర్చించనున్నారు. ముఖ్యంగా అధికార్ల భార్యలు తమ సొంత డబ్బుతో, పెట్టే పెట్టుబడులపై స్పష్టత ఇవ్వనున్నారు.

ఈనాడు బిజినెస్

గూగుల్ పే నుంచి కో-బ్రాండెడ్ క్రెడిట్ కార్డ్

ప్రముఖ యూపీఐ చెల్లింపుల యాప్ గూగుల్ పే, మొదటిసారిగా రూపే నెట్‌వర్క్‌పై కో-బ్రాండెడ్ క్రెడిట్ కార్డు తీసుకొచ్చింది. ఇందు కోసం యాక్సిస్ బ్యాంక్‌తో భాగస్వామ్యం కుదుర్చుకుంది. మర్చంట్ చెల్లింపుల కోసం ఈ కార్డును ఖాతాదారులు తమ యూపీఐ ఖాతాలకు అనుసంధానం చేసుకోవచ్చు. సాధారణంగా క్రెడిట్ కార్డుల సంస్థలు.. వినియోగదారు చెల్లింపు కాలవ్యవధి ముగింపులో రివార్డులు, క్యాష్‌బ్యాక్‌లు ఇస్తుండగా, తాజా కార్డు మాత్రం తక్షణ క్యాష్‌బ్యాక్, రివార్డులను అందించనుంది. తదుపరి లావాదేవీలోనే వీటిని వినియోగించుకోవచ్చని గూగుల్ సీనియర్ డైరెక్టర్, ప్రోడక్ట్ మేనేజర్ శరత్ బులుసు తెలిపారు. ప్రస్తుతం రూపే- యూపీఐ కార్డులకు ఆదరణ పెరుగుతోంది. క్రెడిట్ కార్డులను యూపీఐ తరహాలో వినియోగించుకునే సౌలభ్యం ఉండటమే ఇందుకు కారణం. మాస్టర్‌కార్డ్, వీసా క్రెడిట్ కార్డులను యూపీఐకు అనుసంధానం చేసుకోలేము. రూపే, యూపీఐలను నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా నిర్వహిస్తోంది.

దమానీని మించిన దీపిందర్

- స్వయంకృషితో ఎదిగిన పారిశ్రామికవేత్తల్లో అగ్రస్థానం
- ఎటర్నల్ మార్కెట్ విలువ రూ.3.2 లక్షల కోట్లకు చేరడం వల్లే
- దూసుకొచ్చిన ఇండిగో ప్రమోటర్లు రాహుల్ భాటియా, రాకేశ్ గంగ్వాల్

ఐడీఎఫ్‌సీ ఫస్ట్- హురున్ జాబితా

స్వయంకృషితో ఎదిగిన 200 మంది ఔత్సాహిక పారిశ్రామికవేత్తల జాబితాలోకి విమానయాన సంస్థ ఇండిగో ప్రమోటర్లు రాహుల్ భాటియా, రాకేశ్ గంగ్వాల్ తొలిసారిగా అడుగుపెట్టారు. ఏకంగా టాప్-10లో నిలిచారు. ఇండిగో మాతృసంస్థ ఇంటర్‌గ్లోబ్ ఏవియేషన్ సంస్థ మార్కెట్ విలువ 2025లో రూ.2.2 లక్షల కోట్లకు చేరడంతో, ఈ జాబితాలో వీరు మూడో స్థానం దక్కించుకున్నారు. ఐడీఎఫ్‌సీ ఫస్ట్ ప్రైవేట్ - హురున్ ఇండియా రూపొందించిన 'టాప్ 200 సెల్ఫ్ మేడ్ ఎంటర్‌ప్రెన్యూర్స్ ఆఫ్ ద మిలేనియా 2025' జాబితా ముఖ్యాంశాలు ఇవీ..

జొమాటో, బ్లింకిట్, డిస్ట్రిక్ట్ వంటి సంస్థలను నిర్వహిస్తున్న ఎటర్నల్ మార్కెట్ విలువ రూ.3.2 లక్షల కోట్లకు చేరడంతో.. ఈ జాబితా అగ్రస్థానంలో సంస్థ అధిపతి దీపిందర్ గోయల్ నిలిచారు. గతేడాది తొలిస్థానంలో ఉన్న డిమార్ట్ మార్కెట్ విలువ 13% తగ్గడంతో, ఆ సంస్థ అధినేత దమానీ రెండో స్థానానికి పరిమితమయ్యారు. పేటీఎం, లెన్స్‌కార్ట్ సైతం టాప్-10లోకి వచ్చి భారత్‌లో టెక్ కన్జ్యూమర్ బ్రాండ్ల శక్తిని చాటాయి. రాజోర్‌పే, జెరోధా సంస్థలు టాప్-10 నుంచి బయటకు వెళ్లాయి. మొత్తం 200 కంపెనీల మార్కెట్ విలువ రూ.42 లక్షల కోట్లుగా నిలిచింది. బిలియన్ డాలర్ల (సుమారు రూ.9,000 కోట్ల) విలువైన కంపెనీల సంఖ్య 121 నుంచి 128కి చేరింది. 22 కొత్త కంపెనీలు ఈ జాబితాలోకి ఎక్కాయి. రూ.లక్ష కోట్లు, ఆ పైన స్థాయి కంపెనీలు గతేడాది 3 ఉండగా.. ఇపుడు అయిదుకు చేరాయి. ఈ జాబితాలో ఉన్న కంపెనీల కనీస విలువ గతేడాది రూ.3400 కోట్లు కాగా, ఈసారి రూ.4300 కోట్లకు పెరిగింది.



దీపిందర్ గోయల్ | రాహుల్ భాటియా, రాకేశ్ గంగ్వాల్

✦ మహిళా పారిశ్రామికవేత్తల్లో నైకా వ్యవస్థాపకురాలు ఫల్గుణి నాయర్ అగ్రస్థానంలో కొనసాగారు. మొత్తం 20 మంది మహిళల కంపెనీల విలువ రూ.3.3 లక్షల కోట్లుగా ఉంది.

8 లక్షల ఉద్యోగాలు

ఈ కంపెనీలన్నీ కలిపి 8 లక్షల మందికి ఉపాధినిస్తున్నాయి. అవెన్యూ సూపర్‌మార్ట్స్ (డీమార్ట్)లో 90,280 మంది, ఇండిగోలో 42,887 మంది ఉన్నారు.. అత్యధిక ఆదాయం గల కంపెనీలుగా ఇండిగో (రూ.84,098 కోట్లు), డీమార్ట్ (రూ.59,482 కోట్లు), ఎటర్నల్ (రూ.21,320 కోట్లు) నిలిచాయి.

✦ ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు బెంగళూరులో 88 మంది, ముంబయిలో 83 మంది, దిల్లీలో 52 మంది ఉన్నారు. హైదరాబాద్ 12 మంది (8 కంపెనీల)తో ఏడో స్థానంలో ఉంది.

జాబితాలో అగ్రగామి 10 స్వయం కృషీవలురు

ర్యాంకు	వ్యవస్థాపకులు(సంస్థ)	మార్కెట్ విలువ (రూ.కోట్లలో)
1	దీపిందర్ గోయల్ (ఎటర్నల్)	3,20,700
2	రాధాకిషన్ దమానీ (డీమార్ట్)	2,97,800
3	రాహుల్ భాటియా, రాకేశ్ గంగ్వాల్ (ఇండిగో)	2,19,300
4	అభయ్ సోయ్ (మాక్స్ హెల్త్‌కేర్ ఇన్‌స్టిట్యూట్)	1,10,700
5	శ్రీహర్ష మాజేటి, నందన్ రెడ్డి (స్విగ్గీ)	1,06,100
6	దీప్ కల్రా, రాజేశ్ మాగవ్ (మేక్‌మైట్రిప్)	94,500
7	యశీష్ దహియా, అలోక్‌బన్సల్ (పాలసీబజార్)	80,300
8	విజయ్‌శేఖర్ శర్మ(పేటీఎమ్)	72,900
9	ఫల్గుణి నాయర్, అద్వైత నాయర్ (నైకా)	67,500
10	పీయూశ్ బన్సల్, అమిత్ చౌధరి, నేహ బన్సల్, సుమీత్ కపాహి (లెన్స్‌కార్ట్)	67,000

జాబితాలో తెలుగు రాష్ట్రాలకు చెందిన వారు

వ్యవస్థాపకులు (సంస్థ)	మార్కెట్ విలువ(రూ.కోట్లలో)
నందన్ రెడ్డి, శ్రీహర్ష మాజేటి (స్విగ్గీ)	1,06,100
అనిల్ చలమలశెట్టి, మహేష్ కొల్లి(గ్రీన్‌కో)	66,000
సత్యనారాయణ చావ(లారస్ ల్యాబ్స్)	48,400
మన్నె సత్యనారాయణ రెడ్డి(ఎంఎస్ఎన్ ల్యాబ్స్)	29,600
భాస్కర్ రావు బొల్లినేని(కిమ్స్ హస్పిటల్)	29300
అరవింద్ సంక, పవన్ గుంటుపల్లి(రాపిడో)	20,400
వంశీ గోకరాజు, జీఎస్ రాజు(డెక్కన్ ఫైన్ కెమికల్స్)	19500
మధుకర్‌గంగడి (మెడ్‌ప్లస్)	9600
చైతన్య పెద్ది, జయంత్ పాలేటి, రోహిత్ చెన్నమనేని (డార్విన్ బాక్స్)	8900
రాజ్ ఫణి (జాగిల్ ప్రీపెయిడ్)	4800

25 అత్యంత సంపన్న కుటుంబాల్లో ముకేశ్



ప్రపంచంలోని అగ్రశ్రేణి 25 సంపన్న కుటుంబాల జాబితాను బ్లూమ్‌బర్గ్ ప్రకటించింది. ఇందులో మనదేశం నుంచి ముకేశ్ అంబానీ కుటుంబం ఒక్కటే ఉంది. 105.6 బిలియన్ డాలర్ల (సుమారు రూ.9.50 లక్షల కోట్ల) సంపదతో ఈ జాబితా 8వ స్థానంలో ముకేశ్ కుటుంబం ఉంది. ఈ జాబితాలోని అందరి సంపద విలువ కలిపి గతేడాది కంటే 358.7 బి.డా. (సుమారు రూ.32.28 లక్షల కోట్లు) పెరిగి 2.9 లక్షల కోట్ల డాలర్ల (సుమారు రూ.261 లక్షల కోట్ల)ని నివేదిక పేర్కొంది. ఈ జాబితా అగ్రస్థానంలో వాల్‌మార్ట్ అధినేత వాల్టన్ కుటుంబం ఉంది. వారి సంపద మొత్తం 513.4 బి.డా. (సుమారు రూ.46.20 లక్షల కోట్లు). ఈ జాబితాలోని కుటుంబ కనీస సంపద విలువ 46.4 బి.డా. (సుమారు రూ.4,17,600 కోట్లు) అని, గతేడాది కంటే ఇది 9.7 బి.డా. (రూ.87,300 కోట్లు) అధికమని నివేదిక వివరించింది.

మారుతీ వ్యాగన్‌ఆర్‌లో స్వివెల్ సీటు



దిల్లీ: వృద్ధులు, దివ్యాంగులు కూడా సౌకర్యవంతంగా ప్రయాణించేలా, మారుతీ సుజుకీ వ్యాగన్‌ఆర్ కారులో స్వివెల్ సీటు అమర్చుతోంది. స్వివెల్ సీటుతో తీర్చిదిద్దిన కొత్త వ్యాగన్ ఆర్‌ను సంస్థ బుధవారం విడుదల చేసింది. 'స్వివెల్ సీటు ఉంటే, వృద్ధులు, దివ్యాంగుల రోజువారీ ప్రయాణం మరింత సౌకర్యవంతం అవుతుంది. మన దేశంలో అత్యధికంగా అమ్ముడవుతున్న 10 మోడళ్లలో వ్యాగన్ ఆర్ ఒకటి. అందుకే ఈ సదుపాయాన్ని తెచ్చామ'ని మారుతీ ఎండీ, సీఈఓ హిసాషి టకూచీ వెల్లడించారు. స్వివెల్ సీట్ కిట్.. ఆటోమోటివ్ రీసెర్చ్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా (ఏఆర్ఏఐ) భద్రతా ప్రమాణాలకు అనుగుణంగా ఉందని కంపెనీ తెలిపింది.

మార్చి కల్లా వేదాంతా వ్యాపారాల విభజన

ఛైర్మన్ అనిల్ అగర్వాల్



దిల్లీ: వచ్చే ఏడాది మార్చి కల్లా వేదాంతా వ్యాపారాల విభజన పూర్తవుతుందని కంపెనీ ఛైర్మన్ అనిల్ అగర్వాల్ వెల్లడించారు. అల్యూమినియం, చమురు-గ్యాస్, విద్యుత్, ఇనుము, ఉక్కు వ్యాపారాలను కంపెనీ 5 స్వతంత్ర నమోదిత సంస్థలుగా తీర్చిదిద్దుతున్నామని.. ఇవి 'అయిదు వేదాంతాలు' అవుతాయని అగర్వాల్ ఆశాభావం వ్యక్తం చేశారు. వచ్చే 3-4 నెలల్లో విభజన ప్రక్రియ పూర్తవుతుందని, 2026 మార్చి తమ లక్ష్యమని స్పష్టం చేశారు. నగదు నిల్వల ఆధారంగా, విభజించిన సంస్థలకు రూ.48,000 కోట్ల రుణాలను కేటాయించినట్లు అనిల్ అగర్వాల్ తెలిపారు. విభజన తర్వాత కూడా మూలధన వ్యయాలు, క్రమం తప్పకుండా డివిడెండ్ చెల్లింపులు కొనసాగుతాయని వెల్లడించారు.

విభజనానంతరం ఇలా: వేదాంతా వ్యాపారాల విభజన ప్రతిపాదనకు నేషనల్ కంపెనీ లా ట్రైబ్యునల్ (ఎన్‌సీఎల్‌టీ) మంగళవారం ఆమోదం తెలిపిన విషయం తెలిసిందే. ఈ విభజన తర్వాత ప్రాథమిక లోహాల వ్యాపారం వేదాంతా లిమిటెడ్‌తోనే ఉండనుంది. మరో 4 సంస్థలు వేదాంతా అల్యూమినియం, తల్వాండీ సాబో పవర్, వేదాంతా స్టీల్ అండ్ ఐరన్, మల్కో ఎనర్జీ ఏర్పాటు కానున్నాయి. వేదాంతా షేరు కలిగిన ప్రతి వాటాదారుకు, విభజించిన కంపెనీల నుంచి ఒక్కో షేరు లభిస్తుంది.

రూ.8,000 పెరిగిన వెండి

ఈనాడు వాణిజ్య విభాగం: బంగారం ధర స్థిరంగా ఉన్నా, వెండి ధర మాత్రం ఆకాశమే హద్దుగా పెరుగుతోంది. హైదరాబాద్ బులియన్ విపణిలో బుధవారం రాత్రి 11 గంటలకు కిలో వెండి ధర రూ.8,000కి పైగా పెరిగి రూ.2,08,400కి చేరింది. అంతర్జాతీయ విపణిలో ఔన్సు (31.10 గ్రాముల) వెండి ధర 3 డాలర్లకు పైగా పెరిగి 66.70 డాలర్లకు చేరడం వల్లే, దేశీయంగా ధర ఇంతలా దూసుకెళ్లింది.

కోడి గుడ్లు

18న ఫారం వద్ద రైతు అమ్మకం ధరలు (నెక్) (100కు రూపాయలలో)

హైదరాబాద్	671
వరంగల్	673
విజయవాడ	700
తూ/ప గోదావరి	675
విశాఖపట్నం	675
చిత్తూరు	688

గురుగ్రామ్‌లో టెస్లా ఛార్జింగ్ స్టేషన్

దిల్లీ: దేశీయంగా తమ కార్లు విక్రయిస్తున్న అమెరికా విద్యుత్ వాహన దిగ్గజం టెస్లా, గురుగ్రామ్‌లోని డీఎల్ఎఫ్ హారిజన్ సెంటర్‌లో తొలి సూపర్ ఛార్జింగ్ స్టేషన్‌ను బుధవారం ప్రారంభించింది. 250 కిలోవాట్ గరిష్ఠ ఛార్జింగ్ వేగంతో వి4 సూపర్‌ఛార్జర్లను సర్ఫేస్ పార్కింగ్ ప్రాంతంలో ఏర్పాటు చేసింది. 11 కిలోవాట్ ఛార్జింగ్ వేగంతో 3 డెస్టినేషన్ ఛార్జర్లను కూడా ఏర్పాటు చేసింది. సూపర్ ఛార్జర్లతో, టెస్లా మోడల్ వై కారును 15 నిమిషాలు ఛార్జ్ చేస్తే 275 కి.మీ. ప్రయాణించొచ్చని కంపెనీ తెలిపింది. వినియోగదార్లకు ఆటంకాలు లేని స్థిరమైన మొబిలిటీ పరిష్కారాలు అందిస్తామని కంపెనీ తెలిపింది. 'భవిష్యత్తులో విద్యుత్తు వాహనాల వినియోగం వేగవంతం అవ్వడానికి ఛార్జింగ్ మౌలిక వసతులు చాలా ముఖ్యమ'ని టెస్లా ఇండియా జనరల్ మేనేజర్ శరద్ అగర్వాల్ వెల్లడించారు. తాజా కేంద్రంతో కలిపి, దేశంలో మూడు ఛార్జింగ్ స్టేషన్లను టెస్లా నిర్వహిస్తోంది. మొత్తం 12 సూపర్‌ఛార్జర్లు, 10 డెస్టినేషన్ ఛార్జర్లు వీటిల్లో ఉన్నాయి.

విదేశీ ప్రయాణికుల చేరవేతలో ఎయిరిండియాను మించిన ఇండిగో



జులై-సెప్టెంబరులో 41.4 లక్షల మంది ప్రయాణం

మన దేశం నుంచి విదేశాలకు వెళ్లి, వచ్చే అంతర్జాతీయ ప్రయాణికుల రద్దీ విషయంలో ఎయిరిండియా గ్రూప్‌ను ఇండిగో అధిగమించింది. 2025 జులై-సెప్టెంబరులో ఇండిగో 41.4 లక్షల మంది ప్రయాణికులను గమ్యస్థానాలకు చేరవేసింది. ఎయిరిండియా గ్రూప్ మొత్తంగా 41 లక్షల మందితో రెండో స్థానంలో నిలిచింది. ఇందులో ఎయిరిండియా 23.8 లక్షలు, ఎయిరిండియా ఎక్స్‌ప్రెస్ 17.2 లక్షల మంది చొప్పున అంతర్జాతీయ ప్రయాణికులకు సేవలందించింది. ఈ అంశంలో, ఆరేళ్లలోనే తొలిసారిగా ఎయిరిండియాను ఇండిగో అధిగమించినట్లు ఒక ఆంగ్ల వార్తా సంస్థ తెలిపింది.

అహ్మదాబాద్ ఘటనతో: అహ్మదాబాద్‌లో బోయింగ్ 787 విమాన దుర్ఘటన అనంతరం, ఎయిరిండియా వాటా తగ్గింది. జూన్‌లో జరిగిన ఆ ఘటన తర్వాత అంతర్జాతీయంగా పెద్ద విమానాల కార్యకలాపాలను ఎయిరిండియా 15% తగ్గించింది. మిగతా విమానాలనూ సామర్థ్యం కంటే తక్కువగానే నడపుతున్నారు. బోయింగ్, ఎయిర్‌బస్ కొత్త విమానాల డెలివరీ ఆలస్యం అవుతుండడంతో సవాళ్లు ఎదురవుతున్నాయి. అంతర్జాతీయ ప్రయాణికుల రద్దీ విషయంలో స్పైస్‌జెట్ (3.1 లక్షలు), ఆకాశ ఎయిర్(2.1 లక్షలు) నామమాత్రంగా పోటీలో ఉన్నాయి.

అగ్రస్థానం కొనసాగుతుందా?: శీతాకాల షెడ్యూల్ (అక్టోబరు-మార్చి)లోనూ ఎయిరిండియా గ్రూప్‌తో పోలిస్తే విమానాలు, సీట్ల విషయంలో ఇండిగో ముందు ఉందని సమాచారం. అయితే ఇండిగో విమానాలు, సీట్ల సంఖ్యను పౌర విమానయాన శాఖ సవరించొచ్చు. ఇప్పటికే షెడ్యూల్‌ను 10% తగ్గించమని ఆదేశాలు జారీ అయిన సంగతి తెలిసిందే.

ఉత్తమ దేశీయ విమానయాన సంస్థగా ఎయిరిండియా

ఉత్తమ దేశీయ విమానయాన సంస్థగా ఎయిరిండియా నిలిచింది. ట్రావెల్+ లీజర్ ఇండియా అండ్ సౌత్ ఏషియాస్ బెస్ట్ అవార్డ్స్ 2025లో ఎయిరిండియా ఈ పురస్కారాన్ని దక్కించుకుంది. వరుసగా రెండో ఏడాదీ సంస్థ ఈ ఘనత సాధించడం విశేషం. ప్రయాణికుల అభిప్రాయాల ఆధారంగా ఈ పురస్కారాన్ని ఇచ్చారు. ప్రయాణాల్లో సౌకర్యం, సేవా నాణ్యత, స్థిరత్వం కోసం భారత ప్రయాణికులు చూస్తున్న సమయంలోనే ఈ పురస్కారం లభించినట్లు ఎయిరిండియా తెలిపింది. ప్రయాణికులు తమపై ఉంచిన నమ్మకానికి ఈ పురస్కారం నిదర్శనమని వెల్లడించింది. విమానాశ్రయాలు, ఆన్‌బోర్డ్ విమానాల్లో రోజువారీ సేవలను అందించడంలో కీలక పాత్ర పోషిస్తున్న ఫ్రంట్‌లైన్ సిబ్బంది కృషికి గుర్తింపు లభించినట్లు పేర్కొంది. ప్రయాణ అనుభూతిని మెరుగుపరచడంపై ఎయిరిండియా పెట్టిన దృష్టికి ఇది నిదర్శనమని కంపెనీ చీఫ్ కస్టమర్ ఎక్స్‌పీరియెన్స్ అధికారి రాజేశ్ దోగ్రా తెలిపారు.

ఇన్‌సైడర్ ట్రేడింగ్ నిబంధనలు ఉల్లంఘించిన ప్రణవ్ అదానీ

ఎన్‌డీటీవీ కొనుగోలుపై సెబీ ఆరోపణ



దిల్లీ: ఎన్‌డీటీవీ కొనుగోలు కోసం అదానీ గ్రూపు ప్రకటించిన ఓపెన్ ఆఫర్‌పై, ధరకు సంబంధించి అంతర్గత సమాచారాన్ని తన సమీప బంధువులతో ప్రణవ్ అదానీ పంచుకున్నారని, తద్వారా ఇన్‌సైడర్ ట్రేడింగ్ నిబంధనలను ఉల్లంఘించారని సెబీ ఆరోపించింది. ఈ వ్యవహారంలో ప్రణవ్ అదానీ, ఆయన బంధువులు కునాల్, నృపుల్ షా, ధన్‌పాల్ షా లకు 2025 అక్టోబరు 15న షోకాజ్ నోటీసులను సెబీ జారీ చేసిందని ఓ ఆంగ్ల వెబ్‌సైట్ తెలిపింది. ఈ పరిణామాలపై సెబీ, అదానీ గ్రూపు, నృపుల్, కునాల్, ధన్‌పాల్‌ను సంప్రదించగా.. ఎలాంటి సమాధానం రాలేదని ఆ వార్తా కథనం తెలిపింది. గౌతమ్ అదానీకి సమీప బంధువైన ప్రణవ్ అదానీ.. అదానీ గ్రూపులోని పలు కంపెనీల బోర్డులో డైరెక్టరుగా కూడా ఉన్నారు.

సంక్షిప్తంగా

✦ ఇండియన్ ఓవర్‌సీస్ బ్యాంక్ (ఐఓబీ)లో వాటా విక్రయానికి ప్రభుత్వం ఆఫర్ ఫర్ సేల్ (ఓఎఫ్ఎస్) ప్రక్రియను బుధవారం ప్రారంభించింది. 2% వాటాకు సమానమైన 38.51 కోట్ల షేర్లు విక్రయించాలని ప్రభుత్వం ప్రతిపాదించింది. నాన్- రిటెయిల్ మదుపర్లు బిడ్లు దాఖలు చేశారు. వీరి నుంచి అధిక స్పందన రావడంతో, ఆప్షన్‌గా పెట్టుకున్న మరో 1% వాటాకు సమానమైన 19.25 కోట్ల షేర్లను కూడా విక్రయించనున్నట్లు ఎక్స్ఛేంజీలకు ఐఓబీ తెలిపింది. అంటే మొత్తంగా ఐఓబీలో 3% వాటాను ప్రభుత్వం విక్రయించనుందన్న మాట. షేర్ల జారీ కనీస ధరను రూ.34గా నిర్ణయించారు. ఈ ధర వద్ద 3% వాటా విక్రయం ద్వారా, ప్రభుత్వానికి సుమారు రూ.1960 కోట్లు సమకూరే అవకాశం ఉంది.

✦ భూటాన్‌లో డిజిటల్ సేవలు, సొల్యూషన్లకు పెరుగుతున్న గిరాకీకి తగ్గట్లుగా సేవలు అందించే నిమిత్తం ఆ దేశంలో ఒక అనుబంధ సంస్థను **టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ ఆసియా పసిఫిక్** ఏర్పాటు చేసింది.

✦ అవెండస్ కేపిటల్‌లో 60% వాటాను అమెరికాకు చెందిన పెట్టుబడుల సంస్థ కేకేఆర్ నుంచి కొనుగోలు చేయనున్నట్లు జపాన్‌కు చెందిన పెట్టుబడుల బ్యాంకు **మిజ్హో సెక్యూరిటీస్** వెల్లడించింది.

✦ కేఎస్‌హెచ్ ఇంటర్నేషనల్ ఐపీఓ రెండో రోజుకు 26% స్పందన లభించింది. చిన్న మదుపర్ల విభాగంలోనూ 46% షేర్లకే దరఖాస్తులు వచ్చాయి.

✦ సింగపూర్ కేంద్రంగా కార్యకలాపాలు నిర్వహిస్తున్న 8 ఫ్లిప్‌కార్ట్ కంపెనీలను **ఫ్లిప్‌కార్ట్ ఇంటర్నెట్ ప్రైవేట్ లిమిటెడ్‌**లో విలీనం చేసేందుకు నేషనల్ కంపెనీ లా ట్రైబ్యునల్ ఆమోదం తెలిపింది. ఐపీఓకు వెళ్లేందుకు ఫ్లిప్‌కార్ట్‌కు ఈ పరిణామం ఉపయోగపడనుంది.

✦ భారత ఆర్థిక వ్యవస్థ **వృద్ధి రేటు** ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో 7.5 శాతంగా నమోదయ్యే అవకాశం ఉందని కేరిడ్జ్ రేటింగ్స్ తెలిపింది. వచ్చే ఆర్థిక సంవత్సరంలో వృద్ధి 7 శాతానికి తగ్గొచ్చని పేర్కొంది.

మూడో రోజూ డీలానే

సెన్సెక్స్ ▼120 84560


నిఫ్టీ ▼42 25819

ఎఫ్ఐఐ కొనుగోళ్లు.. రూ.1171.71 కోట్లు
డీఐఐ కొనుగోళ్లు.. రూ.768.94 కోట్లు

వరుసగా మూడో రోజూ మన స్టాక్ మార్కెట్ నష్టాల్లో ముగిసింది. వర్ధమాన దేశాల మార్కెట్ల నుంచి విదేశీ సంస్థాగత మదుపర్లు (ఎఫ్ఐఐ) పెట్టుబడులను ఉపసంహరిస్తుండటంతో, దేశీయ మదుపర్లూ అప్రమత్తతతో వ్యవహరించడం ఇందుకు కారణమైంది. డాలరుతో పోలిస్తే రూపాయి మారకపు విలువ 55 పైసలు పుంజుకుని 90.38 వద్ద ముగిసింది. బ్రెంట్ ముడి చమురు 1.7% నష్టంతో 59.93 డాలర్ల వద్ద ట్రేడవుతోంది. ఆసియా మార్కెట్లలో సింగపూర్, తైవాన్ మినహా మిగతావన్నీ లాభాల్లో ముగిశాయి. ఐరోపా మార్కెట్లు సానుకూల ధోరణిలోనే ఆరంభమయ్యాయి.

✦ బీఎస్ఈలోని నమోదిత కంపెనీల మార్కెట్ విలువ రూ.1.47 లక్షల కోట్లు తగ్గి రూ.466.18 లక్షల కోట్ల (5.16 లక్షల కోట్ల డాలర్ల)కు పరిమితమైంది.

సానుకూలంగా మొదలై..: బీఎస్ఈ సెన్సెక్స్ (క్రితం ముగింపు 84,679.86) ఉదయం స్వల్ప లాభాలతో 84,856.26 పాయింట్ల వద్ద ఆరంభమైంది. వెంటనే నష్టాల్లోకి జారుకుని, 84,415.98 పాయింట్ల వద్ద ఇంట్రాడే కనిష్ఠాన్ని నమోదు చేసింది. చివరకు 120.21 పాయింట్ల నష్టంతో 84,559.65 పాయింట్ల వద్ద ముగిసింది. ఎన్ఎస్ఈ నిఫ్టీ 41.55 పాయింట్లు కోల్పోయి 25,818.55 పాయింట్ల వద్ద స్థిరపడింది. ఇంట్రాడేలో 25,770.35 పాయింట్ల వద్ద కనిష్ఠాన్ని, 25,929.15 పాయింట్ల వద్ద గరిష్ఠాన్ని ఈ సూచీ నమోదుచేసింది.



లాభాల్లోనే ఎక్కువ కంపెనీలు

సెన్సెక్స్ 30 కంపెనీల షేర్లలో 12 మినహా మిగతావి లాభాల్లోనే ముగిశాయి. ఎస్‌బీఐ 1.51%, సన్‌ఫార్మా 0.69%, ఇన్ఫోసిస్ 0.69%, టీసీఎస్ 0.41%, యాక్సిస్ బ్యాంక్ 0.41%, భారతీ ఎయిర్‌టెల్ 0.33%, టాటా స్టీల్ 0.29%, మారుతీ సుజుకీ 0.27% లాభపడ్డాయి. ట్రెంట్ 1.61%, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ 0.99%, ఐసీఐసీఐ బ్యాంక్ 0.96%, అదానీ పోర్ట్స్ 0.89%, బజాజ్ ఫిన్‌సర్వ్ 0.69%, భెల్ 0.64% నష్టపోయాయి. బీఎస్ఈ రంగాల సూచీల్లో భారీ యంత్రపరికరాలు, స్థిరాస్తి, మన్నికైన వినియోగ వస్తువులు, ఇండస్ట్రియల్స్, సేవలు డీలాపడ్డాయి. ఇంధనం, ఐటీ, లోహాలు, చమురు-గ్యాస్, సాంకేతికత రంగాల సూచీలు రాణించాయి. బీఎస్ఈలో 2,694 కంపెనీల షేర్లు ప్రతికూల ధోరణిలో, 1475 కంపెనీల షేర్లు లాభాల్లో ముగిశాయి. 159 కంపెనీల షేర్ల ధరల్లో ఎటువంటి మార్పులేదు.

నెఫ్రోకేర్ కళకళ.. పార్క్ మెడి వరల్డ్ డీలా

✦ డయాలసిస్ సేవల సంస్థ **నెఫ్రోకేర్ హెల్త్ సర్వీసెస్** షేర్లు స్టాక్ మార్కెట్లో నమోదైన రోజే మదుపర్లకు లాభాలు పంచాయి. ఇష్యూ ధర రూ.460తో పోలిస్తే, బుధవారం బీఎస్ఈలో 6.89% ఎక్కువగా రూ.491.70 వద్ద ఈ కంపెనీ షేరు ట్రేడింగ్ ఆరంభమైంది. చివరకు 2.52% లాభంతో రూ.471.60 వద్ద ముగిసింది. తొలి రోజు కంపెనీ మార్కెట్ విలువ రూ.4,732.07 కోట్లుగా నమోదైంది.

✦ పార్క్ బ్రాండుపై ఆసుపత్రులను నిర్వహిస్తున్న **పార్క్ మెడి వరల్డ్** షేర్లు తొలిరోజు నిరాశపరిచాయి. ఇష్యూ ధర రూ.162తో పోలిస్తే, బీఎస్ఈలో 3.95% తక్కువగా రూ.155.60 వద్ద ఈ షేరు నమోదైంది. ఆ తర్వాత 9.35% నష్టపోయి రూ.146.85కు దిగివచ్చింది. చివరకు 8.54% నష్టంతో రూ.148.15 వద్ద ముగిసింది. తొలి రోజుకంపెనీ మార్కెట్ విలువ రూ.6,399.06 కోట్లుగా నమోదైంది.


ఇక గ్రామ/వార్డు సచివాలయాల పేరు స్వర్ణ గ్రామం

ఉద్యోగులు అటెండెన్స్ నమోదు చేయకపోవడంపై సీఎం సీరియస్

ఈనాడు, అమరావతి: గ్రామ/వార్డు సచివాలయాల పేరును 'స్వర్ణ గ్రామం'గా మారుస్తున్నట్లు ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించారు. నేడో రేపో అధికారికంగా కొత్త పేరును ప్రకటిస్తామని కలెక్టర్ల సమావేశంలో చెప్పారు. ప్రజలు వచ్చినప్పుడు గ్రామ/వార్డు సచివాలయాల్లో సిబ్బంది సరిగా అందుబాటులో ఉండడం లేదని పెద్ద ఎత్తున ఫీడ్ బ్యాక్ వచ్చిందని ఆ శాఖ కార్యదర్శి కాటమనేని భాస్కర్ ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువచ్చారు. హాజరుశాతం ఎంత ఉందని సీఎం ప్రశ్నించగా.. నిత్యం సగటున రిజిస్టర్‌లో 74 శాతం అటెండన్స్ నమోదు చేస్తున్నారని మిగతావారు చేయడం లేదని భాస్కర్ తెలిపారు. దీనిపై సీఎం ఆగ్రహం వ్యక్తం చేస్తూ. .'ఎవరెవరు ఇలా అలవాటుగా విధులకు రాకుండాపోతున్నారో అలాంటి వారి వివరాలను తీయండి. ఎవరూ తేలిగ్గా తీసుకునేందుకు వీల్లేదు. అటెండెన్స్ నమోదు చేయడం వాళ్ల డ్యూటీ. ప్రతి ఒక్కరి హాజరూ రికార్డవ్వాలి. ఆ విషయం వాళ్లకు చెప్పండి. అప్పటికీ మారకపోతే క్రమశిక్షణ చర్యలు తప్పవు. తమాషాగా ఉందా? ఏదో అత్యవసరం ఉంటే ఒక రోజు రాలేదంటే సరే, అంతే తప్ప అసలే రాకపోతే కుదరదు' అని సీఎం స్పష్టం చేశారు. రీసర్వే జరుగుతున్నందున గ్రామ సర్వేయర్లు ఫీల్డ్‌కు వెళుతున్నారని ఒక కలెక్టర్ చెప్పగా..అలాంటి వారు ఫీల్డ్‌లో ఉన్నారని సంబంధిత అధికారులు నిర్ధారిస్తే సరిపోతుందని సీఎం అన్నారు.

30వేల మంది ఉద్యోగులు ఆ ప్రచారంలో పాల్గొనలేదు

'వాట్సప్ గవర్నెన్స్‌పై ప్రజలకు అవగాహన కల్పించేందుకు ఇంటింటి ప్రచార కార్యక్రమం నిర్వహిస్తున్నాం. ఇందులో గ్రామ సచివాలయాల్లో పనిచేస్తున్న ఎనర్జీ, పంచాయతీ, రెవెన్యూ సహాయకులు 30 వేల మంది ఎప్పుడూ పాల్గొన లేదు' అని కాటమనేని భాస్కర్ తెలిపారు.



కలెక్టర్ల సదస్సులో మాట్లాడుతున్న సీఎం చంద్రబాబు

తిరుపతిలో ఇమాజికా వరల్డ్

ఈనాడు, అమరావతి: పర్యాటకం రాష్ట్ర మొదటి ప్రాధాన్య రంగమని ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించారు. దాని తర్వాత ఐటీకి ప్రాధాన్యమన్నారు. 'మొదట బస చేయడానికి, తర్వాత పని చేయడానికి.. హోటళ్లకు ప్రాధాన్యం ఇవ్వడం పెద్ద గేమ్ ఛేంజర్' అని సీఎం అన్నారు. కలెక్టర్ల సదస్సులో రాష్ట్ర పర్యాటకశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజయ్ జైన్ కీలక సమస్య లేవనెత్తారు. భూమి గుర్తించి పారిశ్రామికవేత్తలకు తెలియజేసిన తర్వాత, అదే భూమి ఇతర శాఖలకు కేటాయించిన సందర్భాలున్నాయని చెప్పారు. పర్యాటక ప్రాజెక్టు సామర్థ్యం ఆధారంగా పర్యాటకశాఖకు ప్రాధాన్యమివ్వాలని అజయ్‌జైన్ కోరారు. 'దేశంలో ప్రముఖ వినోద కేంద్రాలైన వండర్‌లా ఎమ్యూజ్‌మెంట్ పార్కు విశాఖలో, ఇమాజికా వరల్డ్ తిరుపతిలో ఏర్పాటు కానున్నాయి. వండర్‌లాకు విశాఖలో 50 ఎకరాలు, ఇమాజికా వరల్డ్‌కు తిరుపతిలో 20 ఎకరాలు కావాలి. ఈ రెండు ప్రాజెక్టులతో పెద్ద సంఖ్యలో ఉద్యోగ అవకాశాలు లభిస్తాయి.

పర్యాటకంలో రూ.28,977 కోట్ల పెట్టుబడులు

విశాఖలో నిర్వహించిన భాగస్వామ్య సదస్సులో పర్యాటకశాఖకు 26 జిల్లాల్లో రూ.28,977 కోట్ల విలువైన 209 అవగాహన ఒప్పందాలు కుదిరాయి. రూ.11,092 కోట్ల విలువైన 66 ప్రతిపాదనలతో విశాఖ ముందు వరుసలో ఉంది. రూ.5,321 కోట్ల విలువైన 27 ప్రతిపాదనలతో తిరుపతి రెండో స్థానంలో ఉంది. గుంటూరులో (అమరావతితో కలిపి) రూ.3,960 కోట్ల విలువైన 17 ప్రతిపాదనలు వచ్చాయి. ఈ ప్రాజెక్టులతో రాష్ట్రవ్యాప్తంగా 4,597 హోటల్ గదులు అందుబాటులోకి రానున్నాయి. 10,645 మందికి ప్రత్యక్షంగా, మరో 18,030 మందికి పరోక్షంగా ఉద్యోగ అవకాశాలు లభించనున్నాయి. అమరావతిలో (గుంటూరుతో కలిపి) రూ.884.59 కోట్లతో 891 గదులతో 6 హోటళ్ల నిర్మాణం కానున్నాయి. ప్రత్యక్షంగా 1,675 మందికి ఉద్యోగాలు వస్తాయి' అని అజయ్‌జైన్ వివరించారు.



కలెక్టర్ల సదస్సులో మాట్లాడుతున్న సీఎం చంద్రబాబు. చిత్రంలో ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, మంత్రులు డోలా శ్రీబాల వీరాంజనేయస్వామి, ఆనం రామనారాయణరెడ్డి, నిమ్మల రామానాయుడు, వంగలపూడి అనిత, నాదెండ్ల మనోహర్, అచ్చెన్నాయుడు, లోకేశ్, అనగాని సత్యప్రసాద్, ఎన్ఎండీ ఫరూక్, కొల్లు రవీంద్ర, నారాయణ, పయ్యావుల కేశవ్, గొట్టిపాటి రవికుమార్, సీఎస్ విజయానంద్, డీజీపీ హరీష్ కుమార్ గుప్తా

వృద్ధి ఫలితాల కోసం విద్యార్థిలా ఎదురుచూస్తా

నాలాగే జిల్లాల్లో మంత్రులు, కలెక్టర్లు సమీక్షించాలి

- ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశం
- ఉద్యాన హబ్, పూర్వోదయ కింద కేంద్రం నుంచి నిధులు తేబోతున్నట్లు వెల్లడి

ఈనాడు, అమరావతి: "ఒక విద్యార్థి పరీక్ష ఫలితాల కోసం ఎలా ఎదురుచూస్తాడో నేను ప్రతి 3 నెలలకోసారి వృద్ధి ఎలా ఉందో, జీఎస్‌డీపీ ఎంతుందో అన్న ఫలితాల కోసం అలా ఎదురుచూస్తాను. ఒక్క మన రాష్ట్రమే మూడు నెలలకోసారి ఇలా వృద్ధి లెక్కలు వెలువరిస్తోంది. దేశంలో ఇతర రాష్ట్రాలు ఏడాదికి ఒకసారి మాత్రమే ఈ ఫలితాలు ప్రకటిస్తున్నాయి. వృద్ధి సాధించాలంటే ప్రణాళిక, మోటివేషన్ ముఖ్యం. రాష్ట్ర స్థాయిలో ఎలా చేస్తున్నానో, జిల్లా స్థాయిలో మంత్రులు, కలెక్టర్లు అలా సమీక్షించాలి. మండలాలు జీఎస్‌డీపీలో ఎక్కడ ఉన్నాయో, ఎక్కడెక్కడ ఎలా మెరుగుపరచాలో పరిశీలించి ఫలితాలు సాధించాలి" అని ముఖ్యమంత్రి చంద్రబాబు పేర్కొన్నారు. రాష్ట్ర స్థూల ఉత్పత్తి (జీఎస్‌డీపీ) తొలి అర్ధ సంవత్సర ఫలితాలపై జిల్లా కలెక్టర్ల సదస్సులో బుధవారం చర్చించారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడారు. 2024-25లో జీఎస్‌డీపీలో దేశంలోనే రెండో స్థానంలో నిలిచామని, ఈ ఏడాది లక్ష్యం సాధించాలంటే రెండో అర్ధ సంవత్సరంలో ఇంకా 51% లక్ష్యం సాధించాల్సి ఉందన్నారు. వ్యవసాయ, ఉద్యాన రంగాల్లో రెండో అర్ధ సంవత్సరమే కీలకమని ముఖ్యమంత్రి చెప్పారు. పరిశ్రమలు, సేవారంగంలో ఇంతకుముందు కన్నా మెరుగయ్యామని చెబుతూ విశాఖ పెట్టుబడుల సదస్సు తర్వాత మంచి పురోగతి కనిపించిందన్నారు. చంద్రబాబు ఇంకా ఏం చెప్పారంటే..

■ ఉద్యాన హబ్, పూర్వోదయ కింద ఉద్యాన పంటలు సాగు చేసేలా, అవసరమైన మౌలిక సౌకర్యాలు కల్పించేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నాం. కేంద్రం ఇందుకు సహకరించేందుకు సిద్ధంగా ఉంది. రూ.40 వేల కోట్లతో ప్రణాళికలు సిద్ధమవుతున్నాయి. మరో వైపు శీతల గిడ్డంగులు, రవాణా తదితర మౌలిక సౌకర్యాల కల్పనకు ప్రయివేటు రంగం నుంచి రూ.60 వేల కోట్ల వరకు పెట్టుబడులు తీసుకురావాల్సి ఉంటుంది. అప్పుడు ఫలితాలు వస్తాయి.

■ జిల్లాలు ఏ రంగంలో ఎక్కడ ఉన్నాయో మీకు స్పష్టత ఇచ్చాం. కలెక్టర్లు మిమ్మల్ని మీరు సమర్థించుకోవడానికి ప్రయత్నించొద్దు. ఎలా అభివృద్ధి చేయాలో ఆలోచించండి. ప్రస్తుత పరిస్థితిని సమర్థించుకోవడానికి ప్రయత్నిస్తే ఉపయోగం లేదు. రాష్ట్ర స్థూల ఉత్పత్తి అంటే అందరికీ స్పష్టత ఉండాలి. ఆ ఉత్పత్తి పెరిగితే తలసరి ఆదాయం పెరుగుతుంది. దాన్ని బట్టి కొనుగోలు శక్తి పెరుగుతుంది. మంచి జీవన ప్రమాణాలు ఏర్పడతాయి.

■ ప్రస్తుతం పరిశ్రమల్లో కిందటి ఏడాది కన్నా 5% అధికంగా వృద్ధి సాధించాం. సేవల రంగంలోను జాతీయ సగటు కన్నా ఎక్కువగా ఉన్నాం. టూరిజం క్యాలండర్ ప్రకారం కార్యక్రమాలు నిర్వహించాలి.

■ తొలి అర్ధ సంవత్సరంలో పశుసంవర్థకం నుంచి మంచి విలువ జోడించాం. జిల్లాల్లో కూడా ఇలా రంగాల వారీగా ఎంత ఉత్పత్తి విలువ సాధించామో పేర్కొనాలి.

సదస్సులో రికార్డు కావాలని మాట్లాడొద్దు..

జిల్లా కలెక్టర్ల సదస్సులో మాట్లాడామని రికార్డు కావాలనే ఉద్దేశంతో ఇప్పుడు మాట్లాడితే ఉపయోగం లేదు. మీరు విభాగాధిపతులు, కార్యదర్శులతో ఎప్పటికప్పుడు మాట్లాడి సమస్యలు పరిష్కరించుకోవాలి. ఏ విషయం ఉన్నా వారిని వెంటాడి ఫలితాలు సాధించాలి. ఇక్కడ అదనంగా సాధించే అంశాలపై దృష్టి సారించాలి.

▼ గతంలో తలసరి ఆదాయం, వృద్ధిలో తెలంగాణతో పోటీపడేవాళ్లం. 5 ఏళ్ల 'వారి' పాలన ప్రభావం దెబ్బతీసింది. దక్షిణ భారత దేశంలోనే ఏపీ అట్టడుగుకు చేరింది. మళ్లీ కిందటి ఏడాది సన్నద్ధమయ్యాం. 2024 తర్వాత స్థూల ఉత్పత్తి కొంత మెరుగుపడింది. వ్యవసాయరంగంపై బాగా దృష్టి పెట్టాలి.

▼ రబీ, ఖరీఫ్, రబీ ప్రణాళిక అమలు చేయాలి. మూడు సీజన్లకు స్వల్పకాలిక ప్రణాళిక, అయిదేళ్లకు మధ్యకాలిక ప్రణాళిక, 15-20 ఏళ్లకు దీర్ఘకాలిక ప్రణాళిక ఉండాలి.

▼ ఈ రబీ వచ్చే ఖరీఫ్, రబీ ప్రణాళికలు సిద్ధమైతే ఒకసారి సమీక్షిద్దాం.

▼ అరటి ఉత్పత్తి పెంచాం. దానికి సంబంధించి అన్ని రకాలుగా సిద్ధంగా లేకపోవడం వల్ల కొన్ని సమస్యలు ఎదుర్కొన్నాం. మార్కెట్ ఇంటెలిజెన్సీని బలోపేతం చేసుకోవాలి. ఇందుకు మూడు కన్సల్టెన్సీలను నియమించాం.

▼ సూర్యలంక బీచ్ హైదరాబాద్‌కు గేట్ వే. అక్కడ బీచ్‌లు లేవు. సరిగ్గా ప్రణాళికలు రూపొందిస్తే ఎందరో పర్యాటకులు వస్తారు. ఇందుకు మాస్టర్ ప్లాన్ తయారు చేయాలి. ఏవో సామాన్యంగా ఉండే హోటళ్లు కాదు.. అంతర్జాతీయ పర్యాటకులను ఆకర్షించేలా వసతులు ఏర్పాటు చేయాలి. మాస్టర్ ప్లాన్ రూపొందించాలి. ఎంత భూమి ఉందో కలెక్టర్ చెబితే జాతీయ రహదారి నుంచి అనుసంధానమయ్యేలా రోడ్లు మనం వేసుకుందాం. పర్యాటక శాఖ క్లస్టర్ కింద దీనిపై దృష్టి సారించాలి.

గిరిజన గ్రామాల రహదారులపై ప్రత్యేక శ్రద్ధ పెట్టండి


ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్



ఈనాడు, అమరావతి: కలెక్టర్లు నిబద్ధతతో పనిచేస్తూ కూటమి ప్రభుత్వ లక్ష్యాల్ని ముందుకు తీసుకెళ్లాలని ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ సూచించారు. గిరిజన గ్రామాలకు రహదారి సౌకర్యం కల్పించేందుకు అడవితల్లి బాట పేరుతో చేపట్టిన ప్రాజెక్టులను సమర్థంగా అమలు చేస్తున్నారని బుధవారం కలెక్టర్ల సదస్సులో ఆయన అభినందించారు. వాటిపై మరింత శ్రద్ధ పెట్టాలన్నారు. పార్వతీపురం మన్యం జిల్లాలో తొమ్మిది పనులు చేపడుతుండగా, ఆ జిల్లా కలెక్టర్ అన్నింటికీ అనుమతులు సాధించారని, అల్లూరి సీతారామరాజు జిల్లా కలెక్టర్ 88 పనులకు గాను 79కి అనుమతులు పొందారని తెలిపారు. ఈ పనులపై కలెక్టర్లు ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారనడానికి ఇదే నిదర్శనమని తెలిపారు. ' 'ఉపాధి పథకం కింద పల్లె పండుగ 1.0 కార్యక్రమాల్ని గడువులోగా పూర్తి చేశారు. 4 వేల కి.మీ. సీసీ రోడ్లు, 22,514 గోకులాలు, 15,188 పశువుల నీటితొట్టెలు, 1.02 లక్షల పంట కుంటలు నిర్మించారు. 2025-26లో ఇప్పటివరకు ఉపాధి పథకంలో 41.12 లక్షల కుటుంబాలకు 15.95 కోట్ల పని దినాలు కల్పించాం. రూ.4,330.20 కోట్లు వేతనాలుగా చెల్లించారు. మెటీరియల్ కాంపోనెంట్‌పై రూ.1,056.85 కోట్లు వెచ్చించారు. ఈ అంకెలు మీ కృషికి అద్దం పడుతున్నాయి. పంచాయతీల్లో పన్నుల వసూళ్లపై దృష్టిపెట్టి ఆదాయం పెంచినందుకు అభినందనలు. జూన్‌లో ఒక యూనిట్‌తో ప్రారంభించిన స్వచ్ఛ రథాల సంఖ్యను 25కి పెంచడం గొప్ప విజయం" అని పేర్కొన్నారు. ఆర్‌జీఎస్‌ఏ కింద శిక్షణ కార్యక్రమాల్లో ఏపీ మొదటి స్థానంలో నిలవడానికి కలెక్టర్ల కృషే కారణమన్నారు.

సోమవారమే అర్జీలు తీసుకుంటామని గిరి గీసుకోవద్దు

– అనగాని సత్యప్రసాద్, రెవెన్యూ మంత్రి



"వివిధ ప్రభుత్వ శాఖలకు సంబంధించి ప్రజల నుంచి నిత్యం అనేక అర్జీలు వస్తున్నాయి. కలెక్టర్లు వాటి పరిష్కారంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలి. కేవలం సోమవారమే అర్జీలు తీసుకుంటామని గిరి గీసుకోవద్దు. రాష్ట్రంలో పరిశ్రమలు, సంస్థల ఏర్పాటుకి వివిధ సంస్థలకు భూములిచ్చాం. ఆ ప్రాజెక్టుల్ని ఆచరణలోకి తీసుకు రావడంలో మీ సహకారం కావాలి. జాయింట్ కలెక్టర్లు రెవెన్యూ సమస్యలు పరిష్కరించడానికే ఎక్కువ సమయం కేటాయించాలి. సంక్రాంతి నాటికి పాస్‌బుక్‌లు అందజేయాలి. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం 18 నెలల్లో రూ.20 లక్షల కోట్లకు పైగా పెట్టుబడులు సాధించింది. యువతకు కలల సాకారం దిశగా వేగంగా అడుగులు వేస్తోంది. రాష్ట్ర అభివృద్ధికి కంకణం కట్టుకుని ప్రభుత్వం పనిచేస్తుంటే... కొందరు పనిగట్టుకుని విషప్రచారం చేస్తున్నారు. దాన్ని తిప్పికొట్టడంలో కలెక్టర్లు కూడా చొరవ తీసుకోవాలి"

ప్రజా సమస్యల పరిష్కార వ్యవస్థను పటిష్ఠం చేయాలి

– పయ్యావుల కేశవ్, ఆర్థిక మంత్రి



"ప్రజలు ప్రభుత్వ ప్రకటనలతో సంతృప్తి చెందరు. ఫలితాలనే చూస్తారు. ప్రభుత్వం తీసుకునే ప్రతి విధాన నిర్ణయం, పాలనా సంస్కరణ క్షేత్రస్థాయికి చేరేది కలెక్టర్ల ద్వారానే. ప్రజా సమస్యల పరిష్కార వ్యవస్థను పటిష్ఠం చేయాలి. ప్రభుత్వ ప్రాధాన్య కార్యక్రమాల్ని గడువులోగా అమలు చేయాలి. వివిధ శాఖల మధ్య పరస్పర సమన్వయంతో ప్రజలకు మెరుగైన సేవలందించాలి. జవాబుదారీతనంతో కూడిన వేగవంతమైన పాలనా వ్యవస్థ ఈ ప్రభుత్వ లక్ష్యాలు. వీటిని ముందుకి తీసుకెళ్లాల్సిన బాధ్యత మీపైనే ఉంది"

అదనంగా రూ 5,000 కోట్ల కేంద్ర నిధులు తేవాలి

- జనవరి 15 కల్లా 75 శాతం ఖర్చు చేయాలి
- కేంద్రంతో మంత్రులు, అధికారులు సంప్రదింపులు జరపాలి
- సీఎం చంద్రబాబు

ఈనాడు, అమరావతి: కేంద్ర ప్రభుత్వం నుంచి ఈ ఆర్థిక సంవత్సరంలో ఇప్పటికే మంజూరైన నిధుల్లో 75 శాతం ఖర్చు చేసి అదనంగా మరో రూ.5,000 కోట్లు తెచ్చుకోవాలని ముఖ్యమంత్రి చంద్రబాబు సూచించారు. కొన్ని కేంద్ర మంత్రిత్వ శాఖలు అదనపు నిధులు ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నాయని, రాష్ట్ర మంత్రులు, ఆయా ప్రభుత్వశాఖల కార్యదర్శులు కేంద్ర అధికారులతో సమన్వయం చేసుకోవాలన్నారు. ఈ విషయంలో రాష్ట్ర ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ అన్ని శాఖలను సమన్వయపరచాలని ఆయన ఆదేశించారు. కలెక్టర్ల సదస్సు సందర్భంగా ముఖ్యమంత్రి కేంద్ర ప్రాయోజిత పథకాల అమలు తీరుపై సమీక్షించారు.

ఇంతవరకు రూ.24,513 కోట్లు మంజూరు

'కేంద్ర ప్రాయోజిత పథకాలను అమలు చేసేందుకు ఈ ఏడాది కేంద్రం రూ.15,731 కోట్లు మంజూరు చేసింది. రాష్ట్ర వాటా నిధులతో కలిపి రూ.24,513 కోట్లు. అందులో రూ.16,614 కోట్లు ఇప్పటికే అందుబాటులో ఉంటే రూ.10,362 కోట్లు మాత్రమే ఖర్చు అయ్యాయి' అని ఆర్థికశాఖ కార్యదర్శి రొనాల్డ్ రాస్ పేర్కొన్నారు. ఏ జిల్లా ఇప్పటికి ఎంత ఖర్చు చేసింది. . ఇంకా ఏ పథకాల కింద వెంటనే 75 శాతం నిధులు ఖర్చు చేయాలన్నదానిపై ఆయన ప్రజెంటేషన్ ఇచ్చారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి కలగజేసుకుని ఇంకా నిధులు ఎందుకు ఖర్చు చేయడం లేదని ప్రశ్నించారు. జనవరి 15 లోపు 75శాతం ఖర్చు చేసి మరో విడత నిధులు పొందాలన్నారు. ఆ తర్వాత మూడో విడత నిధుల్లోనూ 75 శాతం ఖర్చు చేసి అదనపు నిధులు సాధించాలని ముఖ్యమంత్రి ఆదేశించారు.

5 శాతం అదనంగా నిధులు తెచ్చుకున్నా ఎంతో మేలు

'కేంద్ర ప్రభుత్వశాఖల్లో చివరి త్రైమాసికానికి ఖర్చు చేయకుండా నిధులు ఎన్నో ఉంటాయి. మనం ప్రయత్నించి ఆ నిధుల నుంచి 5శాతం అదనంగా తెచ్చుకున్నా ఎంతో అధికంగా పొందవచ్చు' అని చంద్రబాబు సలహా ఇచ్చారు. ప్రధానమంత్రి అర్బన్ ఆవాస్ యోజన, సమగ్ర శిక్ష, రాష్ట్రీయ కృషి వికాస్ యోజనల్లో ఎందుకు సకాలంలో నిధులు ఖర్చు చేయడం లేదని ఈ సందర్భంగా చంద్రబాబు ప్రశ్నించారు.

రూ.155.26 కోట్లు జిల్లాలకే..

వివిధ బ్యాంకుల్లో ఉన్న 62,911 ప్రభుత్వ ఖాతాల్లో ఎవరూ తీసుకోని నిధులు రూ.155.26 కోట్లు ఉన్నాయని ఆర్థికశాఖ కార్యదర్శి రొనాల్డ్ రాస్ వెల్లడించారు. బ్యాంకులను సంప్రదించి ఆ నిధులను సంబంధిత జిల్లాలే వాడుకోవాలని సీఎం చంద్రబాబు వెసులుబాటు ఇచ్చారు.

మల్లెల సాగు నుంచే రూ.10,749 కోట్ల ఆదాయం

ఈనాడు, అమరావతి: వ్యవసాయ రంగంలో మల్లెపూల ద్వారానే రూ.10,749 కోట్ల ఆదాయం వస్తోందని, ఆ రంగం స్థూల విలువ జోడింపు (జీవీఏ)లో ఇది 6.06 శాతంగా ఉందని వ్యవసాయ శాఖ ఉన్నతాధికారులు తెలిపారు. కృష్ణా జిల్లాలో మల్లె పూల సాగు విస్తారంగా జరుగుతోందని, మిగిలిన జిల్లాలూ దీనిపై దృష్టి పెట్టాలని సూచించారు.

ఎసైన్డ్ భూములకూ లీజు చెల్లిస్తాం

విద్యుత్ ప్రాజెక్టులకు నెడ్‌క్యాప్ ద్వారా తీసుకుంటాం: సీఎం చంద్రబాబు

ఈనాడు–అమరావతి: విద్యుత్ ప్రాజెక్టుల ఏర్పాటుకు అవసరమైన ఎసైన్డ్ భూములను లీజు ప్రాతిపదికన తీసుకోవాలని నిర్ణయించామని ముఖ్యమంత్రి చంద్రబాబు పేర్కొన్నారు. వాటికి ఎకరానికి ఏడాదికి రూ.31 వేల చొప్పున లీజు చెల్లించనున్నట్లు తెలిపారు. కలెక్టర్ల సమావేశంలో ఇంధన శాఖపై సమీక్ష సందర్భంగా ఆయన మాట్లాడుతూ 'ఆ భూములకు లీజు చెల్లించేందుకు యాజమాన్య హక్కుల ఇబ్బందులు ఉన్నాయి. ఈ దృష్ట్యా నెడ్‌క్యాప్ ద్వారా ఒప్పందం కుదుర్చుకోవాలి. వాటిని విద్యుత్ కంపెనీలకు నెడ్‌క్యాప్ లీజుకు ఇస్తుంది. విద్యుత్ ప్రాజెక్టులను ఏర్పాటు చేసే కంపెనీలు రైతుల నుంచి లీజుకు తీసుకునే భూములకు సంబంధించి లీజు ఒప్పంద పత్రాలను తయారు చేయడంలో ఒక్కో కంపెనీ ఒక్కో నమూనాను అనుసరిస్తున్నాయి. వాటి వల్ల రైతులకు ఇబ్బంది ఉంటుందనే సందేహాలున్నాయి. అందువల్ల ఒకే నమూనాలో లీజు ఒప్పందం ఉండేలా చర్యలు తీసుకుంటున్నాం' అని చంద్రబాబు పేర్కొన్నారు.



సదస్సుకు హాజరైన వివిధ శాఖల ఉన్నతాధికారులు, కలెక్టర్లు

కోతులు.. కుక్కలతో అవస్థలెన్నో!

- కోతులతో అనకాపల్లి జిల్లాలో పంటలు నాశనం
- ఎన్టీఆర్ జిల్లాలో ఇళ్లలోకి చొరబడి జనంపై దాడులు
- చందర్లపాడు మండలంలో అటవీ ఆవుల బెడద
- ఆయా సమస్యలపై కలెక్టర్ల సమావేశంలో ఆసక్తికర చర్చ

ఈనాడు, అమరావతి: పొలాల్లో ప్రవేశించి పంటలను నాశనం చేయడమే కాదు.. పట్టణాల్లోని ఇళ్లలోకి చొరబడి జనాలను ఇబ్బంది పెడుతున్న కోతుల వ్యవహారంపై బుధవారం నిర్వహించిన కలెక్టర్ల సమావేశంలో ఆసక్తికర చర్చ జరిగింది. కుక్కల బెడదపైనా సమీక్షించారు. అనకాపల్లి జిల్లా పరిధిలోని 12 మండలాల్లో కోతుల బెడద తీవ్రంగా ఉందని ఆ జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్ సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకువచ్చారు. రాజమహేంద్రవరం తదితర ప్రాంతాల నుంచి కోతులు పట్టుకునే వారిని రప్పించి, వాటిని పట్టిస్తున్నామని తెలిపారు. కానీ, వాటిని ఎక్కడ వదిలిపెట్టాలనేదీ పెద్ద సమస్యగా మారిందని చెప్పారు. పక్కనున్న అల్లూరి సీతారామరాజు జిల్లాలో వాటిని వదిలిపెట్టబోతే.. అక్కడి వారు అభ్యంతరం చెబుతున్నారని తెలిపారు. ఎన్టీఆర్ జిల్లాలోనూ కోతుల బెడద ఉందని ఆ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ ప్రస్తావించారు. ప్రధానంగా గ్రామాల్లో ఉద్యాన పంటలను దెబ్బతీస్తున్నాయని, విజయవాడ నగరంలోని ఇళ్లలోకి కూడా చొరబడి జనాలపై దాడులు చేస్తున్నాయని తెలిపారు. 'వాటిని పట్టుకొనే వారు ఒక్కో కోతికి రూ.700 అడుగుతున్నారు. బేరం చేశాక రూ.300కు అంగీకరించారు. కానీ, వాళ్లు ఒకచోట పట్టుకున్న వాటిని మరోచోట వదిలేస్తున్నారు. అక్కడ మళ్లీ సమస్య మొదలవుతోంది' అని వివరించారు.

ఏ రకం కోతులవి?: ఉప ముఖ్యమంత్రి, అటవీ శాఖ మంత్రి పవన్ కల్యాణ్ స్పందిస్తూ.. 'ఆ కోతులు ఏ జాతివో గుర్తించగలిగారా? ఎందుకంటే కొన్ని రక్షించాల్సిన జాతులున్నాయి' అని కలెక్టర్‌ను అడిగారు. సాధారణ కోతులేనని ఆయన బదులిచ్చారు. ఇలాంటి సమస్యలున్న ప్రాంతాల్లో 'హనుమాన్' ప్రాజెక్టు చేపట్టి, పరిష్కారం కనుగొనే ప్రయత్నం చేస్తున్నామని పవన్ చెప్పారు.

అటవీ ఆవుల నియంత్రణ ఎలా..?: ఎన్టీఆర్ జిల్లా నందిగామ నియోజకవర్గం చందర్లపాడు మండలంలోని లంక గ్రామాల నుంచి అటవీ ఆవులు సుమారు 800 ఎకరాల్లో పంటలను నాశనం చేస్తున్నాయని కలెక్టర్ లక్ష్మీశ సీఎంకు తెలిపారు. పవన్ కల్యాణ్ కల్పించుకుని అటవీ, పశు సంవర్ధక శాఖ కలిసి ఈ సమస్య పరిష్కారానికి ప్రణాళిక రూపొందించి, అమలు చేయాలని అభిప్రాయపడ్డారు. అందుకు సీఎం అంగీకరించారు.

కుక్కల సంగతి ఏం చేశారు?: అదే సమయంలో కుక్కల బెడద గురించి సీఎం ప్రస్తావించారు. ఏం చేస్తున్నారంటూ పురపాలక శాఖ మంత్రి నారాయణను అడిగారు. 'రాష్ట్ర వ్యాప్తంగా 2.25 లక్షల కుక్కలుండగా, వాటిలో ఇప్పటికే సుమారు 1.30 లక్షల శునకాలకు స్టెరిలైజ్ చేశాం' అని మంత్రి వివరించారు. ఉప ముఖ్యమంత్రి కలుగజేసుకుంటూ 'కేవలం స్టెరిలైజేషన్ సరిపోదు.. అవి మనుషులను కరుస్తున్నాయి.. ఇంకోవైపు యానిమల్ రైట్స్ ఉన్నాయి' అని అంటుండగా.. సీఎం స్పందిస్తూ.. 'ఓ వైపు యానిమల్ రైట్స్ వాళ్లు.. ఇంకో వైపు సివిలియన్ రైట్స్ వాళ్లూ ఉంటారు. ఈ సంఘర్షణ ఎప్పుడూ ఉంటోంది. దీన్ని సమతౌల్యం చేసుకోవాలి. కుక్కల విషయంలో సుప్రీంకోర్టు ఆదేశాల ప్రకారం ముందుకెళ్తాం' అని చెప్పారు.

వచ్చే నెలలో పది హోటళ్ల నిర్మాణానికి ఒకేసారి శంకుస్థాపన

పర్యాటకశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వెల్లడి

ఈనాడు, అమరావతి: పది హోటళ్ల నిర్మాణానికి వచ్చే నెలలో ముఖ్యమంత్రి, మంత్రులు ఒకేసారి శంకుస్థాపన చేయనున్నారు. 2024-29 పర్యాటక విధానంలో కొత్త హోటళ్ల నిర్మాణం కోసం ప్రభుత్వం పెద్దఎత్తున అనుమతులిస్తోంది. ఈ విషయాన్ని రాష్ట్ర పర్యాటకశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజయ్‌జైన్ బుధవారం కలెక్టర్ల సమావేశంలో వెల్లడించారు. కొత్త విధానం ప్రకటించాక ఏడాది వ్యవధిలో 27 కొత్త హోటళ్లకు అనుమతులు ఇచ్చినట్లు ఆయన తెలిపారు. ఇందులో మూడు హోటళ్లు ప్రారంభమైనట్లు ప్రత్యేక ప్రధాన కార్యదర్శి చెప్పారు.

✦ 'హోం స్టే విధానాన్ని ఇప్పటికే ప్రారంభించాం. ఇందుకు సంబంధించిన పోర్టల్ కూడా అందుబాటులో ఉంది. జిల్లాల్లో హోంస్టేల ఏర్పాటుకు ఎక్కువ మంది ముందుకు వచ్చేలా కలెక్టర్లు చొరవ తీసుకోవాలి.

✦ ఏడు పర్యాటక హబ్‌లు, 25 సర్క్యూట్లు ఇప్పటికే ప్రకటించాం. తొలి దశలో కొండపల్లి, మంగళగిరి, కూచిపూడి, ఏటికొప్పాక తదితర ప్రాంతాల్లో ఎక్స్‌పీరియన్స్ సెంటర్లు ప్రారంభించనున్నాం. ఎడ్వంచర్ టూరిజం, హౌస్ బోట్లకు కూడా అనుమతులు ఇస్తున్నాం.

✦ ముఖ్యమైన ప్రాంతాల్లో ప్రభుత్వ, ప్రైవేట్ భాగస్వామ్యంలో హోటళ్ల నిర్మాణం కోసం స్థలాలను కలెక్టర్లు గుర్తించాలి. రెవెన్యూ, ఆర్‌అండ్‌బీ, జల వనరులు, ఇతర ప్రభుత్వశాఖల స్థలాల సేకరించి సిద్ధం చేయాలి.

వీటి వివరాలు వెబ్‌సైట్‌లో పెట్టి హోటల్ నిర్మాణానికి ముందుకు వచ్చే అనుభవం గల సంస్థలకు కేటాయిస్తాం. తిరుపతి, విశాఖపట్నం, బాపట్ల, సూర్యలంకలో హోటళ్ల నిర్మాణానికి పలు సంస్థలు ముందుకొస్తున్నాయి.

✦ బొర్రా గుహలు, సూర్యలంక, సింహాచలం, అన్నవరం, గండికోట, అఖండ గోదావరి, అహోబిలం వంటి ప్రాజెక్టుల పనులు కేంద్ర ప్రభుత్వం సాయంతో చేపడుతున్నాం. వచ్చే జూన్ నాటికి వీటిని పూర్తి చేయాలి. పనుల పురోగతిపై కలెక్టర్లు దృష్టి పెట్టాలి.

✦ జిల్లా పర్యాటక మండలి సమావేశాలు నిర్వహించాలి. ఈవెంట్ల నిర్వహణపై కలెక్టర్లు ప్రత్యేక శ్రద్ధ చూపాలి' అని పర్యాటకశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజయ్‌జైన్ సూచించారు.

ఆ 82 వేల ఎకరాలూ వినియోగంలోకి తెద్దాం

ఈనాడు, అమరావతి: రాష్ట్రంలో నిషేధిత భూముల (22ఎ) జాబితాలో ఉన్న 82 వేల ఎకరాలను పారిశ్రామిక అవసరాలకు వినియోగించుకునేందుకు వీలుగా జాబితా నుంచి తొలగించే ప్రతిపాదనను వచ్చే మంత్రి మండలి సమావేశానికి తీసుకురావాలని సీఎం చంద్రబాబు అధికారులకు సూచించారు. ఈ సమస్యను పరిష్కరించేందుకు వీలుగా ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటుందన్నారు.

వసుంధర

vasundhara@eenadu.in



మనీ మంత్ర...

పిల్లలకు కష్టాలేవీ తెలియకూడదని... ఇంటి ఆర్థిక పరిస్థితిని వారితో చర్చించడం లేదా? వయసులో చిన్నవాళ్లు కదా... ఇవన్నీ ఎందుకని పక్కన పెట్టేస్తున్నారా? రెండూ తప్పేనంటారు నిపుణులు. నేటి బాలలే రేపటి పౌరులు. వారిని మంచి పౌరులుగానే కాదు... క్రమశిక్షణ కలిగిన వ్యక్తులుగా, ఉన్నత స్థాయికి చేరుకునేలా తీర్చిదిద్దాల్సింది తల్లిదండ్రులుగా మీరే. అందుకోసం ఏం చేయాలంటే...

ఆ కష్టాలు చెప్పాల్సిందే!

బాల్యం నుంచే పిల్లలకి ఆర్థిక అక్షరాస్యత నేర్పించడం ఎంతో ముఖ్యం. లేదంటే వ్యక్తుల ఆదాయ-వ్యయాల మధ్య సమతూకం దెబ్బతినడమే కాదు. మలిదశ జీవితం కోసం కనీస పొదుపూ చేయలేరు. ఇది లోపించడం వల్లే ఇప్పటి యువతలో ఎక్కువమంది ఎంత సంపాదిస్తున్నా... రుణాల ఊబి నుంచి బయటకు రాలేకపోతున్నారట. డబ్బు నిర్వహణ తెలియడం వల్ల క్రమశిక్షణ అలవడటమే కాదు... బాధ్యతాయుతమైన నిర్ణయాలూ తీసుకోగలుగుతారు.

ఎంత ఇస్తున్నారు...

పిల్లలకు పాకెట్ మనీ ఇవ్వడం మంచిదే. కానీ, వారు అడిగినంత ఇవ్వకండి. తక్కువ ఇచ్చి మిగిలిన మొత్తం కోసం... వారికి సంపాదించుకునే అవకాశం ఇవ్వండి. ఇలా చేయడంవల్ల ఖర్చు చేయడమే కాదు సంపాదించడమూ నేర్చుకుంటారు.

ఆ రిస్క్ ఊహించాలి...

జీవితంలో ఊహించని పరిణామాలెన్నో జరుగుతాయి. అనారోగ్యాలు, ప్రమాదాలు, ఆస్తుల ధ్వంసం, దొంగతనాలు, ఉద్యోగం కోల్పోవడం వంటి సమస్యలు ఎదురైతే ఏ రకమైన ఆర్థిక ఇబ్బందులు తలెత్తుతాయో చిన్నారులకు వివరించాలి. వీటికోసం అత్యవసర నిధిని ఏర్పాటుచేసుకోవడం నేర్పించాలి. అలాగే జీవిత, ఆరోగ్య, ప్రమాద బీమాల అవసరాన్నీ చెప్పాలి. అలానే, భవిష్యత్తులో క్లిష్ట పరిస్థితుల్ని ఎదుర్కొనే శక్తి మీ చిన్నారికి కావాలి. సరైన పద్ధతుల్లో రుణం తీసుకోవడంతోపాటు తీర్చడమూ వాళ్లకి తెలియాలి. ముఖ్యంగా క్రెడిట్ కార్డులు, బ్యాంకులోన్ల గురించి చెప్పండి. అప్పు తీసుకుంటే వడ్డీ కట్టే విధానం, చెల్లించకపోతే పడే అదనపు రుసుములు వంటివీ వివరించండి. ఇవన్నీ అర్థం చేసుకోగలిగితేనే భవిష్యత్తులో వడ్డీల వలలో చిక్కకుండా ఉంటారు.

ఆ తేడా తెలియాలి...

చాలా కుటుంబాల్లో ఇంటి ఖర్చులు, ఆదాయం గురించి పిల్లల ముందు మాట్లాడరు. కానీ, వయసుకి తగ్గట్లు అవీ చర్చించాల్సిందే. ముఖ్యంగా పిల్లలకు డబ్బు విలువ, ఖర్చుల అదుపు, పొదుపు... వంటివి నేర్పిస్తే బాధ్యతాయుతంగా మారతారు. వాస్తవ పరిస్థితులను తెలుసుకుని తప్పొప్పులు చేయకుండానూ ఉంటారు. ముఖ్యంగా 5-10 ఏళ్ల చిన్నారులకు పిగ్గీ బ్యాంకులో డబ్బులు దాచుకోవడం నేర్పిస్తే సరిపోదు. షాపింగ్‌కి తీసుకెళ్లి అవసరాలు, కోరికలకు మధ్య ఉన్న తేడా చెప్పాలి. ప్రత్యామ్నాయాలు చూపించాలి.

లెక్క రాయాలి...

ఖర్చుపెట్టడం, పొదుపు చేయడం... వంటివన్నీ నోటిలెక్కలే అయితే ఒక్కోసారి మన అంచనాలు తారుమారు అవుతాయి. అందుకే, సంపాదన, ఖర్చులు, పెట్టుబడులు... ఇలా అన్నింటికీ రికార్డు ఉండాలి. ఇవన్నీ పుస్తకంలోనో, కంప్యూటర్‌లోనో పిల్లలతో నమోదు చేయించండి. సమీక్షించుకోవడానికీ, తప్పులు దొర్లకుండా, పొరపాట్లు జరగకుండా చూసుకోవడానికీ ఇదెంతో అవసరమని అర్థమయ్యేలా చెబితే వాళ్లూ పాటిస్తారు.


బడ్జెట్ వేయాలి...

వంటింటి సరకుల ధరలతోపాటు, ఈఎమ్ఐలు, స్కూలు ఫీజులు, ఇతరత్రా ఖర్చులు... మీకొచ్చే ఆదాయం వంటి వివరాలను మీ చిన్నారికి ఇవ్వండి. వీటికి అనుగుణంగా మీ ఇంటి బడ్జెట్ వేయమనండి. ఖర్చుల్ని నియంత్రించుకోవడానికి సలహాలు అడగండి. పొదుపు చేసే మార్గాల్ని చూపించమనండి. ఇవన్నీ వారిలో ఆలోచనా శక్తిని పెంచుతాయి. అంతేకాదు, మీ ఇంటి ఆర్థిక పరిస్థితిని అర్థం చేసుకుంటారు. అనవసర ఖర్చుల్ని తగ్గించుకుంటారు.

మీకు తెలుసా..!

కొంతమంది స్త్రీలు రెండు గర్భాశయాలతో జన్మిస్తారట. ఈ అరుదైన పరిస్థితిని యుటెరస్ డైడల్ఫిస్ అంటారు. ఈ తరహా కేసులు గర్భం దాల్చినప్పుడు, రుతుస్రావం సమయంలో ఎక్కువగా బయట పడతాయట. అప్పుడు అవసరమైతే సర్జరీ ద్వారా సమస్యకు కారణమైన గర్భాశయాన్ని తొలగిస్తారు.

సినిమా చరిత్రలోనే 'అవతార్' ఓ అద్భుతం. అందులోని పాత్రలు పండోరా గ్రహంలో సంచరించినా, నీటిలోపల విహరించినా, తాజాగా అగ్నిపర్వత ప్రాంతాల్లో నివసిస్తున్నా... ప్రేక్షకులకు మరో లోకాన్ని పరిచయం చేస్తాయి. అందుకు కారణం అత్యద్భుతమైన విజువల్ ఎఫెక్ట్స్. వీటిని అందించి ప్రేక్షకుల మనసులతోపాటు అవార్డుల్నీ అందుకుంది 'వెటా ఎఫ్‌ఎక్స్'. ఆ సృజనాత్మక బృందంలో సీక్వెన్స్ సూపర్‌వైజర్‌గా చేసింది మనమ్మాయే. పేరు... పావనీ రావు బొడ్డపాటి!



పావని

అవతార్ వెనక 'ఆమె'

ఫైర్ అండ్ యాష్ సహా మూడు అద్భుత 'అవతార్' చిత్రాలని ప్రేక్షకులకి అందించారు హాలీవుడ్ దర్శకుడు జేమ్స్ కామెరూన్. ఈ వండర్ విజువల్స్ వెనకున్న ఓ సృజన పేరే... పావనీ రావు. ఈనెల 19న విడుదల కాబోతున్న 'అవతార్ (ఫైర్ అండ్ యాష్)'తో సహా గతంలో వచ్చిన మరో రెండు అవతార్ సినిమాలకీ వెటా ఎఫ్ఎక్స్ విజువల్స్‌ను దగ్గరుండి పరిశీలించారీమె.



దిల్లీలో పుట్టిపెరిగారు పావనీ రావు. స్కూల్ ఆఫ్ ప్లానింగ్ అండ్ ఆర్కిటెక్చర్ నుంచి బీఆర్క్ పట్టా పొందారు. తరవాత శాన్‌ఫ్రాన్సిస్కోలోని అకాడమీ ఆఫ్ ఆర్ట్ యూనివర్సిటీలో ఎంఎఫ్ఏ, యానిమేషన్, విజువల్ ఎఫెక్ట్స్ కోర్సులను పూర్తి చేశారు. ప్రస్తుతం న్యూజిలాండ్‌లో ఉంటున్న పావని జేమ్స్ కామెరూన్‌తో కలిసి చిరకాలంగా పనిచేస్తున్నారు. తొలి 'అవతార్'తో 2009లో ఈ ప్రయాణం మొదలైంది. ఈ క్రమంలో అవతార్ మూడు సినిమాలకీ విజువల్ వండర్స్‌ని అందించారు. 'నానమ్మ ఉన్నితో బొమ్మలు తయారుచేసేది. చిన్నప్పుడు అవి చూసే ఆర్కిటెక్ట్ అవ్వాలనుకున్నా. ఆ తరవాత విజువల్ ఎఫెక్ట్స్ నన్ను ఆకర్షించాయి. దీనికి సంబంధించి డిజిటల్ కోర్సులు పూర్తిచేసినప్పటికీ వాటిపై పూర్తి అవగాహన వచ్చింది మాత్రం అవతార్ సినిమాకి పనిచేసినప్పుడే. ముఖ్యంగా 'ది వే ఆఫ్ వాటర్'లో దాదాపు 3000 విజువల్ ఎఫెక్ట్స్ షాట్లు తీశాం. ఎక్కువ భాగం నీటి అడుగున తీసినవే. ఇవన్నీ సవాళ్లతో కూడుకున్న సన్నివేశాలే. ప్రతి షాట్ ఒక వండర్ అనే చెబుతా. మన లోకాన్ని దాటి ప్రేక్షకులకి కొత్త ప్రపంచం చూపిస్తున్నప్పుడు ముందుగా దాన్ని మనం ఆస్వాదించాలి. అంతే జాగ్రత్తగా సినిమాని చిత్రీకరించాలి. ఇందుకు మా టీమ్ చాలా కష్టపడింది' అంటారు పావని. ముందు అవతార్-1కి లైటింగ్ టీడీగా పనిచేయడానికి వెళ్లారీమె. ఆ మూవీలో కొన్ని సన్నివేశాలకి విజువల్ ఎఫెక్ట్స్ ఎలా చేస్తే బాగుంటుందో కామెరూన్‌కి వివరించారట. అలా అవతార్ మూడు భాగాల్లో పనిచేసే అవకాశం వచ్చిందట. ఆయనతో కలిసి పనిచేయడం గొప్ప అనుభూతినిచ్చిందంటారు పావని.

'అవతార్'తోపాటు 'ద క్రానికల్స్ ఆఫ్ నార్నియా, ద లయన్', 'ద విచ్ అండ్ ద వార్డ్‌రోబ్', 'నైట్ ఎట్ ద మ్యూజియం', ది ఇన్‌క్రెడిబుల్ హల్క్', 'రైజ్ ఆఫ్ ద ప్లానెట్ ఆఫ్ ది ఏప్స్'తోపాటు మరికొన్ని సినిమాలకూ పనిచేశారీమె. 'గత కొన్నేళ్లలో వెటా ఎఫ్ఎక్స్ కళాకారులం అనేక అవార్డులు అందుకున్నాం. ఉత్తమ విజువల్ ఎఫెక్ట్స్‌కి గానూ ఏడు అకాడమీ, ఉత్తమ స్పెషల్ విజువల్ ఎఫెక్ట్స్‌కి ఏడు బాఫ్టా అవార్డులనీ అందుకున్నాం. వీటితోపాటు ఎమ్మీ, సైన్స్ అండ్ టెక్నాలజీ పురస్కారాలూ పొందడం గర్వంగా ఉంది' అంటారు పావని.

సందర్భం ఏదైనా చామంతి పూలు తెచ్చే నిండుదనం అంతా ఇంతా కాదు. ఈ మొక్కను ముంగిట పెంచుకుంటే ఇల్లూ కళకళలాడుతుంది. కానీ నర్సరీ నుంచి తెచ్చి ఇంట్లో నాటితే బతకదే! మీదీ ఇదే సమస్యా? అయితే ఈ చిట్కాలు పాటించండి.

విరిసిన చామంతి అందాలు!



- చామంతి సున్నితమైన మొక్క. ఇది ఆరోగ్యంగా పెరుగుతూ ఎక్కువ పూలను ఇవ్వాలంటే కాస్తంత ఎక్కువ శ్రద్ధ పెట్టాలి. మొక్కకు కనీసం 5-6 గంటల పాటు నేరుగా సూర్యరశ్మి తగిలే చోట వీటిని పెంచుకోవాలి. అయితే ఎక్కువ పెంచాలనుకుంటే మరీ దగ్గరగా కాకుండా కాస్త దూరంగా నాటాలి.

చామంతిని నాటడానికి ముందే మట్టిని సారవంతంగా మార్చుకోవాలి. వర్మీకంపోస్ట్‌తోపాటు కాస్త వేపపిండినీ అందులో కలిపి పెట్టుకోవాలి.

- నాటిన తర్వాత 4 వారాలకోసారి ఎన్‌పీకే బ్యాలెన్స్ లిక్విడ్ ఫెర్టిలైజర్ ఇవ్వాలి. మొక్క ఆరు అంగుళాలు వరకూ పెరిగాక దాని తలలు తుంచితే ఎక్కువ కొమ్మలు వస్తాయి. అలానే పూత వచ్చే సమయంలో పొటాష్‌తోపాటు ఇతర సూక్ష్మపోషకాలనూ అందిస్తే ఎక్కువ పూలు వస్తాయి.
- నీళ్లు అతిగా పోస్తే వేర్లు కుళ్లి చనిపోయే ప్రమాదం ఉంది.

దీనికి ఆకు తొలుచు పురుగులు, బూడిద తెగులు, పేను బంక, వేరు కుళ్లు... వంటి చీడపీడలు రావొచ్చు. పరిష్కారంగా... ప్రతి రెండు మూడు రోజులకోసారి ఆకుల కింది భాగంలో నీళ్లను బలంగా స్ప్రే చేయండి. ఆ ధాటికి తెల్ల దోమ, కొన్ని రకాల పురుగులు కొట్టుకుపోతాయి. లేదంటే లీటరు నీటిలో చెంచా వేపనూనె, కాస్త డిష్‌వాష్ లిక్విడ్ కలిపి స్ప్రే చేస్తే సరి. వారానికి రెండు సార్లు ఇలా చేస్తే చీడ పోతుంది. వెల్లుల్లి రెబ్బలను నూరి నీటిలో కలిపి చల్లినా మంచిదే.

అందంలో... నంబర్ వన్!



మార్గట్

అందం, ప్రతిభ, తెలివితేటలు... ఈ మూడింటినీ పోత పోస్తే మార్గట్ రబీ అంటారు ఆమె అభిమానులు. సినిమా నేపథ్యమున్న కుటుంబం కాదు. అయినా ఆసక్తితో గ్లోబల్ స్టార్‌గా ఎదిగారామె. ఆస్ట్రేలియాలోని చిన్న పట్టణం మార్గట్‌ది. మూడు ఉద్యోగాలు చేస్తూ తనని తాను పోషించుకోవడమే కాదు, యాక్టింగ్ విద్యనీ అభ్యసించారు. ఆస్ట్రేలియాలో టీవీ కార్యక్రమంతో ఆమె కెరియర్ ప్రారంభమైంది. కానీ ఆమె హాలీవుడ్‌కి వెళ్లాలనుకున్నారు. పరిచయాలు లేవు, అండ అంతకన్నా లేదు... నిరూపించుకోవాలన్న కసి తప్ప. దాంతోనే 21 ఏళ్లకే హాలీవుడ్ సినిమాలో స్థానం సంపాదించారు. అవతల ఎంత గొప్ప నటులు, అనుభవజ్ఞులైనా ఉండనీ... ధైర్యంగా నటించడం ఆమె నైజం. అదే ఆమెకు గుర్తింపుని తీసుకొచ్చింది. ద వూల్ఫ్ ఆఫ్ వాల్ స్ట్రీట్, ఐ, టోన్యా, సూసైడ్ స్క్వాడ్... వంటివన్నీ ఆమెకు పేరు తెచ్చినవే! ఆధునిక మహిళకు అద్దం పట్టే కథలే ఎంచుకుంటారు మార్గట్. ఆమె పాత్రలన్నీ మహిళల దృఢమైన వ్యక్తిత్వాన్ని ప్రదర్శించేలా ఉంటాయి. నిర్మాత కూడా. ఆమె నటించి, నిర్మించిన 'బార్బీ' గ్లోబల్ బ్లాక్ బస్టర్‌గా నిలిచింది. బార్బీ అంటే క్యూట్‌నెస్ మాత్రమే కాదు, భావోద్వేగాలు, దృఢత్వానికీ, ఆత్మవిశ్వాసానికీ సంకేతంగా చూపించారు. మహిళల గుర్తింపు, వాళ్లు ఆశించే అంశాలపై ప్రపంచవ్యాప్తంగా చర్చకు దారితీసేలా చేశారు. సినీరంగంలో ప్రభావవంతమైన వ్యక్తిగా ఎదిగారు. రిస్క్‌కి వెనకాడరు, తన పాత్ర బలమైన ముద్ర వేయాలనుకుంటారు. ముఖ్యంగా నేటి మహిళకు గొంతుక కావాలనుకుంటారు. అదే ఆమెను ప్రత్యేకంగా నిలబెడుతోంది. ఇంత గుర్తింపు ఉన్నా ఒదిగుండే తత్వం మార్గట్‌ది. ఆ తీరుకీ అభిమానులు ఎక్కువే. పాపులారిటీ, అత్యధికంగా నెట్టింట వెతకడం, ప్రేక్షకులపై చూపే ప్రభావం... ఇలా ఎన్నో అంశాల్లో ముందున్నారు. కాబట్టే, ఐఎండీబీ (ఇంటర్నెట్ మూవీ డేటాబేస్) విడుదల చేసిన ప్రపంచవ్యాప్త అందమైన తారల జాబితాలో ముందున్నారు మార్గట్ రబీ. మొత్తంగా పదిమందిని ఎంపిక చేయగా... భారత్ నుంచి కృతి సనన్ మాత్రమే ఈ జాబితాలో చోటు దక్కించుకున్నారు.

ఓ లక్ష్యాన్ని పెట్టుకుని... దాని సాధనకు సంకల్పించి, రేయింబవళ్లు శ్రమిస్తే విజయం తప్పకుండా వరిస్తుంది. షేక్ గండ్లూరు హఫీజున్, కొమ్ము శిరీషల ప్రయాణమే అందుకు నిదర్శనం. పేదరికం, పెళ్లి, హేళనలు అన్నింటినీ దాటి అనుకున్న కొలువులు సాధించారు.

కష్టాలు దాటి... కానిస్టేబుళ్లు అయ్యారు!

పనిచేస్తూనే సన్నద్ధమయ్యా... - షేక్ గండ్లూరు హఫీజున్



మాది కడప జిల్లా, ముద్దనూరు. నాన్న షేక్ గండ్లూరు బషీర్ అహ్మద్. కూలిపనులు చేస్తూనే నన్నూ తమ్ముడినీ చదివించారు. 'మేము పడుతున్న కష్టాలు మీరు పడకూడదు. బాగా చదువుకుని మంచి ఉద్యోగాలు తెచ్చుకోండి' అంటూ అమ్మానాన్నలు ఎప్పుడూ మమ్మల్ని ప్రోత్సహించేవారు. నేనూ ప్రభుత్వ కొలువే లక్ష్యంగా శ్రమించేదాన్ని. ఆర్థిక పరిస్థితుల వల్ల డిగ్రీ అవ్వగానే పెళ్లి అన్నారు. నా కలలన్నీ నీరుగారినట్లే అనుకున్నా. కానీ మావారు షేక్ వసీం... నేను చదువుకుంటా అంటే కాదనలేదు. పెళ్లయిన ఏడాదికే బాబు పుట్టడంతో కుటుంబ పోషణ భారమైంది. దాంతో ఆయన గల్ఫ్ వెళ్లారు. ఎన్ని ఆర్థిక కష్టాలు ఉన్నా చదువు ఆపలేదు. ఎమ్మెస్సీ బీఈడీ పూర్తిచేశా. ఈ క్రమంలో అమ్మ అందించిన ప్రోత్సాహం మరచిపోలేను. నాకు దన్నుగా నిలిచిన అమ్మ కొవిడ్‌లో చనిపోయింది. నాన్న అనారోగ్యం పాలయ్యారు. నా భర్త కూడా కిడ్నీ సంబంధిత వ్యాధితో బాధపడుతూ ఇంటికి వచ్చేశారు. ఇంటి బాధ్యతలు నేనే తీసుకోవాల్సి వచ్చింది. ల్యాబ్ టెక్నీషియన్‌గా పనిచేస్తూనే ప్రభుత్వ కొలువులకు ప్రయత్నించా. 2022లో పోలీసు కానిస్టేబుల్ నోటిఫికేషన్ రావడంతో అప్లై చేశాను. అప్పటికి నాకు 28ఏళ్లు. పని పూర్తయ్యాక నెహ్రూ యువజన కేంద్రానికి వెళ్లి చదివేదాన్ని. 2023లో ప్రిలిమ్స్ రాశాను. మంచి ర్యాంకు వచ్చింది. కానీ ఈవెంట్స్‌లో ఎంపిక కావాలంటే... ఫిట్‌నెస్ ముఖ్యం. తల్లైన నాకు అప్పటి వరకూ దానిమీద ధ్యాసే లేదు. కసరత్తులు మొదలుపెట్టా. ఇంతలోనే పాత నోటిఫికేషన్ రద్దు అవుతుందన్న వార్తలు వచ్చాయి. ఇదే నాకు చివరి అవకాశం. దీన్ని కూడా కోల్పోతానేమో అని చాలా బాధపడ్డాను. కానీ అలా జరగలేదు. నా శ్రమ ఫలించింది. నియామక పత్రం అందుకున్నా.

- శ్రీనివాసులు బోగెం, కడప

ఆడపిల్లలకు చదువెందుకన్నారు! - కొమ్ము శిరీష



మాది అన్నమయ్య జిల్లాలోని నిమ్మనపల్లి. నాన్న శ్రీనివాసులు, కౌలురైతు. మేము ఇద్దరం అక్కచెల్లెళ్లం. 'చదువు ఒక్కటే మీ జీవితాల్ని మారుస్తుంద'ని చెప్పేవారు నాన్న. మేము కూడా అందుకు అనుగుణంగానే కష్టపడి చదివేవాళ్లం. చెల్లి జేఈఈ మెయిన్స్ రాసి సీటు సంపాదించింది. నేను ఎమ్మెస్సీ కెమెస్ట్రీ పూర్తిచేశా. కానీ, నాకు చిన్నప్పట్నుంచీ పోలీసు అవ్వాలని కోరిక. చదువుకుంటూనే దానికి సన్నద్ధమయ్యేదాన్ని. మమ్మల్ని చదివించడానికి ఎన్నో అప్పులు చేశారు నాన్న. వీటికి తోడు బంధువులు, చుట్టుపక్కల వాళ్లు 'ఆడపిల్లల్ని చదివించి ఏం చేస్తావ్, పెళ్లి చేసుకుని వెళ్లిపోతారు. వృద్ధాప్యంలో మీకు అప్పులు తప్ప ఏం మిగులుతాయ్' అంటూ హేళన చేసేవారు. నాన్న అవేవీ పట్టించుకోకుండా మమ్మల్ని ప్రోత్సహించారు. కానిస్టేబుల్ పోస్టులకు నోటిఫికేషన్ వచ్చాక... కోచింగ్‌కి వెళ్లాలనుకున్నా. కానీ ఆర్థికభారం ఇంకా ఎక్కువ అవుతుందనిపించి ఆగిపోయా. సొంతగానే చదువుకోవడం మొదలుపెట్టా. యూట్యూబ్ వీడియోలు, పాత మెటీరియళ్ల సాయంతో ప్రిపేరవుతూ ప్రశ్నాపత్రాలు సాధన చేసేదాన్ని. రేయింబవళ్లు కష్టపడ్డా. చివరికి అనుకున్న లక్ష్యాన్ని సాధించా.

- కాకి పృథ్వీ, కడప

డియర్ వసుంధర

టైప్-1 డయాబిటీస్ ఏం తినాలి!



డా. జానకీ శ్రీనాథ్
పోషకాహార నిపుణులు

మా పాప వయసు 22. తనకి పదహారేళ్లప్పుడు టైప్-1 డయాబిటీస్ వచ్చింది. ఎప్పుడూ షుగర్ 250 ఉంటుంది. చక్కెర స్థాయులు అదుపులో ఉండాలంటే తనకి ఎలాంటి ఆహారం పెట్టాలి? - స్వరూప రెడ్డి

టైప్-1 డయాబిటీస్ ఉన్నవారికి ఇన్సులిన్‌ని అందించాల్సి ఉంటుంది. వారి శరీరం ఈ హార్మోన్‌ని తయారు చేసుకోలేదు. కాబట్టి వివిధ పద్ధతుల్లో ఇవ్వొచ్చు. ఈమధ్య ఇన్సులిన్ పంపులు వస్తున్నాయి. వీటిని శరీరానికి ఫిట్ చేస్తే బ్లడ్ షుగర్‌ని చెక్ చేస్తూ ఇన్సులిన్‌ని విడుదల చేస్తాయి. టైప్-1 డయాబిటీస్ ఉన్నవారిలో ఇన్సులిన్ మోతాదు, తీసుకునే ఆహారం సమపరిమాణంలో లేనప్పుడు చక్కెర స్థాయుల్లో హెచ్చుతగ్గులు ఏర్పడి చెమటలు పట్టడం, కళ్లు తిరగడం, యూరిన్ ఇన్ఫెక్షన్, కిడ్నీ, గుండె సంబంధిత వ్యాధులు వచ్చే ప్రమాదం ఉంది. ఇప్పుడు మీ అమ్మాయి వయసు 22ఏళ్లు. ఈ వయసులో బరువు పెరగడం, తగ్గడం రెండూ జరగకూడదు. చక్కెర నియంత్రణలో ఉండాలంటే తను తీసుకునే ఇన్సులిన్ మోతాదుకి సరిపడా కార్బోహైడ్రేట్లు, ఉండేలా చూసుకోవాలి. దీంతోపాటు తినే ఆహారంలో పీచు పదార్థాలు ఎక్కువగా ఉండాలి. ఆహార వేళలూ ముఖ్యమే. ఇవి రక్తంలో చక్కెర నిల్వలను హెచ్చుతగ్గులు కాకుండా చేస్తాయి. విటమిన్లు, ఖనిజాలు, మాంసకృత్తులు శరీరానికి సరిపడా అందేలా చూసుకోవాలి. పొట్టుతో ఉండే గింజ ధాన్యాలు, ఆకుకూరలు, కాయగూరల్లో ఫైబర్ ఎక్కువ. ఇవి చక్కెర స్థాయుల్ని తగ్గకుండా, పెరగకుండా ఆపుతాయి. చేప, గుడ్డు, సోయాతోపాటు అవకాడో, నూనె గింజలు, పప్పు దినుసులు, నట్స్ కూడా తినొచ్చు. వాటర్‌మెలన్, మస్క్‌మెలన్, స్ట్రాబెర్రీ, మల్బరీల్లోనూ కార్బోహైడ్రేట్లు తక్కువగా ఉంటాయి. వీటిని చిరుతిండిగా తీసుకోవచ్చు. ప్రాసెస్, బేకరీ పదార్థాలకు దూరంగా ఉండాలి. సపోటా, అరటి, మామిడి పండ్లను లెక్క ప్రకారం తీసుకోవాలి. అయితే ఇవన్నీ మీ అమ్మాయి ఎత్తు, బరువు, జీవన శైలి, తను తీసుకునే ఇన్సులిన్ మోతాదులను బట్టి మారుతుంటాయి. ముందు మీరు పోషకాహార నిపుణుల సలహాతో ఈ నియమాలను పాటిస్తే మంచిది.


బంగారం - వెండి

17న ముగింపు

	బంగారం (24క్యా)	ఆర్నమెంట్ (22క్యా)	వెండి (కిలో)
హైదరాబాద్	1,37,030	1,23,700	2,04,824
విజయవాడ	1,32,560	1,27,000	2,05,000
ప్రొద్దుటూరు	1,32,250	1,21,670	1,97,000
రాజమహేంద్రవరం	1,34,510	1,23,300	2,22,000
విశాఖపట్నం	1,34,000	1,23,300	2,10,000
తమిళనాడు	-----	1,24,000	2,22,000


రంగవల్లిక

15 చుక్కలు
8 వచ్చే వరకూ మధ్య చుక్క





ఏఎన్. ప్రసూన
హైదరాబాద్






కొత్తగట్టు శ్రీవాణి
హైదరాబాద్

16 చుక్కలు
4 వరుసలు
4 వచ్చేవరకూ



కె. వ్యూహశ్రీ
బ్రాహ్మణపల్లి

15 చుక్కలు
15 వరుసలు



మీ ముగ్గులు 9154091911 నంబరుకు వాట్సాప్ చేయొచ్చు.

మా చిరునామా:
వసుంధర, ఈనాడు
ప్రధాన కార్యాలయం,
రామోజీ ఫిల్మ్‌సిటీ,
అనాజ్‌పూర్,
అబ్దుల్లాపూర్‌మెట్ మండలం,
రంగారెడ్డి జిల్లా,
తెలంగాణ - 501 512.
Email:vasundhara@eenadu.in

సిల్క్ సమగ్ర-2 కింద పట్టు రైతులకు రూ.14 కోట్లు

ఈనాడు, అమరావతి: సిల్క్ సమగ్ర-2 పథకం కింద 2023-24, 2024-25 సంవత్సరాలకు సంబంధించి రాష్ట్ర వాటా కింద రూ.14 కోట్ల నిధుల్ని పట్టు పరిశ్రమల శాఖకు విడుదల చేశామని వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడు తెలిపారు. ఈ నిధులతో 13,663 మంది పట్టు రైతులకు లబ్ధి చేకూరిందని బుధవారం ఓ ప్రకటనలో వివరించారు. పట్టు రైతుల ఆదాయం పెంచడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు.



అతిగా శుద్ధిచేసిన పిండిపదార్థాలతో..

అతిగా శుద్ధి చేసి.. నూనెలో వేయించిన పిండిపదార్థాలను ఇటీవల ఎక్కువగా వినియోగిస్తుండటం ప్రజల్లో ఆరోగ్య సమస్యలకు హేతువవుతోంది. ముఖ్యంగా ఇన్సులిన్ నిరోధకత, శరీరంలో వాపు ప్రక్రియ పెరగడం, మధుమేహం, గుండె సంబంధిత సమస్యలు, నిస్సత్తువ, కుంగుబాటు, ఆందోళన, హార్మోన్ల అసమతౌల్యం, పేగు అనారోగ్యాలు తలెత్తుతున్నాయి.

– జే వ్రిగ్లీ, ఫంక్షనల్ మెడిసిన్ డాక్టర్

ఏఐ సాంకేతికత.. ఆశా కార్యకర్తకు చేరువైతేనే ఫలితాలు

- వినూత్న ఆవిష్కరణలతోనే భారత్ గేమ్ ఛేంజర్
- ఫిబ్రవరి 19న ఏఐ వ్యూహపత్రాన్ని విడుదల చేయనున్న ప్రధాని
- ఈనాడుతో డిజిటల్ హెల్త్ కేర్, ఏఐ స్ట్రాటజీ నిపుణుడు కార్తీక్ అడపా



డాక్టర్ కార్తీక్ అడపా

ఈనాడు, అమరావతి: "కృత్రిమ మేధ (ఏఐ) వినియోగంలో ప్రపంచంలో ప్రస్తుతం భారత్ టాప్-10లో ఉంది. మనం టాప్ 1 2, 3ల్లోకి రావాలంటే చాలా కృషి చేయాలి. ఏఐ వినియోగంలో భారత్ గేమ్ ఛేంజర్‌గా మారాలంటే మరింత శ్రమించాలి. వినూత్న ఆవిష్కరణలను అందుబాటులోకి తేవాలి" అని పంజాబ్ రాష్ట్ర పూర్వ వైద్యారోగ్య శాఖ ప్రత్యేక కార్యదర్శి, డిజిటల్ హెల్త్ కేర్, ఏఐ స్ట్రాటజీ నిపుణుడు డాక్టర్ కార్తీక్ అడపా అన్నారు. విజయవాడలో నిర్వహించిన దక్షిణ భారతదేశ బహుళ భాగస్వామ్య సమన్వయ ప్రాంతీయ కార్యశాలకు వచ్చిన ఈయన 'ఈనాడు' ముఖాముఖిలో మాట్లాడారు. ఆ వివరాలివీ..

★ ఆరోగ్య రంగంలో ఏఐ పాత్రను డబ్ల్యూహెచ్‌వో ఎలా ప్రోత్సహిస్తోంది..?

ఆరోగ్య రంగంలో ఏఐ వినియోగం, ఇతర అంశాలపై 300 పేజీల ఏఐ వ్యూహపత్రాన్ని (ఏఐ స్ట్రాటజీ డాక్యుమెంట్).. డబ్ల్యూహెచ్‌వో, భారత ప్రభుత్వం తరఫు నుంచి డబ్ల్యూహెచ్‌వో రూపొందించింది. ఈ డాక్యుమెంట్‌ను రాష్ట్ర ప్రభుత్వాలకు, కేంద్ర పాలిత ప్రాంతాలకు అందించాం. వారిచ్చిన ఫీడ్ బ్యాక్ ఆధారంగా ఈ డాక్యుమెంట్ ఇంకా అభివృద్ధి చేస్తాం. ఫౌండేషనల్ డాక్యుమెంట్‌కు.. పూర్తి స్వరూపం తీసుకొచ్చే కసరత్తు ప్రస్తుతం జరుగుతోంది. ఆ పరిపూర్ణ ఏఐ డాక్యుమెంట్‌ను ఫిబ్రవరి 19న ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఆవిష్కరిస్తారు.

★ ఏఐ ఆధారిత వైద్యసేవల్లో తప్పులు జరిగితే బాధ్యులు ఎవరు?

ఒక డాక్టర్ వినియోగించే ఏఐ టూల్ సురక్షితమా? కాదా? అనేది తేల్చేందుకు క్లినికల్ ట్రయల్ ఉంటుంది. అలాగే ఏఐ ఆధారిత వైద్యసేవల్లోనూ రోగుల భద్రతకు ప్రాధాన్యం ఉంటుంది.

★ ఏఐ సేవలు అందుబాటులోకి వస్తే వైద్య సేవల్లో అంతరాలు తగ్గుతాయా..?

అంతరాలు మొత్తం తొలగకపోయినా.. ఎక్కువ మందికి ఎదురయ్యే సమస్యలు పరిష్కరించే దిశగా ప్రభుత్వం ఏఐ సొల్యూషన్స్ తయారుచేస్తే.. సమస్యలు ఎక్కువగా ఎదుర్కొంటున్న పేదలకు న్యాయం జరుగుతుంది. సామాన్యులు ఎక్కువగా ఎదుర్కొనే ఆరోగ్య సమస్యల పరిష్కారానికి ఎక్కువ డబ్బులు ఖర్చు పెట్టమని ప్రభుత్వానికి సూచిస్తున్నాం. ఎయిమ్స్‌లో వైద్యం అందించే డాక్టర్ ఏ టూల్స్ వాడుతున్నారో.. క్షేత్రస్థాయిలో పనిచేసే ఆశా కార్యకర్తకు కూడా అవే టూల్స్ మనం అందుబాటులోకి తేగలగాలి. ఎక్కువ మందిని వేధిస్తున్న క్యాన్సర్ లాంటి సమస్యలకు ఏఐ సేవలు అందుబాటులోకి తేవాలి. అప్పుడే మనం నిర్దేశించుకున్న లక్ష్యం నెరవేరుతుంది.

★ రోగుల డేటా గోప్యతను కాపాడడంలో సవాళ్లను ఎలా ఎదుర్కొంటారు?

ఏఐ సొల్యూషన్స్‌ను విదేశాల నుంచి భారతదేశానికి రానీయకూడదు. మన దేశంలో అభివృద్ధి చేసినవి.. అదీ మన రాష్ట్రంలో అభివృద్ధి చేసినవి వాడాలి. ఎక్కడికక్కడ సాంకేతికత వినియోగించే ప్రయత్నం చేయాలి. లోకల్ డేటాతో లోకల్ మోడల్స్ రూపొందించాలి. సమాచారానికి ఎలా భద్రత కల్పించాలి? సైబర్ సెక్యూరిటీ ద్వారా ఎలా రక్షణ కల్పించాలి? అనే అంశాలనూ ఏఐ స్ట్రాటజీ డాక్యుమెంట్‌లో పొందుపరిచాం.



మంత్రి కందుల దుర్గేష్ సమక్షంలో ఒప్పంద పత్రాలు మార్చుకుంటున్న ఏడీటీవోఐ ప్రతినిధులు, పర్యాటకశాఖ ఉన్నతాధికారులు

విశాఖలో జాతీయ టూరిజం మార్ట్-2025

ఈనాడు, అమరావతి: భారత డొమెస్టిక్ టూర్ ఆపరేటర్ల అసోసియేషన్ (ఏడీటీవోఐ), రాష్ట్ర పర్యాటక శాఖ సంయుక్తంగా వచ్చే ఏడాది ఫిబ్రవరి 13, 14 తేదీల్లో విశాఖలో జాతీయ టూరిజం మార్ట్-2025 నిర్వహించనున్నారు. సచివాలయంలో బుధవారం రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ సమక్షంలో ఏడీటీవోఐ, రాష్ట్ర పర్యాటకశాఖ అధికారుల మధ్య ఈ మేరకు అవగాహన ఒప్పందం కుదిరింది. దేశీయ పర్యాటక రంగంలో అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న రాష్ట్రంగా ఏపీని తీర్చిదిద్దడమే లక్ష్యంగా ఒప్పందం కుదుర్చుకున్నట్లు మంత్రి దుర్గేష్ తెలిపారు. పర్యాటక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజయ్‌జైన్, రాష్ట్ర పర్యాటకాభివృద్ధి సంస్థ ఎండీ ఆమ్రపాలి, పర్యాటక సంస్థ సీఈవో శ్రీనివాస్, ఏడీటీవోఐ ప్రెసిడెంట్ వేద్ ఖన్నా, వైస్ ప్రెసిడెంట్ ఆశిష్, సీఈవో విజయ్‌మోహన్ తదితరులు పాల్గొన్నారు.

పీఎం యశస్వి పథకానికి రూ.90 కోట్లు

ఈనాడు, అమరావతి: పీఎం యశస్వి పథకం కింద ఓబీసీ, ఈబీసీ, డీఎన్‌టీ విద్యార్థుల ప్రీ, పోస్ట్ మెట్రిక్ ఉపకారవేతనాలకు ప్రభుత్వం రూ.90.50 కోట్లు విడుదల చేసింది. 2025-26 సంవత్సరానికి ఉపకారవేతనాలు అందించేందుకు ఈ నిధులు వినియోగించనున్నారు. ఈ మేరకు బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది.

రహేజాకు భూకేటాయింపు ఎలా చేశారు?

- ఈ ప్రాజెక్టు కోసం ఎంతమంది దరఖాస్తు చేసుకున్నారు?
- వివరాలివ్వాలని ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశం

ఈనాడు, అమరావతి: ఏపీ ల్యాండ్ ఇన్సెంటివ్ ఫర్ టెక్ హబ్స్ (లిఫ్ట్ పాలసీ 2024-29) విధానంలో భాగంగా విశాఖపట్నం- మధురవాడ ఐటీ హిల్ నంబరు3లో ఐటీ సంస్థలకు అవసరమైన వాణిజ్య, నివాస భవనాల సముదాయాలు నిర్మించే నిమిత్తం ప్రముఖ నిర్మాణ సంస్థ కె.రహేజా కార్పొరేషన్ సంస్థకు 27.10 ఎకరాలు కేటాయించడాన్ని సవాలు చేస్తూ దాఖలైన పిల్‌పై హైకోర్టు బుధవారం విచారణ జరిపింది. ఈ ప్రాజెక్ట్ నిమిత్తం ఎంతమంది దరఖాస్తు చేసుకున్నారు, భూకేటాయింపు విషయంలో అనుసరించిన విధానమేంటి తదితర వివరాలను కోర్టు ముందుంచాలని ప్రభుత్వాన్ని ఆదేశించింది. ఏ క్షణానైనా బిల్డర్ సంస్థకు రూ.100 కోట్లు కేటాయించబోతున్నారని, ఆ ప్రక్రియను నిలువరించాలని పిటిషనర్ తరఫు సీనియర్ న్యాయవాది పొన్నవోలు సుధాకర్‌రెడ్డి పలుమార్లు చేసిన అభ్యర్థనను ధర్మాసనం తోసిపుచ్చింది. విచారణను రెండు వారాలకు వాయిదా వేసింది. హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకుర్, జస్టిస్ చల్లా గుణరంజన్‌తో కూడిన ధర్మాసనం బుధవారం ఈ ఉత్తర్వులిచ్చింది. లిఫ్ట్ పాలసీతోపాటు, కె.రహేజా కార్పొరేషన్ సంస్థకు 27.10 ఎకరాలు కేటాయించడాన్ని సవాలు చేస్తూ 'సొసైటీ ఫర్ ప్రొటెక్షన్ ఆఫ్ కానిస్టిట్యూషనల్ రైట్స్' అధ్యక్షుడు జి.శ్రీనివాసరావు హైకోర్టులో పిల్ వేశారు. ఆయన తరఫున సుధాకర్‌రెడ్డి వాదనలు వినిపిస్తూ.. స్థిరాస్తి వ్యాపార సంస్థ భవనాలు నిర్మించేందుకు ప్రభుత్వం రూ.కోట్లు కేటాయిస్తోందని చెప్పారు. మొత్తం 27 ఎకరాలను 98 పైసలకు కేటాయించారన్నారు. నిర్మించిన భవనాలను విక్రయించుకునేందుకు రహేజా సంస్థకు వీలుందన్నారు.

15 వేల ఉద్యోగాలు కల్పించాలనే షరతుతోనే

రాష్ట్ర ప్రభుత్వం తరఫున అడ్వొకేట్ జనరల్ (ఏజీ) దమ్మాలపాటి శ్రీనివాస్ వాదనలు వినిపిస్తూ.. 15 వేల ఉద్యోగాలు కల్పించాలనే షరతుతోనే రహేజా సంస్థకు భూమి కేటాయించామన్నారు. పాలసీ నిబంధనలకు కట్టుబడి ముందుకొచ్చినవారినే ఎంపిక చేశామని చెప్పారు. పిటిషనర్ వీటిని గోప్యంగా ఉంచుతూ కోర్టును తప్పుదోవ పట్టిస్తున్నారన్నారు. వాదనలు విన్న ధర్మాసనం భూకేటాయింపు, బిల్డర్ ఎంపికపై వివరాలివ్వాలని ప్రభుత్వాన్ని ఆదేశించింది.

అమిత్ షా, నబీన్‌లతో ఏపీ భాజపా నేతల భేటీ





అమిత్‌షాకు శ్రీవారి ప్రతిమను బహూకరిస్తున్న కేంద్ర సహాయ మంత్రి శ్రీనివాసవర్మ. చిత్రంలో ఏపీ భాజపా అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్, రాష్ట్ర మంత్రి సత్యకుమార్ యాదవ్
★ భాజపా నూతన కార్యనిర్వాహక అధ్యక్షుడు నితిన్ నబీన్ సిన్హాకు జ్ఞాపికను బహూకరిస్తూ...

ఈనాడు, దిల్లీ: కేంద్ర హోం మంత్రి అమిత్‌షా, భాజపా నూతన కార్యనిర్వాహక అధ్యక్షుడు నితిన్ నబీన్ సిన్హాలతో కేంద్ర సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ, రాష్ట్ర మంత్రి సత్యకుమార్ యాదవ్, ఆంధ్రప్రదేశ్ భాజపా అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్‌లు భేటీ అయ్యారు. బుధవారమిక్కడ పార్లమెంటులోని కార్యాలయంలో హోం మంత్రి అమిత్ షాతో, భాజపా ప్రధాన కార్యాలయంలో కార్యనిర్వాహక అధ్యక్షుడు నబీన్‌తో విడివిడిగా సమావేశమయ్యారు. పార్టీ రాష్ట్ర శాఖ నిర్వహిస్తున్న అటల్-మోదీ సుపరిపాలన యాత్ర గురించి అమిత్‌షాకు వివరించారు. ఈ యాత్రకు ప్రజల నుంచి చక్కటి స్పందన లభిస్తున్నట్లు చెప్పారు. రాష్ట్రానికి సంబంధించిన పలు అంశాలపై ఆయనతో చర్చించారు. ఆ తర్వాత పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు నితిన్ నబీన్ సిన్హాను మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

పలువురు కేంద్ర మంత్రులతోనూ భేటీ

కేంద్ర భారీ పరిశ్రమలు, ఉక్కు శాఖ మంత్రి హెచ్‌డీ కుమారస్వామి, రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీ, విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్, పౌర విమానయాన శాఖ మంత్రి కె.రామ్మోహన్‌నాయుడులనూ మాధవ్, శ్రీనివాసవర్మ, సత్యకుమార్ యాదవ్, ఎంపీ సీఎం రమేష్‌లు బుధవారం పార్లమెంటు భవనంలో కలిశారు. రాష్ట్రానికి సంబంధించిన పెండింగ్ అంశాలపై వారితో చర్చించారు. రాష్ట్రంలోని పలు రాష్ట్ర రహదారులను జాతీయ రహదారులుగా మార్చాలని నితిన్ గడ్కరీకి వినతి పత్రం సమర్పించారు.

సుప్రీంకోర్టు తీర్పును పరిశీలించి రండి

హిడ్మా ఎన్‌కౌంటర్‌పై పిల్ వేసిన పిటిషనర్‌కు హైకోర్టు సూచన

ఈనాడు, అమరావతి: మావోయిస్టు కీలక నేత మడ్వి హిడ్మా, ఆయన భార్య తదితరుల ఎన్‌కౌంటర్ ఘటనపై జ్యుడీషియల్ విచారణ జరిపించాలంటూ 'పీపుల్స్ యూనిటీ ఫర్ సివిల్ లిబర్టీస్ హ్యూమన్ రైట్స్ ఫోరం' జాతీయ అధ్యక్షురాలు జయ వింధ్యాల దాఖలు చేసిన పిల్‌పై సోమవారం హైకోర్టు విచారణ జరిపింది. రాష్ట్ర ప్రభుత్వం, పోలీసుల తరఫున అడ్వొకేట్ జనరల్ దమ్మాలపాటి శ్రీనివాస్ స్పందిస్తూ.. పిల్‌కు విచారణ అర్హత లేదన్నారు. ఎన్‌కౌంటర్ విషయంలో నిర్వహిస్తున్న మినిస్టీరియల్ విచారణపై అభ్యంతరం ఉంటే సెషన్స్ జడ్జి వద్ద దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈ మేరకు సుప్రీంకోర్టు గతంలో స్పష్టమైన తీర్పు ఇచ్చిందంటూ ఆ కాపీని కోర్టుకు అందజేశారు. ఈ తీర్పు ప్రతిని అధ్యయనం చేసి రావాలని పిటిషనర్ తరఫు న్యాయవాదికి ధర్మాసనం సూచించింది. విచారణను వారం రోజులకు వాయిదా వేసింది. హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకుర్, జస్టిస్ చల్లా గుణరంజన్‌తో కూడిన ధర్మాసనం బుధవారం ఈ మేరకు ఉత్తర్వులిచ్చింది. పిటిషనర్ తరఫున న్యాయవాది సీహెచ్ శ్రీనివాసరెడ్డి వాదనలు వినిపిస్తూ.. మావోయిస్టులను అదుపులోకి తీసుకొని మూడు రోజులు హింసించి, బూటకపు ఎన్‌కౌంటర్ చేశారన్నారు.

కొత్త ప్రైవేట్ బడుల ఏర్పాటుకు దరఖాస్తుల స్వీకరణ

ఈనాడు, అమరావతి: వచ్చే విద్యా సంవత్సరం (2026-27)లో కొత్తగా ప్రైవేట్ పాఠశాలలు ప్రారంభించేందుకు ఈ నెల 31 లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ విజయరామరాజు తెలిపారు. cse.ap.gov.in వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తులు సమర్పించాలని, నిబంధనలు అనుసరించి అనుమతులు ఇస్తామని పేర్కొన్నారు. పాఠశాలకు అనుమతి ఇచ్చిన తర్వాత ప్రారంభానికి కావాల్సిన సదుపాయాలు ఏర్పాటు చేసుకునేందుకు సమయం అవసరం కానున్నందున ఈ నెల 31లోగా ప్రతిపాదనలు సమర్పించాలని సూచించారు.

24న బ్లూబర్డ్-6 ప్రయోగం

సూళ్లూరుపేట, న్యూస్‌టుడే: సతీష్ ధవన్ స్పేస్ సెంటర్-షార్ నుంచి అమెరికాకు చెందిన భారీ కమ్యూనికేషన్ ఉపగ్రహం 'బ్లూబర్డ్-6'ను ఈ నెల 24న ప్రయోగించనున్నారు. సుమారు 6,500 కిలోల బరువున్న ఈ ఉపగ్రహాన్ని ఎల్‌వీఎం-3 రాకెట్ అంతరిక్షంలోకి తీసుకెళ్లనుంది. అమెరికాకు చెందిన ఏఎస్‌టీ స్పేస్ మొబైల్ సంస్థతో కలిసి ఇస్రో వాణిజ్య విభాగం న్యూస్పేస్ ఇండియా లిమిటెడ్ ఈ ప్రయోగాన్ని నిర్వహిస్తోంది.

నందిగం రాణికి సుప్రీంలో ఎదురు దెబ్బ

- ముందస్తు బెయిల్ ఇవ్వడానికి నిరాకరణ
- పిటిషన్ ఉపసంహరించుకున్న న్యాయవాది

ఈనాడు, దిల్లీ: హర్షిత పాఠశాల ఏర్పాటు పేరుతో రూ.కోట్లు వసూలు చేసి మోసానికి పాల్పడిన వ్యవహారంలో ఏలూరు జిల్లా కామవరపుకోట మండలం తడికలపూడి గ్రామంలో శ్రీ హర్షిత ఇంగ్లిష్ మీడియం స్కూల్, జూనియర్ కళాశాల ఛైర్‌పర్సన్ నందిగం రాణికి సుప్రీంకోర్టులో గట్టి ఎదురుదెబ్బ తగిలింది. ఈ కేసులో ఆమెకు ముందస్తు బెయిల్ ఇచ్చేందుకు కోర్టు నిరాకరించింది. ఏపీ హైకోర్టు జారీచేసిన ఉత్తర్వులను సవాలు చేస్తూ ఆమె వేసిన పిటిషన్‌పై బుధవారం విచారణ జరిపిన జస్టిస్ మనోజ్‌మిశ్ర, జస్టిస్ ఉజ్జల్ భుయాన్‌లతో కూడిన ధర్మాసనం పిటిషన్ను డిస్మిస్ చేయడానికి సిద్ధమవడంతో విధిలేని పరిస్థితుల్లో ఆమె తరఫు న్యాయవాదులు దాన్ని ఉపసంహరించుకుంటున్నట్లు చెప్పారు. దాంతో ధర్మాసనం ఆ పిటిషన్‌ను డిస్మిస్డ్ యాజ్ విత్‌డ్రాన్‌గా ప్రకటించింది. 'ఇక్కడ ఈ కేసును పూర్తిస్థాయిలో వినడానికి మేం నిరాకరిస్తున్నాం. ఎందుకంటే ఇదే కేసులో హైకోర్టు ముందస్తు బెయిలు జారీ చేస్తూ విధించిన షరతులను సవరించాలని కోరుతూ ఐదుగురు దాఖలుచేసిన పిటిషన్‌లో రాష్ట్ర ప్రభుత్వానికి నోటీసులు జారీచేశాం. రాష్ట్ర ప్రభుత్వం కౌంటర్ దాఖలు చేయాల్సి ఉంది. ఇప్పుడు ముందస్తు బెయిల్‌ను రద్దుచేస్తూ హైకోర్టు ఇచ్చిన తీర్పును సవాలు చేస్తూ నందిగం రాణి దాఖలు చేసిన ఈ పిటిషన్‌లో వాదనలను పూర్తిస్థాయిలో విని తిరస్కరిస్తే బెయిలు పొందినవారు ఇబ్బందుల్లో పడతారు. అయినాసరే మీరు వినిపించాలనుకుంటే వాదనలు వినిపించండి' అని జస్టిస్ మనోజ్‌మిశ్ర నందిగం రాణి తరఫున హాజరైన సీనియర్ న్యాయవాది నాగముత్తుకు సూచించారు. అందుకు ఆయన స్పందిస్తూ తదుపరి వాదనలను శుక్రవారానికి వాయిదా వేయాలని కోరగా న్యాయమూర్తి అందుకు నిరాకరించారు.

కస్టోడియల్ విచారణ అవసరం

'వాదించాలనుకుంటే ఇప్పుడే వాదించండి. మా అభిప్రాయం ప్రకారం ఈ కేసులో నిందితులకు కస్టోడియల్ విచారణ అవసరం. ఇది ముందస్తు బెయిల్‌కు సంబంధించిన కేసే కాదు. అయితే ఐదుగురి ముందస్తు బెయిల్‌పై రాష్ట్ర ప్రభుత్వం అప్పీల్ దాఖలు చేయలేదు కాబట్టి మేం దాని జోలికి పోవడంలేదు. అయితే తన ముందస్తు బెయిల్‌ను రద్దు చేస్తూ హైకోర్టు జారీ చేసిన ఉత్తర్వులపై నందిగం రాణి అప్పీలు దాఖలు చేశారు కాబట్టి హైకోర్టు ఉత్తర్వులను మేం కచ్చితంగా ఆమోదిస్తాం. అప్పుడు మిగతా నిందితులకు హైకోర్టు ఇచ్చిన ముందస్తు బెయిల్‌ను సవాలు చేయడానికి ప్రభుత్వానికి అవకాశం ఏర్పడుతుంది. మీరు అదికావాలనుకుంటే ఈ కేసును విని మెరిట్ ప్రాతిపదికన నిర్ణయిస్తాం. ఇక మీరు వాదనలు వినిపించండి, మేం మెరిట్ ప్రాతిపదికన డిస్మిస్‌చేస్తాం' అని జస్టిస్ మనోజ్‌మిశ్ర స్పష్టం చేశారు. దాంతో నందిగం రాణి తరఫు న్యాయవాది నాగముత్తు పిటిషన్‌ను ఉపసంహరించుకునేందుకు అనుమతివ్వాలని కోరగా జస్టిస్ మనోజ్‌మిశ్ర అందుకు అంగీకరిస్తూ పిటిషన్‌ను డిస్మిస్డ్ యాజ్ విత్‌డ్రాన్‌గా ప్రకటించారు. మళ్లీ సంబంధిత కోర్టుల ముందు న్యాయపరిష్కారాలు కోరుకొనే స్వేచ్ఛను ఇవ్వాలని కోరగా న్యాయమూర్తి అందుకు నిరాకరించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి జస్టిస్ మనోజ్‌మిశ్ర కొన్ని కీలక వ్యాఖ్యలు కూడా చేశారు. 'ఇందులో నిందితులు డిపాజిటర్లకు సంబంధించిన రూ.కోట్లు కాజేశారన్నది ఆరోపణ. అందువల్ల వారిని కస్టడీలోకి తీసుకొని విచారించకపోతే ఆ డబ్బు ఎక్కడికిపోయిందో ఎలా తెలుస్తుంది' అని ప్రశ్నించారు. మనీ ట్రయల్‌ను కనిపెట్టడానికి కస్టోడియల్ విచారణ అవసరమని అన్నారు. అయితే అలా విచారించాల్సిన అవసరం ఉందా? లేదా? అన్నది పోలీసులు చెప్పాలని, అంతిమంగా అది వారి విచక్షణాధికారాల పరిధిలోకి వస్తుందని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కౌంటర్‌లో ఆ విషయం చెప్పాలని న్యాయమూర్తి సూచించారు.

రాజకీయ కారణాలతో నీళ్లు కేటాయిస్తే జలయుద్ధాలే

- అందుకు నిర్దిష్ట విధానాలున్నాయి
- తెలంగాణకు చారిత్రక అన్యాయం జరిగిందన్నది అబద్ధం
- ఎస్ఎల్‌బీసీ పూర్తికానందుకే కదా.. ఏఎంఆర్‌పీ నిర్మించింది
- సాగర్ ఎడమ ఆయకట్టు ఎక్కడా తగ్గలేదు
- పాత ఒప్పందాలన్నీ బచావత్ ట్రైబ్యునల్ తీర్పుతో రద్దు
- కృష్ణా-2 ట్రైబ్యునల్ ఎదుట ఏపీ వాదనలు

ఈనాడు, అమరావతి: 'రాజకీయ ఉద్దేశంతో రాష్ట్రాల విభజన జరిగినప్పుడు.. అదే ప్రాతిపదికన నీటి కేటాయింపులు చేసే నిబంధనలు వస్తాయి. అంతర్రాష్ట్ర నదుల్లో రాజకీయ కారణాలతో నీళ్లివ్వడం సాధ్యం కాదు. ఏ రాష్ట్రానికి కేటాయించాలన్నా.. నదీజల వివాద చట్టాలు, ట్రైబ్యునల్ కేటాయింపులు, అంతర్జాతీయ తగ్గ సూత్రాలు, అప్పటికే ఉన్న వినియోగం వంటి అంశాలు కీలకమవుతాయి. కృష్ణా నీటి కేటాయింపులకు సంబంధించి తెలంగాణ వాదన అర్థరహితం. తమకు చారిత్రక అన్యాయం జరిగిందనే వాదన తప్పు' అని ఏపీ తరఫున సీనియర్ న్యాయవాది జయదీప్ గుప్తా వాదించారు. దిల్లీలో బ్రిజేష్ ట్రైబ్యునల్ ఛైర్మన్ జస్టిస్ బ్రిజేష్ కుమార్, సభ్యులు జస్టిస్ రామమోహన్‌రెడ్డి, జస్టిస్ తాలపత్రల ఎదుట బుధవారం ఈ వాదనలు వినిపించారు. గతంలో తెలంగాణ వినిపించిన వాదనలను ఒక్కొక్కటిగా ప్రస్తావిస్తూ.. అవి ఏరకంగా సహేతుకం కాదో స్పష్టంగా వివరించారు. ఈయనకు మరో సీనియర్ న్యాయవాది ఉమాపతి, న్యాయవాదులు ఎస్.సంజయ్, శరత్‌చంద్రలు సహకరించారు.

జయదీప్ వాదనల్లోని ముఖ్యాంశాలు..

◆ తుంగభద్ర నీటి కేటాయింపుల్లో తమకు చారిత్రక అన్యాయం జరిగిందంటూ తెలంగాణ చేసిన వాదన తప్పు. 1944లో జరిగిన ఒప్పందం ప్రకారం మద్రాస్, హైదరాబాద్‌లకు సమానంగా జలాలు కేటాయించారన్న వాదనలో నిజం లేదు. ఆ ఒప్పంద ఉద్దేశం ఆర్డీఎస్, కేసీ కాలువలకు సహాయం అందించడమే. తెలంగాణ వాదిస్తున్నట్లు సమాన హక్కు ఏర్పాటు కాదు.

◆ 1938లో తుంగభద్ర నది హైదరాబాద్, మద్రాస్ రాష్ట్రాల మధ్య సరిహద్దుగా ఉంది. ఎడమవైపు హైదరాబాద్, కుడివైపు మద్రాస్ రాష్ట్రాలుండేవి. ఈ రెండు మల్లాపురంలో తుంగభద్ర ఆనకట్టను సంయుక్త ప్రాజెక్టుగా నిర్మించాలని భావించాయి. ఆంధ్ర రాష్ట్ర చట్టం 1953 ప్రకారం.. రాష్ట్రం ఏర్పాటుతో తుంగభద్ర కుడి గట్టు ఎల్ఎల్‌సీ, 'హెచ్ఎల్‌సీ తలభాగాలు మద్రాస్ రాష్ట్రానికి చెందినవి మైసూరు రాష్ట్రానికి బదిలీ అయ్యాయి. ప్రాజెక్టు కుడి వైపున మైసూర్, ఆంధ్ర రాష్ట్రాలకు సంయుక్తంగా చెందింది. ఆనకట్ట ఎడమ వైపు హైదరాబాద్ రాష్ట్రంలో ఉంది. బచావత్ ట్రైబ్యునల్ ఈ అంశాలు పరిశీలించే సమయానికి ప్రాంతీయ మ్యాప్ 1944 నుంచి మారిపోయింది.

◆ కుడివైపు కాలువను కేసీ కాలువగా, ఎడమవైపు కాలువను ఆర్డీఎస్‌తో పోల్చడం అనేది ఊహాజనితం. బచావత్ ట్రైబ్యునల్ తుంగభద్ర కేటాయింపులకు ఒక అధ్యాయాన్నే కేటాయించి, వాటిని ప్రాజెక్టుల వారీగా నిర్దిష్టంగా నిర్ణయించింది. రాష్ట్ర విభజన చట్టం సెక్షన్ 89 వాటికి రక్షణలు కల్పించింది. ఈ విషయంలో తెలంగాణకు ఏ రకంగానూ చారిత్రక అన్యాయం జరగలేదు.

◆ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఏర్పడటానికి ముందే తుంగభద్ర ఉమ్మడి కాలువను విస్తరించేందుకు మైసూరు, ఆంధ్ర రాష్ట్రాల చర్చలు జరిపాయి. తుంగభద్ర బోర్డు ఆధ్వర్యంలో ఆంధ్రకు 65%, మైసూరుకు 35% నీటి కేటాయింపులకు ఒప్పందం కుదుర్చుకున్నారు. ఇందులో కుడి కాలువకు ఎప్పుడూ వాటా లేదు. ఈ పరిస్థితుల్లో ఈ ఒప్పందానికి నాటి హైదరాబాద్ రాష్ట్రాన్ని పిలవాల్సిన అవసరం లేదు. ఆ రాష్ట్రం ఒప్పందంలో భాగం కాలేదన్న వాదన అర్థరహితం.

◆ 1892, 1933, 1944, 1946 ఒప్పందాలు బచావత్ ట్రైబ్యునల్ ఉత్తర్వుతో రద్దయ్యాయి. 1956 తర్వాత తుంగభద్ర ప్రాజెక్టు నియంత్రణను మార్చి, తుంగభద్ర బోర్డుకు అప్పగించారు.

◆ అప్పట్లో ఆటు ఎస్ఆర్‌బీసీ, తెలంగాణకు ఎస్ఎల్‌బీసీ నిర్మాణం చేపట్టారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో పదేళ్ల కాలంలో శ్రీశైలం ఎడమ గట్టు కాలువ పూర్తిచేశారు. ఆ తర్వాత తెలంగాణ రాష్ట్రం ఏర్పడి 10 ఏళ్లయినా ఆ ప్రాజెక్టును పూర్తి చేసుకోలేకపోయారు. అందుకు సాంకేతిక కారణాలున్నాయే తప్ప, ఆ రాష్ట్రానికి అన్యాయం చేయడమన్న ఉద్దేశం లేదు. ఎస్ఎల్‌బీసీ పూర్తి చేయనందువల్లే ఎలిమినేటి మాధవరెడ్డి ప్రాజెక్టు ఏర్పాటు చేసి, అవే ప్రయోజనాలు అందించారు. ఇక వారికి అన్యాయం ఎక్కడ జరిగింది?

◆ ప్రపంచ బ్యాంకు సాయంతో అప్పట్లో రాయలసీమలో ఎస్ఆర్‌బీసీ, తెలంగాణలో శ్రీరాంసాగర్ ప్రాజెక్టులు నిర్మించారు. సాగర్ నీళ్లు కృష్ణా పరీవాహకమైన నల్గొండ జిల్లాకు కొంత అందాయి. ఎస్ఆర్‌బీసీ నీటి కేటాయింపులు తెలంగాణ కేటాయింపులను ఏ తరహా సబబు?

◆ నాగార్జునసాగర్ ఎడమగట్టు ద్వారా నిర్దేశించిన ఆయకట్టు తగ్గి కుదించేలా పెరిగిందని తెలంగాణ వాదించింది. రెండు వైపులా చెరో 132 టీఎంసీల కేటాయింపులున్నాయి. తెలంగాణలో 6.60 లక్షల ఎకరాల ఆయకట్టు సేద్యాన్ని భావించారు. ప్రారంభంలో 6.02 లక్షల ఎకరాలకే నీళ్లు అందినా.. తర్వాత కాలంలో వైరా ఆయకట్టు, ఇతర ఆనకట్టల ఆయకట్టు క్రమబద్ధీకరణ ద్వారా మొత్తం నిర్ణయించారు. సాగర్ ఎడమ కాలువ కింద తెలంగాణలో ఆయకట్టు తగ్గిందన్న వాదన తప్పు.

◆ 'ఒక పరీవాహక ప్రాంతం నుంచి మరో పరీవాహక ప్రాంతానికి నీళ్లు తీసుకెళ్లడానికి వీలులేదు' అని తెలంగాణ వాదించింది. కృష్ణా నుంచి పెన్నాకు నీళ్లు తీసుకువెళ్లేందుకు వీలులేదని పేర్కొంది. అదే తెలంగాణ.. గోదావరి నుంచి పెన్నాకు నీళ్లు తీసుకువెళ్లడం అని చెబుతోంది. ఇదెలా? గోదావరి నుంచి పెన్నాకు తీసుకువెళ్లాలని అని చెబుతూనే.. పోలవరం-బనకచర్ల, పోలవరం-నల్లమలసాగర్ అనుసంధానానికి అనుమతించొద్దంటూ సుప్రీంకోర్టులో కేసులు దాఖలు చేస్తోంది. ఇదేం తీరు' అంటూ జయదీప్ గుప్తా ప్రశ్నించారు.

రామోజీ ఫిల్మ్‌సిటీలో.. పీఎస్సీ ఛైర్‌పర్సన్ల జాతీయ సదస్సు

- ఈ నెల 19, 20 తేదీల్లో నిర్వహణ
- ముఖ్యఅతిథిగా రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము

ఈనాడు, హైదరాబాద్: దేశంలోని పబ్లిక్ సర్వీస్ కమిషన్(పీఎస్సీ)ల ఛైర్మన్ల జాతీయ సదస్సు ఈనెల 19, 20 తేదీల్లో హైదరాబాద్‌లోని రామోజీ ఫిల్మ్‌సిటీలో నిర్వహించనున్నట్లు టీజీపీఎస్సీ ఛైర్మన్ బుర్రా వెంకటేశం ఒక ప్రకటనలో తెలిపారు. సదస్సును రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ప్రారంభిస్తారని, 20న జరిగే ముగింపు కార్యక్రమానికి ఉప రాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్ హాజరవుతారని పేర్కొన్నారు. కార్యక్రమంలో గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, సీఎం రేవంత్‌రెడ్డి, యూపీఎస్సీ ఛైర్మన్ అజయ్‌కుమార్, సభ్యులు లెఫ్టినెంట్ జనరల్ రాజ్‌శుక్లా, దినేశ్ దాసా, యూపీఎస్సీ కార్యదర్శి శశి రంజన్‌కుమార్, అన్ని రాష్ట్రాల ఛైర్మన్లు, ఉన్నతాధికారులు పాల్గొంటారని వివరించారు. దేశంలోని రాష్ట్రాల పబ్లిక్ సర్వీసు కమిషన్లు, యూపీఎస్సీని ఒకే వేదిక పైకి చేర్చి సంస్కరణలపై చర్చలు నిర్వహించే వేదికగా సదస్సు ఉంటుందన్నారు.

లోక్ అదాలత్‌లో ఒక్కరోజే 3.11 లక్షల కేసుల పరిష్కారం

- రూ.400 కోట్లకు పైగా పరిహారం చెల్లింపునకు అవార్డులు జారీ
- ఈ స్థాయిలో కేసులు పరిష్కారం కావడం ఇదే మొదటిసారి


జస్టిస్ మానవేంద్రనాథ్ రాయ్

ఈనాడు, అమరావతి: జాతీయ లోక్ అదాలత్‌లో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా ఇటీవల నిర్వహించిన లోక్ అదాలత్‌లో గతంలో ఎన్నడూ లేని విధంగా ఒక్కరోజే 3.11 లక్షల కేసులు పరిష్కారమయ్యాయి. ఏపీ న్యాయ సేవాధికార సంస్థ కార్యనిర్వాహక అధ్యక్షులు జస్టిస్ మానవేంద్రనాథ్‌రాయ్ మార్గదర్శకత్వంలో రాష్ట్ర వ్యాప్తంగా శనివారం 433 లోక్ అదాలత్ బెంచ్‌లు నిర్వహించిన విషయం తెలిసిందే. అందులో 3,11,230 కేసులను పరిష్కరించి, రూ.400 కోట్లకు పైగా పరిహారం అందజేతకు అవార్డులు జారీ చేశారు. లోక్ అదాలత్ చరిత్రలో ఒకేరోజు ఇంత భారీగా కేసులు పరిష్కారం కావడం ఇదే మొదటిసారి. రాజీకి అవకాశమున్న పలు కేసులను ఇరువర్గాల మధ్య సామరస్యపూర్వకంగా పరిష్కరించారు. లోక్ అదాలత్ సౌలభ్యాన్ని భవిష్యత్తులోనూ కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని జస్టిస్ మానవేంద్రనాథ్ రాయ్ కోరారు. న్యాయసేవాధికార సంస్థ సభ్య కార్యదర్శి బీఎస్‌వీ హిమబిందు ఈ మేరకు తాజాగా ప్రకటన విడుదల చేశారు.

పవన్‌కల్యాణ్ ఛైర్‌పర్సన్‌గా 'హనుమాన్' గవర్నింగ్ బాడీ

ఈనాడు, అమరావతి: ఆంధ్రప్రదేశ్‌లో వన్యప్రాణులు, ప్రజల మధ్య సంఘర్షణను నియంత్రించేందుకు అమలు చేయనున్న హీలింగ్ అండ్ నర్చరింగ్ యూనిట్స్ ఫర్ మానిటరింగ్ ఎయిడ్ అండ్ నర్సింగ్ వైల్డ్‌లైఫ్ (హనుమాన్) ప్రాజెక్ట్ కోసం ప్రభుత్వం గవర్నింగ్ బాడీని ఏర్పాటు చేసింది. దీనికి 'ఆంధ్రప్రదేశ్ హ్యూమన్-వైల్డ్‌లైఫ్ కాన్‌ఫ్లిక్ట్ మిటిగేషన్ ఫౌండేషన్' అని నామకరణం చేసింది. ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ ఛైర్‌పర్సన్‌గా అటవీ శాఖ కార్యదర్శి, పీసీసీఎఫ్ సహా మొత్తం 18 మంది సభ్యులతో ఈ ఫౌండేషన్ ఏర్పాటు చేసింది. సొసైటీల చట్టం కింద రిజిస్ట్రేషన్‌కు అనుమతిచ్చింది. ఈ మేరకు అటవీ శాఖ కార్యదర్శి కాంతిలాల్ దండే బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఆవాస ప్రాంతాల నిర్వహణ, అభివృద్ధి ద్వారా మానవ, వన్యప్రాణి సంఘర్షణను నియంత్రించటం, వన్యప్రాణుల్ని సంరక్షిస్తూనే మనుషులు, పంటలు, ఆస్తుల్ని వాటి బారిన పడకుండా కాపాడటం, పరిహారం చెల్లింపు వేగవంతం చేయడం వంటి కార్యకలాపాలను హనుమాన్ ప్రాజెక్టులో భాగంగా చేపట్టనున్నారు.

తిరుపతిలో 'డెల్లా వసుధైక కుటుంబ అంతర్జాతీయ టౌన్‌షిప్'

- 1,400 ఎకరాల్లో నిర్మాణానికి ప్రణాళిక

ఈనాడు, అమరావతి: తిరుపతిలో డెల్లా వసుధైక కుటుంబ అంతర్జాతీయ టౌన్‌షిప్‌ను అభివృద్ధి చేయనున్నారు. డెల్లా టౌన్‌షిప్స్ సంస్థ 1,400 ఎకరాల విస్తీర్ణంలో ఈ ప్రాజెక్టును చేపడుతుంది. మొత్తం స్థూల అభివృద్ధి విలువతో (జీడీవీ) కలిపి సుమారు రూ.35 వేల కోట్లతో హిందూమతంపై ప్రపంచంలోనే తొలి 5,000 ఏళ్ల జీవన ప్రదర్శన (లివింగ్ ఎగ్జిబిషన్)ను ఏర్పాటు చేయనున్నారు. డిజైన్ ఫ్యూచరిస్ట్, డెల్లా టౌన్‌షిప్స్ వ్యవస్థాపకులు జిమ్మీ మిస్త్రీ సహకారంతో ఈ ప్రాజెక్టును నిర్మిస్తారు. దీని ద్వారా 20 వేల మందికి ఉద్యోగ అవకాశాలు లభించనున్నాయి. ఇందులో స్థానికులకే 80 శాతం మేర ఉద్యోగాలు కేటాయించనున్నారు. విశాఖలో నిర్వహించిన పెట్టుబడుదారుల సదస్సులో సీఎం చంద్రబాబు సమక్షంలో రాష్ట్ర ప్రభుత్వంతో చేసుకున్న ఒప్పందం వివరాలు,


డెల్లా వసుధైక కుటుంబ అంతర్జాతీయ టౌన్‌షిప్ నమూనా చిత్రం

ప్రాజెక్టు ప్రత్యేకతలను డెల్లా టౌన్‌షిప్ సంస్థ నిర్వాహకులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. తిరుమల తిరుపతి దేవస్థానం (తితిదే), రాష్ట్ర పర్యాటకశాఖల భాగస్వామ్యంతో ఈ ప్రాజెక్టును అభివృద్ధి చేయనున్నట్లు సంస్థ పేర్కొంది.

◆ హిందూమతానికి సంబంధించిన విభిన్న జ్ఞాన పరంపరలు, సంప్రదాయాలు, ఆచారాలను దేశవ్యాప్తంగా ఏకీకృతం చేయడం ప్రాజెక్టు ప్రధాన లక్ష్యం

◆ 300 ఎకరాల్లో లివింగ్ ఎగ్జిబిషన్ ఏర్పాటు చేస్తారు. ఇందులో ఒక్కొక్కటి లక్ష చదరపు అడుగుల విస్తీర్ణంలో 25 పెవిలియన్లు ఉంటాయి. సింధూలోయ నాగరికత నుంచి ఆధునిక హిందూ తత్వచింతన వరకూ భారత నాగరికతను ఇవి ప్రతిబింబిస్తాయి.

◆ వేద విజ్ఞాన వ్యవస్థలు, శాస్త్రీయ కళలు, ఆలయ నిర్మాణ శిల్పం, ఆచారాలు, ప్రాంతీయ సంప్రదాయాలు వంటివి ప్రదర్శనలో ఉంటాయి. అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలు తమ పెవిలియన్ల రూపకల్పనలో భాగస్వాములు కావాలని నిర్వాహకులు ఆహ్వానించనున్నారు.

◆ లివింగ్ ఎగ్జిబిషన్‌తోపాటు విలాసవంతమైన నివాసాలు, ప్రైవేట్ విల్లాలు అభివృద్ధి చేయనున్నారు.

◆ 600కు పైగా గదులతో ఫైవ్ స్టార్ రిసార్ట్‌లు.

◆ డెస్టినేషన్ వెడ్డింగ్ వేదికలు అందుబాటులోకి రానున్నాయి.

ఏపీకి కేంద్రం ప్రత్యేక ఆర్థికసాయం చేయాలి

- వీబీ-జీ రామ్ జీ బిల్లుపై చర్చలో తెదేపా నేత లావు శ్రీకృష్ణదేవరాయలు వినతి

ఈనాడు, దిల్లీ: రాష్ట్ర విభజన నాటినుంచి ఆంధ్రప్రదేశ్ రెవెన్యూ లోటుతో సతమతమవుతున్న నేపథ్యంలో 'వికసిత్ భారత్ రోజ్‌గార్, ఆజీవికా హామీ మిషన్ (గ్రామీణ్) (వీబీ-జీ రామ్ జీ)' అమలుకు రాష్ట్ర ప్రభుత్వం నుంచి 40% వాటా సమకూర్చడం భారంగా మారుతుందని తెలుగుదేశం పార్లమెంటరీ పార్టీ నాయకుడు లావు శ్రీకృష్ణదేవరాయలు అన్నారు. అందువల్ల కేంద్ర ప్రభుత్వం ఆర్థికంగా ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. బుధవారం రాత్రి ఈ బిల్లుపై జరిగిన చర్చలో ఆయన మాట్లాడారు. "దేశంలోని పరిస్థితులు, ప్రజల ఆకాంక్షలు, ఆర్థిక వ్యవస్థలో వచ్చిన మార్పులను దృష్టిలో ఉంచుకొని కేంద్ర ప్రభుత్వం ఉపాధి హామీ పథకంలో మార్పులు తీసుకొచ్చింది. ఆ మార్పులను మేం స్వాగతిస్తున్నాం. అయితే ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్ నుంచి కొన్ని విజ్ఞాపనలు చేస్తున్నాం. 2014లో అశాస్త్రీయంగా విభజన చేసిన నాటి నుంచి రాష్ట్రం రెవెన్యూ లోటుతో నడుస్తోంది. ఇబ్బందికరంగా ఉన్న ఆంధ్రప్రదేశ్ ఆర్థిక పరిస్థితిని ఎప్పటికప్పుడు కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకొస్తున్నాం.


లోక్‌సభలో మాట్లాడుతున్న లావు శ్రీకృష్ణదేవరాయలు

అయితే 2019-24 మధ్యకాలంలో అప్పటి రాష్ట్ర ప్రభుత్వం మూలన పడేసిన 92 కేంద్ర ప్రాయోజిత పథకాలను ప్రధానమంత్రి, కేంద్ర ప్రభుత్వ సహకారంతో ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వం పునరుద్ధరించి విజయవంతంగా నడుపుతోంది. వాటికితోడు ఇప్పుడు కేంద్ర ప్రభుత్వం కొత్తగా తెస్తున్న ఉపాధి హామీ పథకానికి రాష్ట్ర ప్రభుత్వాలు 40% నిధులు సమకూర్చాలన్న నిబంధన ఆంధ్రప్రదేశ్‌కు కష్టంగా మారుతుంది. అందువల్ల కేంద్ర ప్రభుత్వం రాష్ట్ర పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని తగిన సాయంచేయాలి. అప్పుడే దీన్ని విజయవంతంగా అమలుచేయడానికి వీలవుతుంది" అని పేర్కొన్నారు. పథకం అమలులో కొన్ని మార్పులు చేయాలని శ్రీకృష్ణదేవరాయలు సూచించారు. ఆ వివరాలు..

1. మోసాలను అరికట్టే వ్యవస్థను బలోపేతం చేయాలి. గత పదేళ్లలో ఆంధ్రప్రదేశ్‌లో రూ.82 కోట్ల మోసానికి సంబంధించిన 1,11,932 కేసులు నమోదయ్యాయి. ఇందులో నుంచి కేవలం రూ.48 కోట్లు మాత్రమే రికవరీ చేశారు. ఎక్కడా ఇందుకు బాధ్యులైన వారిపై చర్యలు తీసుకున్న దాఖలా కనిపించలేదు. అందువల్ల నిధుల దుర్వినియోగం జరగకుండా ఇందులో కట్టుదిట్టమైన నిబంధన విధించాలి.
2. టెక్నికల్ అసిస్టెంట్ల సంఖ్యను పెంచాలి. ప్రస్తుతం నాలుగు గ్రామపంచాయతీలకు కలిపి ఒక టెక్నికల్ అసిస్టెంట్‌ను నియమించారు. ఒక వ్యక్తి మూడు రోజుల్లో 16 పని స్థలాలను కొలవడం అసాధ్యం. దానివల్ల కొలతలు, ఇతర అంశాల్లో మోసాలు చేస్తున్నారు. దీన్ని నివారించడానికి టెక్నికల్ అసిస్టెంట్ల సంఖ్యను పెంచాలి.
3. కార్మికుల వేతనాలను వ్యవసాయ వినియోగ ధరల సూచి ఆధారంగా కాకుండా గ్రామీణ ధరల సూచీ ఆధారంగా నిర్ణయించాలి.
4. సాధారణ పనులు కాకుండా పల్లెలకు పనికొచ్చే ఆస్తుల కల్పన చేయాలి. వ్యక్తిగత ఆస్తుల సృష్టి కాకుండా సామాజిక ఆస్తుల సృష్టికి ప్రాధాన్యం ఇవ్వాలి.
5. ప్రతి రాష్ట్రం తప్పనిసరిగా సామాజిక ఆడిట్‌లు నిర్వహించేలా చూడాలి. ఇందుకోసం స్వతంత్ర వ్యవస్థలు ఏర్పాటయ్యేలా చర్యలు తీసుకోవాలి.

పొట్టిశ్రీరాములు స్మృతివనానికి జీవీ ఆంజనేయులు రూ.10 లక్షల విరాళం

ఈనాడు, అమరావతి: రాజధాని అమరావతిలో నిర్మించనున్న అమరజీవి పొట్టి శ్రీరాములు 58 అడుగుల విగ్రహం, స్మృతివనానికి ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు రూ.10 లక్షల విరాళం ఇచ్చారు. చెక్కును చంద్రబాబు సమక్షంలో పొట్టి శ్రీరాములు మెమోరియల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ డూండి రాకేశ్‌కు అందజేశారు. కార్యక్రమంలో తెదేపా నేత కె.శ్రీనివాస్ పాల్గొన్నారు.


చంద్రబాబు సమక్షంలో రాకేశ్‌కు చెక్కు అందజేస్తున్న ఆంజనేయులు. చిత్రంలో పార్టీ నేత శ్రీనివాస్

మచిలీపట్నంలో భోగరాజు పట్టాభి సీతారామయ్య స్మారకం

ఈనాడు, అమరావతి: ఆంధ్రా బ్యాంకు వ్యవస్థాపకుడు భోగరాజు పట్టాభి సీతారామయ్య స్మారకానికి మచిలీపట్నంలో 2 ఎకరాల్ని కేటాయించాలని కృష్ణా జిల్లా కలెక్టరుకు ముఖ్యమంత్రి చంద్రబాబు సూచించారు. కలెక్టర్ల సదస్సులో ఈ అంశం ప్రస్తావనకు వచ్చింది. 'విలీనం కారణంగా ఆంధ్రా బ్యాంకుకు గుర్తింపు పోయింది. ఆయన జ్ఞాపకార్థం స్మారక భవనం కట్టుకుంటామంటే భూమి కూడా ఇవ్వలేమా? వెంటనే ప్రతిపాదనలు పంపండి. మంత్రివర్గ సమావేశంలో ఆమోదిస్తాం' అని సీఎం అన్నారు.

పనిదినాలు పెంచడం మంచిదే.. కానీ సాధ్యమా?

వైకాపా ఎంపీ అవినాష్‌రెడ్డి

ఈనాడు, దిల్లీ: నూతన ఉపాధి హామీ పథకంలో పనిదినాలను 100 నుంచి 125 రోజులకు పెంచడం మంచిదేనని వైకాపా సభ్యుడు వైఎస్ అవినాష్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం ఆయన లోక్‌సభలో 'వికసిత్ భారత్ రోజ్‌గార్, ఆజీవికా హామీ మిషన్ (గ్రామీణ్) (వీబీ-జీ రామ్ జీ) బిల్లు- 2025'పై జరిగిన చర్చలో మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వాలు ఈ పథకానికి 40% నిధులు సమకూర్చాల్సి ఉందని, ఆర్థిక సమస్యల కారణంగా అవి ఆ మొత్తం సమకూర్చే పరిస్థితి ఉండకపోవచ్చని అనుమానం వ్యక్తంచేశారు. దానివల్ల ఆచరణలో 125 రోజుల పనిదినాల అమలు సాధ్యం కాదన్నారు. ఈ బిల్లును జేపీసీ, లేదంటే సెలెక్ట్ కమిటీకి పంపి విస్తృత అధ్యయనం చేయించాలని సూచించారు. అక్కడి నుంచి వచ్చిన సిఫార్సుల ఆధారంగా తగిన మార్పులు చేయాలని కోరారు. అప్పుడే గ్రామీణ ప్రజల హక్కులకు రక్షణ లభిస్తుందని అవినాష్‌రెడ్డి చెప్పారు.

ఏజీఐసీఎల్ ఎండీగా శ్రీనివాస్ బాధ్యతల స్వీకరణ



ఈనాడు, అమరావతి: రాజధాని అమరావతి అభివృద్ధిలో భాగంగా కొత్తగా ఏర్పాటైన అమరావతి గ్రోత్, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ (ఏజీఐసీఎల్) మేనేజింగ్ డైరెక్టర్‌గా విశ్రాంత ఐఏఎస్ అధికారి ఎస్వీఆర్ శ్రీనివాస్ బుధవారం బాధ్యతలు చేపట్టారు. రాయపూడిలోని సీఆర్‌డీఏ ప్రధాన కార్యాలయంలో ఈ కార్యక్రమం జరిగింది. ఎండీ శ్రీనివాస్‌కు అధికారులు, సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు. 1989 బ్యాచ్ మహారాష్ట్ర క్యాడర్‌కు చెందిన శ్రీనివాస్‌కు పాలనా సంస్కరణలు, పట్టణాభివృద్ధి, మౌలిక సదుపాయాల కల్పన, పోర్టుల అభివృద్ధి తదితర కార్యకలాపాల్లో విశేష అనుభవం ఉంది. ప్రత్యేక వాహక నౌక (ఎస్పీవీ)గా ఏర్పాటైన ఏజీఐసీఎల్.. అమరావతి నిర్మాణంలో కీలక పాత్ర పోషిస్తుందని శ్రీనివాస్ అన్నారు. గ్రీన్‌ఫీల్డ్ విమానాశ్రయం, ఎన్టీఆర్ విగ్రహం, స్మార్ట్ పరిశ్రమలు, ఐకానిక్ వంతెన, స్పోర్ట్స్ సిటీ, రివర్‌ఫ్రంట్ అభివృద్ధి, రోప్‌వే, ఇన్నర్‌రింగ్ రోడ్డు, ఇతర ప్రత్యేక ప్రాజెక్టులను ఏజీఐసీఎల్ పర్యవేక్షించనుంది.

ఈ పుస్తకాలతో సంపద సృష్టిపై అవగాహన



సంపద సృష్టి, ఆర్థిక క్రమశిక్షణను అలవరచుకునేందుకు యువ మదుపుదారులు ఈ మూడు పుస్తకాలను పరిశీలించాలి. **1.** అటామిక్ హేబిట్స్. ఈ పుస్తకం అత్యుత్తమ ఫలితాలందించే అలవాట్లపై గొప్ప అవగాహనను కలిగిస్తుంది. **2.** ది సింపుల్ పాత్ టు వెల్త్. ఈ పుస్తకం పెట్టుబడులు, పొదుపు, ఆర్థిక స్వేచ్ఛ వంటి అంశాలను విశదీకరిస్తుంది. **3.** ఐ విల్ టీచ్ యూ టు బి రిచ్. దీని ద్వారా నగదు నిర్వహణ, తెలివైన ఆర్థిక నిర్ణయాలు తీసుకోవడం ఎలా? అనే విషయాలను తెలుసుకోవచ్చు.

– టోబీ, ఫైనాన్స్ ఎడ్యుకేటర్

ఎన్‌పీఎస్‌లో 80% నిధులు వెనక్కి తీసుకోవచ్చు

- ప్రభుత్వేతర చందాదార్లకు అనుమతి: పీఎఫ్‌ఆర్‌డీఏ

దిల్లీ: జాతీయ పింఛను వ్యవస్థ (ఎన్‌పీఎస్)లో ప్రభుత్వేతర చందాదార్లు బయటకు వచ్చే సమయం (ఎగ్జిట్)లో అప్పటి వరకు జమ అయిన మొత్తంలో (కార్పస్) 80% వరకు నిధులు వెనక్కి తీసుకోవచ్చని పింఛను నిధి నియంత్రణ, అభివృద్ధి ప్రాధికార సంస్థ (పీఎఫ్‌ఆర్‌డీఏ) వెల్లడించింది. ఇంతకు ముందు ఉపసంహరణ పరిమితి 60 శాతంగా ఉండేది. మిగిలిన మొత్తాన్ని యాన్యుటీలు కొనుగోలు చేయడానికి వినియోగించాలి. దీనిపై నెలవారీ, పీరియాడికల్ పెన్షన్ అందించే సదుపాయం ఉండేది. ఎగ్జిట్ వయసు కూడా గతంలో ఉన్న 70 ఏళ్లను ప్రస్తుతం 85 ఏళ్లకు పెంచింది. 2025 డిసెంబరు 12న తీసుకొచ్చిన పీఎఫ్‌ఆర్‌డీఏ (ఎగ్జిట్స్ అండ్ విత్‌డ్రాయల్స్ అండర్ ది నేషనల్ పెన్షన్ సిస్టమ్) (అమెండ్‌మెంట్) రెగ్యులేషన్స్ 2025 ప్రకారం, నియంత్రిత ఆర్థిక సంస్థల నుంచి పీఎఫ్‌ఆర్‌డీఏ నిర్దేశించిన పరిమితి మేరకు ఎన్‌పీఎస్ ఖాతాలపై రుణాలు తీసుకునే సదుపాయం కూడా కల్పించింది.

◆ పెన్షన్ కార్పస్ రూ.8 లక్షల్లోపు ఉంటే, చందాదారు మొత్తం వెనక్కి తీసుకునే అవకాశం కల్పించింది. ఒకవేళ వద్దనుకుంటే క్రమానుగత ఉపసంహరణకు అవకాశం ఉంది. పాక్షిక ఉపసంహరణలు కూడా గతంలో 3 సార్లు కాగా, దాన్ని నాలుగుసార్లకు పెంచింది. పదవీ విరమణ వయసు 60 ఏళ్లు దాటిన తర్వాత పాక్షిక ఉపసంహరణలు మూడేళ్ల వ్యవధితో మూడు సార్లు చేసుకోవచ్చు. యాన్యుటీ భాగాన్ని 20 శాతానికి తగ్గించడంతో నియంత్రణ సంస్థ ఎన్‌పీఎస్ చందాదార్లకు ఎంతో ప్రయోజనం కలిగించింది. వారి అవసరాలకు ఈ నిధులు వినియోగించుకోవచ్చు.

◆ ప్రభుత్వ రంగంలోని ఎన్‌పీఎస్ చందాదార్లకు ఎగ్జిట్ వయసు 75 నుంచి 85 సంవత్సరాలకు పెంచింది. వారు మాత్రం పదవీ విరమణ సమయంలో ఎన్‌పీఎస్ మొత్తం 60% ఉపసంహరించుకోవచ్చు. మిగిలిన 40 శాతంతో యాన్యుటీలు కొనుగోలు చేయాలి. 60% ఉపసంహరణ మొత్తాన్ని కూడా ఒక్కసారిగా లేదా క్రమానుగత ఉపసంహరణ విధానంలో వెనక్కి తీసుకునే అవకాశం ఉంది. ఒకవేళ ఉపసంహరణ మొత్తం రూ.5 లక్షలు లేదా అంతకంటే తక్కువగా ఉంటే, పూర్తిగా ఏక మొత్తంలో ఎగ్జిట్ సమయంలో వెనక్కి తీసుకోవచ్చు.

విశాఖ అందాలను తిలకించిన అమెరికా కాన్సుల్ జనరల్


గాజు వంతెనపై లారా విలియమ్స్

విశాఖపట్నం (విశాలాక్షినగర్), న్యూస్‌టుడే: అమెరికా కాన్సుల్ జనరల్ లారా విలియమ్స్ బుధవారం విశాఖలోని కైలాసగిరిపై ఇటీవల ఏర్పాటు చేసిన గాజు వంతెనను సందర్శించారు. వీఎంఆర్డీఏ, రెవెన్యూ అధికారులు ఆమెకు వంతెన విశేషాలు వివరించారు. అనంతరం ఆమె జిప్‌లైనర్, స్కై సైక్లింగ్ వద్ద ఫొటోలు దిగారు. బ్యాటరీ కారులో, అద్దాల రైల్లో కొద్దిసేపు విహరించి విశాఖ నగర అందాలను వీక్షించారు. అంతకుముందు పలు ఆలయాలను దర్శించుకున్నారు.

అపురూప శాసనానికి ప్రతిరూపం సిద్ధం

21న ఆవిష్కరణకు స్వర్ణ భారత్ ట్రస్టు చర్యలు


కలమల్లలో లభించిన శాసనం


ఆవిష్కరణకు సిద్ధంగా ఉన్న శాసన ప్రతిరూపం

ఈనాడు, కడప: తొలి తెలుగు శాసనానికి ప్రతిరూపాన్ని తయారు చేసి భావితరాలకు అందించేందుకు స్వర్ణ భారత్ ట్రస్టు చర్యలు చేపట్టింది. వైఎస్సార్ కడప జిల్లా ఎర్రగుంట్ల మండలం కలమల్లలోని శ్రీలక్ష్మీ చెన్నకేశవ స్వామి ఆలయంలో ఐదో శతాబ్దం నాటి తెలుగు రాతి శాసనం వెలుగు చూసింది. ఐదున్నర అడుగులు ఉన్న శాసనం దెబ్బతిని ప్రస్తుతం 4 అడుగులే మిగిలింది. గతేడాది ఇక్కడ జరిగిన తెలుగు భాషా దినోత్సవానికి ముఖ్య అతిథిగా హాజరైన పూర్వ ఉపరాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు విషయం తెలుసుకొని.. స్వర్ణ భారత్ ట్రస్టు ద్వారా శాసనం ప్రతిరూపం తయారు చేయాలని ఆలోచన చేశారు. ఆ మేరకు ట్రస్టు మేనేజింగ్ ట్రస్టీ దీపా వెంకట్ చర్యలు చేపట్టారు. శాసన ప్రతిరూపాన్ని ఈ నెల 21న జానుమద్ది సాహితీ పీఠం ఆధ్వర్యంలో కడపలోని సీపీ బ్రౌన్ భాషా పరిశోధన కేంద్ర ప్రాంగణంలో అధికారికంగా ఆవిష్కరించనున్నారు.

తెలంగాణలో కాంగ్రెస్ 'తీన్'మార్

- పంచాయతీ ఎన్నికల మూడు విడతల్లోనూ పైచేయి

ఈనాడు, హైదరాబాద్: తెలంగాణలో జరిగిన గ్రామ పంచాయతీ ఎన్నికల్లో కాంగ్రెస్ జయకేతనం ఎగురవేసింది. మొదటి, రెండు విడతల్లో సుమారు 56 శాతం స్థానాలను గెలిచిన పార్టీ మూడో విడతలోనూ అదే ఆధిక్యాన్ని కొనసాగించింది. బుధవారం మొత్తం 4,146 స్థానాలకు జరిగిన ఎన్నికల్లో ఏకగ్రీవాలతో కలిపి(రాత్రి 11 గంటల వరకు) కాంగ్రెస్ మద్దతుదారులు 2,235కి పైగా స్థానాలను గెలిచారు. భారాస 1,153కి పైగా, భాజపా 242, ఇతరులు 498 స్థానాల్లో విజయం సాధించారు. సిద్దిపేట మినహా మిగిలిన 30 జిల్లాల్లోనూ కాంగ్రెస్ పార్టీ విజయం సాధించింది. 31 జిల్లాల్లోని 12,733 పంచాయతీ సర్పంచి పదవులకు మూడు విడతల్లో ఎన్నికలు జరిగాయి. ఇందులో 6,830 స్థానాల్లో కాంగ్రెస్ ఆధిక్యం సాధించింది. 3,513 స్థానాల్లో భారాస గెలుపొందింది. భాజపా ఏడు వందల స్థానాలు పొందగా... ఇతరులు 1,653 స్థానాలు గెలిచారు. నల్గొండ, ఖమ్మం, భద్రాద్రి, హనుమకొండ, జగిత్యాల, జయశంకర్ భూపాలపల్లి, మహబూబాబాద్, మహబూబ్‌నగర్, మంచిర్యాల, నాగర్‌కర్నూల్, నిజామాబాద్, పెద్దపల్లి, రంగారెడ్డి, సంగారెడ్డి, సూర్యాపేట, వికారాబాద్, కామారెడ్డి, యాదాద్రి జిల్లాల్లో అత్యధిక మెజారిటీలను కాంగ్రెస్ సాధించింది. వార్డు సభ్యులు ఎన్నికలు పూర్తి కాగా వారితో ఉపసర్పంచుల ఎన్నికలను అధికారులు పూర్తి చేశారు.

అక్కడ జగన్‌పై చంద్రబాబు విజయం

జూలూరుపాడు, న్యూస్‌టుడే: తెలంగాణ పంచాయతీ ఎన్నికల్లో చోటుచేసుకున్న విశేషమిది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా జూలూరుపాడు మండలం గుండ్లరేవు పంచాయతీ సర్పంచి ఎన్నికల్లో భూక్యా చంద్రబాబు.. తన ప్రత్యర్థి బానోత్ జగన్నాథం అలియాస్ జగన్‌పై 100 ఓట్ల ఆధిక్యంతో గెలుపొందారు. వీరిద్దరూ కాంగ్రెస్ పార్టీకి చెందిన వారే. బుధవారం జరిగిన ఎన్నికల్లో చంద్రబాబుకు 480 ఓట్లు రాగా.. జగన్‌కు 380 ఓట్లు వచ్చాయి. మొత్తం 934 మంది ఓటర్లలో 862 మంది తమ ఓటుహక్కును వినియోగించుకున్నారు. చంద్రబాబు మద్దతుదారులైన అభ్యర్థులు 6 వార్డుల్లో గెలుపొందగా.. ప్రత్యర్థి మద్దతుదారులకు 4 వార్డులు దక్కాయి.

తెలంగాణలో ఐదుగురు ఎమ్మెల్యేలపై అనర్హత పిటిషన్ల కొట్టివేత

ఈనాడు, హైదరాబాద్: తెలంగాణలోని ఎమ్మెల్యేల అనర్హత వ్యవహారంలో దాఖలైన పిటిషన్లపై శాసనసభాపతి గడ్డం ప్రసాద్‌కుమార్ కీలక నిర్ణయం తీసుకున్నారు. తమ పార్టీకి చెందిన పది మంది ఎమ్మెల్యేలు పార్టీ ఫిరాయించారని, వారిపై అనర్హత వేటు వేయాలని భారాస ఎమ్మెల్యేలు దాఖలు చేసిన వేర్వేరు పిటిషన్లపై విచారణ చేపట్టిన ఆయన.. ఎమ్మెల్యేలు తెల్లం వెంకట్రావు, బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి, గూడెం మహిపాల్‌రెడ్డి, టి.ప్రకాశ్‌గౌడ్, అరెకపూడి గాంధీలకు సంబంధించిన అనర్హత పిటిషన్లను కొట్టివేశారు. భారత రాజ్యాంగంలోని పదో షెడ్యూల్ నిబంధనల ప్రకారం దాఖలైన పార్టీ ఫిరాయింపు కేసుల్లో బుధవారం ఆయన తీర్పు వెలువరించారు. మరో నలుగురు ఎమ్మెల్యేలు పోచారం శ్రీనివాస్‌రెడ్డి, కాలె యాదయ్య, సంజయ్‌కుమార్‌లకు సంబంధించిన అనర్హత పిటిషన్లపై తీర్పును ఒకట్రెండు రోజుల్లో వెల్లడించే అవకాశాలున్నట్లు తెలుస్తోంది. అయితే నోటీసులు ఇచ్చిన తర్వాత నెలలుగా సమయం తీసుకున్న ఎమ్మెల్యే కడియం శ్రీహరి తాజాగా స్పీకర్‌కు తన సమాధానాన్ని ఇచ్చారు. దీంతో నోటీసులు స్వీకరించిన వారిలో ఎమ్మెల్యే దానం నాగేందర్ ఒక్కరే సమాధానం ఇవ్వనట్లుగా తెలుస్తోంది.

మరో వంద స్వచ్ఛ రథాలు వస్తున్నాయ్!

- ఫలించిన ప్రయోగాత్మక విధానం
- అన్ని జిల్లాల్లో అమలుకు చర్యలు

ఈనాడు, అమరావతి: రాష్ట్రంలో మరో వంద స్వచ్ఛ రథాలను త్వరలో ప్రారంభించనున్నారు. ప్రతి ఉమ్మడి జిల్లాకు 6 నుంచి 8 చొప్పున వీటిని కేటాయించనున్నారు. పలు జిల్లాల్లో ప్రయోగాత్మకంగా ప్రారంభించిన ఈ స్వచ్ఛ రథాలతో మంచి ఫలితాలు రావడంతో రాష్ట్రవ్యాప్తంగా వీటిని ప్రారంభించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ప్రజలు తమ ఇళ్లలోని ప్లాస్టిక్ వ్యర్థాల మొదలు పాత పుస్తకాల వరకూ స్వచ్ఛ రథాలకు ఇచ్చి, అవసరమైన నిత్యావసరాలు తీసుకెళ్లొచ్చు. గ్రామాల్లో పారిశుద్ధ్య సమస్య పరిష్కారం కోసం ఈ విధానాన్ని జులై 10న గుంటూరు గ్రామీణ మండలంలోని 11 పంచాయతీల్లో ప్రయోగాత్మకంగా స్వచ్ఛరథాల ద్వారా ప్రారంభించారు. అక్కడ వీటి ద్వారా మురుగు కాలువల్లో పడేస్తున్న పాడైన ప్లాస్టిక్ వస్తువులు, పాత పుస్తకాలు, పేపర్లు, కాపర్, అల్యూమినియం, ఐరన్ తదితర వస్తువులను సేకరించి అవసరమైన నిత్యావసరాలు అందిస్తున్నారు. ఫలితాలు బాగుండటంతో మరో ఐదు జిల్లాల్లోనూ ప్రయోగాత్మకంగా రథాలు ప్రారంభించారు. నాలుగు నెలల్లో ఆరు



గుంటూరు గ్రామీణ మండలంలో స్వచ్ఛరథం వద్ద ప్రజల సందడి

జిల్లాల్లో కలిపి మొత్తం 1.92 లక్షల కిలోల ఘన వ్యర్థాలు సేకరించి రూ.2.95 కోట్ల విలువైన నిత్యావసరాలు ప్రజలకు అందించారు. స్వచ్ఛ రథాలు ఏర్పాటు చేసిన పంచాయతీల్లో పారిశుద్ధ్య సమస్య కూడా పరిష్కారమైనట్లు అధికారులు గుర్తించారు. ప్రత్యేకించి మురుగు కాలువల్లో ప్లాస్టిక్ వ్యర్థాలు, ఇతర ఘన వ్యర్థాలు పారబోసే విధానానికి పరిష్కారం లభించింది. దీంతో అన్ని జిల్లాల్లోనూ ఈ స్వచ్ఛ రథాలు ప్రవేశపెట్టాలన్న ప్రభుత్వ ఆదేశాలతో రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ 100 వాహనాలు సిద్ధం చేస్తోంది. అందుకు సంబంధించి ఆ శాఖ అధికారులు ప్రత్యేక మార్గదర్శకాలు జారీ చేశారు. వాటికి అనుగుణంగా స్వచ్ఛ రథాలు ప్రారంభించాలని జిల్లా అధికారులను ఆదేశించారు.

✦ గుంటూరు, కృష్ణా, తిరుపతి, నంద్యాల, పల్నాడు, ఎన్టీఆర్ జిల్లాల్లో ప్రయోగాత్మకంగా నిర్వహిస్తున్న స్వచ్ఛ రథాల నుంచి ఇప్పటివరకు సేకరించిన ప్లాస్టిక్ వస్తువులు, పేపర్లు ఇతర ఘన వ్యర్థాల వివరాలు..

✦ ఆరు జిల్లాల్లో ప్రస్తుతం తిప్పుతున్న స్వచ్ఛ రథాలు: 25

✦ ఇప్పటివరకు సేకరించిన ఘన వ్యర్థాలు: 1,92,448 కిలోలు

☛ ప్రజలకు ఇచ్చిన నిత్యావసరాల విలువ: రూ.2.95 కోట్లు

ఉమ్మడి జిల్లాల్లో కొత్తగా ప్రారంభించనున్న స్వచ్ఛ రథాలు

జిల్లా	రథాల సంఖ్య
అనంతపురం	8
చిత్తూరు	8
తూర్పుగోదావరి	8
ప్రకాశం	8
గుంటూరు	8
కడప	8
కృష్ణా	6
కర్నూలు	8
నెల్లూరు	8
శ్రీకాకుళం	8
విశాఖపట్నం	8
విజయనగరం	6
పశ్చిమగోదావరి	8

ప్రైవేటు విద్యా సంస్థలకు అగ్నిమాపక నిరభ్యంతర పత్రంలో వెసులుబాటు

ఈనాడు, అమరావతి: రాష్ట్రంలో 30 మీటర్ల ఎత్తు వరకు భవనాలున్న ప్రైవేటు విద్యా సంస్థలు ఐదేళ్లకోసారి అగ్నిమాపక శాఖ నిరభ్యంతర పత్రం రెన్యువల్ చేసుకునేలా వెసులుబాటు కల్పిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు గత ప్రభుత్వం తెచ్చిన విధానాన్ని మంత్రి లోకేశ్ సరిదిద్దారు. వైకాపా హయాంలో ప్రైవేటు విద్యా సంస్థలను వేధించడంలో భాగంగా అగ్నిమాపక శాఖ నుంచి ఏటా నిరభ్యంతర పత్రం తీసుకోవాలనే నిబంధన పెట్టారు. దీంతో వారు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. యువగళం పాదయాత్రలో ఈ విషయం లోకేశ్ దృష్టికి రావడంతో తెదేపా అధికారంలోకి వస్తే కాలపరిమితిని ఐదేళ్లకు పెంచుతామని ఆయన హామీ ఇచ్చారు. ఇటీవల ఎమ్మెల్సీలు భూమిరెడ్డి రాంగోపాల్‌రెడ్డి, కంచర్ల శ్రీకాంత్, వేపాడ చిరంజీవి, ఆలపాటి రాజేంద్రప్రసాద్, రాజశేఖర్‌లు మంత్రి లోకేశ్ దృష్టికి తీసుకువెళ్లారు. ఆయన వెంటనే దీనిపై చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

వల వేయగా..
చిక్కింది భారీ వాలుగ!



నంద్యాల జిల్లా చాగలమర్రి మండలంలోని చింతలచెరువు సమీపం భైరవగుండాలలోని తెలుగుగంగ మినీ రిజర్వాయర్‌లో ఓ యువకుడికి భారీ చేప చిక్కింది. చాగలమర్రికి చెందిన సిద్దిఖ్ బుధవారం చేపల వేటకు వెళ్లి.. రిజర్వాయర్‌లో వల వేశాడు. కొద్దిసేపటికే 12 కిలోల వాలుగ చేప వలలో పడింది. ఈ జలాశయంలో ఇంత పెద్దచేప చిక్కడం ఇదే తొలిసారి అని యువకుడు ఆనందం వ్యక్తం చేశారు. చేపను రూ.3 వేలకు విక్రయించినట్లు తెలిపారు.

– న్యూస్‌టుడే, చాగలమర్రి

జీ రామ్‌జీకి వ్యతిరేకంగా రేపు దేశవ్యాప్త నిరసనలు

దిల్లీ: ఎంజీ నరేగా చట్టం బదులు కేంద్రం తీసుకువచ్చిన జీ రామ్ జీ బిల్లుకు వ్యతిరేకంగా ఈ నెల 19న దేశవ్యాప్తంగా నిరసన ప్రదర్శనలు నిర్వహించాలని వివిధ సంఘాలు నిర్ణయించాయి. పని సాధించేందుకు పేదప్రజలు కష్టపడి సాధించిన హక్కుపై ప్రభుత్వం దాడి చేస్తోందని విమర్శించాయి. 'నరేగా సంఘర్ష్ మోర్చా' బుధవారం దిల్లీ ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వివిధ సంఘాల నాయకులు మాట్లాడారు. గ్రామీణ ఉపాధి పథకం స్వరూపాన్నే మార్చేస్తున్నారని ఆందోళన వ్యక్తంచేశారు. పనిదినాల సంఖ్య పెంచడం కంటితుడుపేనని, వ్యయభారం రాష్ట్రాలపై గణనీయంగా పెరగబోతోందని చెప్పారు. పని చేయడాన్ని హక్కుగా తొలిసారి మార్చిన ఎంజీ నరేగాను పార్లమెంటు ఏకగ్రీవంగా ఆమోదించిందని, కొత్త బిల్లు విషయంలో అలా జరగలేదని ఆర్థికవేత్త ప్రభాత్ పట్నాయక్ చెప్పారు. ఏకాభిప్రాయం లేకుండా కేవలం మెజారిటీ ఓటు సాయంతో ప్రధాన మార్పుల్ని చేయడం తగదన్నారు. రాష్ట్రాలు, కార్మిక సంఘాలతో ఎంతో లోతుగా చర్చించాకే గతంలో ఉపాధి హామీ చట్టాన్ని తెచ్చారని సీపీఐ నేత అనీ రాజా గుర్తుచేశారు. హక్కును కాస్తా ప్రభుత్వమిచ్చిన బహుమతిగా మార్చేస్తున్నారని మరో ఆర్థికవేత్త జయతీఘోష్ విమర్శించారు.



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న వెంకట్

రద్దుచేసే వరకు ఉద్యమిస్తాం: వెంకట్

అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి బి.వెంకట్ మాట్లాడుతూ- కొత్త బిల్లు రద్దుచేసే వరకు ఉద్యమం కొనసాగుతుందని చెప్పారు. రైతులు, వ్యవసాయ కార్మికుల మధ్య ఘర్షణ సృష్టించేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తోందని, భూమిపై నియంత్రణ హక్కులున్నవారిని మెప్పించడానికే కొన్ని నిబంధనలు తెచ్చారని విమర్శించారు. వ్యవసాయ పనులకు కూలీలు అందుబాటులో ఉండేలా చేస్తామనేది పచ్చి మోసమన్నారు. శుక్రవారం మొదలయ్యే నిరసనలు ఇకపై దేశమంతటా కొనసాగుతాయని ఉద్యమకారుడు యోగేంద్ర యాదవ్ చెప్పారు.

ఉపాధి హామీ చట్టానికి సవరణలపై 19న నిరసనలు: సీపీఎం


ఈనాడు, అమరావతి: మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టానికి కేంద్రం చేస్తున్న సవరణలకు నిరసనగా ఈ నెల 19న అన్ని జిల్లా కేంద్రాలు, పట్టణాల్లో గాంధీ విగ్రహాల వద్ద సత్యాగ్రహ మౌనదీక్షలు నిర్వహించనున్నట్లు సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు తెలిపారు. "చట్టబద్ధ హక్కుగా ఉన్న ఈ పథకాన్ని రద్దు చేసేందుకు కేంద్రం చేస్తున్న కుట్రలను తీవ్రంగా ఖండిస్తున్నాం. కేంద్రం తీసుకువస్తున్న వికసిత్ భారత్-గ్యారంటీ ఫర్ రోజ్‌గార్ అండ్ అజీవిక మిషన్ పేరుతో ఉపాధి హామీ పథకానికి రాం రాం పలుకుతున్నారు. పని హక్కుగా ఉన్న పాత చట్టాన్ని మార్చివేసి అవసరాన్ని అనుసరించి పనులు చేపట్టడం అంటే పథకం మౌలిక స్వభావాన్ని నిర్వీర్యం చేయడమే. గ్రామీణ కూలీలకు చేస్తున్న ద్రోహాన్ని పక్కదారి పట్టించేందుకు ఈ పథకంలోని గాంధీ పేరును తొలగించారు" అని విమర్శించారు.

EENADU Vol: 52, Issue: 128 Printed and Published by M Nageswara Rao on behalf of Ushodaya Publications, a division of Ushodaya Enterprises Pvt Ltd. Printed and Published at Ushodaya Publications, Eenadu Press, Survey No. 239/3, 240/3B & 240/4, Gudavalli Village, Vijayawada Rural Mandal, NTR District - 521 104, Andhra Pradesh. Editor: M Nageswara Rao. Phones: 0866-2494900, 2862111. Regd. No. VJ/013/2024-26. RNI No.32238/1978. Air Surcharge Extra. Mumbai, Kolkata, Goa. Re. 1.00, Portblair Rs. 10.00. Founder Ramoji Rao

ఈనాడు సినిమా

మీ మ్యాజిక్‌ని చూడడానికి సెట్స్‌కి రావొచ్చా?

● దర్శకుడు రాజమౌళిని కోరిన ప్రముఖ హాలీవుడ్ డైరెక్టర్ జేమ్స్ కామెరూన్



కామెరూన్‌తో వీడియోకాల్‌లో మాట్లాడుతున్న రాజమౌళి

ప్రముఖ హాలీవుడ్ దర్శకుడు జేమ్స్ కామెరూన్ దర్శకత్వంలో రూపొందిన విజువల్ వండర్ 'అవతార్'. ఇప్పటికే రెండు భాగాలుగా వచ్చిన ఈ సినిమా మూడో భాగం 'అవతార్: ఫైర్ అండ్ యాష్' డిసెంబరు 19న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సందర్భంగా 'అవతార్' చిత్రబృందం భారత్‌లో వినూత్నంగా ప్రచారానికి తెర తీసింది. దర్శకుడు ఎస్.ఎస్.రాజమౌళి సహా కొందరు సినీ ప్రముఖులకు 'అవతార్ 3'ని చూపించారు. అనంతరం జేమ్స్ కామెరూన్, రాజమౌళి వీడియోకాల్ ద్వారా మాట్లాడుకున్నారు. భారీ థియేట్రికల్ చిత్రాలను సృష్టించడం, ప్రేక్షకులను థియేటర్లలకు తీసుకురావడంపై చిత్రనిర్మాతలు ఎదుర్కొంటున్న సవాళ్లతో పాటు పలు అంశాల గురించి చర్చించుకున్నారు. దీనికి సంబంధించిన వీడియోను చిత్ర నిర్మాణ సంస్థ విడుదల చేసింది. ఇందులో రాజమౌళి మాట్లాడుతూ.."145 కోట్ల మంది భారతీయులలో 'అవతార్: ఫైర్ అండ్ యాష్' చూసిన మొదటి వ్యక్తిగా అవకాశం ఇచ్చినందుకు మీకు ధన్యవాదాలు. ఈ సినిమా చాలా ప్రత్యేకమైన అనుభూతినిచ్చింది. చూస్తున్నంతసేపూ చిన్న పిల్లాడిలా మారిపోయాను''అన్నారు రాజమౌళి. "మీరిప్పుడు 'వారణాసి' సినిమాతో చాలా బిజీగా ఉండి ఉంటారు. మీ కొత్త సినిమా మార్కెట్‌లోకి వచ్చినప్పుడు నేను కూడా ప్రతిగా మీకు ఏదైనా చేయగలిగితే నన్ను గుర్తుపెట్టుకోండి. నేను ఎప్పుడైనా మీ సెట్‌కి వచ్చి మీరు మ్యాజిక్ సృష్టించడాన్ని చూడొచ్చా?'' అని అడిగారు జేమ్స్ కామెరూన్. ఈ మాటతో రాజమౌళి.. "మీరు రావడం ఎంతో సంతోషకరమైన విషయం. మా 'వారణాసి' చిత్రబృందమే కాదు.. మొత్తం సినీ ఇండస్ట్రీ థ్రిల్ అవుతుంది. మీకు స్వాగతం'' అనగా, "మీరు పులులతో సరదాగా ఏదైనా చేస్తున్నప్పుడు నాకు చెప్పండి'' అని కామెరాన్ అనడంతో నవ్వులు విరిశాయి. సెకండ్ యూనిట్‌కైనా కెమెరా పట్టుకుని తాను కొన్ని సన్నివేశాలు తీస్తానని కామెరూన్ చెప్పడం గమనార్హం. రాజమౌళి తెరకెక్కించిన 'ఆర్ఆర్ఆర్' సినిమా విషయం గురించి మాట్లాడుకున్న సందర్భంలో పులి ప్రస్తావన వచ్చింది.

ఆస్కార్ బరిలో హోమ్‌బౌండ్ మరో అడుగు



ఇషాన్ కట్టర్, విశాల్ జెత్వా, జాన్వీ కపూర్ ప్రధాన పాత్రల్లో తెరకెక్కిన చిత్రం 'హోమ్‌బౌండ్'. ఈ సినిమా 'ది బెస్ట్ ఇంటర్నేషనల్ ఫీచర్' విభాగంలో మనదేశం తరఫున 'ఆస్కార్ 2026'కు అధికారిక ఎంట్రీ పొందిన విషయం తెలిసిందే. ఇప్పుడీ చిత్రం మరో అడుగు ముందుకు వేస్తూ.. ఆస్కార్ ఎంపికలో కీలకమైన షార్ట్‌లిస్ట్ జాబితాలో చోటు దక్కించుకుంది. ఈ విషయాన్ని నిర్మాణసంస్థ అధికారికంగా ప్రకటించింది. ఇది భారతీయ సినీరంగానికి మైలురాయి అని పేర్కొంది. తాజాగా 12 విభాగాల్లో పోటీ పడుతోన్న చిత్రాల షార్ట్‌లిస్ట్‌ను అకాడమీ ప్రకటించింది. 'ది బెస్ట్ ఇంటర్నేషనల్ ఫీచర్' విభాగంలో మొత్తం 15 చిత్రాలను షార్ట్‌లిస్ట్ చేశారు. అందులో 'హోమ్‌బౌండ్' కూడా ఉంది. తుది జాబితాలోకి వీటిని 5కి తగ్గించనున్నారు. ఆ జాబితాని జనవరి 22న ప్రకటించనున్నారు. వచ్చే ఏడాది మార్చి 15న జరగనున్న ఆస్కార్ పురస్కారాల వేడుకలో ఈ ఐదు చిత్రాలలో ఏదైనా ఒకటి ఆస్కార్‌ను సొంతం చేసుకుంటుంది. ప్రతిష్ఠాత్మకమైన ఈ అవార్డుల బరిలో తమ చిత్రం ఉండడంతో 'హోమ్‌బౌండ్' చిత్రబృందం ఆనందం వ్యక్తం చేసింది. ఈ సందర్భంగా నిర్మాత కరణ్‌జోహార్ సామాజిక మాధ్యమాల వేదికగా పోస్ట్ పెట్టారు. సినిమాను ఆదరించిన అందరికీ ధన్యవాదాలు తెలిపారు. ఇద్దరు స్నేహితులు పోలీసు కావాలనే తమ కలను సాధించడానికి ప్రయత్నిస్తున్నప్పుడు కుల, మత వివక్షలకు వ్యతిరేకంగా చేసిన పోరాటమే ఈ సినిమా కథాంశం. నీరజ్ ఘైవాన్ దర్శకత్వం వహించారు. ఈ ఏడాది కేన్స్‌కు ఎంపికైన ఏకైక భారతీయ చిత్రమిది. అంతేకాదు టోరంటో అంతర్జాతీయ చలన చిత్రోత్సవంలో రెండో రన్నరప్‌గా ఇంటర్నేషనల్ పీపుల్స్ ఛాయిస్ అవార్డునూ గెలుచుకుందీ సినిమా.

సహనా.. కలలో నిన్నే చూశానా!



నిధి అగర్వాల్, ప్రభాస్

ప్రభాస్ సినిమాల స్థాయి ఎలాంటిదో మరోసారి 'ది రాజాసాబ్' సినిమాతో చూపిస్తున్నారు టి.జి.విశ్వప్రసాద్. ఆయన పీపుల్ మీడియా ఫ్యాక్టరీ పతాకంపై కృతిప్రసాద్‌తో కలిసి నిర్మించిన చిత్రమే... 'ది రాజాసాబ్'. నిధి అగర్వాల్, మాళవిక మోహనన్, రిద్ధికుమార్ కథానాయికలు. సంజయ్‌దత్ ముఖ్య పాత్రని పోషించారు. మారుతి దర్శకుడు. ఈ చిత్రం సంక్రాంతి సందర్భంగా జనవరి 9న ప్రేక్షకుల ముందుకు రానున్న సంగతి తెలిసిందే. బుధవారం ఇందులోని 'సహనా సహనా నా సఖి సహనా... కలలో నిన్నే చూశానా' అంటూ సాగే పాటని విడుదల చేశారు. దర్శకుడు మారుతి మాట్లాడుతూ "ప్రభాస్ ఎప్పుడూ అభిమానుల గురించే ఆలోచిస్తూ శ్రమిస్తుంటారు. ఈ సంక్రాంతికి రాజాసాబ్‌తో అందరినీ అలరిస్తాం" అన్నారు. నిర్మాత మాట్లాడుతూ "అందరూ కోరుకుంటున్నట్టుగానే జనవరి 8న ప్రీమియర్ షోలతోనే ఈ సినిమా సందడి మొదలు కాబోతోంది. త్వరలోనే విడుదలకు ముందస్తు వేడుకని నిర్వహిస్తాం. ప్రభాస్ ఆ వేడుకకి హాజరవుతారు'' అన్నారు. తమన్ మాట్లాడుతూ "ఇప్పటికే విడుదలైన పాటలకి మంచి స్పందన లభించింది. ఇంకా రెండు పాటలు ఉన్నాయి. ఒక పాటలో ముగ్గురు కథానాయికలతో కలిసి ప్రభాస్ వేసిన నృత్యాలు అదిరిపోయేలా ఉంటాయ''న్నారు. ఈ కార్యక్రమంలో కథానాయికలు నిధి అగర్వాల్, రిద్ధికుమార్‌తోపాటు, ఇతర చిత్రబృందం పాల్గొంది.

స్మగ్లర్లకు.. మనం ఓ పీడ కల



ఇమ్రాన్ హష్మీ

ఇటీవలే 'ఓజీ', 'హక్' చిత్రాలతో థియేటర్లలో సందడి చేశారు నటుడు ఇమ్రాన్ హష్మీ. ఇప్పుడు ఓటీటీ వేదికగా ప్రేక్షకుల్ని అలరించేందుకు సన్నద్ధమవుతున్నారు. ఆయన ప్రధాన పాత్రలో నటిస్తోన్న వెబ్ సిరీస్ 'తస్కరీ: ది స్మగ్లర్స్ వెబ్'. నీరజ్ పాండే దర్శకత్వం వహిస్తున్నారు. ఇందులో ఇమ్రాన్ అంతర్జాతీయ స్మగ్లింగ్ నెట్‌వర్క్‌లను ఛేదించే కస్టమ్స్ అధికారిగా కనిపించనున్నారు. తాజాగా ప్రముఖ ఓటీటీ సంస్థ నెట్‌ఫ్లిక్స్ ఈ సిరీస్ విడుదల తేదీని ప్రకటించింది. జనవరి 14 నుంచి ఈ సిరీస్ ప్రసారం కానుందని పేర్కొంటూ.. సామాజిక మాధ్యమాలలో అధికారిక టీజర్‌ను ఆవిష్కరించింది. "ఎళ్లతరబడి స్మగ్లర్లు, మనమూ దాగుడుమూతలు ఆడుతున్నాము. కొన్నిసార్లు వాళ్లు.. కొన్నిసార్లు మనం గెలుస్తున్నాము. ప్రపంచంలోని స్మగ్లర్లకు మనం ఒక పీడ కల'' లాంటి సంభాషణలతో ఈ టీజర్ సిరీస్‌పై ఆసక్తిని రేకెత్తిస్తోంది.

"సరైన ప్రచారం లేకే నేను ఇదివరకు చేసిన సినిమాలు ప్రేక్షకుల వరకూ వెళ్లలేదేమో. 'గుర్రం పాపిరెడ్డి' సినిమాకు మాత్రం ఇదివరకు ఎప్పుడూ చేయనంత ప్రచారం చేశా'' అన్నారు నరేశ్ అగస్త్య. 'మత్తు వదలరా', 'సేనాపతి', 'వికటకవి', 'పంచతంత్రం', 'మేఘాలు చెప్పిన ప్రేమ కథ' తదితర చిత్రాలతో ప్రేక్షకులకు చేరువైన నటుడీయన. ఇటీవల ఆయన కథానాయకుడిగా 'గుర్రం పాపిరెడ్డి' తెరకెక్కింది. మురళీ మనోహర్ దర్శకత్వం వహించిన ఈ చిత్రం ఈ నెల 19న ప్రేక్షకుల ముందుకొస్తున్న సందర్భంగా నరేశ్ అగస్త్య బుధవారం హైదరాబాద్‌లో విలేకర్లతో ముచ్చటించారు.

అక్కడ కష్టాలు.. ఇక్కడ నవ్వులు



నరేశ్ అగస్త్య

"డార్క్ కామెడీ కథతో రూపొందిన చిత్రమిది. నేను ఇప్పటి వరకూ ఈ తరహా సినిమా చేయలేదు. తెరపైన పాత్రలు కష్టాలు పడుతుంటే, థియేటర్లలో చూస్తున్న ప్రేక్షకులకు మాత్రం నవ్వు ఆగదు. అలాంటి కథతో రూపొందిన సినిమానే ఇది. తెలివైనవాడు తెలివి తక్కువ పనిచేసినప్పుడు, తెలివిలేనివాళ్లు అతనికి తోడైనప్పుడు ఏం జరిగిందనే విషయాలు ఇందులో ఆసక్తికరం. ప్రతీ సన్నివేశం కామెడీ ప్రధానంగా సాగుతుంది. ఆ వెనక ఓ బలమైన కథ కూడా జరుగుతుంటుంది. నేను ఇప్పటిదాకా చేసిన సినిమాల్లో నా పాత్రలు కొంచెం నింపాదిగా సాగుతున్నట్టు అనిపిస్తాయి. ఇందులో మాత్రం ఉత్సాహంగా కనిపించే పాత్రలో కనిపిస్తా".

❑ "దర్శకుడు చెప్పగానే ఈ కథ నచ్చింది. దాన్ని పట్టాలెక్కించేందుకు ఏడాది సమయం పట్టింది. ఎంత మంచి స్క్రిప్ట్ ఉన్నా, దానికి తగ్గ నటులు కూడా తోడు కావాలి. మా సినిమాలో ఫరియా, రాజ్‌కుమార్ కసిరెడ్డి, వంశీధర్ తదితర నటులు మంచి టైమింగ్‌తో నటించారు. సీనియర్ నటులైన బ్రహ్మానందంతో నాకు సన్నివేశాలు లేవు కానీ, యోగిబాబుతో మాత్రం చాలా సన్నివేశాల్లో కలిసి కనిపిస్తా. ఆయన ఎంతో స్నేహంగా మెలుగుతారు. బైక్‌పై కూర్చోబెట్టుకుని రామోజీ ఫిల్మ్‌సిటీ అంతా నన్ను తిప్పారు, ఆ తర్వాత ఓ ఫొటో తీసుకుందాం రా నరేశ్ అంటూ సెల్ఫీ తీసుకున్నారు. ఇందులో కృష్ణ సౌరభ్ పాటలు చాలా బాగుంటాయి. ప్రచార చిత్రానికీ మంచి స్పందన లభించింది. నిర్మాతలు ఎక్కడా రాజీపడలేదు".

❑ "నా దృష్టిలో కమర్షియల్ సినిమా అంటే ఫైట్లు, పాటలు లేకపోయినా ఆద్యంతం ఆసక్తిని రేకెత్తిస్తూ ప్రేక్షకుల్ని కూర్చోబెట్టేదే. ఇప్పటివరకూ నేను చేసిన సినిమాల్లో అలాంటి పక్కా కమర్షియల్ ప్రయత్నాలు లేవు. ఇక నుంచి వస్తాయి. కొత్త తరహా సినిమాలు చేయాలనేది నా కోరిక. సహారా ఎడారి నేపథ్యంలో ఓ సినిమాని చేశా. అది 70 శాతం చిత్రీకరణను పూర్తి చేసుకుంది. వచ్చే ఏడాదిలో ఆ సినిమా వస్తుంది".

"వేరే భాషల్లో నేను చేసిన సినిమాల్ని చూసి మరీ... మెచ్చుకుంటూ తెలుగు ప్రేక్షకులు అద్భుతమైన ఎన్నో సందేశాల్ని పంపారు. ఆ ప్రోత్సాహమే బలంగా భావించి 'ఛాంపియన్' సినిమాలో నటించా'' అంటోంది మలయాళ అందం అనస్వర రాజన్. మలయాళం చిత్రాలతో పరిచయమైన ఆమె హిందీ, తమిళంలోనూ పలు సినిమాలు చేసింది. 'ఛాంపియన్' చిత్రంతో తెలుగులో పరిచయం అవుతోంది. రోషన్ కథానాయకుడిగా తెరకెక్కిన చిత్రమిది. ప్రదీప్ అద్వైతం దర్శకుడు. జీ స్టూడియోస్ సమర్పణలో ఆనంది ఆర్ట్ క్రియేషన్స్, కాన్సెప్ట్ ఫిలిమ్స్ కలిసి నిర్మించాయి. ఈ చిత్రం ఈ నెల 25న ప్రేక్షకుల ముందుకొస్తున్న సందర్భంగా అనస్వర రాజన్ బుధవారం హైదరాబాద్‌లో విలేకర్లతో ముచ్చటించారు.



అనస్వర రాజన్

తెలుగులో ఒక్కసారి నటిస్తే చాలు..

"ప్రేక్షకుల మనసుల్లో ఎప్పటికీ నిలిచిపోయే కథ, పాత్రలతో తెరకెక్కిన సినిమానే... 'ఛాంపియన్'. దర్శకుడు ఈ కథ చెప్పగానే ఎంతో భావోద్వేగానికి గురయ్యాను. ఒక మంచి సినిమాకి ఉండాల్సిన అన్ని అంశాలూ ఇందులో ఉన్నాయి. తెలుగులో సరైన సినిమాతో పరిచయం అవుతున్నాననే భావన కలిగింది. తెలుగులో భారీ కాన్వాస్‌లో సినిమాలు తెరకెక్కుతుంటాయి. ఇక్కడ నటిస్తున్నప్పుడు ఆ విషయం ఇంకా బాగా నచ్చింది. ఒక్కసారి తెలుగులో నటిస్తే చాలు... మళ్లీ మళ్లీ ఇక్కడే సినిమాలే చేయాలనిపిస్తుంది. ప్రస్తుతం వరుసగా తెలుగు సినిమాలు చేస్తుండడం ఆనందంగా ఉంది".

● "ఒకప్పటి జీవితాన్ని ఆవిష్కరించే కథలంటే నాకు చాలా ఇష్టం. అందుకే పీరియాడిక్ సినిమాల్ని ఎక్కువగా చూస్తుంటా. మనం నిజ జీవితంలో చూడని విషయాలన్నీ కూడా ఆ సినిమాలతో అనుభవంలోకి వస్తాయి. ఈ సినిమా అలాంటి కథతోనే తెరకెక్కింది".

● "నటులకు భాషే అతి పెద్ద సవాల్. భాష తెలిస్తే పాత్రని సొంతం చేసుకుని నటించే అవకాశం ఉంటుంది. తెలియనప్పుడు ఆ సౌకర్యం ఉండదు. తెలుగు సినిమాల్ని చూస్తూనే ఉన్నాను కానీ, భాషపై నాకు పెద్దగా అవగాహన లేదు. దర్శకుడు ప్రదీప్ అద్వైతం ఆ విషయంలో నాకు అండగా నిలిచారు. పాత్రతోపాటు, అన్ని విషయాలపైనా నాకు పూర్తి అవగాహన కల్పించి నటింపజేశారు. నిర్మాత స్వప్న దత్ కూడా సెట్‌లో నన్ను మెచ్చుకుంటూ ప్రోత్సహించారు. ఈ ప్రయాణంలో ఆమె ఓ సోదరిలా మారిపోయారు. మా సినిమా ట్రైలర్‌ని రామ్‌చరణ్ ఆవిష్కరిస్తున్నారని తెలిసి ఎంతో సంతోషించా".

వారి కుటుంబాల్లో ఆనందం కోసం



సోనూ సూద్

కొవిడ్ విపత్కర పరిస్థితుల్లో ఎంతోమందికి సాయం చేసి రియల్ హీరో అనిపించుకున్నారు ప్రముఖ బాలీవుడ్ నటుడు సోనూ సూద్. తాజాగా ఆయన మంచి మనసు ఏంటో మరోసారి తెలిసింది. "ఏ మహిళా ఒంటరిగా పోరాడాల్సిన అవసరం లేని భవిష్యత్తు కోసం కలలు కంటున్నాం. మన దేశాన్ని రొమ్ము క్యాన్సర్ రహిత దేశంగా మారుద్దాం'నే నినాదంతో తన ఫౌండేషన్ ద్వారా కొంత కాలంగా రొమ్ముక్యాన్సర్ చికిత్స అవగాహనకై పోరాటం చేస్తున్న సంగతి తెలిసిందే. తాజాగా ఆయన తన ఫౌండేషన్ ద్వారా దేశంలో 500 మంది మహిళలకు రొమ్ము క్యాన్సర్ చికిత్స చేయించినట్లు వెల్లడించారు. ఈ చొరవ చాలా మంది మహిళలకు ప్రాణాంతక అనారోగ్యాన్ని అధిగమించడానికి, ఆత్మ విశ్వాసాన్ని తిరిగి పొందడానికి సహాయపడిందన్నారు. దేశంలోని మహిళలకు రొమ్ము క్యాన్సర్‌పై అవగాహన కల్పించడంపై మరింత దృష్టిసారించనున్నట్లు తెలిపారు. "మొత్తం 500పైగా శస్త్రచికిత్సలు జరిగాయి. 500 మంది మహిళలను మేం కాపాడగలిగాం. వారంతా కొత్త జీవితాన్ని పొందారు. వారి కుటుంబాల్లో ఆనందం నింపినందుకు నేనెంతో సంతోషంగా ఉన్నాను. సమష్టి కృషి ద్వారా మాత్రమే ఇలాంటి గొప్ప పనులు జరుగుతాయి''అంటూ వైద్యులకు కృతజ్ఞతలు తెలుపుతూ ఇన్‌స్టా స్టోరీలో పంచుకున్నారు. ఇది ఆరంభం మాత్రమేనని భవిష్యత్తులో ఇలాంటి కార్యక్రమాలు చేయడంలో తానెప్పుడూ ముందుంటానని పేర్కొన్నారు.

కంటిచూపుతో కాదు... కన్నీళ్లతో!



వైష్ణవి

పవన్‌కల్యాణ్ బత్తుల కథానాయకుడిగా పరిచయం అవుతున్న చిత్రం 'పురుషః'. వైష్ణవి కొక్కుర, విషిక, హాసిని సుధీర్ కథానాయికలు. వీరు వులవల దర్శకుడు. బత్తుల కోటేశ్వరరావు నిర్మాత. భార్యాభర్తల నేపథ్యంలో సాగే కథతో ఈ చిత్రం రూపొందుతోంది. ఇందులో వైష్ణవి కొక్కుర పోషించిన పాత్ర లుక్‌ని విడుదల విడుదల చేశారు. 'కంటిచూపుతో కాదు... కన్నీళ్లతో చంపేస్తా...' అనే శీర్షికతో ఆ లుక్‌ని ఆవిష్కరించారు. కాన్సెప్ట్ పోస్టర్లు, పాత్రల పరిచయంతోనే ఈ సినిమాపై ప్రేక్షకుల్లో ఆసక్తిని రేకెత్తించామని, ఈ చిత్రం ఇంటిల్లిపాదినీ అలరించేలా దర్శకుడు తీర్చిదిద్దుతున్నారని సినీ వర్గాలు చెప్పాయి.

స్వాతంత్ర్యం అడిగి కాదు.. కొట్టి తెచ్చుకోవాలి



భరత్ మోతుకూరి, వెంకట్‌రెడ్డి, మనోజ్, హనుమరెడ్డి, రవి బస్రూర్

నన్ను ప్రేక్షకులు మళ్లీ కథానాయకుడిగా ఎలాంటి సినిమాలో చూడాలనుకున్నారో...అలాంటి కథతోనే 'డేవిడ్ రెడ్డి' తెరకెక్కుతోందన్నారు మంచు మనోజ్. ఆయన కథానాయకుడిగా... హనుమరెడ్డి యక్కంటి తెరకెక్కిస్తోన్న చిత్రమిది. మారియా కథానాయిక. వెంకట్‌రెడ్డి, భరత్ మోతుకూరి నిర్మాతలు. తెలుగుతోపాటు, హిందీ, తమిళ, మలయాళ, కన్నడ భాషల్లో రూపొందనున్న ఈ సినిమా ప్రచార చిత్రాన్ని హైదరాబాద్‌లో బుధవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా మంచు మనోజ్ మాట్లాడుతూ "చరిత్రలో బయటకు రాని కొన్ని సంఘటనలు, దారుణాల్ని ఎదుర్కొనేందుకు ఒక వ్యక్తి నిలబడితే ఎలా ఉంటుందో అదే... 'డేవిడ్ రెడ్డి' కథ. మనం స్వాతంత్ర్యం అడిగి కాదు, కొట్టి తెచ్చుకోవాలనే ధృక్పథం ఉన్న వ్యక్తి డేవిడ్‌రెడ్డి'' అన్నారు. దర్శకుడు మాట్లాడుతూ "ఒకరే భగత్‌సింగ్, ఒకరే సుభాష్ చంద్రబోస్, ఒకరే డేవిడ్‌రెడ్డి అన్నట్టుగా పాన్ ఇండియా స్థాయిలో ఈ సినిమాని తెరకెక్కిస్తున్నాం'' అన్నారు. ఈ చిత్రానికి సంగీతం: రవి బస్రూర్.

అసభ్యమైన ఏఐ కంటెంట్‌ని ప్రోత్సహించొద్దు



శ్రీలీల

సాంకేతికత పెరిగితే జీవనం సులభం కావాలి కానీ క్లిష్టంగా మారకూడదు, సాంకేతికతను దుర్వినియోగం చేయొద్దంటూ సోషల్ మీడియా వినియోగదారుల్ని కోరింది ప్రముఖ నటి శ్రీలీల. తనతో పాటు తోటి నటీమణులు కూడా ఇలాంటి పరిస్థితినే ఎదుర్కోవడం చూసి ఆవేదన కలిగిందంటూ ఇన్‌స్టా పోస్ట్‌లో రాసుకొచ్చింది. సోషల్ మీడియా వినియోగదారులు అసభ్యతతో కూడిన ఏఐ జనరేటెడ్ కంటెంట్‌ను ప్రోత్సహించవద్దని అభ్యర్థించింది. "నిజం చెప్పాలంటే ఇలా మాట్లాడటం నాకు అసౌకర్యంగా ఉంటుంది. కానీ, దీని వెనుక ఉన్న ఉద్దేశం నెరవేరుతుందని ఆశిస్తున్నా. సామాజిక మాధ్యమాలలోని ప్రతి ఖాతాదారుడికి చేతులు జోడించి అభ్యర్థిస్తున్నా. ఏఐ సహాయంతో సృష్టించే అర్థంలేని వాటికి మద్దతు ఇవ్వొద్దు. టెక్నాలజీని మంచి కోసం వాడటం వేరు. అసభ్యత కోసం వాడటం వేరు. రెండింటికీ మధ్య చాలా తేడా ఉంది. ప్రతి అమ్మాయి ఎవరో ఒకరికి కూతురు, మనవరాలు, సోదరి, స్నేహితులు, సహ ఉద్యోగి అయి ఉంటారు. ఒకవేళ ఆమె కళను వృత్తిగా ఎంచుకుని ఉండవచ్చు. ఇండస్ట్రీలో ఆమె భాగస్వామి అయినందుకు సంతోషపడుతూ, రక్షణతో కూడిన వాతావరణంలో ఉందన్న నమ్మకాన్ని తన వారికి ఇవ్వాలనుకుంటుంది. నాకున్న బిజీ షెడ్యూల్స్ కారణంగా ఆన్‌లైన్‌లో ఏం జరుగుతుందో తెలుసుకోలేకపోతున్నా. అలాంటి కొన్నింటిని నా శ్రేయోభిలాషులు నా దృష్టికి తీసుకొచ్చారు. చాలా విషయాలను నేను పెద్దగా పట్టించుకోను. నా ప్రపంచంలో జీవిస్తా. కానీ, ఈ విషయం నన్ను బాధించింది. ప్రేక్షకులపై నాకు గౌరవం, నమ్మకం ఉన్నాయి. అందుకే మాకు అండగా నిలబడమని అభ్యర్థిస్తున్నా. ఇకపై సంబంధిత అధికారులు దీనిపై తగిన చర్యలు తీసుకుంటారు"అని శ్రీలీల పోస్ట్‌లో పేర్కొన్నారు.

పాతబస్తీ నేపథ్యంలో... 'జమాన'



సూర్య, సంజీవ్

సూర్య శ్రీనివాస్, సంజీవ్ కుమార్ ప్రధాన పాత్రధారులుగా తెరకెక్కిన చిత్రం 'జమాన'. భాస్కర్ జక్కుల దర్శకుడిగా పరిచయం అవుతున్నారు. తేజస్వి అడప, బొద్దుల లక్ష్మణ్, శివకాంత్, శశికాంత్ నిర్మాతలు. హైదరాబాద్ పాతబస్తీ నేపథ్యంలో సాగే ఈ చిత్రం జనవరి 30న ప్రేక్షకుల ముందుకు రానుంది. దర్శకుడు మాట్లాడుతూ "మంచి థ్రిల్లర్ కథతో రూపొందించిన చిత్రమిది. కథలో మలుపులు ఆసక్తిని రేకెత్తిస్తాయి'' అన్నారు. నిర్మాత మాట్లాడుతూ "బలమైన స్క్రీన్‌ప్లేతో రూపొందించిన చిత్రమిది. ప్రతీ సన్నివేశం ప్రేక్షకులకు కనెక్ట్ అవుతుంది'' అన్నారు. కథానాయకుడు మాట్లాడుతూ "నేటి తరం అభిరుచులకు తగ్గ కథ ఇది. థ్రిల్లింగ్ అంశాలతోపాటు, హాస్యం పంచే సన్నివేశాలూ ఉంటాయి'' అన్నారు. స్వాతి కశ్యప్, జారా తదితరులు నటించిన ఈ చిత్రానకి ఛాయాగ్రహణం: జనగ్.ఎ, సంగీతం: కేశవ కిరణ్.

కొత్త ప్రపంచాన్ని చూపిస్తున్నాం



నిఖిల్

'జిన్' సినిమా ప్రేక్షకులకు ఓ సరి కొత్త అనుభూతిని పంచుతుందని... కాన్సెప్ట్ పరంగా ఇదొక కొత్త ప్రయోగం అన్నారు నిఖిల్ ఎం.గౌడ. ఆయన నిర్మాణంలో అమిత్‌రావ్, పర్వేజ్ సింబా, ప్రకాశ్ తుమినాడ్, రవి భట్, సంగీత ప్రధాన పాత్రధారులుగా తెరకెక్కిన చిత్రమే 'జిన్'. చిన్మయ్ రావ్ దర్శకత్వం వహించారు. ఈ చిత్రం ఈ నెల 19న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సందర్భంగా నిర్మాత నిఖిల్ ఎం.గౌడ బుధవారం హైదరాబాద్‌లో విలేకర్లతో మాట్లాడారు. "ఈ సినిమాతో ఓ కొత్త ప్రపంచాన్ని చూపిస్తున్నాం. దర్శకుడు చిన్మయ్‌రావ్ ఎంచుకున్న కాన్సెప్ట్, దాన్ని ఆయన తెరపైకి తీసుకొచ్చిన విధానం కొత్తగా ఉంటాయి. కథ రీత్యా కర్ణాటక, ఆంధ్రప్రదేశ్ సరిహద్దుల్లో చిత్రీకరణ చేశాం. భిన్న భాషల్లో ప్రేక్షకుల ముందుకు రానున్న ఈ చిత్రంలోని సునీల్ హొన్నలి విజువల్స్, అలెక్స్ సమకూర్చిన స్వరాలు ప్రధాన ఆకర్షణగా నిలుస్తాయి'' అన్నారు.

దర్శకుడు కేకే కన్నుమూత



కిరణ్ కుమార్

అగ్ర హీరో నాగార్జున కథానాయకుడిగా 'కేడీ' చిత్రాన్ని తెరకెక్కించిన దర్శకుడు కేకే అలియాస్ కిరణ్ కుమార్ కన్నుమూశారు. కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన హైదరాబాద్‌లోని ఓ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ బుధవారం తుదిశ్వాస విడిచారు. ఆయన ఇటీవల 'కేజేక్యూ: కింగ్ జాకీ క్వీన్' అనే చిత్రాన్ని తెరకెక్కించారు. నిర్మాణానంతర పనుల దశలో ఉన్న ఆ చిత్రం విడుదలకు సిద్ధమవుతున్న దశలోనే దర్శకుడు కేకే కన్నుమూయడం చిత్రబృందాన్ని విషాదంలో ముంచెత్తింది. మణిరత్నం దగ్గర 'పొన్నియిన్ సెల్వన్' చిత్రాలకి సహాయ దర్శకుడిగా పనిచేసిన కేకే, 'సచిన్: ఎ బిలియన్ డ్రీమ్స్', 'ఓకే బంగారం', 'చెలియా', 'నవాబ్' తదితర అనువాద చిత్రాలకు తెలుగులో సంభాషణలు రాశారు. ప్రముఖ దర్శకుడు సందీప్‌రెడ్డి వంగా గతంలో కేకే దగ్గర సహాయ దర్శకుడిగా పనిచేశారు.

ఛాంపియన్



ఒక్క బంతీ పడకుండానే...

పొగ మంచు కారణంగా భారత్, దక్షిణాఫ్రికా నాలుగో టీ20 రద్దు

లఖ్‌నవూ

క్రికెట్ అభిమానులకు నిరాశ. లఖ్‌నవూలో భారత్, దక్షిణాఫ్రికా మధ్య కీలకమైన నాలుగో టీ20 మ్యాచ్ దట్టమైన పొగమంచు కారణంగా ఒక్క బంతి కూడా పడకుండానే రద్దయింది. టాస్ కూడా వేయలేదు. సాయంత్రం నుంచి అనేకసార్లు మైదానాన్ని తనిఖీ చేసిన అంపైర్లు చివరికి మ్యాచ్‌ను రద్దు చేయాలని నిర్ణయించారు. కాలుష్యంతో కూడిన మంచు దట్టంగా ఏర్పడ్డ నేపథ్యంలో ఎకానా స్టేడియంలో ఏది సరిగా కనిపించకపోవడంతో ఆట సాధ్యం కాలేదు. లఖ్‌నవూలో బుధవారం వాయు కాలుష్యం ప్రమాదకర స్థాయిలో ఉంది. స్టార్ ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్య మాస్క్ ధరించి కనిపించాడు. జట్లు అయిదో మ్యాచ్ కోసం అహ్మదాబాద్ వెళ్తాయి. సిరీస్‌లో 2-1తో ఆధిక్యంలో ఉన్న భారత్.. ఇక సిరీస్‌ను కోల్పోదు. ఆఖరి మ్యాచ్‌లో నెగ్గితే సిరీస్‌ను చేజిక్కించుకుంటుంది. నాలుగో టీ20 రద్దయిన నేపథ్యంలో బీసీసీఐ శీతాకాలంలో ఉత్తరభారతంలో మ్యాచ్‌ను షెడ్యూలింగ్ చేయడంపై ప్రశ్నలు తలెత్తు



తున్నాయి. నవంబరు, డిసెంబరులో లఖ్‌నవూ, చండీగఢ్, ధర్మశాల వంటి నగరాల్లో కాలుష్యం హెచ్చు స్థాయిలో ఉంటుంది. నాలుగో టీ20ని అధిక మంచు కారణంగా రద్దు చేస్తున్నట్లు అధికారికంగా ప్రకటించినా.. అసలు కారణం మాత్రం కాలుష్యంతో కూడిన మంచే. మ్యాచ్‌లకు వేదికలను కేటాయించడంలో బీసీసీఐ రొటేషన్ విధానాన్ని పాటిస్తుంది. అయితే దక్షిణాఫ్రికాతో సిరీస్ వేదికలను, జనవరి 11న ఆరంభమయ్యే న్యూజిలాండ్‌తో సిరీస్ వేదికలను అటు ఇటు మార్చే అంశాన్ని బీసీసీఐ పరిశీలించాల్సిందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. న్యూజిలాండ్‌తో వైట్‌బాల్ సిరీస్‌లో మ్యాచ్‌లు వడోదర, రాజ్‌కోట్, ఇండోర్, నాగ్‌పుర్, రాయ్‌పుర్, గువాహటి, విశాఖపట్నం, తిరువనంతపురంలో జరగాల్సివుంది. గతవారం దక్షిణాఫ్రికాతో మూడో టీ20 ధర్మశాలలో పది డిగ్రీల లోపు ఉష్ణోగ్రతలో జరిగింది. ''గతంలో నేనెప్పుడూ ఇంత చల్లదనం ఉన్న మైదానంలో ఆడలేదు. చాలా కష్టమనిపించింది'' అని ఆ మ్యాచ్ అనంతరం మిస్టరీ స్పిన్నర్ వరుణ్ చక్రవర్తి (తమిళనాడు) వ్యాఖ్యానించాడు.

భలే కుర్రాళ్లు

తండ్రి కల మధ్యలో ఆగిపోతే.. తాను ఆ లక్ష్యాన్ని చేరుకుని నాన్న కలను నెరవేర్చిన కొడుకొకరు.. రోజూ 70 కిలోమీటర్లు ప్రయాణించి మరీ క్రికెట్ ఆడి.. ఇప్పుడు ఆ కష్టానికి ఫలితాన్నందుకున్న కుర్రాడొకరు.. అసలు క్రికెట్ ఆడేందుకు ఏ అనుకూలతలూ లేని చోటు నుంచి వచ్చి.. ఆ ప్రాంతంలో ఎవ్వరికీ సాధ్యం కాని ఘనత అందుకున్న అబ్బాయి మరొకరు.. చిన్న వయసులోనే ఐపీఎల్ వేలంలో అనూహ్యమైన ధర సాధించిన కుర్రాళ్లలో ఒక్కొక్కరిది ఒక్కో రకమైన విజయగాథ.

పొలం, నగలు అమ్మి..


కార్తీక్

రాజస్థాన్‌లోని భరత్‌పుర్‌కు చెందిన మనోజ్ శర్మ యుక్త వయసులో అంతర్జాతీయ క్రికెటర్ కావాలని కలలు కన్నాడు. మీడియం పేసరైన మనోజ్ ఆ దిశగా కష్టపడుతుండగా.. భుజం గాయం అతడి కలలకు బ్రేక్ వేసింది. తన క్రికెట్ కెరీర్ ఆగిపోయినా.. తన ముగ్గురు కొడుకుల్లో ఒకరినైనా అంతర్జాతీయ క్రికెటర్‌ను చేయాలనుకున్నాడు. వారిలో ఒకరైన కార్తీక్ చేతికి రెండున్నరేళ్ల వయసులోనే బ్యాట్ ఇచ్చాడు. అయిదేళ్ల వయసు నుంచి సీరియస్‌గా తనే శిక్షణ ఇవ్వడం మొదలుపెట్టాడు. స్కూల్ స్థాయిలో ప్రొఫెషనల్ కోచ్‌లకు తనయుడిని అప్పగించాడు. కార్తీక్ క్రికెట్ శిక్షణ కోసం అతను భూమితో పాటు భార్య నగలూ అమ్మాడు. భారీ మొత్తంలో బ్యాంకు రుణం కూడా తీసుకున్నాడు. భారత జట్టుకు ప్రాతినిధ్యం వహించిన ఫాస్ట్ బౌలర్ దీపక్ చాహర్ తండ్రి అయిన లోకేంద్ర సింగ్ చాహర్ దగ్గర శిక్షణకు కుదిరాక కార్తీక్ ఆట గణనీయంగా మెరుగుపడింది. చిన్న వయసులోనే అలవోకగా భారీ సిక్సర్లు బాదే నైపుణ్యం సంపాదించాడు కార్తీక్. వికెట్ కీపర్ బ్యాటరైన కార్తీక్.. కెవిన్ పీటర్సన్ శైలిలో షాట్లు ఆడతాడు. ముస్తాక్ అలీ టోర్నీలో అతను నిలకడగా రాణించడం, విధ్వంసకంగా ఆడుతూ 160కి పైగా స్ట్రైక్ రేట్‌తో పరుగులు సాధించడంతో ఐపీఎల్ ఫ్రాంఛైజీల దృష్టిలో పడ్డాడు. రూ.30 లక్షల కనీస ధరతో వేలానికి వస్తే.. సీఎస్కే ఏకంగా రూ.14.2 కోట్లకు అతణ్ని కొనుక్కుంది.

కష్టానికి ఫలితం


మంగేశ్

మినీ వేలంతో రూ.5.2 కోట్లతో బెంగళూరు జట్టు సొంతం చేసుకున్న మంగేశ్.. మధ్యప్రదేశ్‌లోని చింద్వారాలో ఒక దిగువ మధ్యతరగతి కుటుంబం నుంచి వచ్చాడు. అతడి తండ్రి ట్రక్ డ్రైవర్. వృత్తి రీత్యా ఒకసారి బయటికి వెళ్తే అతను కొన్ని నెలల పాటు ఇంటికి రాడు. కుటుంబం కోసం రేయింబవళ్లు కష్టపడే తండ్రికి సంతోషాన్నివ్వాలన్నది కొడుకు మంగేశ్ ఆశ. అది క్రికెట్‌తోనే సాధ్యమని అతను అనుకున్నాడు. అందుకోసం అతను తన ఊరి నుంచి 70 కిలోమీటర్ల దూరంలో ఉండే అకాడమీకి వెళ్లి సాధన చేసేవాడు. ఫాస్ట్‌బౌలర్‌గా టీనేజీలోనే తన ప్రాంతంలో అతను మంచి పేరు సంపాదించాడు. జిల్లా స్థాయికి, ఆపై రాష్ట్ర స్థాయికి ఎదిగాడు. మధ్యప్రదేశ్ టీ20 లీగ్‌లో ఆడడం తన కెరీర్‌ను మలుపు తిప్పింది. ఈ ఏడాది ఈ లీగ్‌లో 6 మ్యాచ్‌లు ఆడితే నాలుగుసార్లు అతను 4 వికెట్ల ప్రదర్శన చేశాడు. బ్యాటింగ్‌లోనూ రాణించడంతో ఆల్‌రౌండర్‌గా మంచి గుర్తింపే వచ్చింది. అలా ఐపీఎల్ ఫ్రాంఛైజీల దృష్టిలో పడ్డాడు. మంగేశ్ గురించి తన కోచ్ ఉత్సవ్ బైరాగి మాట్లాడుతూ.. ''అతడిది గొప్ప మనసు. ఆర్థికంగా వెనుకబడ్డ కుటుంబం నుంచి వచ్చినా సరే.. తనకు ప్రైజ్‌మనీ వస్తే వేరే వాళ్లకు పంచేసేవాడు. ఇండోర్‌లో ఒక మ్యాచ్ ఆడి రూ.10 వేల బహుమతి అందుకుంటే, దాన్ని మైదానాన్ని శుభ్రం చేసే సిబ్బందికి ఇచ్చాడు. ఇంకో సందర్భంలో ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్ కింద వచ్చిన సైకిల్‌ను గ్రౌండ్స్‌మన్‌కే అందజేశాడు. తన కష్టాన్ని నమ్ముకుని అతను ఇంత వరకు రావడం గొప్ప విషయం'' అని చెప్పాడు.

డాక్టర్ కావాలనుకుని..


ఆకిబ్ నబి

క్రికెట్‌కు ఏమాత్రం అనుకూలం కాని బారాముల్లాలో ఆకిబ్ నబి క్రికెటర్‌గా ఎదగడం ఆశ్చర్యమే. అతడి తండ్రి గులాం నబి ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయుడు. తనయుడు డాక్టర్ కావాలనేది ఆయన ఆశ. నబి కూడా శ్రద్ధగానే చదివేవాడు. అయితే తన స్నేహితుడు క్రికెట్లో రాణించడం అతడిని ఆకర్షించింది. ఒకవైపు చదువు కొనసాగిస్తూనే మైదానం బాట పట్టాడు. బారాముల్లాలో క్రికెట్ ఆడే పరిస్థితులు లేకపోవడంతో బెంగళూరు వెళ్లి సాధన చేసేవాడు. అలా పేస్ బౌలింగ్‌లో పట్టు సాధించాడు. 2016లో అండర్-16 సెలక్షన్స్‌లో పాల్గొని జమ్ము కశ్మీర్ జట్టుకు ఎంపికయ్యాడు ఆకిబ్. కూచ్ బెహార్ టోర్నీలో రాణించి.. 2020లో రంజీ ట్రోఫీకి ఎంపికై సత్తా చాటాడు. 2024-25 రంజీ సీజన్లో 8 మ్యాచ్‌ల్లో 44 వికెట్లు పడగొట్టాడు. ఈ ఏడాది దులీప్ ట్రోఫీలో హ్యాట్రిక్ తీసి అందరి దృష్టిలో పడ్డాడు. ఈ సీజన్లో సయ్యద్ ముస్తాక్‌అలీ టోర్నీలో 7 మ్యాచ్‌ల్లో 15 వికెట్లు తీశాడు. చక్కని స్వింగ్ బౌలింగ్ ఆకిబ్ సొంతం. మెరుపు వేగంతో బంతులు వేసే అతడికి 'బారాముల్లా డేల్ స్టెయిన్' అనే పేరుంది. ఇప్పటిదాకా 36 ఫస్ట్‌క్లాస్ మ్యాచ్‌లు ఆడిన 29 ఏళ్ల ఆకిబ్.. 125 వికెట్లు పడగొట్టాడు. 12సార్లు అయిదు వికెట్ల ప్రదర్శనలు చేశాడు. ఐపీఎల్ వేలంలో ఏకంగా రూ.8.4 కోట్లకు దిల్లీకి సొంతమైన నబి.. ఆ డబ్బుతో తన స్వస్థలం బారాముల్లాలో అకాడమీ నెలకొల్పాలని అనుకుంటున్నాడు. ఆడాలన్న కోరిక ఉన్నా వసతులు లేక ఇబ్బంది పడుతున్న తన ఊరి వారికి చేయూత ఇవ్వాలనేది అతడి ఆశ.

చివరి టీ20కి గిల్ దూరం?


గిల్

లఖ్‌నవూ: పేలవ ఫామ్‌లో ఉన్న టీమ్‌ఇండియా వైస్ కెప్టెన్ శుభ్‌మన్ గిల్.. గాయం కారణంగా దక్షిణాఫ్రికాతో ఆఖరి టీ20కి దూరమైనట్లు బీసీసీఐ వర్గాలు తెలిపాయి. ప్రాక్టీస్ సందర్భంగా గిల్ కాలి బొటనవేలికి గాయం అయినట్లు తెలుస్తోంది. నాలుగో టీ20 జరిగినా.. గిల్ ఆడగలిగేవాడు కాదు. ''నాలుగో టీ20 నేపథ్యంలో గిల్ గట్టిగా సాధన చేశాడు. నెట్స్‌లో బ్యాటింగ్ చేస్తుండగా ఆఖర్లో బంతి బలంగా కాలి బొటనవేలిని తాకింది. అతడు చాలా నొప్పితో బాధపడ్డాడు. బుధవారం మ్యాచ్‌లో ఆడడం గిల్‌కు కష్టమయ్యేది. అతడు అహ్మదాబాద్‌లో ఆఖరి మ్యాచ్‌లో ఆడడం కూడా అనుమానమే'' అని ఓ బీసీసీఐ అధికారి చెప్పాడు. గిల్ మెడ గాయం కారణంగా దక్షిణాఫ్రికాతో టెస్టు, వన్డే సిరీస్‌లకు కూడా దూరమైన సంగతి తెలిసిందే. అతను రెండు రోజులు ఆస్పత్రిలో ఉండాల్సి వచ్చింది. టీ20 సిరీస్ ముంగిట అతడు తిరిగి ఫిట్‌నెస్ సాధించాడు.


మెస్సి

భారత్‌లో ఫుట్‌బాల్‌కు గొప్ప భవిష్యత్తు

దిల్లీ: భారత్‌లో ఫుట్‌బాల్‌కు గొప్ప భవిష్యత్తు ఉంటుందని అర్జెంటీనా సాకర్ దిగ్గజం లియోనెల్ మెస్సి అన్నాడు. నాలుగు రోజుల భారత పర్యటనను ముగించుకుని స్వదేశానికి బయల్దేరిన నేపథ్యంలో అతను ఇక్కడి అభిమానులకు కృతజ్ఞతలు చెప్పాడు. ''దిల్లీ, ముంబయి, హైదరాబాద్, కోల్‌కతాల్లో నా పర్యటన గొప్పగా సాగింది. నాకు సాదరంగా స్వాగతం పలికినందుకు, ఆత్మీయ ఆతిథ్యం ఇచ్చినందుకు ధన్యవాదాలు. ఈ పర్యటన ఆసాంతం నా మీద ప్రేమ చూపించారు. భారత్‌లో ఫుట్‌బాల్‌కు గొప్ప భవిష్యత్తు ఉంటుందని ఆశిస్తున్నా'' అని మెస్సి అన్నాడు. ఈ నెల 12న కోల్‌కతాలోని సాల్ట్ లేక్ స్టేడియంలో కార్యక్రమంతో భారత్‌లో మెస్సి పర్యటన మొదలైంది. అక్కడ ఈవెంట్ అస్తవ్యస్తంగా మారినప్పటికీ.. అదే రోజు హైదరాబాద్ కార్యక్రమం విజయవంతమైంది. తర్వాతి రెండు రోజులు ముంబయి, దిల్లీల్లో పర్యటించిన అతను చివరి రోజు అనంత్ అంబానికి చెందిన వంతారా వన్యప్రాణుల సంరక్షణ కేంద్రానికి వెళ్లాడు.

సాత్విక్ జోడీ శుభారంభం


సాత్విక్, చిరాగ్

హంగ్‌జౌ: బీడబ్ల్యూఎఫ్ ప్రపంచ టూర్ ఫైనల్స్‌లో స్టార్ షట్లర్లు సాత్విక్ సాయిరాజ్- చిరాగ్ శెట్టి సత్తాచాటారు. బుధవారం పురుషుల డబుల్స్ గ్రూపు-బి పోరులో భారత జంట 12-21, 22-20, 21-14తో పారిస్ ఒలింపిక్స్ రజత పతక విజేత, లియాంగ్ వీ కెంగ్- వాంగ్ ఛాంగ్ (చైనా) జోడీపై విజయం సాధించింది. హోరాహోరీగా సాగిన మ్యాచ్‌లో తొలి గేమ్‌లో ప్రత్యర్థి జోడీదే పైచేయి అయింది. 7-7 వరకు ఇరు జోడీలు సమంగా తలపడ్డాయి. చైనా జంట గేరు మార్చడంతో 9-14తో భారత జోడీ వెనుకంజ వేసింది. మరింత దూకుడు పెంచిన చైనా జోడీ 21-12తో మొదటి గేమ్‌ను గెలుచుకుంది. రెండో గేమ్ నువ్వానేనా అన్నట్లు సాగింది. సాత్విక్, చిరాగ్ అద్భుతమైన స్మాష్‌లతో చెలరేగడంతో భారత జంట 18-12తో ఆధిక్యం సంపాదించింది. అయితే భారత ద్వయం అనవసర తప్పిదాలతో స్కోరు 18-18తో సమమైంది. సాత్విక్ తడబడటంతో చైనా జంట 19-18తో ఆధిక్యంలోకి కూడా వెళ్లింది. అనంతరం 19-19, 20-20తో పాయింట్లు సమమయ్యాయి. చైనా ఆటగాడు షటిల్‌ను నెట్‌కు ఆడటంతో భారత జోడీ 21-20తో ఆధిక్యం సంపాదించింది. చిరాగ్ అద్భుతమైన స్మాష్‌తో పాయింటు రాబట్టడంతో 22-20తో రెండో గేమ్ భారత జోడీ సొంతమైంది. మూడో గేమ్ ఆసక్తికరంగానే సాగింది. 13-10తో ఆధిక్యం సంపాదించిన భారత జంట 15-12తో ముందంజ వేసింది. అనంతరం భారత జోడీ ఒక్కసారిగా దూకుడు రెట్టింపు చేసింది. 17-12, 19-13తో మరింత ముందుకెళ్లింది. చివరికి 21-14తో మూడో గేమ్‌తో పాటు మ్యాచ్‌ను గెలుచుకుని ప్రత్యర్థి జంట పోరాటానికి తెరదించింది.

కేరీ సెంచరీ

- ఆస్ట్రేలియా 326/8
- ఇంగ్లాండ్‌తో యాషెస్ మూడో టెస్టు



అడిలైడ్: ఇంగ్లాండ్, ఆస్ట్రేలియా మధ్య యాషెస్ మూడో టెస్టు ఆసక్తికరంగా మొదలైంది. అలెక్స్ కేరీ (106; 143 బంతుల్లో 8×4, 1×6) అద్భుత శతకం సాధించడంతో తొలి రోజు, బుధవారం ఆట ముగిసే సమయానికి ఆస్ట్రేలియా తొలి ఇన్నింగ్స్‌లో 8 వికెట్ల నష్టానికి 326 పరుగులు చేసింది. కష్టాల్లో చిక్కుకున్న ఆతిథ్య జట్టును ఖవాజా (82; 126 బంతుల్లో 10×4)తో కలిసి కేరీ ఆదుకున్నాడు. స్టార్క్ (33 బ్యాటింగ్)తో పాటు లైయన్ (0) క్రీజులో ఉన్నాడు. ఆర్చర్ (3/29), కార్స్ (2/70), విల్ జాక్స్ (2/105) బంతితో రాణించారు.

టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న ఆస్ట్రేలియా.. ఆర్చర్ ధాటికి 94 పరుగులకే నాలుగు వికెట్లు కోల్పోయి కష్టాల్లో చిక్కుకుంది. వెదరాల్డ్ (18), లబుషేన్ (19), గ్రీన్ (0)లను ఆర్చర్ ఔట్ చేయగా.. హెడ్ (10)ను కార్స్ వెనక్కి పంపాడు. ఆ దశలో కేరీ నిలబడ్డాడు. ఇన్నింగ్స్‌కు వెన్నెముకలా నిలిచిన అతడు.. సూపర్ బ్యాటింగ్‌తో జట్టును ఆదుకున్నాడు. ఖవాజాతో అయిదో వికెట్‌కు 91 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పిన కేరీ.. జోష్ ఇంగ్లిస్ (32)తో ఆరో వికెట్‌కు 59 పరుగులు జోడించాడు. ఆ తర్వాత కమిన్స్ (13)తో ఏడో వికెట్‌కు 26 పరుగులు, మిచెల్ స్టార్క్‌తో ఎనిమిదో వికెట్‌కు 50 పరుగులు జోడించి ఔటయ్యాడు. స్టీవ్ స్మిత్ అనారోగ్యం కారణంగా ఈ మ్యాచ్‌కు దూరమయ్యాడు. కెప్టెన్ ప్యాట్ కమిన్స్ ఈ మ్యాచ్‌తోనే పునరాగమనం చేశాడు.

సంక్షిప్త స్కోర్లు... ఆస్ట్రేలియా తొలి ఇన్నింగ్స్: 326/8 (కేరీ 106, ఖవాజా 82, స్టార్క్ 33 బ్యాటింగ్, లబుషేన్ 19, వెదరాల్డ్ 18; ఆర్చర్ 3/29, కార్స్ 2/70, విల్ జాక్స్ 2/105)

శ్రీలంక ఫీల్డింగ్ కోచ్‌గా ఆర్.శ్రీధర్


ఆర్.శ్రీధర్

కొలంబో: భారత జట్టు మాజీ ఫీల్డింగ్ కోచ్ ఆర్.శ్రీధర్.. శ్రీలంకకు తన సేవలు అందించనున్నాడు. తమ జాతీయ జట్టుకు శ్రీధర్‌ను ఫీల్డింగ్ కోచ్‌గా నియమించినట్లు శ్రీలంక క్రికెట్ (ఎస్‌ఎల్‌సీ) బుధవారం ప్రకటించింది. వచ్చే ఏడాది ఫిబ్రవరి- మార్చిలో జరిగే టీ20 ప్రపంచకప్ వరకు అతని సేవలు జట్టుకు అందుబాటులో ఉంటాయని తెలిపింది. 2014 నుంచి 2021 వరకు భారత జట్టుకు శ్రీధర్ ఫీల్డింగ్ కోచ్‌గా వ్యవహరించాడు. ఈ ఏడాది ఆరంభంలో శ్రీలంక జాతీయ హై పర్ఫార్మెన్స్ సెంటర్‌లో 10 రోజుల పాటు ఫీల్డింగ్ శిబిరాన్ని నిర్వహించాడు. ''ఐసీసీ టీ20 ప్రపంచకప్ ముగిసే వరకు శ్రీలంక జాతీయ జట్టుకు శ్రీధర్ ఫీల్డింగ్ కోచ్‌గా వ్యవహరిస్తాడు. 2014 నుంచి 2021 వరకు 300లకు పైగా అంతర్జాతీయ మ్యాచ్‌ల్లో అతను భారత్‌కు సేవలు అందించాడు'' అని ఎస్‌ఎల్‌సీ పేర్కొంది.



మహిళల అంధుల జట్టుతో సచిన్

ముంబయి: ప్రపంచకప్ గెలిచిన భారత అంధ మహిళల క్రికెట్ జట్టును దిగ్గజ సచిన్ తెందుల్కర్ అభినందించాడు. పట్టుదలతో సవాళ్లను అధిగమించి దేశానికి కీర్తిని తెచ్చారని బుధవారం జరిగిన ఓ కార్యక్రమంలో అతడు.. మహిళా క్రికెటర్లను కొనియాడాడు. ప్రపంచకప్ విజయం ముగింపు కాదని, సుదీర్ఘ ప్రయాణానికి అదో ప్రారంభమని అన్నాడు.

దియాకు డబుల్స్ టైటిల్


ఆభా, చేతన్, దియా

భాగల్‌పుర్ (బిహార్): జాతీయ సబ్ జూనియర్ బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్‌లో భారత మాజీ ఆటగాడు చేతన్ ఆనంద్ కుమార్తె దియా సత్తాచాటింది. మంగళవారం ముగిసిన ఈ టోర్నీలో అండర్-13 బాలికల డబుల్స్‌లో దియా ఆనంద్ జోడీ విజేతగా నిలిచింది. ఫైనల్స్‌లో దియా ఆనంద్- ఆభా జాదవ్ (తెలంగాణ) జోడీ 21-14, 16-21, 21-15తో ఆన్య (తెలంగాణ)- కైరా రైనా (మహారాష్ట్ర) జంటపై విజయం సాధించింది.

సత్తా చాటిన రవి, దీపిక

ఆసియా యూత్ పారా క్రీడల్లో పతకాల పంట


రవి

హైదరాబాద్-ఈనాడు, జంగారెడ్డిగూడెం-న్యూస్‌టుడే: ఆసియా యూత్ పారా క్రీడల్లో తెలుగు క్రీడాకారులు బుడిగిన రవి వీర వెంకట భవాని కార్తిక్, గంగపట్నం విజయ దీపిక పతకాల పంట పండించారు. దుబాయ్‌లో జరిగిన ఈ పోటీల్లో రవి స్విమ్మింగ్‌లో మూడు స్వర్ణాలు, మూడు రజతాలు సాధించాడు. దీపిక టేబుల్ టెన్నిస్‌లో స్వర్ణం, కాంస్యం గెలిచింది. ఆంధ్రప్రదేశ్‌లోని ఏలూరు జిల్లా జంగారెడ్డిగూడెం పట్టణానికి చెందిన రవి.. 100 మీటర్ల బ్రెస్ట్ స్ట్రోక్, 100 మీటర్ల బ్యాక్ స్ట్రోక్, 200 మీటర్ల ఐఎం విభాగాల్లో పసిడి పతకాలు నెగ్గాడు. 50 మీటర్ల ఫ్రీస్టైల్, 100 మీటర్ల ఫ్రీస్టైల్, 100 మీటర్ల బ్యాక్ స్ట్రోక్‌లో రజతాలు సాధించాడు. ఈ పోటీల్లో అత్యధిక పతకాలు గెలిచిన భారత క్రీడాకారుడు రవినే. హైదరాబాద్ అమ్మాయి దీపిక టీటీ మిక్స్‌డ్ డబుల్స్ రిషిత్ నత్వానితో కలిసి విజేతగా నిలిచింది. మహిళల సింగిల్స్‌లో దీపిక మూడో స్థానంలో నిలిచింది. 15 ఏళ్ల దీపిక కాంటినెంటల్ స్థాయి పారా క్రీడల్లో స్వర్ణం గెలిచిన అత్యంత పిన్న వయస్కురాలిగా ఘనత సాధించింది.


దీపిక

ఆనంద్.. ఆరేళ్ల తర్వాత


ఆనంద్

కోల్‌కతా: అయిదు సార్లు ప్రపంచ ఛాంపియన్.. భారత చెస్ దిగ్గజం ఆటగాడు విశ్వనాథన్ ఆనంద్ ఆరేళ్ల తర్వాత టాటా స్టీల్ చెస్ టోర్నీలో బరిలో దిగనున్నాడు. వచ్చే ఏడాది 7 నుంచి 11 వరకు జరిగే ఈ టోర్నీలో ఆనంద్ ఆడనున్నాడు. తన శిష్యుడు.. ప్రపంచ ఛాంపియన్ గుకేశ్‌తో ఆనంద్ పోటీపడనుండటం ఈ టోర్నీలో ప్రత్యేక ఆకర్షణ. భారత్ గడ్డపై వ్యక్తిగతంగా ఇద్దరు ప్రపంచ ఛాంపియన్‌లు తలపడనుండటం ఇదే తొలిసారి. ప్రజ్ఞానంద, అర్జున్ ఇరిగేశి, వీ యీ, వెస్లీ సో సహా అగ్రశ్రేణి క్రీడాకారులంతా ఈ టోర్నీ బరిలో ఉన్నారు. 2019లో ఆనంద్ చివరిసారిగా ఈ టోర్నీలో పాల్గొన్నాడు. అప్పట్నుంచి భారత అగ్రశ్రేణి క్రీడాకారులకు మెంటార్‌గా వ్యవహరిస్తున్నాడు. గత కొన్నేళ్లుగా తన వెస్ట్‌బ్రిడ్జ్ ఆనంద్ చెస్ అకాడమీలో గుకేశ్‌తో పాటు మరికొందరు చెస్ స్టార్లకు మార్గనిర్దేశనం చేస్తున్నాడు.

కొత్త జీవితాన్నిచ్చారు


సీఎస్కేకు సర్ఫరాజ్ కృతజ్ఞతలు

దిల్లీ: తనకు మళ్లీ ఐపీఎల్‌లో ఆడే అవకాశమిచ్చినందుకు చెన్నై సూపర్ కింగ్స్ ఫ్రాంఛైజీకి ముంబయి బ్యాటర్ సర్ఫరాజ్ ఖాన్ కృతజ్ఞతలు చెప్పాడు. సర్ఫరాజ్‌ను గత రెండు సీజన్లలో ఏ జట్టూ తీసుకోలేదు. ఈసారి రూ.75 లక్షల కనీస ధరతో వేలంలోకి వచ్చిన అతడిపై తొలి రౌండ్లో ఏ జట్టూ ఆసక్తి చూపలేదు. కానీ తర్వాత సీఎస్కే కనీస ధరకే అతణ్ని సొంతం చేసుకుంది. వేలంలో అమ్ముడయ్యానని తెలిశాక సర్ఫరాజ్ 'జెర్సీ' సినిమాలో నాని విన్నింగ్ మూమెంట్‌ను ఇన్‌స్టాగ్రామ్‌లో పంచుకున్నాడు. దీంతో పాటు చెన్నైకి ధన్యవాదాలు చెబుతూ పోస్టు పెట్టాడు. ''నాకు కొత్త జీవితాన్ని ఇచ్చినందుకు సీఎస్కేకు ధన్యవాదాలు. 2026లో చెన్నై టైటిల్ గెలిచేందుకు నా వంతు ప్రయత్నం చేస్తా'' అని సర్ఫరాజ్ తెలిపాడు.

శివుడు, విష్ణువు వేరుగా కనిపించినా.. ఒకే పరబ్రహ్మస్వరూపం. ఈ శివకేశవ అభేదాన్ని అవతారరూపంలో చూపించేది అయ్యప్ప స్వరూపం. అద్వైతానుభూతికి ఆచరణ రూపమే హరిహరసుత అయ్యప్ప అవతారం.

హరిహరాద్వైతం అయ్యప్ప తత్త్వం

పరమేశ్వరుడు మహాశక్తి స్వరూపుడు. ఆయన అనేకమై జగత్తును నడిపిస్తున్నాడు. ఆ యోగమాయే పురుషరూపంలో నారాయణుడు. స్త్రీ రూపంలో జగదంబ. ఆ అమ్మ క్షేత్రంలో కాళి, సమరంలో దుర్గ, భోగభాగ్యాల్లో భవాని, క్షీరసాగర మథనం వేళ అమృతాన్ని అర్హులకు పంచడంలో నారాయణి, అనర్హులకు అందకుండా చేయడంలో మోహిని అయ్యింది. పరమశివుడు లోకరక్షణకై మోహినికి అర్ధాంతమై మహిషి అనే రాక్షసిని (మహిషాసురుడి సోదరి) సంహరించేందుకు- శక్తిని సృష్టించాడు. ధనుర్మాసం ఉత్తరా నక్షత్రంలో అవతరించిన ఆ శక్తి స్వరూపమే అయ్యప్ప. పౌరాణిక కథనాలను అనుసరించి కైలాసంలో గణపతి, సుబ్రహ్మణ్య స్వామితో పాటు మహాశాస్త (జ్ఞాని, ముక్తిని ప్రసాదించే దైవం) స్థానం కూడా ఉంది. హరిహర సంయోగంతో అవతరించిన శిశువును దేవతలు పంపానది తీరంలో వదిలేశారు. ఆ సమయంలో పందళ దేశాధీశుడైన రాజశేఖరుడు వేటకు వచ్చాడు. సంతానం లేని ఆతడు ఆ బిడ్డను భగవత్ ప్రసాదంగా భావించి రాజభవనానికి తీసుకెళ్లాడు. కంఠంలో మణిహారం ఉండటంతో మణికంఠుడిగా పిలుచుకున్నారు. ఆ బాలుడు వచ్చిన వేళావిశేషంతో రాణికి సంతానం కూడా కలిగింది.



పులిపాలు.. మహిషి సంహారం

మహావీరుడైన మణికంఠ చిన్నతనంలోనే తన పరాక్రమంతో రాజ్యాన్ని శత్రువుల బారి నుంచి రక్షించాడు. భవిష్యత్తులో తన సొంత కుమారుడికి మణికంఠుడు అడ్డుగా ఉంటాడేమోనని భయపడింది రాణి. తీవ్ర అనారోగ్యంతో ఉన్నట్లు నటించి అది తగ్గడానికి పులిపాలు కావాలని రాజును ఒత్తిడి చేసింది. పులిపాలు తెచ్చేందుకు బయల్దేరిన మణికంఠ మార్గమధ్యంలో మహిషిని సంహరించి, పూర్వజన్మ శాపాన్ని తొలగించి ఆమెకి దైవత్వాన్ని ప్రసాదించాడు. తర్వాత తల్లి ఆజ్ఞానుసారం పులిపాలే కాదు, ఏకంగా పులిపై స్వారీచేసి రాజ్యానికి తిరిగొచ్చాడు.

ఈ సంఘటనలను గమనించినప్పుడు- అయ్యప్ప అవతార మూలతత్వం కనిపిస్తుంది. మహిషిని సంహరించడం తమోగుణ నిర్మూలనం. పులిని అధిరోహించడం రజోగుణ నియంత్రణం. తల్లికి స్వచ్ఛమైన క్షీరాన్ని సమర్పించడం సత్వగుణానికి ప్రతీక. రాజు ఇవ్వజూపిన రాజ్యాన్ని తిరస్కరించి సత్వ రజస్తమో గుణాలకు అతీతమైన స్థితిని చేరుకున్న మహావైరాగ్యమూర్తి అయ్యప్ప. తన దీక్షను స్వీకరించి జీవితాన్ని సాధనామయం చేసుకున్న భక్తులకు జీవన్ముక్తిని ప్రసాదిస్తాడు అయ్యప్పస్వామి.

అయ్యప్ప నామ విశిష్టత

అయ్యప్ప అంటే పెద్ద, తల్లి, తండ్రి, పూజ్యుడు, గురువు, వాత్సల్యాన్ని అందించేవాడని అర్థం. అంటే భక్తులకు తల్లిలా లాలన, పాలన, తండ్రిలా రక్షణ పోషణ బాధ్యతల్ని వహించేవాడు. అయ్యప్పకు శాస్త, ధర్మశాస్త, మహాశాస్త అనే నామాలు కూడా ఉన్నాయి. ఇవి ధర్మాన్ని శాసించేవాడు, ధర్మ మార్గం చూపేవాడు, నియమాలను సృష్టించి భక్తుల జీవితాన్ని పరిపుష్టం చేసే గురువు, జ్ఞానాన్ని, ముక్తిని ప్రసాదించే దైవం- అనే అర్థాలను సూచిస్తాయి.

రజోగుణ నియంత్రణ

శబరిమల దేవస్థానంలో దర్శనమిచ్చే అయ్యప్ప విగ్రహం యోగమూర్తి. వీరాసనంలో కూర్చున్న రూపం, మోకాలిపై యోగపట్టం, నిటారుగా వెన్నెముక- ఇవన్నీ యోగ సాధనా సూచనలు. చేతుల్లో చిన్ముద్ర, ముఖంలో ప్రశాంతత, అపార కరుణ సాధకుని అంతరంగంలో జ్ఞానజ్యోతిని వెలిగిస్తాయి. అయ్యప్ప వాహనం పులి. దానిపై స్వారీచేయడం రజోగుణాన్ని నియంత్రణలో పెట్టుకోవడాన్ని సూచిస్తుంది. దిగువన విధ్వంసమైన మహిషి తమస్సుకు ప్రతీక. ఈ రూపం యోగశాస్త్రానికి చిత్రరూప వ్యాఖ్యానం లాంటిది.

అంతరంగ శుద్ధి

శబరిమల యాత్రకు ముందుగా 40 రోజులు (మండలం) దీక్ష పాటిస్తారు. నల్లని వస్త్రాలు, భస్మధారణ, భూశయనం, సాత్వికాహారం, బ్రహ్మచర్యం, ఇంద్రియనిగ్రహం- ఇవన్నీ శారీరక మమకారాన్ని తగ్గించి అంతరంగాన్ని శుద్ధి చేసే ఆచారాలు. దీక్షితులు పరస్పరం 'స్వామి' అని పిలుచుకోవడం- 'సమం సర్వేషు భూతేషు, సర్వం బ్రహ్మమయం జగత్' అనే ఉపనిషత్తు భావాల్ని ఆచరించడమే. కుల, మత, జాతి, వర్ణ భేదాలు లేవు. అందరూ స్వాములే. తలపై బ్రహ్మరంధ్ర స్థానంలో ఇరుముడితో శబరిమల వెళ్లడం మన ఆలోచనలన్నీ పరమపదం దిశగా మళ్లించాలని బోధిస్తే, 18 పవిత్ర మెట్లు 18 గుణదోషాలపై విజయం సాధించమని సూచిస్తాయి. పంపానదిలో స్నానం, అడవిదారిలో సంకటాలు, గిరిశిఖర సన్నిధి- జీవుడు దేవుడివైపు సాగించే అంతర్గత యాత్రకు ప్రతీకలు. ఇలా అయ్యప్పదీక్ష ఉపనిషత్తులోని తత్వమసి వాక్యానికి క్రియారూపం. అందరూ పరబ్రహ్మ స్వరూపులే అనే సందేశాన్ని ఆచరణలో అనుభవింపజేసే సాధనామార్గం ఈ దీక్ష.

పూర్ణ పుష్కల భావం

అయ్యప్ప స్వామికి పూర్ణ, పుష్కల అనే ఇద్దరు దేవేరులు ఉన్నట్లు పురాణాలు తెలియ జేస్తున్నాయి. నైష్ఠిక బ్రహ్మచారి అయిన అయ్యప్ప అనుగ్రహానికి తాత్విక ప్రతీకలు ఈ పూర్ణ, పుష్కల. తన భక్తులకు అయ్యప్ప అనుగ్రహాన్ని పూర్తిగా, సమృద్ధిగా అనుగ్రహిస్తాడన్నది అంతరార్థం. గణపతికి సిద్ధి, బుద్ధిలను భార్యలుగా పేర్కొన్నట్లే పూర్ణ, పుష్కల తాత్వికతకు ప్రతీక. మహిషి తన తామసత్వాన్ని వదలి మళ్లీ జన్మించి స్వామిని వివాహం చేసుకోమని కోరిందనీ, శబరిమలకు కన్నెస్వాములు రాని సంవత్సరం ఆమెని వివాహం చేసుకుంటానని స్వామి వరమిచ్చాడనేది పౌరాణిక కథనం.

తమసోమా జ్యోతిర్గమయ

మన సనాతన ధర్మం 'తమసోమా జ్యోతిర్గమయ' అని చెబుతోంది. అజ్ఞానం అనే అంధకారం నుంచి జ్ఞానజ్యోతి దిశగా ప్రయాణించాలి. అయ్యప్ప గాథ ఈ సందేశాన్నే అందిస్తుంది. తమస్సు (మహిషి) నశించాలి, రజస్సు (పులి) నియంత్రణలోకి రావాలి, సాత్వికత (పాలు) జీవితానికి మూలమవ్వాలి. అలాంటి స్థితికి దారి చూపే పరమ శక్తి స్వరూపుడే అయ్యప్ప. వ్యసనాలు, ధర్మవిరుద్ధ కార్యాల నుంచి దూరమయ్యేందుకు అయ్యప్పదీక్ష దోహదం చేస్తుంది. చెడు అలవాట్లు వదలి బ్రహ్మచర్యం, జపం, ధ్యానం, భజనలతో గడిపే మండలదీక్ష మనసును శుద్ధి చేస్తుంది. 'స్వామియే శరణం అయ్యప్ప' అనే నినాదం- సమానత్వం, సహానుభూతి, నియమాచారాలను అలవరుస్తుంది.

అరణ్యం నుంచి అంతఃపురంలో అడుగుపెట్టి, బిడ్డలు లేని రాజమాతకు సంతానాన్ని అనుగ్రహించాడు అయ్యప్ప. దీక్ష చేపట్టిన భక్తుల్లో తామస గుణాలను పరిహరించి తన్మయ స్థితిని కలిగిస్తాడు. ఆ స్వామి అనుగ్రహంతో అలౌకిక ఆనందం లభిస్తుంది.

– డా.ఎస్ఎల్వి ఉమామహేశ్వరరావు, త్రిపురాంతకం

సాధువు ప్రవచనం ముగించి ఏమైనా సందేహాలుంటే అడగమన్నారు. ఒక వ్యక్తి కర్మాచరణ గురించి తన సందేహాలను వెలిబుచ్చాడు. బదులుగా సాధువు ఇలా వివరించారు...

శ్రీకృష్ణుడి సందేశం!

మన మనసు నిరంతరం భోగభాగ్యాల కోసం పరితపిస్తూ ఉంటుంది. అంతులేని కోరికలు.. వాటిని తీర్చుకోవాలనే ఆరాటం... ఈ లాలస లేదా వ్యామోహం మన ఆత్మకు శాశ్వత ఆనందాన్ని అందించే మార్గాన్ని అడ్డుకుంటోంది.

'కర్మ ఆచరించటంలో మాత్రమే నీకు అధికారం ఉంది. ఫలితం గురించి ఆలోచించవద్దు' అన్నాడు శ్రీకృష్ణపరమాత్ముడు. కర్మ ఫలానికి మనం కారణం కాదు. అదేవిధంగా కర్మలు చేయకుండా ఉండటం కూడా మన ధర్మం కాదు. మనం చేసే పని (కర్మ) ఫలితాన్ని, దాని ద్వారా లభించే సుఖాన్ని (భోగాన్ని) ఆశించినప్పుడు.. మనసు ఈ వలయంలో బందీ అవుతుంది. తపన చెందుతుంది. ఫలితంపై ఉండే ఆసక్తి, ఆ భోగాన్ని అనుభవించాలనే లాలస మనల్ని కర్మ ఫలాల చట్రంలోకి లాగుతుంది.

ఒక వ్యక్తి ఏదైనా వ్యాపారం మొదలుపెట్టాడనుకోండి.. అపార లాభాలు ఆర్జించాలన్నదే అతడి లక్ష్యం అవుతుంది. లాభంపై అతడికి ఉన్న అత్యధిక లాలస- కర్మను సరైన పద్ధతిలో చేయనివ్వదు. ఫలితంగా ధర్మాన్ని అతిక్రమించి, నైతికతను పక్కన పెట్టి అడ్డదారుల్లో వెళ్లేందుకు ప్రయత్నిస్తాడు. ఎంతగా లాభాలు వచ్చి, ఎన్నెన్ని భోగాలను అనుభవించినప్పటికీ.. ఆ ఆనందం తాత్కాలికమే అవుతుంది. ఆ తృష్ణ మరింత పెరుగుతుంది, అంతం లేని కోరికలకు దారితీస్తుంది. ఆశించినంత దక్కకపోయినా లేదా నష్టం సంభవించినా దుఃఖం, నిరాశ కలుగుతాయి. ఎందుకంటే.. పని సవ్యంగా చేయడం మాత్రమే బాధ్యత అనుకోలేదు, అతడి శక్తియుక్తులన్నీ ఫలితంపైనే కేంద్రీకృతమయ్యాయి. శ్రీకృష్ణుడు చెప్పినట్లుగా, ఫలితంపై ఆసక్తి లేకుండా కేవలం మన కర్తవ్యాన్ని సక్రమంగా నిర్వహించడంపై దృష్టి పెడితే... నిశ్చింత, ప్రశాంతత చేకూరతాయి. పొంగిపోవడం, కుంగిపోవడం లేకుండా మనసు సమభావంతో ఉంటుంది. ఇదే అనాసక్త యోగం. భోగాల పట్ల కాంక్ష మనిషిని కర్మబంధాల్లో ఇరికించే మాయాజాల తెర.



ఈ తెరను తొలగించడానికి ఉన్న ఏకైక మార్గం ఆధ్యాత్మిక సాధన. భోగం కోసం కాకుండా, మన కర్తవ్యంగా కర్మను భావించాలి. వైద్యుడు రోగికి చికిత్స అందించడం, ఉపాధ్యాయుడు విద్యార్థికి పాఠం చెప్పడం- ఇవి కేవలం కర్మలు. ఫలితంపై ఆసక్తి లేనప్పుడు, ఆ పని యజ్ఞంతో సమానం అవుతుంది. భోగాలు లభించినా, లభించకపోయినా, లాభం వచ్చినా, నష్టం వచ్చినా మనం ఎలాంటి ఉద్వేగాలకూ లోనవకుండా నిబ్బరంగా ఉండగలగాలి. ఆనందమో, ఆందోళనో లేకుండా సుఖ దుఃఖాలను సమానంగా స్వీకరించగలిగితే.. భోగ లాలస దాని ప్రభావాన్ని కోల్పోతుంది.

భోగాలు క్షేత్రం.. అంటే నశించేవి అని, మనం ఆ భోగాలను అనుభవించే ఆత్మ స్వరూపమైన క్షేత్రజ్ఞులమని తెలుసుకోవాలి. విలాసాలమీద వ్యామోహం అగ్ని వంటిది. నెయ్యి వేస్తుంటే మరింతగా మంటలు వ్యాపిస్తాయి. అందువల్ల కోరికలను గనుక నియంత్రించకపోతే అవి మన ప్రశాంతతను దహించేస్తాయి. భగవద్గీత బోధించినట్లుగా, ఫలితంపై వ్యామోహాన్ని విడిచిపెట్టి, ధర్మాచరణపై దృష్టిపెట్టడమే భోగ లాలస నుంచి విముక్తి పొందే సూత్రం. అప్పుడే లౌకిక సుఖాల అడ్డుగోడ తొలగుతుంది. అంతర్గత శాంతికి మార్గం సుగమం అవుతుంది.

– డా. చిట్యాల రవీందర్

ధ్యానం: అనిశ్చితి వేళ ఆవశ్యక గులిక

ఈపోటీ ప్రపంచంలో పిల్లలకు చదువుల గురించి ఒత్తిడి, ఆందోళన, నిద్రలేమి.. యువతకు ఉద్యోగాల అనిశ్చితి, ఆందోళన.. మధ్య వయస్కులకు కుటుంబ జీవితంలో ఇబ్బందులు, అసమతుల్యత, నిరంతర భయాలు, క్రమం లేని పనివేళలు, టార్గెట్లు, ఆరోగ్య, ఆర్థిక సమస్యలు.. పెద్దవారిలో ఒంటరితనం. ఇలా ఎటు చూసినా ఈ ప్రపంచంలో అంతటా ఓ అనూహ్య అనిశ్చితి. ఈ నేపథ్యంలో, ధ్యానం ప్రపంచవ్యాప్తంగా అత్యంత ముఖ్యమైన, అత్యంత అవసరమైన జీవన నైపుణ్యంగా మారుతోంది.

ఎక్కువ సంపాదించటం, ఎక్కువ సాధించటం, ఎక్కువ మందికి నచ్చేలా జీవించటం.. ఇలా విజయం, సంపద, గుర్తింపు, పోటీల వేటలో బాహ్య ప్రపంచం వెంట జీవితమంతా పరుగులు. కానీ ఆ పరుగుల క్రమంలో.. 'నేనెలా ఉన్నాను? నేనెవరిని? దేనికోసం ఈ పరుగు?' లాంటి మౌలిక ప్రశ్నలను మర్చిపోతున్నాం. ఈ ప్రశ్నలకు సమాధానం దొరకాలంటే బయట కాదు.. అంతరంగంలోకి తొంగిచూసి మనల్ని మనం శోధించాలి.


డిసెంబరు 21 ధ్యాన దినోత్సవం

కృత్రిమ మేధస్సు (ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్.. ఏఐ) కారణంగా ప్రపంచంలో చాలా మార్పులు వేగంగా చోటు చేసుకుంటున్నాయి. ఉద్యోగాలు, విద్య, వైద్య సేవలు, రోజువారీ నిర్ణయాలు అన్నింటికీ ఏఐ ఆధారమవుతోంది. అన్నీ దాని అధీనంలోకి వెళ్తున్నాయి. ఈ వేగం వల్ల మన మనసులు విపరీతమైన ఒత్తిడికి గురవుతున్నాయి. ఇందుకు పిల్లలు, వృద్ధులు కూడా ఇందుకు మినహాయింపు కాదు.

మనలో చాలామంది జీవితం ఇప్పుడు యాంత్రికంగా తయారయ్యింది. మొబైల్ అలారంతో మేల్కొని, వాట్సాప్ మెసేజ్‌తో రోజును మొదలుపెట్టి, ఇన్‌స్టాగ్రామ్ రీల్స్‌తో ముగిస్తున్నాం. అలా ఉదయం మేల్కొన్నది మొదలు రాత్రి నిద్రించే వరకు ఆ విషయాలే మనల్ని వెంటాడుతున్నాయి. సమాచారం పెరిగింది, కానీ స్పష్టత తగ్గింది. మాట్లాడటం ఎక్కువైంది, కానీ వినడం తగ్గింది. ఈ గందరగోళంలో మన మనసు ఎప్పుడూ అలసిపోయిన స్థితిలోనే ఉంటోంది.

ఈ శబ్దాల మధ్య మన మనసుకు శ్వాస తీసుకునే అవకాశం ఎక్కడ? ఈ అలసటకు సెలవు ఇచ్చేది ధ్యానం మాత్రమే. ధ్యానం అనేది ఒక మతాచారం కాదు. ఇది మనసును గమనించే శాస్త్రం. మనలో జరుగుతున్న ఆలోచనలు, భావాలు, భయాలను గమనించడం.. అంతే!

ధ్యానం అనేది ఎక్కడో కొండల్లో చేసే పని కాదు. అదొక మతానికో, దేశానికో పరిమితం కాదు. డబ్బు అవసరం లేదు. పరికరాలు అవసరం లేదు. పేద, పెద్ద అనే అంతరం లేదు. రోజుకు ఐదు నిమిషాలు చాలు. ధ్యానం అందరికీ అందుబాటులో ఉంటుంది. మానవాళికి మన మహర్షులు అందించిన అస్త్రం.. ఆధ్యాత్మిక అంతర్ముఖులై అందించిన దివ్యాస్త్రం ఇది. ఆ పరంపరను మన ఆధ్యాత్మిక గురువులు కాపాడుతూ ఇప్పటికీ ప్రపంచానికి పంచుతున్నారు. ఆర్ట్ ఆఫ్ లివింగ్ వ్యవస్థాపకులు శ్రీశ్రీ రవిశంకర్ గురూజీ లాంటివారు సుదర్శన క్రియ ధ్యాన ప్రక్రియను 180 దేశాలకు పరిచయం చేశారు. 'నిశ్చలమైన మనసు సమాజంలో శాంతిని నెలకొల్పుతుంది. మతాలు, భౌగోళిక సరిహద్దులతో తేడా లేకుండా మానవాళి అందరికీ ఉపయోగపడేది ధ్యానం. ఆధునిక ప్రపంచం విసురుతున్న సవాళ్లను ఎదుర్కోవటానికి ధ్యానం ఎంతగానో దోహదపడుతుంది' అంటారు రవిశంకర్ గురూజీ.



ఆధునిక యుగంలో ధ్యానం ఎందుకంటే...

కృత్రిమ మేధస్సు మన పనులను వేగవంతం చేస్తోంది. కానీ మన భావాలను అర్థం చేసుకోలేకపోతోంది. యంత్రాలు కేవలం ఆలోచిస్తాయి; మనుషులు అనుభవిస్తారు. ఈ అనుభవాలను సమతుల్యం చేయకపోతే ఒత్తిడి, ఆందోళన, నిరాశ తప్పవు.

ఈ రోజుల్లో మానసిక ఒత్తిడి ఒక వయసుకు పరిమితం కాదు. చిన్నపిల్లలు ఏకాగ్రత కోల్పోతున్నారు. యువత భవిష్యత్తు భయంతో జీవిస్తోంది. ఉద్యోగస్తులు పనిభారం - వ్యక్తిగత జీవితాల మధ్య నలిగిపోతున్నారు. వృద్ధులు ఒంటరితనంతో బాధపడు తున్నారు. దేశాలు మారినా, సంస్కృతులు మారినా సమస్య మాత్రం ఒకటే. మనసుకు విశ్రాంతి లేదు.

ధ్యానం మనం ఎదుర్కొంటున్న సమస్యలను వెంటనే తొలగించదు. కానీ వాటిని ఎదుర్కొనే అంతర్గత బలం ఇస్తుంది. ఆలోచనలకు మధ్య చిన్న విరామాన్ని సృష్టిస్తుంది. ఆ విరామంలోనే స్పష్టత పుడుతుంది. అందుకే అభివృద్ధి చెందిన దేశాల్లో ధ్యానం, మైండ్‌ఫుల్‌నెస్ కార్యాలయాల్లోకి, పాఠశాలల్లోకి ప్రవేశిస్తున్నాయి. ఇది ఆందోళన తగ్గించి సమతుల్యత తెస్తుంది. అందుకే ఐక్యరాజ్య సమితి డిసెంబర్ 21వ తేదీని ప్రపంచ ధ్యాన దినోత్సవంగా గుర్తించి నిర్వహిస్తోంది.

ధ్యానం కష్టమైన సాధన కాదు

ధ్యానం కోసం నిత్యం గంటల తరబడి కూర్చోవాల్సిన అవసరం లేదు. ఐదు నుంచి పది నిమిషాలు చాలు. నిశ్శబ్దంగా కూర్చొని శ్వాసను గమనించడం మొదలుపెడితే సరిపోతుంది. ఆలోచనలు వస్తాయి.. వాటిని ఆపే ప్రయత్నం చేయనవసరం లేదు. గమనించి వదిలేయడమే ధ్యానం. ఈ చిన్న అలవాటు క్రమంగా మన జీవితాన్ని ఎంతగానో మారుస్తుంది.

లోనికి పరికించడం నిజమైన విజయం

ప్రపంచాన్ని గెలవాలంటే ముందు మనల్ని మనం గెలవాలి. మన మనసును గెలవాలి. ప్రపంచాన్ని మార్చాలంటే ముందుగా మనల్ని మనం మార్చుకోవాలి. ఆ గెలుపు, మార్పు లోపలే మొదలవు తుంది. లోపల శాంతి ఉంటే బయట సమస్యలు చిన్నవిగా కనిపిస్తాయి. లోపల స్పష్టత ఉంటే నిర్ణయాలు బలంగా ఉంటాయి. అందుకే ఈ కాలానికి అత్యవసర మైన పాఠం ఒక్కటే- బయటకు కాదు లోనికి చూడటం. అలా మనల్ని మనం అర్థం చేసుకుని, అర్థవంతంగా జీవనం సాగించే అద్భుత మార్గాన్ని చూపేదే ధ్యానం.

– డి.వి.ఆర్.కె. శాస్త్రి

మన భారతీయ సంస్కృతిలో ప్రతీ మాసానికి ఒక ప్రత్యేకత ఉంది. అందులో పుష్యమాసం గురించి చెప్పాలంటే.. ఇది దైవారాధనకు అత్యుత్తమ కాలం. పురాణాలు దీన్ని ధర్మమాసంగా పేర్కొన్నాయి.

పూజలు.. దానాలు..

సూర్యుడు ధనుస్సు రాశి నుండి మకరరాశిలోకి ప్రవేశించే సంధి కాలాన్ని సూచిస్తుంది పుష్యమాసం. ఇది దివ్యశక్తి, ఆధ్యాత్మిక సంపదలకు నెలవు. ఈ మాసంలో ప్రకృతి, కాలం రెండూ భగవంతుని ఆరాధనకు అనుకూలించేలా మారతాయి. శివపూజ, విష్ణుపూజ, సూర్యారాధన, తులసీసేవన ఇవన్నీ ఈ మాసంలో అపార ఫలితాలనిస్తాయని వేదాలు వెల్లడించాయి.

పుణ్యప్రదమైన పుష్యమాసానికి ప్రధాన దైవం సూర్య భగవానుడు. ఈ కాలంలో సూర్యుణ్ణి ఆరాధించడం వల్ల ఆరోగ్యం, ఐశ్వర్యం లభిస్తాయని విశ్వసిస్తారు.

శ్రీమహావిష్ణువుకు అత్యంత ప్రీతిపాత్రమైన ధనుర్మాస వ్రతం (గోదాదేవి తిరుప్పావై) ఈ మాసంలోనే ముగుస్తుంది. ఈ మాసంలో వచ్చే సంక్రాంతి ముఖ్యమైన పండుగ. పంటలు ఇంటికి చేరే ఈ సమయంలో దానధర్మాలు చేయడం ఉత్తమం. ముగ్గులు, గొబ్బెమ్మలు, గంగిరెద్దులు, హరిదాసులు.. ఇలా మన సంస్కృతీ సంప్రదాయాల కలయిక ఈ మాసానికి గొప్ప శోభను తెచ్చిపెడుతుంది. సంక్రాంతి రోజున సూర్యుడు మకర రాశిలోకి ప్రవేశిస్తాడు.



ఉత్తరాయణ పుణ్యకాలం మొదలవుతుంది. దేవతలకు ఇది పగటిసమయం.

ఈ మాసాన్ని 'మూఢమాసం' అని కూడా వ్యవహరిస్తారు. మూఢం అంటే శుభ కార్యాలకు విరామం ఇవ్వాల్సిన కాలం. జ్యోతిషం ప్రకారం ఈ మాసంలో రెండు మూఢ కాలాలు ముఖ్యమైనవి. సూర్యుడు ధనుస్సు రాశిలో ఉన్న కాలాన్ని గురుమూఢం లేదా ధనుర్మాసం అంటారు. గురుడు అంటే బృహస్పతికి సూర్యుడు దగ్గరగా వచ్చినప్పుడు శుభత్వం తగ్గుతుందని భావిస్తారు. బృహస్పతి- గృహప్రవేశం, ఉపనయనం, వివాహం తదితర శుభకార్యాలకు కారకుడు. గురుబలం తక్కువగా ఉన్నప్పుడు చేసే పనులు శుభాన్ని, స్థిరత్వాన్ని ఇవ్వవని పెద్దలు చెబుతారు. అందుకే ఈ కాలంలో ఈ కార్యక్రమాలను నిలిపేస్తారు. ఈ నియమం శుభకార్యాలకే వర్తిస్తుంది, భగవత్ ఆరాధనకు కాదు.

పుష్యమాసంలో కొన్నిసార్లు శుక్రగ్రహం సూర్యుడికి అతి దగ్గరగా వచ్చి అస్తమించడం జరుగుతుంది. శుక్రుడు వైవాహిక జీవితం, భోగభాగ్యాలు, సుఖసంతోషాలకు కారకుడు. శుక్రుడు అస్తమించినప్పుడు శుభఫలం తగ్గుతుంది. అందుకే ఈ సమయంలోనూ పెళ్లి, ప్రయాణం, వ్యాపార ఒప్పందం శుభకరం కాదని భావిస్తారు. ఈ మూఢకాలం శుభకార్యాలు, స్థిరత్వాన్ని కోరుకునే అంశాలకే వర్తిస్తుంది. దైవ దర్శనం, పూజలు, వ్రతాలు, దానాలు, తీర్థయాత్రలకు వర్తించదు. ఇంకా చెప్పాలంటే.. పుష్యమాసంలో ఆధ్యాత్మిక కార్యక్రమాలు అధిక శుభ ఫలితాలను ఇస్తాయి.

సమస్యల మధ్యే పరిష్కారాన్ని కనుగొనాలని సందేశమిస్తుంది పుష్యమాసం. లౌకిక కార్యక్రమాలకు విరామం ఇస్తూ, ఆధ్యాత్మిక చింతనను పెంచిపోషిస్తుంది. మనల్ని లౌకిక వ్యవహారాల నుంచి కాస్త విముక్తులను చేసి, ఆత్మపరిశీలన, భగవత్ చింతన దిశగా మళ్లించడానికి దైవం ఇచ్చిన అద్భుత అవకాశం ఈ మాసం. జ్ఞానం, ఆరోగ్యం, ఆనందం అనే త్రివేణి సంగమ ప్రవాహం పుష్యం. నిష్ఠగా పూజలు, దానాలు చేసి, జీవితాన్ని సార్థకం చేసుకోవడమే పరమార్థం.

– కె.వి.లక్ష్మణ రావు

పరమ శివుడు బోయవాని వేషంలో వచ్చి అర్జునుడితో యుద్ధం చేయడానికి సిద్ధమయ్యాడు. ఆ యుద్ధంలో అర్జునుడు నిద్రను నియంత్రించుకుని శివుణ్ణి ఎదిరించి నిలబడ్డాడు. ప్రసన్నుడైన శివుడు 'గుడాకేశా' (నిద్రను వశపరచుకున్నవాడని అర్థం) అని పిలిచాడు. ఆ విధంగా అర్జునుడికి గుడాకేశుడు అనే పేరు వచ్చింది. ఇది మహాభారతంలోని కథనం.

రాగి పాత్రలో నైవేద్యం

యుద్ధభూమిలో అర్జునుడు తన బంధువులను, గురువులను ఎదుర్కోవడానికి సిద్ధపడలేక మనస్తాపం చెందాడు. ఆ సమయంలో శ్రీకృష్ణపరమాత్ముడు-

ఏవముక్తో హృషీకేశో గుడాకేశేన భారత
సేనయోరుభయోర్మధ్యే స్థాపయిత్వా రథోత్తమమ్

అంటూ ఉపదేశించాడు. ఆ సందర్భంలో పార్థుని 'గుడాకేశా' అని శ్రీకృష్ణుడు సంబోధించాడు. అర్జునుడికి జీవిత సత్యాలను బోధించినదే భగవద్గీత. దైవభక్తి, ధర్మబద్ధత గలవాడివి, కార్యసాధనలో అంతులేని ధైర్యం ప్రదర్శించేవాడివి, ఆకలి, నిద్ర తదితర ఇంద్రియాలను నిగ్రహించుకోగల శక్తిమంతుడివి- అంటూ పార్థుడికి తెలియజేయడమే గుడాకేశుడి పేరుతో పిలవడంలోని అంతరార్థం. 'కర్త, కర్మ, క్రియ అన్నీ నేనే! నువ్వు ఆత్మప్రక్షాళన చేసుకుంటూ కర్తవ్య పాలనా ధర్మాన్ని పాటిస్తూ ముందుకు సాగడమే నీ కర్తవ్యం' అని బోధించాడు. గుడాకేశుడి పేరుతో పిలవడం వల్ల అర్జునుడు కార్యోన్ముఖుడయ్యాడు.



పౌరాణిక కథను అనుసరించి... గుడాకేశుడనే రాక్షసుడు మహా విష్ణుభక్తుడు. అతడు నిరంతరం విష్ణునామాన్నే జపిస్తూ ధర్మకార్యాలను నిర్వర్తిస్తుండేవాడు. అలాంటి అతడికి విష్ణువును గురించి తపస్సు చేయాలనిపించింది. ఏకంగా పదహారువేల సంవత్సరాల పాటు కఠోర తపస్సు చేశాడు. అతడి తపస్సుకు మెచ్చి విష్ణువు ప్రత్యక్షమై వరం కోరుకోమన్నాడు. అప్పుడు గుడాకేశుడు కొన్నివేల జన్మల పాటు తాను విష్ణుభక్తిలో మునిగిపోయే విధంగా అనుగ్రహించమని, విష్ణుచక్రంతోనే తన మరణం సంభవించాలని- కోరుకున్నాడు. ఆ రాక్షసుడికి వరాలను అనుగ్రహించి అంతర్థానమయ్యాడు శ్రీమహావిష్ణువు. సంతోషించిన గుడాకేశుడు తపస్సును ఆపకుండా కొనసాగించాడు.

విష్ణుమూర్తి వైశాఖశుద్ధ ద్వాదశినాడు గుడాకేశుడి కోరికను తీర్చాలని నిశ్చయించుకుని మిట్టమధ్యాహ్నం వేళ తన చక్రాయుధాన్ని ప్రయోగించాడు. సుదర్శనచక్రం గుడాకేశుని తలను ఖండించింది. అప్పుడా రాక్షసుడి మాంసం రాగిగా, ఎముకలు వెండిగా, అతడి శరీరంలోని మలినాలు కంచులోహంగా మారాయి. ప్రియభక్తుడి శరీరంతో ఏర్పడిన రాగిపాత్రలో నైవేద్యాన్ని స్వీకరించడం విష్ణుమూర్తికి ఎంతో ఇష్టం. రాగిపాత్రలోని నైవేద్యంలో ఎన్ని మెతుకులుంటాయో.. అన్ని వేల సంవత్సరాల పాటు, ఆ నైవేద్యాన్ని పెట్టిన భక్తుడు వైకుంఠంలో ఉండగలడని కూడా తెలియజేశాడు. ఈ విధంగా గుడాకేశుడు రాగిపాత్ర రూపంలో స్వామి సన్నిధిలో కొలువుతీరాడు. సంకల్పబలంతో మనసును, నిద్రను జయించి విజయుడైన గుడాకేశునితో పోల్చి అర్జునుడిని సమరానికి సంసిద్ధం చేశాడు కృష్ణుడు.

రాగి బుధ గ్రహానికి ప్రతీక. రాగి పాత్రలో నైవేద్యం సమర్పించడం వల్ల బుధ గ్రహ దోషం, సూర్యుడి దోషాలూ తగ్గుతాయని విశ్వసిస్తారు.

– కె.వి.సుమలత

ప్రాక్టీస్ బిట్స్

జనరల్ స్టడీస్ - చరిత్ర

1. కిందివాటిలో సింధు నాగరికత కాలంనాటి గడ్డం ఉన్న పూజారి విగ్రహానికి సంబంధించి సరికానిది?
   1) ఈ ప్రసిద్ధి లోహ విగ్రహం మొహంజొదారోలో లభించింది.
   2) అర్ధనిమీలిత నేత్రాలు ఉన్నాయి.
   3) ఎడమ భుజం చుట్టూ వస్త్రాలంకరణ ఉంది.
   4) ఈ విగ్రహం తక్కువ ఎత్తుతో ఉంది.
2. సుర్కటుడోల్‌లో లభించిన గుర్రం అవశేషాలు గుర్రానివి కావు, కంచర గాడిదవని అభిప్రాయపడినవారు?
   1) మర్టిమన్ వీలర్ 2) సర్‌జాన్ మార్షల్
   3) రోమిలా థాపర్ 4) అలెగ్జాండర్ కన్నింగ్‌హోం
3. సింధు ప్రజల మృతసంస్కారాలకు సంబంధించి సరైంది?
   ఎ) దహనం, ఖననం రెండు పద్ధతులనూ అనుసరించారు.
   బి) దహన ప్రక్రియ ఏకరూపతతో ఉంది.
   సి) పునర్జన్మ ఉంటుందని సింధు ప్రజలు విశ్వసించారు.
   డి) మృతదేహాల పక్కన కొన్ని రకాల వస్తువులు ఉంచి పూడ్చేవారు.
   1) ఎ 2) ఎ, బి, డి 3) ఎ, బి, సి 4) ఎ, డి
4. సింధు నాగరికత పతనానికి ఆర్యుల దండయాత్ర కారణమని అభిప్రాయపడినవారు?
   1) మార్టిమన్ వీలర్ 2) రోమిలా థాపర్
   3) సర్‌జాన్ మార్షల్ 4) పైవారందరూ

సమాధానాలు: 1-1, 2-3, 3-2, 4-1.

JUNIOR INTER Chemistry — Atomic Structure

Final Exams-2026 IMPORTANT Q & A

1. **Calculate the mass of one mole of electrons.** (2 Marks)

A: Mass of electron = 9.1×10^{-31} kg (or) 9.1×10^{-28} gms.

One mole of electrons has mass = $6.023 \times 10^{23} \times 9.1 \times 10^{-31}$
$= 54.8 \times 10^{-8} = 5.48 \times 10^{-7}$ kg.

2. **What is a black body?**

A: The body, which is perfect absorber and emitter of all types of radiations incident on it is called a black body.

3. **Explain Pauli's exclusion principle.**

A: **Pauli's exclusion principle:** According to this principle, "No two electrons in an atom can have the same set of four quantum numbers. This can also be stated as "only two electrons may exist in the same orbital and these electrons must have opposite spins.

4. **What is Aufbau's principle?**

A: **Aufbau's principle:** This principle states, "In the ground state of the atoms, the orbitals are filled in order of their increasing energies". In other words, electrons first occupy the lowest energy orbital available to them and enter into higher energy orbitals only after the lower energy orbitals are filled.

The order in which the orbitals are filled as follows: 1s < 2s < 2p < 3s < 3p < 4s < 3d < 4p < 5s < 4d < 5p < 4f < 5d < 6p < 7s

5. **What is Hund's rule?**

A: **Hund's rule:** This rule deals with the filling of electrons in degenerate orbitals. It states "Pairing of electrons in the orbitals belonging to the same sub-shell (p, d or f) does not take place until each orbital belonging to that subshell has one electron each (i.e.,) all the orbitals are singly occupied".

Since there are three 'p', five 'd', and seven 'f' orbitals, therefore the pairing of electrons will start in the p, d, and f orbitals with the entry of 4th, 6th, and 8th electrons, respectively.

For more IMP Q & A



Writer: P. Trinadha raja

జనరల్ స్టడీస్ — ఇండియన్ ఎకానమీ

సుస్థిర ప్రగతికి బహుమితీయ వ్యూహం!

ప్రపంచంలో వేగంగా అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థగా భారత్ ఎదుగుతున్నప్పటికీ, పేదరికం, ఆదాయం, సంపదలకు సంబంధించి తీవ్రమైన అసమానతలు ఇంకా దేశంలో నెలకొని ఉన్నాయి. లింగ సమానత్వంలోనూ అనేక సవాళ్లు ఎదురవుతున్నాయి. వీటిని పరిష్కరించడంలో పేదరికం లెక్కలు ప్రధానంగా ఉపయోగపడతాయి. ప్రస్తుతం దారిద్ర్యరేఖకు ప్రత్యామ్నాయంగా బహుమితీయ పేదరిక సూచికను నీతి ఆయోగ్ అభివృద్ధి చేసింది. ఐక్యరాజ్యసమితి ప్రకటించిన సుస్థిరాభివృద్ధి లక్ష్యాలకు అనుగుణంగా పేదరికాన్ని తగ్గించడానికి నీతి ఆయోగ్ ద్వారా భారత ప్రభుత్వం అనేక సర్వేలు నిర్వహిస్తోంది. కొలమానాలను నిర్దేశిస్తోంది. సామాజిక, ఆర్థిక కార్యక్రమాలను రూపొందించి అమలు చేస్తోంది. ఆ కొలమానాలు, పథకాల గురించి పోటీ పరీక్షార్థులకు అవగాహన ఉండాలి. ఆ దిశగా జరుగుతున్న కృషిని తెలుసుకోవాలి.




పేదరికం అంచనాల్లో నీతి ఆయోగ్ పాత్ర

భారతదేశంలో ప్రస్తుతం పేదరిక అంచనాలను నీతి ఆయోగ్ వెల్లడిస్తోంది. ఇందుకోసం జాతీయ నమూనా సర్వే కార్యాలయం (ఎన్ఎస్ఎస్ఓ) నుంచి గణాంకాలతో పాటు జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే గణాంకాలనూ పరిగణనలోకి తీసుకుంటోంది. ఆదాయం, ఆరోగ్యం, విద్య, జీవన ప్రమాణాలు తదితర 12 అంశాల మిళితంగా బహుమితీయ పేదరిక సూచిక (మల్టీడైమెన్షనల్ పావర్టీ ఇండెక్స్- ఎంపీఐ)ను కూడా అభివృద్ధి చేసి ప్రకటిస్తోంది.

నీతి ఆయోగ్ చర్చాపత్రం

పేదరికంలో అన్ని కోణాలను బహిర్గతం చేసి పరిష్కరించే ఉద్దేశంతో నీతి ఆయోగ్ 2021లో తొలిసారి చర్చాపత్రాన్ని విడుదల చేసింది. జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయుల్లో ఆరోగ్యం, విద్య, జీవన ప్రమాణాల్లో ఉన్న లోపాలను ఇందులో వెల్లడించింది. ఈ చర్చాపత్రం ప్రకారం భారతదేశంలో బహుమితీయ పేదరికం 2013-14లో 29.17% నుంచి 2022-23లో 11.28 శాతానికి తగ్గింది. తొమ్మిది సంవత్సరాల్లో 24.82 కోట్ల మంది బహుమితీయ పేదరికం నుంచి బయటపడ్డారని పేర్కొంది.

గ్లోబల్ మల్టీడైమెన్షనల్ పావర్టీ ఇండెక్స్ (జీఎంపీఐ)



దీనిని 2010 నుంచి ఐక్యరాజ్యసమితి అభివృద్ధి కార్యక్రమం (యూఎన్‌డీపీ), ఆక్స్‌ఫర్డ్ పావర్టీ అండ్ హ్యూమన్ డెవలప్‌మెంట్ ఇనిషియేటివ్ (ఓపీహెచ్ఐ) సంయుక్తంగా ప్రకటిస్తున్నాయి. 2025 జీఎంపీఐ నివేదికను 'అతివ్యాప్తి చెందుతున్న కష్టాలు: పేదరికం, వాతావరణ ప్రమాదాలు' శీర్షికతో ప్రచురించాయి. దీని ప్రకారం 109 దేశాల్లోని 6.3 బిలియన్ల మందిలో 1.1 బిలియన్ల ప్రజలు (18.3%) తీవ్రమైన బహుమితీయ పేదరికంలో జీవిస్తున్నారు. ఎక్కువగా యువకులు, గ్రామీణ ప్రాంత ప్రజలు, తక్కువ మానవాభివృద్ధి దేశాల్లో ఉన్నారు. ◆ జీఎంపీఐ ప్రకారం భారతదేశంలో బహుమితీయ పేదరికం 2005-06లో 55.1% నుంచి 2019-21కి 16.4 శాతానికి తగ్గింది. దేశంలోని పెద్ద రాష్ట్రాలు పేదరికంతో పాటు వనరుల కొరత, తీవ్రమైన వాయు కాలుష్య ప్రభావాలను ఎదుర్కొంటున్నాయి.

పేదరిక నిర్మూలన పథకాలు/కార్యక్రమాలు

భారతదేశంలో ఇటీవలి కాలంలో ఉపాధి కల్పన, సామాజిక భద్రత, గృహనిర్మాణం, ఆరోగ్యం, ఆహార భద్రతపై దృష్టి సారించిన పేదరిక నిర్మూలన పథకాలు, కార్యక్రమాలు అమలవుతున్నాయి.

సామాజిక భద్రత కార్యక్రమాలు: ◆ ప్రధానమంత్రి గరీబ్ కల్యాణ్ యోజన- పేదలకు అదనపు ఆహార ధాన్యాలు అందించే కార్యక్రమం. ◆ ప్రధానమంత్రి జన్‌ధన్ యోజన- బ్యాంకింగ్, క్రెడిట్, బీమా తదితర ఆర్థిక సేవలను పొందే విధంగా చేస్తుంది. ◆ ప్రధానమంత్రి ఉజ్వల యోజన- కాలుష్యరహిత వంట ఇంధన వినియోగాన్ని ప్రోత్సహించేలా దారిద్ర్యరేఖకు దిగువన ఉన్న గృహాల మహిళలకు ఉచిత ఎల్‌పీజీ కనెక్షన్లు పంపిణీ చేస్తుంది.

నీతి ఆయోగ్ ప్రకారం గత తొమ్మిదేళ్లలో ఉత్తర్‌ప్రదేశ్‌లో 5.94 కోట్ల మంది, బిహార్‌లో 3.77 కోట్లు, మధ్యప్రదేశ్‌లో 2.30 కోట్లు, రాజస్థాన్‌లో 1.87 కోట్ల మంది బహుమితీయ పేదరికం నుంచి బయటపడ్డారు.

ఉపాధి, జీవనోపాధి కార్యక్రమాలు



దీన్ దయాళ్ అంత్యోదయ యోజన - జాతీయ గ్రామీణ జీవనోపాధి మిషన్: గ్రామీణ పేదలకు ముఖ్యంగా మహిళలకు ఆర్థిక సేవలు, జీవనోపాధి అవకాశాలు పొందడానికి స్వయంసహాయక బృందాల ఏర్పాటులో మద్దతు ఇస్తుంది.

పండిట్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయ గ్రామీణ కౌశల్ యోజన: గ్రామీణ యువతకు మెరుగైన ఉపాధి కోసం నైపుణ్య శిక్షణ అందించడం లక్ష్యంగా దీనిని ప్రారంభించారు.

ప్రధానమంత్రి వీధి విక్రేత ఆత్మనిర్భర్ నిధి (పీఎం స్వనిధి): వీధి వ్యాపారులు స్వయంసమృద్ధి సాధించేలా చిన్న రుణాలను అందిస్తుంది.

ఆరోగ్యం, గృహ నిర్మాణ కార్యక్రమాలు

ఆయుష్మాన్ భారత్ - ప్రధానమంత్రి జన్ ఆరోగ్య యోజన: ఆసుపత్రిలో ఇన్‌పేషెంట్ ఖర్చుల కోసం ప్రతి కుటుంబానికి ఏడాదికి రూ.5 లక్షల వరకు ఆరోగ్య బీమా అందిస్తుంది.

ప్రధానమంత్రి ఆవాస్ యోజన: అందరికీ గృహవసతి లక్ష్యంగా సరసమైన ఇళ్ల నిర్మాణానికి సహాయం అందించే పథకం.

భారతదేశంలో గత కొన్ని దశాబ్దాలుగా ఆర్థికవృద్ధి ఫలితాలతో పాటు ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలు ప్రభావమంతంగా అమలవుతుండటంతో పేదరికం గణనీయంగా తగ్గింది.

ముఖ్యాంశాలు



◆ పేదరికాన్ని దృష్టిలో ఉంచుకుని 'భారత ఆర్థిక వ్యవస్థ గాజు తెర ఆర్థిక వ్యవస్థ'గా పేర్కొన్న ఆర్థికవేత్త- గౌతమ్ మాథుర్. ◆ బహుమితీయ పేదరిక సూచికలో ప్రస్తుతం 12 సూచికలను తీసుకుని లెక్కిస్తున్నారు. ◆ ప్రపంచ బ్యాంకు 2021 కొనుగోలు శక్తి సమానత ప్రకారం ఒక వ్యక్తి రోజుకు 3 డాలర్ల కంటే తక్కువ ఆదాయంతో జీవించడాన్ని తీవ్ర పేదరికంగా నిర్వచించింది. ◆ 2025లో దేశంలో తీవ్ర పేదరికం నుంచి విముక్తి పొందిన మొదటి రాష్ట్రం-కేరళ. ◆ ఆదాయ అసమానతలను కొలవడానికి గిని గుణకాన్ని ఉపయోగిస్తారు. ◆ గ్లోబల్ మల్టీ డైమెన్షనల్ పావర్టీ ఇండెక్స్-2021 ప్రకారం 109 దేశాల్లో భారత్ 66వ స్థానంలో ఉంది. ◆ 2023-24 నెలసరి తలసరి వినియోగ వ్యయం (ఎంపీసీఈ) గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో ఎక్కువ ఉన్న రాష్ట్రం - సిక్కిం. ◆ ధరల స్థాయి రాష్ట్రం నుంచి రాష్ట్రానికి మారడం వల్ల దేశంలో ఒక నిర్దిష్ట సంవత్సరంలో కొన్ని రాష్ట్రాల్లో అధికారిక దారిద్ర్యరేఖలు ఇతర రాష్ట్రాల కంటే ఎక్కువగా ఉంటాయి. ◆ గ్లోబల్ మల్టీడైమెన్షనల్ పావర్టీ ఇండెక్స్ (జీఎంపీఐ)ని 2010లో ప్రారంభించారు. ◆ నీతి ఆయోగ్ జాతీయ బహుమితీయ పేదరిక సూచికను లెక్కించి ప్రచురిస్తుంది.



రచయిత: వమరవల్లి రమణయ్య

ధనేశ్వర్ బారిక్‌కు ప్రకృతి బంధు పురస్కారం!

రష్యా అధ్యక్షుడు పుతిన్ ఇటీవల చేసిన రెండు రోజుల భారత్ పర్యటన ప్రపంచం దృష్టిని ఆకర్షించింది. ఫిఫా వేడుకల్లో అమెరికా అధ్యక్షుడు ట్రంప్ అంతర్జాతీయ శాంతి బహుమతిని అందుకున్నారు. చైనా బలగాలతో ఘర్షణ జరిగిన గల్వాన్‌లో అత్యంత ఎత్తయిన యుద్ధ స్మారకాన్ని భారత్ ఆవిష్కరించింది. దేశంలో అర్హత ఉన్న ప్రతి ఒక్కరినీ ఓటరు జాబితాలో చేర్చడంతో పాటు అనర్హులను తొలగించాలనే లక్ష్యంతో కేంద్ర ఎన్నికల సంఘం 'సర్' పేరుతో సవరణ కార్యక్రమాన్ని చేపట్టింది. సేంద్రియ అల్లం ఉత్పత్తి, మార్కెటింగ్‌లో రాణిస్తున్న రాష్ట్రంగా మిజోరం గుర్తింపు పొందింది. రాష్ట్ర ప్రజలకు పది లక్షల రూపాయల వరకు నగదు రహిత చికిత్స అందించే బీమా పథకాన్ని పంజాబ్ ప్రారంభించింది. వర్తమాన వ్యవహారాల్లోని ఇలాంటి ముఖ్యాంశాలు, ప్రధాన పరిణామాలను పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే వారు నిరంతరం తెలుసుకోవాలి. జాతీయ, అంతర్జాతీయ క్రీడల విజేతలు, విశిష్ట అవార్డుల గ్రహీతలు, వార్తల్లో నిలిచిన వ్యక్తులు, ఇటీవల దేశంలో నిర్వహించిన వివిధ దినోత్సవాలను, వాటి ఇతివృత్తాలను గుర్తుంచుకోవాలి.



కరెంట్ అఫైర్స్

మాదిరి ప్రశ్నలు

1. సర్ (ఎస్ఐఆర్)-2026లో భాగంగా ఓటర్ జాబితాను 100% డిజిటలైజ్ చేసిన తొలి రాష్ట్రం?
   1) గుజరాత్ 2) రాజస్థాన్ 3) గోవా 4) తమిళనాడు

నోట్: 1) ఎస్ఐఆర్ అంటే స్పెషల్ ఇన్‌టెన్సివ్ రివిజన్.
2) యూపీ, ఎంపీ, గోవా, గుజరాత్, ఛత్తీస్‌గఢ్, తమిళనాడు, పశ్చిమ బెంగాల్, కేరళ; కేంద్రపాలిత ప్రాంతాలైన పుదుచ్చేరి, లక్షద్వీప్, అండమాన్- నికోబార్ దీవుల్లో ఎన్నికల సంఘం ఎస్ఐఆర్‌ను నిర్వహిస్తోంది.

2. గ్లోబల్ హ్యూమన్ సొసైటీ అందించే గ్లోబల్ హ్యూమానిటేరియన్ అవార్డు కిందివారిలో ఎవరికి వచ్చింది?
   1) అనంత్ అంబానీ
   2) ముకేశ్ అంబానీ
   3) అనిల్ అంబానీ
   4) ఇషా అంబానీ



నోట్: 1) జంతు సంక్షేమం కోసం ఆయన చేస్తున్న కృషికి ఈ అవార్డును ఇచ్చారు.
2) 'పెటా' ఇండియా 2025 పర్సన్ ఆఫ్ ద ఇయర్ అవార్డు నటి రవీనా టాండన్‌కి లభించింది.

3. కింది వాటిలో సరైంది?
   ఎ) యునెస్కో ఇన్‌టాంజిబుల్ కల్చరల్ హెరిటేజ్ ఆఫ్ హ్యూమానిటీ జాబితాలో దీపావళికి చోటు లభించింది.
   బి) ఈ జాబితాలో ఇండియా నుంచి చోటు పొందిన వాటిలో దీపావళి 16వది.
   సి) 2023లో గుజరాత్ గర్బా ఈ జాబితాలో చేరింది.
   డి) న్యూదిల్లీలో 2025, డిసెంబరు 8-13 వరకు ఎర్రకోటలో యునెస్కో ఇంటర్ గవర్నమెంటల్ కమిటీ 20వ సెషన్ జరిగింది.
   1) ఎ, బి, సి 2) బి, సి, డి
   3) ఎ, బి, సి, డి 4) బి, డి
4. 2025-26లో భారత జీడీపీ వృద్ధి 7.2%గా నమోదు కావొచ్చని అంచనా వేసిన సంస్థ?
   1) ఏడీబీ 2) ప్రపంచ బ్యాంకు
   3) ఐఎంఎఫ్ 4) ఆర్‌బీఐ

నోట్: ఆర్‌బీఐ 2025-26 భారత జీడీపీ అంచనాను 7.3%కి పెంచింది.

5. పురుషుల జూనియర్ అండర్-21 ప్రపంచ హాకీ టోర్నమెంట్-2025కు సంబంధించి సరైంది?
   ఎ) ఈ టోర్నీ విజేత - జర్మనీ
   బి) ఈ టోర్నీ రన్నర్ - స్పెయిన్
   సి) మూడో స్థానం - ఇండియా
   డి) ఈ టోర్నీ స్పెయిన్‌లో జరిగింది.
   1) ఎ, బి, సి, డి 2) బి, సి, డి
   3) సి, డి 4) ఎ, బి, సి

నోట్: 1) ఈ టోర్నీ ఇండియా(చెన్నై)లో జరిగింది.
2) ఈ టోర్నీ 14 సార్లు జరగగా జర్మనీ 8 సార్లు, అర్జెంటీనా, భారత్ రెండు సార్లు చొప్పున; ఆస్ట్రేలియా, పాకిస్థాన్ ఒకసారి చొప్పున నెగ్గాయి.
3) ఈ టోర్నీ టాప్ స్కోరర్ - అమీరుల్ ఇస్లాం (18 గోల్స్) బంగ్లాదేశ్
4) ఉత్తమ ఆటగాడు - కాస్పర్ వాన్ డెర్‌వీన్ (నెదర్లాండ్స్)

6. The Eleventh Hour: A Quintet of stories పుస్తక రచయిత?
   1) అరుంధతీ రాయ్ 2) కిరణ్ దేశాయ్
   3) సల్మాన్ రష్దీ 4) అనిల్ చౌదరి

నోట్: 1) Bharat that is India: Reclaiming Our real Identity పుస్తక రచయిత - అభిజిత్ జోగ్
2) I like challenges - ఆనంది బెన్‌పటేల్ జీవిత చరిత్ర ఆధారంగా రూపొందిన పుస్తకం.

7. 'ఫుట్‌బాల్ యునైట్స్ ది వరల్డ్' పేరుతో పిలిచే ఫిఫా శాంతి బహుమతి మొదటిసారిగా ఎవరికి ప్రదానం చేశారు?
   1) పుతిన్
   2) మోదీ
   3) జిన్‌పింగ్
   4) డొనాల్డ్ ట్రంప్



నోట్: ఫిఫా ప్రస్తుత అధ్యక్షుడు గియానీ ఇన్ఫాంటినో

8. ఏ దేశ తొలి రక్షణ దళాల అధిపతిగా ఫీల్డ్‌మార్షల్ ఆసిమ్ మునీర్ నియమితులయ్యారు?
   1) బంగ్లాదేశ్ 2) పాకిస్థాన్
   3) శ్రీలంక 4) భూటాన్
9. ఇటీవల 46వ గల్ఫ్ సహకార మండలి (జీసీసీ) శిఖరాగ్ర సదస్సు ఎక్కడ జరిగింది?
   1) దోహా 2) కువైట్
   3) మనామా 4) అబుదాబి

నోట్: 1) బహ్రెయిన్ రాజధాని మనామా
2) జీసీసీలో ఖతార్, కువైట్, ఒమన్, బహ్రెయిన్, సౌదీ అరేబియా, యూఏఈ సభ్య దేశాలు.
3) జీసీసీ ప్రధాన కార్యాలయం సౌదీలోని రియాద్‌లో ఉంది. 1981లో ఈ కూటమి ఏర్పడింది.
4) గ్లోబల్ ఏఐ షో 2025, డిసెంబరు 8, 9 తేదీల్లో యూఏఈలోని అబుదాబిలో జరిగింది.
థీమ్ - 'ఏఐ: 2031- యాక్సిలరేటింగ్ ఇంటెలిజెంట్ ఫ్యూచర్స్'


10. రూ.10 లక్షల వరకు నగదు రహిత చికిత్సను అందించేలా ఇటీవల 'ముఖ్యమంత్రి సేహత్ బీమా యోజన' పథకాన్ని ప్రారంభించిన రాష్ట్రం?
    1) రాజస్థాన్ 2) గోవా 3) పంజాబ్ 4) కేరళ

నోట్: 1) రూ.51,000 సహాయం అందించే ముఖ్యమంత్రి కన్యా బిబాహ యోజనను ఒడిశా ప్రారంభించింది.
2) 9 - 12 తరగతుల విద్యార్థుల కోసం ముఖ్యమంత్రి భారత్ దర్శన్ యోజనను ప్రారంభించిన రాష్ట్రం బిహార్.

11. భారతదేశంలో మొదటి ఓపెన్ నెట్‌వర్క్ (ఆన్) కోర్టు ఎక్కడ ప్రారంభించారు?
    1) చెన్నై 2) అమరావతి (ఆంధ్రప్రదేశ్)
    3) హైదరాబాద్ 4) కొల్లం (కేరళ)
12. 33వ ఆగ్నేయాసియా క్రీడలు ఏ దేశంలో జరుగుతున్నాయి?
    1) లావోస్ 2) సింగపూర్
    3) కంబోడియా 4) థాయ్‌లాండ్
13. టైమ్స్ సీఈఓ ఆఫ్ ది ఇయర్ 2025గా ఎవరు నిలిచారు?
    1) అనిష్ షా 2) ముఖేష్ అంబానీ
    3) శ్రీని పల్లియా 4) నీల్ మోహన్

నోట్: యూట్యూబ్ సీఈఓ నీల్ మోహన్

14. నాణ్యమైన సేంద్రియ అల్లం, ఉత్పత్తి, ప్రాసెసింగ్, మార్కెట్ పరిధిని పెంచడంతో భారత్‌లో ఏ రాష్ట్రాన్ని నీతి ఆయోగ్ 'జింజర్ క్యాపిటల్ ఆఫ్ ఇండియా'గా ప్రకటించింది?
    1) అరుణాచల్ ప్రదేశ్ 2) మేఘాలయ
    3) మిజోరం 4) మణిపుర్
15. కింది వాటిలో సరైంది?
    ఎ) రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ డిసెంబరు 4-5 (2025) తేదీల్లో భారత్‌లో పర్యటించారు.
    బి) అస్సాంకు చెందిన 'బ్లాక్ టీ పొడి', పశ్చిమ బెంగాల్‌లోని ముర్షిదాబాద్‌లో తయారుచేసిన వెండి టీ కప్పు సెట్, రెడ్ గోల్డ్‌గా పిలిచే కశ్మీర్ కుంకుమ పువ్వు, రష్యన్‌లోకి అనువదించిన భగవద్గీతను మోదీ.. పుతిన్‌కి అందించారు.
    సి) 23వ భారత్ - రష్యా వార్షిక శిఖరాగ్ర సదస్సు కోసం పుతిన్ ఇండియా వచ్చారు.
    1) ఎ, బి 2) ఎ, సి 3) ఎ, బి, సి 4) బి, సి
16. అరుదుగా పుష్పించే పరాన్నజీవి మొక్క 'క్యాంప్‌బెలియా ఆరంటీయకా'ను 175 ఏళ్ల తర్వాత ఏ రాష్ట్రంలో పరిశోధకులు కనుక్కున్నారు?
    1) తమిళనాడు 2) గోవా 3) కేరళ 4) కర్ణాటక



నోట్: 'డోలోమెడెస్ ఇండికస్' అనే కొత్తరకం సాలీడు జాతిని కూడా కేరళలో కనుక్కున్నారు.

17. 5వ ఎడిషన్ హరిమౌ శక్తి సైనిక విన్యాసాలు ఇటీవల ఏ దేశాల మధ్య రాజస్థాన్‌లోని మహాజన్ ఫీల్డ్ ఫైరింగ్ రేంజ్‌లో ప్రారంభమయ్యాయి?
    1) భారత్ - మలేసియా
    2) భారత్ - ఇండోనేసియా
    3) భారత్ - కెనడా 4) భారత్ - నేపాల్

నోట్: గరుడశక్తి సైనిక విన్యాసాలు 2025 భారత్-ఇండోనేసియా మధ్య హిమాచల్‌ప్రదేశ్‌లో ప్రారంభమయ్యాయి.

18. 'విజ్ఞాన్ సే సమృద్ధి - ఫర్ ఆత్మనిర్భర్ భారత్' థీమ్‌తో 11వ ఇండియా ఇంటర్నేషనల్ సైన్స్ ఫెస్టివల్ - 2025 ఎక్కడ జరిగింది?
    1) పానిపట్టు (హరియాణా) 2) కొచ్చి (కేరళ)
    3) పంచకుల (హరియాణా)
    4) అమరావతి (ఆంధ్రప్రదేశ్)
19. లావాదేవీల పరిమాణం పరంగా ప్రపంచంలోనే అతిపెద్ద రిటైల్ ఫాస్ట్ పేమెంట్ సిస్టంగా యూపీఐను ఐఎంఎఫ్ గుర్తించింది. అయితే భారత యూపీఐ.. గ్లోబల్ షేర్‌లో ఎంత శాతం వాటాతో ఉంది?
    1) 25% 2) 69% 3) 49% 4) 70%
20. అంతర్జాతీయ పౌరవిమానయాన దినోత్సవం ఏటా ఏ రోజున నిర్వహిస్తారు?
    1) డిసెంబరు 9 2) డిసెంబరు 12
    3) డిసెంబరు 7 4) డిసెంబరు 6

నోట్: 1) డిసెంబరు 10 - మానవ హక్కుల దినోత్సవం. థీమ్: హ్యూమన్ రైట్స్, అవర్ ఎవ్రీడే ఎసన్షియల్స్
2) డిసెంబరు 5 - ప్రపంచ నేలల దినోత్సవం; 2025 థీమ్: 'హెల్దీ సాయిల్స్ ఫర్ హెల్దీ సిటీస్'
3) డిసెంబరు 9 - అంతర్జాతీయ అవినీతి వ్యతిరేక దినోత్సవం; 2025 థీమ్: యునైటింగ్ విత్ యూత్ అగైనెస్ట్ కరప్షన్: షేపింగ్ టుమారోస్ ఇంటెగ్రిటీ

21. 'ఎంపవరింగ్ రూరల్ ఇన్నోవేషన్ ఫర్ గ్లోబల్ ఛేంజ్' థీమ్‌తో 2025, డిసెంబరు 5-6 తేదీల్లో ఎర్త్ సమ్మిట్ ఎక్కడ జరిగింది?
    1) గాంధీనగర్ (గుజరాత్)
    2) కోల్‌కతా (పశ్చిమ బెంగాల్)
    3) హైదరాబాద్ (తెలంగాణ) 4) పనాజీ (గోవా)
22. ఖేలో ఇండియా యూనివర్సిటీ గేమ్స్ - 2025లో 67 పతకాలతో మొదటి స్థానం (45 పసిడి + 14 రజతాలు + 11 కాంస్యాలు)లో నిలిచిన విశ్వవిద్యాలయం ఏది?
    1) జైన్ విశ్వవిద్యాలయం
    2) గురుకాశీ విశ్వవిద్యాలయం
    3) చండీగఢ్ విశ్వవిద్యాలయం
    4) లవ్లీ ప్రొఫెషనల్ విశ్వవిద్యాలయం

నోట్: ఈ పోటీలు 2025, నవంబరు 24 నుంచి డిసెంబరు 5 వరకు రాజస్థాన్‌లో జరిగాయి.

23. ప్రకృతి బంధు సమ్మాన్ పురస్కారం పొందిన ధనేశ్వర్ బారిక్ ఏ రాష్ట్రానికి చెందినవారు?
    1) ఉత్తర్‌ప్రదేశ్ 2) ఒడిశా 3) అస్సాం 4) కేరళ
24. ఇటీవల మరణించిన స్వరాజ్ కౌశల్ ఏ రాష్ట్ర గవర్నర్‌గా పనిచేశారు?
    1) మిజోరం 2) మణిపుర్
    3) అస్సాం 4) అరుణాచల్ ప్రదేశ్

నోట్: ఫిబ్రవరి 8, 1990 నుంచి ఫిబ్రవరి 9, 1993 వరకు మిజోరం గవర్నర్‌గా పనిచేశారు.

25. ఆండ్రెజ్ బాబిస్ ఏ దేశ ప్రధానిగా నియమితులయ్యారు?
    1) కొలంబియా 2) చెక్ రిపబ్లిక్
    3) చిలీ 4) అర్జెంటీనా
26. ప్రపంచంలోనే అత్యంత ఎత్తయిన యుద్ధ స్మారక చిహ్నాన్ని ఇటీవల ఎక్కడ ఆవిష్కరించారు?



    1) నుబ్రా వ్యాలీ 2) జన్స్కర్ వ్యాలీ
    3) గుల్‌మార్గ్ 4) గల్వాన్



రచయిత: బి. ధన్‌మోహన్ రెడ్డి

సమాధానాలు

1-2, 2-1, 3-3, 4-1, 5-4, 6-3, 7-4, 8-2, 9-3, 10-3, 11-4, 12-4, 13-4, 14-3, 15-3, 16-3, 17-1, 18-3, 19-3, 20-3, 21-1, 22-3, 23-2, 24-1, 25-2, 26-4.


శ్రీశైలం ప్రాజెక్టు


నాగార్జున సాగర్ ప్రాజెక్టు


భాక్రానంగల్ ప్రాజెక్టు

సాగు, తాగు నీటి కోసం, విద్యుత్ ఉత్పత్తికి, ఆహార భద్రత తదితర అనేక అవసరాలను ఏకకాలంలో తీర్చేందుకు వీలుగా నదులపై నిర్మించిన కట్టడాలే బహుళార్థసాధక ప్రాజెక్టులు. వీటిలో భారీ స్థాయిలో నీటిని నిల్వ చేసే అవకాశం ఉంటుంది. దీంతో వర్షాభావ పరిస్థితులనూ సమర్థవంతంగా ఎదుర్కోవచ్చు. కరవుల వల్ల జరిగే నష్టాలను నివారించవచ్చు. ప్రాజెక్టుల ద్వారా తరతరాలకు సాగు, తాగు నీరు అందుబాటులోకి వస్తుంది. ఒక ప్రాంత ప్రగతిలో ఇవి ముఖ్య భూమిక పోషిస్తాయి. అయితే ఆయా నదీ పరీవాహక ప్రాంతాలను పంచుకోవడంపై వివిధ రాష్ట్రాల నడుమ నీటి పంపకాలపై వివాదాలు నెలకొంటున్నాయి. ఆ ప్రభావం ప్రాజెక్టుల నిర్మాణంపై ఉంటోంది. దేశంలోని వివిధ నీటిపారుదల ప్రాజెక్టులు, వాటి సమస్యలపై పోటీపరీక్షార్థికి అవగాహన అవసరం.

భారత ఆర్థిక సమస్యలు - నీటిపారుదల ప్రాజెక్టులు

తరతరాల అవసరాలు తీరుస్తూ.. ఆర్థికాభివృద్ధికి అండగా నిలుస్తూ!

ఏపీపీఎస్సీ పరీక్షల ప్రత్యేకం
ఇండియన్ ఎకానమీ

బహుళార్థసాధక నదీ ప్రాజెక్టులు అంటే కేవలం నీటి పారుదల అవసరాలను తీర్చడమే కాకుండా ఎన్నో ఇతర ప్రయోజనాలను సైతం అందిస్తాయి. విద్యుత్ ఉత్పాదన, వరదలు అరికట్టడం, జల రవాణా, తాగు నీటి సరఫరా, పరిశ్రమల నీటి అవసరాలు తీర్చడం, మత్స్య సంపద వృద్ధి, పర్యాటక కేంద్రాల అభివృద్ధికి ఇవి తోడ్పడతాయి.

నాగార్జున సాగర్ ప్రాజెక్టు

నాగార్జున సాగర్ డ్యామ్ తెలంగాణలోని నల్గొండ జిల్లా, ఆంధ్రప్రదేశ్‌లోని పల్నాడు జిల్లాల మధ్య సరిహద్దులో ఉంది. ఇది కృష్ణానదికి అడ్డంగా నిర్మించిన రాతి ఆనకట్ట.

✦ ఇది ప్రపంచంలోనే అతిపెద్ద రాతి ఆనకట్ట, మానవ నిర్మిత ప్రాజెక్టు. మన దేశంలో రెండో అతిపెద్ద నీటి నిల్వ ప్రాజెక్టు కూడా ఇదే.

✦ ఇది తెలంగాణలోని నల్గొండ, సూర్యాపేట, ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలు; ఆంధ్రప్రదేశ్‌లోని కృష్ణా, గుంటూరు, పల్నాడు, ప్రకాశం, పశ్చిమ గోదావరి జిల్లాలోని కొన్ని ప్రాంతాలకు సాగునీటిని అందిస్తుంది. ఇది జాతీయ గ్రిడ్‌కు విద్యుత్ ఉత్పత్తికి కూడా మూలం.

✦ ఈ ప్రాజెక్టు నిర్మాణాన్ని భారత మొదటి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ 1955 డిసెంబరు 10న అధికారికంగా ప్రారంభించారు. ఇంజినీర్ కానూరి లక్ష్మణరావు నాయకత్వంలో పూర్తిగా స్థానిక పరిజ్ఞానంతో దీన్ని నిర్మించారు.

✦ ఇందిరాగాంధీ 1967 ఆగస్టు 4న నాగార్జున సాగర్ ప్రాజెక్టును ప్రారంభించారు.

✦ ఇందులో ఎడమ గట్టు కాలువ (లాల్‌బహదూర్ కాలువ) పొడవు 178 కి.మీ. దీని కింద నల్గొండ, సూర్యాపేట, ఖమ్మం, కృష్ణా జిల్లాల్లోని 4,19,816 హెక్టార్లకు నీరు అందుతోంది.

✦ కుడి గట్టు కాలువ (జవహర్‌లాల్ నెహ్రూ కాలువ) పొడవు 203 కి.మీ. దీని ద్వారా ఉమ్మడి గుంటూరు, ప్రకాశం జిల్లాల్లోని 4,75,465 హెక్టార్లకు నీరు అందుతుంది.

✦ ఉడాన్ పథకంలో భాగంగా ఈ ప్రాజెక్టును అభివృద్ధి చేయాలని ప్రభుత్వం 2022లో నిర్ణయించింది. దీని ప్రకారం, ఆ ప్రదేశంలో నీటి విమానాశ్రయాన్ని అభివృద్ధి చేస్తారు.

భాక్రానంగల్ ప్రాజెక్టు

ఇది హిమాచల్ ప్రదేశ్‌లోని బిలాస్‌పూర్ జిల్లాలో ఉన్న భాక్రా గ్రామంలో ఉంది. దీన్ని సట్లెజ్ నదిపై నిర్మించారు.

- భాక్రా డ్యామ్ వెనక భాగంలో గురుగోవింద్ సాగర్ అనే జలాశయం ఏర్పడింది. దీని పొడవు 90 కి.మీ.
- ఇది ఆసియాలోనే రెండో ఎత్తయిన ఆనకట్ట. దేశంలో అత్యధిక గురుత్వాకర్షణ శక్తి కలిగిన ఆనకట్టగా దీనికి పేరుంది.
- దీని పొడవు 518 మీ., ఎత్తు 226 మీ.
- ఈ ప్రాజెక్టు నిర్మాణం 1948లో ప్రారంభమై 1963 నాటికి పూర్తయ్యింది. నిర్మాణ వ్యయం రూ.245.28 కోట్లు.
- సర్ చౌధరి ఛోటు రామ్‌ను భాక్రానంగల్ ఆనకట్ట పితామహుడిగా పేర్కొంటారు.
- మొత్తం నీటి నిల్వ సామర్థ్యం 7.551 మిలియన్ మెగా లీటర్లు (266.70 టీఎంసీ అడుగులు), క్రియాశీల సామర్థ్యం 6.007 మిలియన్ మెగా లీటర్లు. విద్యుత్ ఉత్పత్తి Installed Capacity 1325 మెగావాట్లు.

సమస్యలు: ఆనకట్ట వల్ల ఏర్పడిన పెద్ద జలాశయం బిలాస్‌పూర్ జిల్లా నుంచి పెద్ద సంఖ్యలో జనాభాను స్థానభ్రంశం చేసింది. దాదాపు 371 గ్రామాలు నీటిలో మునిగాయి.

ప్రాజెక్టు గణాంకాలు:

- మొత్తం పరీవాహక ప్రాంతం: 2,14,185 కి.మీ.
- పూర్తి జలాశయ స్థాయి: 179.83 మీటర్లు
- ఎఫ్ఆర్ఎల్ వద్ద నీటి విస్తరణ ప్రాంతం: 285 కి.మీ.
- ఎఫ్ఆర్ఎల్ వద్ద స్థూల నిల్వ సామర్థ్యం: 312 టీఎంసీ
- నది తూముల ఎండీడీఎల్: 137.3 మీటర్లు

సమస్యలు: కృష్ణా నది సహజ ప్రవాహాన్ని కృత్రిమ లిఫ్ట్ ఇరిగేషన్ ద్వారా డెల్టా ప్రాంతం నుంచి నల్గొండ జిల్లాకు మళ్లించారు. దీంతో అక్కడ ఫ్లోరిన్ అధికంగా ఉండే అగ్నిపర్వత శిలలు కోతకు గురై, భూగర్భ జలాలు కలుషితమయ్యాయి.

◆ అంతేకాక డెల్టా ప్రాంతంలోకి అనిశ్చిత నీటి ప్రవాహం చేరి, సహజ అద్భుతమైన 'కొల్లేరు సరస్సు' కుచించుకు పోవడానికి కారణమైంది.

◆ కోతను నిరోధించేందుకు కాలవలు తవ్వడం వల్ల నది Natural Silting ప్రక్రియకు ఆటంకం ఏర్పడింది.

◆ సముద్రంలో కలిసే నదీ ప్రవాహం తగ్గింది. దీంతో దివిసీమలోని తీర ప్రాంత భూగర్భ జలాల్లో లవణీయత పెరిగింది.

శ్రీశైలం ప్రాజెక్టు

దీన్ని నీలం సంజీవరెడ్డి ప్రాజెక్టు అని కూడా అంటారు. నంద్యాల (ఆంధ్రప్రదేశ్) - నాగర్ కర్నూల్ (తెలంగాణ) సరిహద్దులో పాతాళగంగ వద్ద కృష్ణా నదిపై దీన్ని నిర్మించారు.

▼ ఈ ప్రాజెక్టు ప్రధాన ఉద్దేశం జలవిద్యుత్ ఉత్పత్తి. ఇందులో రెండు జల విద్యుత్ కేంద్రాలున్నాయి. జల విద్యుత్ కేంద్రం సామర్థ్యంపరంగా దేశంలో రెండో అతిపెద్దది.

▼ శ్రీశైలం ప్రాజెక్టు నిర్మాణం 1960లో ప్రారంభమైంది. 1980 జులై 26న పూర్తయ్యింది. 1981లో శ్రీశైలం కుడి కాలువ, 1983లో తెలుగు గంగ, ఎడమ కాలువ ప్రారంభించారు.

▼ శ్రీశైలం ప్రాజెక్టు నుంచి మొత్తం 1670 మె.వా. విద్యుత్ ఉత్పత్తి అవుతుంది. ఇందులో తెలంగాణ 900 మె.వా., ఆంధ్రప్రదేశ్ 770 మె.వా. ఉత్పత్తి చేస్తాయి.

▼ దీని గరిష్ఠ ఎత్తు 143 మీటర్లు, పొడవు 512 మీ. ఈ జలాశయం ఉపరితల వైశాల్యం 616 చ.కి.మీ., స్థూల నీటి నిల్వ సామర్థ్యం 216 టీఎంసీఎఫ్‌టీ, క్రియాశీల నీటి నిల్వ సామర్థ్యం 178.74 టీఎంసీఎఫ్‌టీ.

నిర్వహణ, భద్రత సమస్యలు:

దేశంలో రెండో అతిపెద్ద జలవిద్యుత్ ప్రాజెక్టుగా పేరున్న దీనిలో భద్రతాపరమైన సమస్యలు అనేకం ఉన్నాయి.

● 2018లో నిర్వహించిన ఒక సర్వే ప్రకారం, ఆనకట్టకు దిగువన ఉన్న Apron down streamలో భారీ గొయ్యి ఏర్పడింది. దీంతో ప్రధాన ఆనకట్ట పునాదిని రక్షించే నిర్మాణం బలహీన పడింది. ఆనకట్టకు మరమ్మతు చేయడానికి, నిర్వహించడానికి ఇంకా ప్రయత్నాలు జరగలేదు.

● 2025 మేలో నేషనల్ డ్యాం సేఫ్టీ అథారిటీ (ఎన్‌డీఎస్ఏ) ఆనకట్టను పరిశీలించి దీని పరిస్థితిపై ఆందోళన వ్యక్తం చేసింది. సంవత్సరాలుగా ప్లంజ్ పూల్ చుట్టూ, కొన్ని కీలక రక్షణ పనులకు నష్టం వాటిల్లినట్లు పేర్కొంది. ఇది ఇలాగే కొనసాగితే ఆంధ్రప్రదేశ్ తీవ్రంగా నష్టపోతుందని హెచ్చరించింది.


రచయిత
బండారి ధనుంజయ
విషయ నిపుణులు

Word of the Day 864

Confound

Telugu meaning: అయోమయం అవ్వడం, ఆశ్చర్యపడటం

English meaning: The word confound (కన్‌ఫౌండ్) is a verb that means to confuse or surprise someone, often by acting unexpectedly.

Synonyms: Confuse, Perplex

Antonyms: Clarify, Explain

Usage: **1.** The sudden change in market trends confounded analysts who had predicted steady growth.

2. Her brilliant performance confounded critics who had doubted her abilities.

Current Affairs



Prime Minister Narendra Modi was conferred Ethiopia's highest civilian honour, the 'Great Honour Nishan of Ethiopia' on 16 December 2025, during his first bilateral visit to the country.

◆ The award was presented at a special ceremony held at the Addis International Convention Centre by Ethiopian Prime Minister Abiy Ahmed in recognition of Modi's exceptional contribution to strengthening India-Ethiopia ties and his leadership as a global statesman.



B Sairam took over as Chairman-cum-Managing Director (CMD) of Coal India Limited (CIL). He succeeded Sanoj Kumar Jha. Prior to his elevation, Sairam was chairman-cum-managing director of Northern Coalfields Limited (NCL).

The President of India, Droupadi Murmu, inaugurated the Param Vir Dirgha at Rashtrapati Bhavan on 16 December 2025 on the occasion of Vijay Diwas. The Gallery has the portraits of all 21 Param Vir Chakra awardees on display. The Gallery aims to educate visitors about our national heroes who displayed dauntless resolve and unconquerable spirit in defending our nation.

The PM Surya Ghar Muft Bijli Yojana is steadily transforming India's residential power landscape, with more than 7.7 lakh households already reporting zero electricity bills after installing rooftop solar systems, the Ministry of New and Renewable Energy said on 16 December 2025. The scheme, launched in February 2024, aims to make clean energy affordable while reducing the power burden on households across the country.

India and the Asian Development Bank (ADB) on 15 December 2025 signed loan agreements worth over $2.2 billion to support five major development projects spanning skilling, renewable energy, healthcare, urban transport and sustainable livelihoods across multiple states. The agreements were finalised under the guidance of the Department of Economic Affairs, Ministry of Finance.

For more Current Affairs: Scan QR code

అంతర్జాతీయ వలసదారుల దినోత్సవం

డిసెంబరు 18
చరిత్రలో ఈనాడు

వ్యక్తులు ఒంటరిగా లేదా కుటుంబంతో సహా ఒక ప్రాంతం నుంచి మరొక ప్రదేశానికి వెళ్లడాన్ని వలస అంటారు. దీన్నే స్థానచలనంగా పేర్కొంటారు. రాష్ట్రాలు, దేశాలతోపాటు ప్రపంచవ్యాప్తంగా అవి కొనసాగుతున్నాయి. వీటిని ఆధునిక జనాభా సామాజిక పరివర్తన రూపంగా పేర్కొంటారు. కొత్త ప్రాంతంలో వలసదారులు గణనీయమైన సవాళ్లను ఎదుర్కొంటారు. ప్రపంచవ్యాప్తంగా వలసదారులు ఎదుర్కొనే ఇబ్బందులను తెలియజేసి, వారిని కాపాడే లక్ష్యంతో ఏటా డిసెంబరు 18న 'అంతర్జాతీయ వలసదారుల దినోత్సవం'గా (International Migrants Day) నిర్వహిస్తారు. వలసదారుల హక్కులను పరిరక్షించడం, అంతర్జాతీయ సమాజాల నిర్మాణంలో వారి కీలక పాత్ర గురించి చాటిచెప్పడం ఈ రోజు ముఖ్య ఉద్దేశం.

చారిత్రక నేపథ్యం

వలస కార్మికులు, వారి కుటుంబ సభ్యుల ప్రాథమిక మానవ హక్కుల పరిరక్షణ; గౌరవాన్ని కాపాడటం, వలస వచ్చిన చోట దుర్బల పరిస్థితులను నివారించడం అనే ఉద్దేశంతో ఐక్యరాజ్య సమితి 1990, డిసెంబరు 18న ఒక సమావేశాన్ని నిర్వహించింది. అందులో 'ది ఇంటర్నేషనల్ కన్వెన్షన్ ఆన్ ది ప్రొటెక్షన్ ఆఫ్ ది రైట్స్ ఆఫ్ ఆల్ మైగ్రెంట్ వర్కర్స్ అండ్ మెంబర్స్ ఆఫ్ దెయిర్ ఫ్యామిలీస్ (సీఎండబ్ల్యూ)' తీర్మానాన్ని ఆమోదించారు. వలస కార్మికులు - వారి కుటుంబాలకు హక్కులు కల్పించడం, ఉపాధి - విద్య - ఆరోగ్య సంరక్షణ లాంటివి అందించడం, దోపిడీని నిరోధించడం లాంటివి ఇందులోని ముఖ్యాంశాలు.



✦ సీఎండబ్ల్యూ తీర్మానం ఆమోదానికి గుర్తుగా ఏటా డిసెంబరు 18న 'అంతర్జాతీయ వలసదారుల దినోత్సవం'గా జరుపుకోవాలని ఐక్యరాజ్య సమితి జనరల్ అసెంబ్లీ 2000, డిసెంబరు 4న ప్రకటించింది. అప్పటి నుంచి ప్రతి సంవత్సరం దీన్ని నిర్వహిస్తున్నారు.

భారతీయులు అధికంగా వలస వెళ్తున్న టాప్-10 దేశాలు, గణాంకాలు తదితర పూర్తి సమాచారం కోసం క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.

జనరల్ స్టడీస్ - ఇండియన్ పాలిటీ

ఎస్సీ, ఎస్టీ కమిషన్లు



తరాలుగా కొనసాగుతున్న కులవ్యవస్థ కారణంగా కొన్ని వర్గాలు అంటరానితనానికి గురయ్యాయి. వీరిలో షెడ్యూల్డ్ కులాలు, తెగల వారున్నారు. వీరిపై సమాజం అనేక ఆంక్షలు విధించింది. అనేక మంది ఆర్థికంగా వెనకబడి ఉన్నారు. వీరి హక్కులను పరిరక్షించడానికి, ఆయా వర్గాల అభివృద్ధి కోసం ప్రభుత్వాలు రాజ్యాంగబద్ధంగా కమిషన్లను ఏర్పాటు చేశాయి.

జాతీయ షెడ్యూల్డ్ కులాల కమిషన్

☛ ఆర్టికల్ 338 (1) ప్రకారం ఎస్సీ కమిషన్‌లో ఒక ఛైర్మన్, ఒక వైస్ ఛైర్మన్, ముగ్గురు ఇతర సభ్యులుంటారు. వీరిలో ఒక మహిళా సభ్యురాలు తప్పనిసరిగా ఉండాలి. వీరి పదవీ కాలం మూడేళ్లు.

☛ ఈ కమిషన్ రాజ్యాంగపరమైన ఒక స్వతంత్ర సంస్థ.

జాతీయ షెడ్యూల్డ్ తెగల కమిషన్

ఆర్టికల్ 338 (ఎ) ప్రకారం, 89వ రాజ్యాంగ సవరణ చట్టం ద్వారా జాతీయ షెడ్యూల్డ్ తెగల కమిషన్ 2004 ఫిబ్రవరిలో ఏర్పాటైంది.

☛ 2003లో దిలీప్‌సింగ్ భూరియా కమిటీ సిఫార్సుల మేరకు దీన్ని ఏర్పాటు చేశారు.

జాతీయ ఎస్సీ, ఎస్టీ కమిషనర్లు (ఉమ్మడిగా ఉన్నప్పుడు), ఎస్సీ కమిషన్ అధికారాలు - విధులు, కమిషన్ ఛైర్మన్లు, ఎస్టీ కమిషన్ అధికారాలు - విధులు, జాతీయ కమిషన్ ఛైర్మన్లు మొదలైన అంశాలతోపాటు పూర్తి సమాచారం ఈనాడు ఈప్రతిభ వెబ్‌సైట్‌లో 'జనరల్ స్టడీస్ ఈ-బుక్స్' కోర్సులో ఈ-బుక్ రూపంలో అందుబాటులో ఉంది. మరిన్ని వివరాలకు క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.

Latest Updates

Senior Technical Assistant Posts

The Defence Research & Development Organisation (DRDO) - Centre for Personnel Talent Management (CEPTAM), under the Ministry of Defence, Government of India, has released a notification for the recruitment of Senior Technical Assistant posts in DRDO labs/units across the country. The total number of posts is 764. The examination fee is Rs.750. The last date for online applications is 1 January 2026.

Executive Trainee jobs

Damodar Valley Corporation (DVC), Human Resource Department, Kolkata, is inviting applications for Executive Trainee posts for engineering graduates based on the GATE 2025 score. The total no. of posts is 54. The application fee is Rs.300. Eligible candidates can apply online before 23 December 2025.

Did You Apply..?

Today (December 18) is the last date for the following Jobs/ Apprentice posts

☛ 16 Diploma Engineering Trainee posts at UCSL.
Eligibility: Diploma (Mechanical/Electrical).

☛ 2,756 apprentice posts in IOCL.
Eligibility: 10th, Diploma, ITI, Degree.


☛ Project Research Scientist Posts in THSTI.
Eligibility: 10th, degree, PG.

☛ Junior Resident Jobs in AIIMS Deoghar.
Eligibility: MBBS.

For more information and other notifications - scan QR code

Weightage based Multidimensional logical diagrams

Directions (Qs. 1 - 4): *By observing the following figure, answer the questions that follow.*



1. The number of students who took any three of the four subjects?
A) 64 B) 62 C) 66 D) 68 E) 70


2. The number of students who took both history and geography among other subjects was....
A) 60 B) 65 C) 66 D) 63 E) 68

3. Which subject was taken by the largest number of students?
A) Science B) History
C) Geography D) Mathematics
E) All are equal

4. Which subject was taken by the least number of students?
A) Science B) Mathematics
C) Geography D) History
E) All are equal

Directions (Qs. 5 - 8): *Study the following figure and answer the corresponding questions that follow.*

The weightage of i. Circle is 2, ii. Square is 1, iii. Hexagon is 3 and iv. Rectangle is $1\frac{1}{2}$.



If any letter lies in the intersection of two figures or three figures or four then the weightage of the letter is the product of weightages figures in which it lies.

5. In the given weightages of figures, A stands for
A) 2 B) 6 C) 3 D) $4\frac{1}{2}$ E) $7\frac{1}{2}$


Bank Exams
Reasoning

6. What is the difference of weightages of A and B ?
A) 4 B) 2 C) 1
D) 3 E) None of the above

7. What i the difference of weightages of A and D?
A) 1 B) 2 C) 3 D) 4 E) 5

8. Calculate the value of $\frac{A+B}{D} = ?$
A) 4 B) 6 C) 8 D) 10 E) 12

Directions (Qs. 9 - 15): *Study the following diagram and find out the answer of the questions that follow.*



9. The value of 2a + 3c = ...
A) 100 B) 101 C) 102
D) 105 E) 110

10. The value of 3 (a × b + c) – 2 (g + f) = ?
A) 200 B) 360 C) 400
D) 420 E) None of these

11. The value of which of the following is maximum?
A) a B) d C) e D) f E) g

12. The value of which of the following is the minimum?
A) a B) c C) e D) d E) f

13. The value of (a + b + c) ÷ 3 is...
A) less than 30 B) greater than 30
C) equal to 30 D) greater than 100
E) Can not be determined

14. The value of $\left(\frac{5i}{2c}\right)$ = ...
A) 0 B) 1 C) 2.5
D) 3 E) data in adequate

15. If the value of the circle is halved and that of the rectangle is doubled, what is the new value of b?
A) it will be doubled
B) it will be halved
C) it will increase
D) it will decrease
E) it will not be changed

Scan the QR code for Key

These model questions were prepared by
Rajesh Madhu
Asst. Prof. of Mathematics.





ఇథియోపియా పార్లమెంటులో చట్టసభ సభ్యులతో కరచాలనం చేస్తున్న ప్రధాని మోదీ ✦ ఇథియోపియాలోని అదిస్ అబాబా మ్యూజియం వద్ద ఢంకా మోగిస్తున్న మోదీ ✦ అదిస్ అబాబాలో జరిగిన కార్యక్రమంలో ఇథియోపియా ప్రధాని అబి అహ్మద్ అలీ నుంచి ఆ దేశ అత్యున్నత పురస్కారం స్వీకరిస్తున్న ప్రధాని మోదీ

మనం సహజ భాగస్వాములం

- ఇథియోపియాలో ఉంటే సొంతింట్లో ఉన్నట్టే అనిపిస్తోంది
- ఆ దేశ పార్లమెంటులో ప్రధాని మోదీ వ్యాఖ్యలు

అదిస్ అబాబా: ప్రాంతీయ శాంతి, భద్రత, అనుసంధానంలో భారత్, ఇథియోపియా సహజ భాగస్వాములని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. ఇథియోపియాలో ఉంటే సొంతింట్లో ఉన్నట్టే అనిపిస్తోందని పేర్కొన్నారు. పార్లమెంటు సంయుక్త సమావేశాన్ని ఉద్దేశించి మోదీ బుధవారం ప్రసంగించారు. "సింహాల భూమిగా పేరుగాంచిన ఇథియోపియాలో ఉండటం అద్భుతంగా అనిపిస్తోంది. నా స్వరాష్ట్రమైన గుజరాత్ కూడా సింహాలకు ప్రసిద్ధి. అందుకే నాకు ఇక్కడ ఉంటే సొంతింట్లో ఉన్నట్టే అనిపిస్తోంది" అని పేర్కొన్నారు. అభివృద్ధి చెందుతున్న దేశాలైన భారత్, ఇథియోపియా పలు రంగాల్లో పరస్పరం మరింతగా సహకరించుకోవాలని మోదీ అన్నారు. చాలామంది భారతీయ ఉపాధ్యాయులు ఇథియోపియాలో సేవలందిస్తున్న సంగతిని గుర్తుచేశారు. ఆ దేశంలో అత్యధిక విదేశీ పెట్టుబడిదారులు భారతీయులేనని పేర్కొన్నారు. తనకు అందించిన ఇథియోపియా అత్యున్నత పౌర పురస్కారాన్ని భారత ప్రజల తరఫున వినమ్రంగా స్వీకరిస్తున్నానని చెప్పారు. ఇరు దేశాలూ తమ జాతీయ గీతాల్లో భూమిని తల్లిగా అభివర్ణించడం విశేషమని పేర్కొన్నారు.

✦ ప్రధాని మోదీ ప్రసంగించిన 18వ విదేశీ పార్లమెంటు ఇది.


✦ మోదీ ప్రసంగం మొదలైనప్పటి నుంచీ ముగిసేవరకూ ఇథియోపియా చట్టసభ్యులు 50 సార్లకుపైగా చప్పట్లు కొట్టారు.

✦ 'అమ్మ పేరుపై ఒక మొక్క', ఇథియోపియా హరిత వారసత్వం కార్యక్రమాల్లో భాగంగా ఆ దేశ పార్లమెంటు వద్ద మోదీ ఓ మొక్కను నాటారు.

✦ మోదీ గౌరవార్థం ప్రధాని అబి అహ్మద్ అలీ ఏర్పాటుచేసిన విందులో ఇథియోపియా గాయనీ గాయకులు ముగ్గురు వందేమాతరం ఆలపించారు. అది తనను ఎంతగానో కదిలించిందని మోదీ 'ఎక్స్'లో రాసుకొచ్చారు.

బూటు విసిరే ఘటనలు జరగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సూచనలు చేయండి

- కేంద్రం, బార్ అసోసియేషన్‌లను కోరిన సుప్రీం కోర్టు



దిల్లీ: న్యాయస్థానాల్లో బూటు విసిరే ఘటనల వంటివి చోటుచేసుకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సూచనలు చేయాలని కేంద్ర ప్రభుత్వం, సుప్రీం కోర్టు బార్ అసోసియేషన్లను అత్యున్నత న్యాయస్థానం కోరింది. గతంలో పూర్వ సీజేఐ జస్టిస్ బి.ఆర్.గవాయ్‌పై కోర్టులో బూటు విసిరేందుకు ప్రయత్నం జరిగిన నేపథ్యంలో ఈ సూచనలు కోరింది. ఇలాంటి ఘటనలపై మీడియా కవరేజీ, ప్రసారాలకు సంబంధించి ఒక ప్రమాణ పద్ధతినీ నిర్ణయించాలని సూచించింది. తమకు అందే సూచనల ఆధారంగా మార్గదర్శకాలను సిద్ధం చేస్తామని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మాల్య బాగ్చిలతో కూడిన ధర్మాసనం కేంద్ర ప్రభుత్వ ప్రతినిధి అయిన సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా, సుప్రీంకోర్టు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు వికాస్ సింగ్‌లకు బుధవారం తెలియజేసింది. అయితే ఈ విషయంలో కేంద్రానికి కోర్టు.. నోటీసు జారీ చేయలేదు. ఈ విషయంలో ప్రతివాదనలకు తావు లేదు కాబట్టి సాధారణ సలహాలు సమర్పించవచ్చని ధర్మాసనం పేర్కొంది. నవంబరు నెలలో జరిగిన విచారణ సందర్భంగా కోర్టు గత ప్రధాన న్యాయమూర్తిపై బూటు విసరడానికి ప్రయత్నించిన 71 సంవత్సరాల న్యాయవాది రాకేశ్ కిశోర్‌కు వ్యతిరేకంగా క్రిమినల్ చర్యలు తీసుకోవడంపై నిరాసక్తి కనబరిచింది. ఈ విషయంలో ఏం చేయాలో కోర్టు పరిశీలిస్తుందని న్యాయస్థానం పేర్కొంది.

కలకత్తా హైకోర్టుకు ఆర్‌జీ కర్ హత్యాచారం కేసు

కోల్‌కతాలోని ఆర్‌జీ కర్ వైద్య కళాశాలలో పీజీ వైద్య విద్యార్థినిపై జరిగిన హత్యాచార ఘటనకు సంబంధించి తాను వెలువరించిన ఆదేశాల అమలును పర్యవేక్షించాల్సిందిగా బుధవారం కలకత్తా హైకోర్టును సుప్రీంకోర్టు ఆదేశించింది. కేసుకు సంబంధించిన పత్రాలను హైకోర్టుకు పంపాల్సిందిగా జస్టిస్ ఎం.ఎం.సుందరేశ్, జస్టిస్ సతీశ్‌చంద్ర శర్మలతో కూడిన ధర్మాసనం సూచించింది. ఈ కేసును తనంత తానుగా విచారణకు స్వీకరించిన అత్యున్నత న్యాయస్థానం.. విచారణ ఏ స్థాయిలో ఉందో తెలిపే నివేదికను బాధితురాలి తల్లిదండ్రులకు అందజేయాలని ఆదేశించింది.

బోండీ బీచ్ నిందితుడిపై 59 అభియోగాలు

- 15 హత్య కేసులు

సిడ్నీ: ఆస్ట్రేలియాలోని సిడ్నీ బోండీ బీచ్‌లో కాల్పులు జరిపి 15 మంది మృతికి కారణమైన ఉగ్రవాది నవీద్ అక్రమ్‌పై పోలీసులు 59 అభియోగాలను నమోదు చేశారు. అందులో 15 హత్య కేసులున్నాయి. సాజిద్ హతం కావడంతో నవీద్ ఒక్కడిపైనే ఈ అభియోగాలను పోలీసులు మోపారు. పోలీసు కాల్పుల్లో గాయపడ్డ 24 ఏళ్ల నవీద్.. బుధవారం కోమా నుంచి బయటకు వచ్చాడు. చనిపోయిన ప్రతి ఒక్కరి హత్యకు కారణమంటూ పోలీసులు విడివిడిగా అతడిపై 15 కేసులు నమోదు చేశారు. కాల్పులకు సంబంధించి 40 కేసులు పెట్టారు. పేలుడు పదార్థాలు తదితర నేరాలపై మరో నాలుగు కేసులను నమోదు చేశారు.

అందరూ యూదులే

ఉగ్ర ఘటనలో చనిపోయిన వారందరినీ పోలీసులు గుర్తించారు. వారంతా యూదులేనని తేలింది. బుధవారం నుంచి వారి అంత్యక్రియల ప్రక్రియ ప్రారంభమైంది. ✦ ఐదుగురు పిల్లల తండ్రి అయిన ఎలి ష్లాంగ్లర్ అంత్యక్రియలను అశ్రునయనాల మధ్య జరిపారు. ఆయన సహాయ రబ్బీగా (మత గురువు) పని చేసేవారు. బోండీ బీచ్‌లో యూదుల కార్యక్రమం ఏర్పాటు చేయడంలో ఆయనే కీలక పాత్ర పోషించారు.

మిఠాయిల మెరుపు తగ్గుతోంది..

ఇంటర్నెట్ డెస్క్: వివాహాలు, శుభకార్యాల వంటి ఆనందకరమైన సమయాల్లో పంచుకొనే కాజూకత్లీ, బర్ఫీ వంటి మిఠాయిలపై వెండిపూతను గమనిస్తుంటాం. అంతర్జాతీయ మార్కెట్‌లో గత ఆరు నెలలుగా వెండి ధరలు భారీగా పెరగడంతో ఈ మిఠాయిలపై ఉండే ఆ 'మెరుపు' క్రమంగా తగ్గుతోంది.



కిలో వెండి ధర రూ.2 లక్షలు దాటడంతో మునుపటిలా వెండిపూతతో సరఫరా చేయడం భారంగా మారిందని తయారీదారులు పేర్కొంటున్నారు. వెండిపూతకు బదులు పిస్తా, కుంకుమపువ్వు వంటి ప్రత్యామ్నాయాలను ఉపయోగిస్తున్నట్లు చెబుతున్నారు. దీంతో కొన్ని నెలలుగా మార్కెట్‌లో వెండి కోటింగుకు ఉన్న డిమాండు 25-30 శాతం తగ్గినట్లు తెలిపారు. ఉత్తర్‌ప్రదేశ్, పంజాబ్, హరియాణా, రాజస్థాన్, మధ్యప్రదేశ్, బిహార్ వంటి ఉత్తరాది రాష్ట్రాల ప్రజలు వెండిపూత మిఠాయిలను ఎక్కువగా ఇష్టపడతారని స్వీట్స్, నమ్‌కీన్ తయారీదారుల సమాఖ్య డైరెక్టర్ జనరల్ ఫిరోజ్ హైదర్ నక్వీ పేర్కొన్నారు. దీంతో ఆయా ప్రాంతాల్లో వెండి పూత తగ్గించకుండా తయారీదారులు మిఠాయిల ధరలను భారీగా పెంచుతున్నట్లు తెలిపారు.



ఆ గ్రామాల పేరులో 'బెండ'.. ఎటుచూసినా ఈ పంటే నిండా!

ఈటీవీ భారత్: బిహార్‌లోని సమస్తిపుర్ జిల్లా మోర్వా బ్లాకులో గల హర్పుర్ భిండీ, బశహీ భిండీ గ్రామాలు పలురకాల బెండకాయల సాగుకు ప్రసిద్ధి. తొమ్మిది వేలకు పైగా జనాభా ఉన్న ఈ గ్రామాల్లో పండించే బెండకాయలకు ముజఫ్ఫర్‌పుర్, వైశాలీ మార్కెట్లలో మంచి డిమాండు ఉంటుంది. వీటి కొనుగోళ్లకు ప్రత్యేకంగా వేలం పాట పెడతారు. ఇక్కడి నుంచి ఉత్తర బిహార్‌లోని మోతీపుర్ కూరగాయల మార్కెటుకు సైతం బెండకాయలు సరఫరా చేస్తారు. ఈ ఊర్ల పేర్లు కూడా బెండకాయ (భిండీ) పదంతోనే ఉంటాయి. వంకాయ, క్యాబేజీ, బఠానీ, ముల్లంగి, గుమ్మడి, ఆకుకూరల వంటి ఇతర కూరగాయలు పండించినా.. రెండు గ్రామాల్లో కలిపి 75 శాతం రైతులు బెండకాయలనే సాగు చేస్తారు. హర్పుర్ భిండీ రైతు సూర్యనారాయణ్ సింగ్ మాట్లాడుతూ.. తమ గ్రామంలో జనవరి తర్వాత ఎటుచూసినా బెండకాయల సాగే కనిపిస్తుందన్నారు. హైబ్రిడ్ బెండకాయలు తక్కువ శ్రమతో మంచి దిగుబడిని ఇస్తాయని, వీటి సాగు ఎక్కువ లాభదాయకంగానూ ఉంటుందన్నారు. పర్భణీ క్రాంతి, కాశీ క్రాంతి, సాయాజీ హైబ్రిడ్ ఓక్రా 2211 వంటి రకాలు మంచి లాభాలను ఇస్తాయని తెలిపారు.

మరింత భూభాగం ఆక్రమించుకుంటాం

- ఉక్రెయిన్‌కు పుతిన్ హెచ్చరిక



రష్యా దాడితో ఉక్రెయిన్‌లోని జపోరిజియాలో ఓ అపార్ట్‌మెంట్ నుంచి వెలువడుతున్న పొగ

మాస్కో: శాంతి చర్చల్లో తాము చేసిన డిమాండ్లను అంగీకరించని పక్షంలో ఉక్రెయిన్‌లో మరింత భూభాగాన్ని వశపరచుకుంటామని రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ బుధవారం హెచ్చరించారు. రష్యా సైనికాధికారుల వార్షిక సమావేశంలో ప్రసంగించిన పుతిన్ "దౌత్య మార్గాల్లో సమస్యను సమూలంగా పరిష్కరించాలని మేం కోరుకుంటున్నాం. అయితే ఎదుటి పక్షం, దాని విదేశీ మిత్రులు విస్తృత సకారాత్మక చర్చలకు నిరాకరిస్తే రష్యా తన చారిత్రక భూభాగాన్ని సైనిక చర్య ద్వారా తిరిగి వశపరచుకోగలదు" అన్నారు. "రష్యా సరిహద్దుపై వ్యూహాత్మక నియంత్రణ కలిగివుంది. సరిహద్దు వెంబడి బఫర్ రక్షణ జోన్ ఏర్పాటు చేస్తాం" అని పుతిన్ పేర్కొన్నారు. రష్యా సాధించిన సైనిక ఆధునికీకరణను పుతిన్ ప్రశంసించారు. ముఖ్యంగా అణ్వాయుధ భాండారాన్ని ఆధునికీకరించడం తాము సాధించిన విజయమని ఆయన చాటుకున్నారు. అణ్వాయుధ సామర్థ్యం కలిగిన ఓరెష్నిక్ క్షిపణుల్ని ఈ నెలలో మోహరిస్తామని పుతిన్ ప్రకటించారు.

రాష్ట్రాలకు కేంద్ర అంబులెన్సులు: గడ్కరీ



దిల్లీ: దేశంలో రోడ్డు ప్రమాదాలు ఆందోళనకరంగా పెరుగుతుండటంతో రాష్ట్ర ప్రభుత్వాలకు ఆధునిక అంబులెన్సులను అందించడానికి కేంద్రం సిద్ధంగా ఉందని కేంద్ర రవాణా మంత్రి నితిన్ గడ్కరీ తెలిపారు. 10 నిమిషాల్లో ప్రమాదస్థలాలకు చేరుకోవాలనే షరతుపై వాటిని అందజేస్తామని రాజ్యసభలో బుధవారం ప్రకటించారు. దేశంలో ఏటా 5 లక్షల రోడ్డు ప్రమాదాలు జరుగుతూ 1.8 లక్షలమంది మరణిస్తున్నారనీ, మృతుల్లో 66 శాతం మంది 18-34 ఏళ్ల వయోవర్గంలోనివారని వివరించారు. రోడ్డు ప్రమాదాలకు గురైనవారిని రక్షించే వ్యక్తులను రహదారి వీరులుగా గుర్తించి, తలా రూ.25,000 నగదు బహుమతి ఇస్తామని మంత్రి ప్రకటించారు. అంబులెన్సుల నిర్వహణ జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ పరిధిలోకి రాదనీ, రాష్ట్రాలకు 100 నుంచి 150 అంబులెన్సులివ్వడానికి కేంద్రం సిద్ధంగా ఉందని తెలిపారు.

ఉపగ్రహ సాయంతో టోల్ వసూలు

జాతీయ రహదారులపై ఉపగ్రహ, కృత్రిమ మేధ (ఏఐ) ఆధారిత సుంక వసూలు యంత్రాంగాన్ని 2026 చివరికల్లా ప్రారంభిస్తామని గడ్కరీ చెప్పారు. దీనివల్ల టోల్‌గేట్ల వద్ద వాహనాలు నిరీక్షించాల్సిన అగత్యం తప్పుతుందని పేర్కొన్నారు. ఈ కొత్త పద్ధతి వల్ల ప్రభుత్వానికి రూ.6,000 కోట్ల అదనపు ఆదాయం లభిస్తుందని, వాహనదారులకు రూ.1,500 కోట్ల మేరకు ఇంధనం ఆదా అవుతుందని వివరించారు. గతంలో టోల్‌గేట్‌ల వద్ద సుంకం చెల్లించడానికి 3-10 నిమిషాలు పట్టేదనీ, ఫాస్టాగ్ వల్ల 60 సెకన్లు లేదా అంతకు తక్కువ సమయంలోనే చెల్లింపు జరిగిపోతోందని గడ్కరీ చెప్పారు. కొత్తగా ప్రవేశపెట్టే బహుళ లైన్ల స్వేచ్ఛా రవాణా (ఎంఎల్ఎఫ్ఎఫ్) పద్ధతిలో వాహనాలు క్షణం కూడా ఆగకుండా 80 కిలోమీటర్ల వేగంతో టోల్ గేట్స్ నుంచి దూసుకెళతాయని వివరించారు. దీంతో టోల్ గేట్స్ నిర్వహణ ఖర్చులు తగ్గిపోతాయన్నారు. టోల్‌గేట్ ఆపరేటర్ల అక్రమాలు ప్రభుత్వ దృష్టికి వచ్చాయనీ, వీటి నిరోధానికి గట్టి చర్యలు తీసుకుంటామని గడ్కరీ ప్రకటించారు. ఫాస్టాగ్‌ను వాహనానికి అమర్చకుండా చేతితో పట్టి చూపడం వల్ల నష్టం కలుగుతోందని చెప్పారు. ఈ ఏడాది డిసెంబరు 10 నాటికి ఇలాంటి 6,725 కేసుల వరకు తమ దృష్టికి వచ్చాయన్నారు. చేతితో పట్టే ఫాస్టాగ్‌లను సంబంధిత బ్యాంకు బ్లాక్ లిస్ట్ చేస్తుందని హెచ్చరించారు.

బుర్ఖా ధరించలేదని భార్య కాల్చివేత

- ఇద్దరు కుమార్తెలనూ చంపిన యూపీవాసి

ఈటీవీ భారత్: బుర్ఖా ధరించకుండా పుట్టింటికి వెళ్లిందన్న కోపంతో ఓ వ్యక్తి తన భార్యను అత్యంత దారుణంగా హత్య చేశాడు. ఆమె వెంట ఉన్న ఇద్దరు కుమార్తెలనూ చంపేశాడు. ఉత్తర్‌ప్రదేశ్‌లో వారం రోజుల క్రితం జరిగిన ఈ దారుణ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. షామ్లీ పట్టణం గఢీదౌలత్ గ్రామానికి చెందిన ఫరూఖ్‌కు భార్య తాహిరా (32), ఐదుగురు పిల్లలు ఉన్నారు. వారం నుంచి తాహిరా, ఇద్దరు కుమార్తెలు అఫ్రీన్(12), సారీన్(5) కనిపించకుండా పోయారు. దీంతో ఫరూఖ్ తండ్రి దావూద్ మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. దర్యాప్తులో భాగంగా పోలీసులు ఫరూఖ్‌ను తమదైన శైలిలో ప్రశ్నించగా దారుణ వాస్తవాలు వెలుగులోకి వచ్చాయి. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం- ఆచార వ్యవహారాల విషయంలో ఫరూఖ్, తాహిరా తరచూ గొడవ పడుతుండేవారు. నెల రోజుల క్రితం ఇద్దరి మధ్య గొడవ జరిగాక, తాహిరా బుర్ఖా ధరించకుండానే పుట్టింటికి వెళ్లింది. అది ఫరూఖ్‌కు తీవ్ర కోపం తెప్పించింది. అప్పటి నుంచి ఆమెను చంపేందుకు ప్రణాళిక వేసుకోవడం ప్రారంభించాడు. ఈ నెల 10న రాత్రి ముగ్గురు పిల్లలను వారి తాతయ్య ఇంటికి పంపించాడు. ఆ రోజు రాత్రి ఇంట్లో మిగతా ఇద్దరు కమార్తెలు, భార్య ఉన్నారు. తాహిరాను ఫరూఖ్ టీ అడిగాడు. వంటింట్లోకి వెళ్లగానే ఆమెపై కాల్పులు జరిపాడు. కాల్పుల శబ్దానికి నిద్రలేచిన పెద్ద కుమార్తె హడావుడిగా ఏం జరిగిందోనని వంటిట్లోకి పరుగెత్తుకు వెళ్లింది. ఫరూఖ్ ఆమెపై కూడా కాల్పులు జరిపాడు. అనంతరం చిన్న కుమార్తెను గొంతు నులిమి చంపాడు. ముగ్గురి మృతదేహాలను సెప్టిక్ ట్యాంక్ గొయ్యిలో పాతిపెట్టాడు.

ఇటుకల బట్టీ చిమ్నీ కూలి నలుగురి మృతి

- త్రిపురలో ఘటన

అగర్తల: ఇటుకల బట్టీ చిమ్నీ కూలి త్రిపురలోని ధలాయ్ జిల్లాలో బుధవారం నలుగురు మృతి చెందారు. మరో నలుగురు తీవ్ర గాయాలతో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. కార్మికులు పని చేస్తున్న సమయంలో చిమ్నీ విరిగి పడటంతో ఈ ఘటన చోటుచేసుకుంది.. చిమ్నీ కూలిపోతుందని సూచించే ఎలాంటి సంకేతాలూ లభించలేదని ప్రాథమిక దర్యాప్తులో వెల్లడైంది. దీనిపై లోతైన దర్యాప్తును ప్రారంభించినట్లు అధికారులు తెలిపారు. బాధిత కుటుంబాలకు ప్రభుత్వం అండగా నిలుస్తుందని ముఖ్య మంత్రి మాణిక్ సాహా హామీఇచ్చారు.



రాజస్థాన్‌లోని సాంబార్ ఉప్పు నీటి సరస్సులో సందడి చేస్తున్న ఫ్లెమింగోలు

ఆ 586 దీవులకు పేర్లు పెట్టండి

- ప్రజలను కోరిన అండమాన్ నికోబార్ యంత్రాంగం

శ్రీ విజయపురం: అండమాన్ నికోబార్‌లోని వందలాది దీవులకు పేర్లు పెట్టే అవకాశాన్ని అక్కడి యంత్రాంగం ప్రజలకు కల్పించింది. ముఖ్యంగా జనావాసాలు లేని 586 దీవులకు పేర్లు సూచించాలని సామాన్యులకు విజ్ఞప్తి చేసింది. ఆ పేర్లు స్థానిక ఆదివాసీ వారసత్వాన్ని, స్వాతంత్ర్య సమరయోధులను, ప్రముఖ వ్యక్తులను, అమరులను, ప్రత్యేకమైన వృక్ష, జంతు జాలం, జాతీయ ప్రాముఖ్యత కలిగిన చారిత్రక సంఘటనలను, భౌగోళిక లక్షణాలను ప్రతిబింబించాలని అండమాన్ నికోబార్ కళా, సాంస్కృతిక విభాగ డైరెక్టర్ ప్రియాంకా కుమారి పేర్కొన్నారు. పేర్లపై నిర్ణయం తీసుకున్న తర్వాత తుది ఆమోదం కోసం వాటిని కేంద్ర హోం శాఖకు పంపిస్తామన్నారు. కేంద్రపాలిత ప్రాంతమైన అండమాన్ నికోబార్ దీవుల భూభాగం 8249 చ.కి.మీటర్లు. ఇక్కడ మొత్తం 836 దీవులు ఉన్నాయి. వీటిలో 31 ద్వీపాలు మాత్రం నివాసయోగ్యంగా ఉన్నాయి. ప్రస్తుతం 586 దీవులకు పేర్లు లేవు. ప్రత్యేక నంబర్లతో వాటిని గుర్తిస్తున్నారు. నివాసయోగ్యం కాని ఇటువంటి 21 దీవులకు ప్రధాని మోదీ 2023 జనవరిలో నామకరణం చేశారు. ఈ దీవుల సర్వే, సముద్ర సరిహద్దులు, మ్యాప్‌లు తయారు చేసేందుకు సర్వే ఆఫ్ ఇండియా (ఎస్ఓఐ) సాంకేతిక సాయం అందిస్తుంది.

నైట్‌క్లబ్ యజమానులకు ఐదు రోజుల పోలీస్ కస్టడీ

పణజీ: ఇటీవల అగ్ని ప్రమాదానికి గురైన బిర్చ్ బై రోమియోలేన్ నైట్‌క్లబ్ యజమానులు గౌరవ్, సౌరభ్ లూథ్రాలను కోర్టు బుధవారం ఐదురోజుల పోలీస్ కస్టడీకి అప్పగించింది. ఇటీవల ఈ నైట్‌క్లబ్ అగ్ని ప్రమాదంలో 25 మంది ప్రాణాలు కోల్పోయిన సంగతి విదితమే. ప్రమాదానంతరం థాయ్‌లాండ్‌కు పారిపోయిన నైట్‌క్లబ్ యజమానుల్ని అక్కడి అధికారులు మంగళవారం భారత్‌కు అప్పగించారు. తదనంతరం వారిని గోవాకు తరలించి జుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ సమక్షంలో బుధవారం హాజరు పరిచారు. అనారోగ్య కారణాలు చూపి నిందితులు ఊరట పొందే ప్రయత్నం చేస్తున్నారని, వారికి ఎలాంటి మినహాయింపు ఇవ్వరాదని బాధితుల తరఫు న్యాయవాది కోర్టును అభ్యర్థించారు. నిందితులు పదే పదే అనారోగ్య కారణాలు చూపుతుండటంతో వారికి తిరిగి వైద్య పరీక్షలు జరిపించామని, ఎలాంటి మినహాయింపులు వారికి ఇవ్వాల్సిన అవసరం లేదని తేలిపోయిందని న్యాయమూర్తి పేర్కొన్నారు.

నెహ్రూ పత్రాలు గల్లంతు కాలేదు ..సోనియా దగ్గర ఉన్నాయి

- కేంద్ర మంత్రి శెఖావత్ వివరణ

దిల్లీ: భారత తొలి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూకు సంబంధించిన పత్రాలు 'ప్రధానమంత్రుల మ్యూజియం, లైబ్రరీ' (పీఎంఎంఎల్) నుంచి గల్లంతు కాలేదని, ఆ పత్రాలను కాంగ్రెస్ నాయకురాలు సోనియాగాంధీ 2008లో వెనక్కి తీసుకున్నారని కేంద్ర ప్రభుత్వం బుధవారం స్పష్టం చేసింది. "పార్లమెంటుకు, పరిశోధకులకు నెహ్రూ కాలంనాటి పరిస్థితుల్ని తెలియజెప్పే ఆ పత్రాలను తిరిగివ్వాలని ప్రభుత్వం సోనియాను కోరింది. ఆ పత్రాలు ప్రజలకు చెందాలే తప్ప వాటిని నాలుగు గోడలకు పరిమితం చేయరాదు" అని కేంద్ర సాంస్కృతిక శాఖ మంత్రి గజేంద్ర సింగ్ శెఖావత్ సామాజిక మాధ్యమ పోస్టులో పేర్కొన్నారు. "నెహ్రూకు సంబంధించిన పత్రాలను 2008లోనే సోనియాగాంధీ 51 పెట్టెల నిండా తీసుకెళ్లిపోయారు. అవి ఎక్కడున్నాయో తెలుసు కాబట్టి గల్లంతయ్యాయని చెప్పలేం" అని శెఖావత్ వివరణ ఇచ్చారు. దీనిపై మంగళవారం పార్లమెంటులో కేంద్రం ప్రకటన చేయగా.. మరుసటి రోజే మంత్రి వివరణ ఇచ్చారు.

22న నిరసనకు వామపక్షాల పిలుపు

దిల్లీ: మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం చట్టం స్థానంలో ప్రవేశ పెట్టిన కొత్త బిల్లును కేంద్రం ఉపసంహరించుకోవాలని వామపక్షాలు బుధవారం డిమాండ్ చేశాయి. గ్రామీణ ఉపాధి పథకం పేరు మార్చడం ద్వారా కేంద్రం గాంధీని అవమానించిందని ఆరోపిస్తూ ఆ పార్టీలు కొత్త బిల్లుకు నిరసనగా ఈనెల 22న ఉమ్మడి నిరసనకు పిలుపునిచ్చాయి. వికసిత్ భారత్ గ్యారెంటీ ఫర్ రోజ్‌గార్ అండ్ ఆజీవికా మిషన్-గ్రామీణ్ (వీబీ జీరాంజీ) పేరుతో కేంద్రం ప్రవేశపెట్టిన కొత్త బిల్లును వ్యతిరేకిస్తూ సీపీఎం, సీపీఐ, సీపీఐ(ఎంఎల్) లిబరేషన్, రివల్యూషనరీ సోషలిస్టు పార్టీ, ఆలిండియా ఫార్వర్డ్ బ్లాక్‌లు ఒక సంయుక్త ప్రకటన విడుదల చేశాయి.

ద్విచక్ర వాహనంపై ముగ్గురి ప్రయాణం నిర్లక్ష్యం కాదు

- గుజరాత్ హైకోర్టు స్పష్టీకరణ

అహ్మదాబాద్: రోడ్డు ప్రమాదం కేసుల్లో ద్విచక్ర వాహనంపై ముగ్గురు ప్రయాణిస్తున్నారన్న ఒకే ఒక కారణాన్ని వాహన చోదకుడి నిర్లక్ష్యానికి సాక్ష్యంగా భావించలేమని గుజరాత్ హైకోర్టు ఇటీవల స్పష్టం చేసింది. ప్రమాదానికి ద్విచక్ర వాహన చాలకుడు కారణం కానప్పుడు ప్రమాద సమయంలో వాహనంపై ముగ్గురు ప్రయాణిస్తున్నారన్న సాకుతో నిర్లక్ష్యాన్ని ఆపాదించలేమని జస్టిస్ హస్‌ముఖ్ సుతార్ పేర్కొన్నారు. 2019 ఫిబ్రవరి 24న జరిగిన ఒక రోడ్డు ప్రమాదానికి సంబంధించిన విచారణ సందర్భంగా న్యాయమూర్తి ఈ వ్యాఖ్యలు చేశారు. నాటి ప్రమాదంలో మయూర్ ధుబా, అతని సోదరి సెజల్ బెన్, మేనకోడలు భావనా బెన్ ఒక ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా గుజరాత్ రోడ్డు రవాణా సంస్థకు చెందిన బస్సు వారిని ఢీకొంది. ముగ్గురూ మరణించిన ఈ ప్రమాదం జునాగఢ్ జిల్లాలో జరిగింది. ఆ సమయంలో ద్విచక్ర వాహనంపై ముగ్గురు ప్రయాణిస్తున్నారని, ఇది ప్రమాదానికి 10 శాతం కారణమైందని మోటారు వాహనాల ప్రమాదాల పరిహార ట్రైబ్యునల్ పేర్కొంది. ఈ ఆదేశాలను మృతుల సమీప బంధువులు హైకోర్టులో సవాలు చేశారు.

అశాంతికి, అలసటకు ధ్యానమే విరుగుడు



- జెనీవాలో శ్రీశ్రీ రవిశంకర్

బెంగళూరు: ప్రపంచంలో అశాంతి తాండవిస్తున్న ప్రస్తుత తరుణంలో ధ్యానం వంటి శాశ్వత శాంతి సాధనాలను స్వీకరించాల్సిన అవసరాన్ని మానవాళి గుర్తించాలని ప్రఖ్యాత ఆధ్యాత్మిక గురువు శ్రీ శ్రీ రవిశంకర్ బుధవారం పేర్కొన్నారు. జెనీవాలో ఐక్యరాజ్యసమితి భవనంలో రెండో ప్రపంచ ధ్యాన దినోత్సవానికి ముందు బుధవారం జరిగిన ఒక ప్రత్యేక కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. ధ్యానం వ్యక్తిగత శ్రేయస్సుకే కాకుండా, అలసట, ఒత్తిడి, అనిశ్చితి, భావోద్వేగ సంఘర్షణల్లో కొట్టుమిట్టాడుతున్న సమాజాల్లో స్థిమితాన్ని, శాంతిని సాధించడానికి ఎంతగానో ఉపయోగపడుతుందని అన్నారు.

ప్రపంచ శాంతి కోసం ధ్యానం

జెనీవాలోని భారత శాశ్వత కార్యాలయం(పర్మనెంట్ మిషన్ ఆఫ్ ఇండియా), ఆర్ట్ ఆఫ్ లివింగ్ సంస్థ సంయుక్తంగా నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో 'ప్రపంచ శాంతి కోసం ప్రపంచం ధ్యానం చేస్తోంది' అనే అంశంపై గురుదేవ్ ప్రసంగించారు. లింగ, వయో భేదాలకు అతీతంగా అందరిలో ఆందోళన, తీవ్ర అలసట, ఒంటరితనం పెరిగిపోతున్న ప్రస్తుత కాలంలో సమస్యలను కేవలం బాహ్య పరిష్కారాలతోనే నిర్మూలించలేమని, మనిషి మనసును స్థిరపరచడం ఎంతో ముఖ్యమని ఆయన స్పష్టంచేశారు. ధ్యానం విలాసం కాదని, అది అవసరమని గురుదేవ్ అన్నారు. మన జనాభాలో మూడో వంతు మంది ఒంటరితనంతో బాధపడుతున్నారు. సగం మంది మానసిక ఆరోగ్య సమస్యలను ఎదుర్కొంటున్నారు. ఈ పరిస్థితుల్లో మనల్ని అంతరంగంతో ముడివేసే, మనలో దాగి ఉన్న ఒత్తిడిని తొలగించే సాధన అవసరం, ఆ సాధనే ధ్యానం, అని ఆయన చెప్పారు.

ధ్యానం... అప్రమత్త మానసిక స్థితి

"మైండ్‌ఫుల్‌నెస్ లేదా అప్రమత్త మానసిక స్థితి మీ ఇంటికి వెళ్లే దారి లాంటిది, ధ్యానం మీ ఇల్లు. ధ్యానం మనల్ని మన అంతరంగ లోకంలోకి తీసుకెళ్లి ప్రశాంతతను అందిస్తుంది. ఇది సాధించడం కష్టం కాదు. ధ్యానం చేయడం అంటే మనసు అనే కంప్యూటర్‌లో అనవసరంగా పేరుకుపోయిన ఫైళ్లన్నింటినీ 'డిలీట్' చేయడమే అని గురుదేవ్ అన్నారు. గత ఏడాది డిసెంబర్ 21న 'వరల్డ్ మెడిటేట్స్ విత్ గురుదేవ్' కార్యక్రమం ద్వారా ప్రపంచవ్యాప్తంగా 85 లక్షల మందికి పైగా ప్రజలు ఒకచోట చేరి ధ్యానం చేశారు. ఇది ఇప్పటివరకు నమోదైన అతిపెద్ద ధ్యాన సమూహంగా ఆరు గిన్నిస్ వరల్డ్ రికార్డులను సృష్టించింది. ఈ నెల 21న ప్రపంచ ధ్యాన దినోత్సవ సందర్భంగా న్యూయార్క్ నగరం వరల్డ్ ట్రేడ్ సెంటర్‌లోని ప్రతిష్ఠాత్మక 'ఒక్యులస్' కేంద్రంగా భారత కాలమానం ప్రకారం రాత్రి 8.30 గంటలకు శ్రీశ్రీ రవిశంకర్ నేతృత్వంలో కోట్లాది మంది ధ్యానం చేయనున్నారు.

కాడ్మియం విషానికి విరుగుడు కనుగొన్న శాస్త్రవేత్తలు

ఈటీవీ భారత్: వాతావరణ కాలుష్యంలో పర్యావరణానికి నష్టం కలిగించడంతోపాటు మానవ జీవితానికి ప్రాణాంతకం కాగల మూలకాల్లో నిశ్శబ్దంగా ప్రాణం తీయగల కాడ్మియం ఒకటి. పారిశ్రామిక వ్యర్థాలు, ఎరువులు, పొగాకు, కలుషిత జలాల రూపంలో మనిషి నిరంతరం ఈ విషం బారిన పడుతున్నాడు. మూత్రపిండాలు, కాలేయం, ఎముకలు, నాడీ వ్యవస్థలపై ప్రభావం చూపే ఈ మూలకం క్యాన్సర్ కారకమైన విషమని ప్రపంచ ఆరోగ్య సంస్థ సైతం ప్రకటించింది. ఈ ప్రాణాంతక విషం నుంచి మనుషుల్ని, పర్యావరణాన్ని కాపాడేందుకు మధ్యప్రదేశ్‌లోని సాగర్‌లో ఉన్న 'డాక్టర్ హరిసింగ్ గౌర్ కేంద్రీయ విశ్వవిద్యాలయం' శాస్త్రవేత్తలు ఒక పరిష్కారాన్ని కనుగొన్నారు. కాడ్మియం నుంచి రక్షణ కల్పించే ఒక పెప్టైడ్ ఆధారిత నానో పదార్థాన్ని వారు అభివృద్ధి పరిచారు. ఈ పరిశోధనకు విశ్వవిద్యాలయ రసాయనశాస్త్ర విభాగం అధిపతి డాక్టర్ కె.బి.జోషి నేతృత్వం వహించారు.

మానవ శరీరానికి నిత్యం హాని

"కాడ్మియం అత్యంత విషతుల్యమైన లోహం. పర్యావరణంలోని క్యాడ్మియం, సీసం, మెర్క్యురీ, ఆర్సెనిక్ అనే రసాయనాలు మానవ శరీరానికి నిత్యం హాని కలిగిస్తుంటాయి. మేం అభివృద్ధి పరచిన పెప్టైడ్ రసాయన పదార్థం.. జీవ వ్యవస్థల నుంచి కాడ్మియంను తొలగిస్తుంది. విష తీవ్రతను తగ్గిస్తుంది. క్యాడ్మియం కారణంగా ప్రబలే వ్యాధుల్ని నిరోధిస్తుంది" అని డాక్టర్ జోషి చెప్పారు. జన్యుపరంగా మనిషితో పోలిక కలిగి ఉండే జీబ్రా ఫిష్‌పై జరిపిన అనేక ప్రయోగాలు ఈ విషయాన్ని వెల్లడించాయి. కాడ్మియం వల్ల కలిగే విషానికి విరుగుడుగా స్మార్ట్ పెప్టైడ్ పనిచేస్తుందని ఈ ప్రయోగంలో రుజువైంది" అని మైక్రోబయాలజీ నిపుణుడు డాక్టర్ యోగేశ్ భార్గవ చెప్పారు.

ప్రజల సంతృప్తి.. ప్రభుత్వానికి ప్రామాణికం

- జిల్లాకు వచ్చినప్పుడు ఆకస్మిక తనిఖీలు చేస్తాం
- 39 శాఖల సేవలపై ప్రజల నుంచి అభిప్రాయ సేకరణ
- విమర్శలకు భయపడి కాదు.. ప్రజలకే జవాబుదారీ
- కలెక్టర్ల సదస్సులో ముఖ్యమంత్రి చంద్రబాబు



కలెక్టర్ల సదస్సులో మాట్లాడుతున్న సీఎం చంద్రబాబు. చిత్రంలో ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, మంత్రి అనగాని సత్యప్రసాద్, సీఎస్ విజయానంద్, డీజీపీ హరీశ్ కుమార్ గుప్తా

ఈనాడు, అమరావతి: ప్రభుత్వ పనితీరుకు ప్రజల సంతృప్త స్థాయి ప్రామాణికమని సీఎం చంద్రబాబు అన్నారు. కలెక్టర్ల సమావేశంలో మాట్లాడుతూ.. 'రాబోయే రోజుల్లో జిల్లాల పర్యటనకు వచ్చినప్పుడు ఆకస్మికంగా తనిఖీ చేస్తా. పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెసల్ సిస్టం (పీజీఆర్ఎస్) అమలు తీరును ఒక కేస్ స్టడీ తీసుకుని పరిశీలిస్తా.. నేనే ఫోన్ చేసి వారి దగ్గరకు వెళ్తా. సంబంధిత వ్యక్తిని అవసరమైతే రహస్యంగా మీదగ్గరకే తీసుకొస్తా. ప్రభుత్వం ద్వారా ప్రజలకు 39 రకాల సేవలు అందిస్తున్నాం. వాటిపై ప్రజల అభిప్రాయాన్ని 50 ప్రశ్నల ద్వారా తెలుసుకుంటున్నాం. దీని ద్వారా సేవలు అందుతున్న తీరును విశ్లేషించుకోవాలి. పింఛన్ల విషయాన్ని తీసుకుంటే.. లబ్ధిదారులకు పింఛన్లు ఎక్కడ అందించారు? ఇంటి దగ్గర ఇచ్చారా? ఇచ్చినప్పుడు డబ్బులు అడిగారా? దురుసుగా ప్రవర్తించారా అన్న అంశాలను డేటా ఆధారంగా విశ్లేషించాలి. తద్వారా ప్రభుత్వ పాలన మరింత మెరుగుపరుచుకునే అవకాశం ఉంటుంది. ధాన్యం సేకరించి రైతులకు 24 గంటల్లో చెల్లిస్తున్నాం. అప్పులు తీసుకొచ్చి..అవస్థలు పడుతున్నాం. డేటాలో ఏమైనా లోపాలు ఉంటే వాటిని సరిచేద్దాం. ప్రతి విషయంలో స్పందించే పాలన ప్రజలకు అందించాలనేది నా ఆలోచన. 90 శాతం అంతా బాగా చేసినా.. 5 శాతం లోపం ఉంటే ఇబ్బంది పడతాం. దాన్ని కూడా చక్కదిద్దాల్సిన బాధ్యత మనపై ఉంది. కలెక్టర్లకు డేటా అందుబాటులో ఉండేలా చూడాలి. దీనివల్ల వారిలో పోటీ పెరుగుతుంది' అని పేర్కొన్నారు.

ఎవరో విమర్శిస్తారని కాదు..

ఎవరో విమర్శిస్తారని తాను పరిపాలన చేయబోనని సీఎం స్పష్టం చేశారు. 'ప్రజలకు జవాబుదారీతనంతో పాలన అందించాలన్నదే నా ఆలోచన. ప్రతిపక్షాలు చేసే విమర్శల గురించి పాలన చేయాల్సిన అవసరం లేదు. గత మూడు నెలల్లో జిల్లాల వారీగా వివిధ శాఖల ద్వారా అందించే సేవల్లో సంతృప్త స్థాయి ఎలా ఉందనే గణాంకాలు మీకు అందుబాటులో ఉన్నాయి. ప్రజల నుంచి వచ్చే డేటా ఇది. సేవలు అందిన వెంటనే వారి నుంచి అభిప్రాయాన్ని తీసుకుంటాం. డేటాను రహస్యంగా ఉంచాలి. దాన్ని వినియోగించుకుని మంచి ఫలితాలు సాధించవచ్చు. ఇందుకు పాస్‌వర్డ్ ఇచ్చి..కలెక్టర్లకు మాత్రమే డేటా అందుబాటులో ఉండేలా చేస్తాం. పూర్వం రాజులు మారు వేషాల్లో వెళ్లి.. ప్రజల అభిప్రాయాలు తెలుసుకునే వారు. ఇప్పుడు సాంకేతికత వినియోగించి ప్రజల అభిప్రాయాలను తెలుసుకుంటాం. డీపీఆర్వో వ్యవస్థను వినియోగించుకుని ప్రభుత్వ కార్యక్రమాలను ప్రజలకు వివరించాలి' అని సీఎం ఆదేశించారు.

✦ జిల్లాల వారీగా వివిధ శాఖ నుంచి అందించే సేవలు..సంతృప్త స్థాయి వివరాలను సమాచార, పౌర సంబంధాలశాఖ డైరెక్టర్ విశ్వనాథ్ వివరించారు. పశ్చిమగోదావరి జిల్లా 71 శాతం సంతృప్త స్థాయితో మొదటి స్థానంలో ఉందన్నారు.

భూమి ధర ఎక్కువగా ఉన్న చోట జీ+3 మోడల్ ఇళ్లు

- ఉగాది నాటికి 5 లక్షల గృహాలు పూర్తి
- సీఎం చంద్రబాబు

ఈనాడు, అమరావతి: అర్హులైన పేదలకు ఇళ్ల నిర్మాణానికి పట్టణ ప్రాంతాల్లో 2 సెంట్లు, గ్రామీణ ప్రాంతాల్లో 3 సెంట్లు ఇవ్వాలనేది ప్రభుత్వ విధానమని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. నివాస ప్రాంతానికి సుదూరంలోని లేఅవుట్లలో స్థలాలు పొందిన వారు అక్కడ నిర్మాణాలు చేపట్టబోమని చెబితే వాటిని రద్దు చేస్తామని, నివాసయోగ్యమైన ప్రాంతాల్లో 2, 3 సెంట్లు కేటాయిస్తామని తెలిపారు. లేదా ఇప్పుడు స్థలాలు పొందిన చోటే కట్టుకుంటామని చెబితే అనుమతిస్తామన్నారు. కొత్తగా స్థలాన్ని కొనుగోలు చేసేందుకు ధర ఎక్కువగా ఉన్న చోట జీ+3 మోడల్‌లో నిర్మిస్తామని పేర్కొన్నారు. మొత్తంగా ఐదేళ్లలో అర్హులైన ప్రతి ఒక్కరికీ స్థలమిచ్చి ఇళ్లు నిర్మించి ఇవ్వాలనేదే ప్రభుత్వ లక్ష్యమన్నారు. 'గత ప్రభుత్వ హయాంలో ఇంటి నిర్మాణానికి ఒక నియోజకవర్గానికి చెందిన లబ్ధిదారులకు మరో నియోజకవర్గంలో స్థలాలు కేటాయించారు. అక్కడ ఇళ్ల నిర్మాణాలు చేపట్టేందుకు లబ్ధిదారులు ముందుకు రావడం లేదు' అని తిరుపతి జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్ సచివాలయంలో బుధవారం నిర్వహించిన కలెక్టర్ల సదస్సులో ప్రస్తావించారు. దీనికి సీఎం చంద్రబాబు పైవిధంగా స్పందించి అధికారులకు దిశానిర్దేశం చేశారు. 'పేదల ఇళ్ల నిర్మాణాన్ని యుద్ధప్రాతిపదికన చేపడుతున్నాం. ఇప్పటికే 3 లక్షల గృహాల్ని పూర్తి చేశాం. వచ్చే ఉగాది నాటికి మరో 5 లక్షల ఇళ్ల నిర్మాణాల్ని పూర్తి చేస్తాం. దీనికి ఈ లక్ష్య సాధనకు ప్రతి మూడు నెలల్ని గడువుగా పెట్టుకుని అధికారులు ముందుకు వెళ్లాలి' అని పేర్కొన్నారు.

కేపీఐలో అగ్రగామిగా గృహనిర్మాణ శాఖ

- అట్టడుగున ఈడబ్ల్యూఎస్, హోం శాఖలు

ఈనాడు, అమరావతి: పనితీరు మదింపు సూచీ (కేపీఐ)లో గృహనిర్మాణ శాఖ అగ్రగామిగా నిలిచింది. ఆ తర్వాతి స్థానాల్లో వరుసగా పౌర సరఫరాలు, ఆర్థిక, నైపుణ్యాభివృద్ధి, గిరిజన సంక్షేమం, ఇంధన, మౌలిక వసతులు, కార్మిక, ఉపాధి కల్పన, స్త్రీ, శిశు సంక్షేమ, వైద్యారోగ్య శాఖలు ఉన్నాయి. ఈ శాఖలన్నీ 'ఏ ప్లస్' గ్రేడ్ సాధించి మెరుగైన పనితీరు కనబరిచాయి. ఈడబ్ల్యూఎస్, హోం శాఖలు అతి తక్కువ స్కోర్‌తో సీ గ్రేడ్‌కు పరిమితమయ్యాయి. రవాణా, ఉన్నతవిద్య, యువజన సర్వీసులు, క్రీడలు, మౌలికవసతులు, పెట్టుబడులు, జలవనరులు, బీసీ సంక్షేమ శాఖలు బీ గ్రేడ్ దక్కించుకున్నాయి. కలెక్టర్ల సదస్సులో ఈ వివరాలు వెల్లడించారు.

✦ జిల్లాల వారీగా 83 స్కోర్ సాధించి ఎన్టీఆర్, పల్నాడు, అనంతపురం, అగ్రగామిగా నిలిచాయి. 75 స్కోర్‌తో డా.బీఆర్ అంబేడ్కర్ కోనసీమ, 76 స్కోర్‌తో అన్నమయ్య, విజయనగరం జిల్లాలు అట్టడుగున నిలిచాయి. అయితే రాష్ట్రంలోని 26 జిల్లాలూ ఏ గ్రేడ్ సాధించాయి.

✦ సుస్థిరాభివృద్ధి లక్ష్యాల సాధనలో వ్యవసాయం, ఇంధనం, పౌర సరఫరాలు, స్త్రీ, శిశు సంక్షేమం, వైద్యారోగ్యం, కార్మిక శాఖలు ఏ ప్లస్ గ్రేడ్ సాధించాయి. రెవెన్యూ సెక్రటేరియెట్ సీ గ్రేడ్‌లో ఉంది. పంచాయతీరాజ్, హోమ్, ఉన్నత విద్య సెక్రటేరియెట్‌లు బీ గ్రేడ్‌కు పరిమితమయ్యాయి. ఈ అంశంలో జిల్లాల వారీగా చూస్తే విశాఖపట్నం, బాపట్ల మొదటి రెండు స్థానాల్లో ఉండగా, డా.బీఆర్ అంబేడ్కర్ కోనసీమ, కాకినాడ జిల్లాలు చివర్లో నిలిచాయి. 26 జిల్లాలూ సుస్థిరాభివృద్ధి లక్ష్యాల సాధనలో ఏ గ్రేడ్‌లోనే ఉన్నాయి.



సచివాలయంలో నిర్వహించిన జిల్లా కలెక్టర్ల సదస్సులో మాట్లాడుతున్న ముఖ్యమంత్రి చంద్రబాబు. చిత్రంలో ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, మంత్రులు వంగలపూడి అనిత, నాదెండ్ల మనోహర్, అచ్చెన్నాయుడు, లోకేశ్, అనగాని సత్యప్రసాద్, ఎన్ఎండీ ఫరూక్, కొల్లు రవీంద్ర, నారాయణ, పయ్యావుల కేశవ్, కొలుసు పార్థసారథి, గొట్టిపాటి రవికుమార్, సీఎస్ విజయానంద్, డీజీపీ హరీశ్ కుమార్ గుప్తా

రోజూ పిల్లలు ఆటలు ఆడాల్సిందే

ఈనాడు, అమరావతి: కలెక్టర్ల సదస్సులో సంక్షేమ శాఖలపై సమీక్షలో సీఎం ప్రసంగించారు. అందులోని పలు కీలకాంశాలివీ.. 'విద్యార్థులందరికీ ఏడాదికొకసారి ఆరోగ్య పరీక్షలు చేయాలి. ఆరోగ్యపరమైన లోపాలుంటే సరిదిద్దాలి. పరీక్షల ఒత్తిడిని అధిగమించేందుకు 7, 8, 9, 10 ఇంటర్మీడియట్ విద్యార్థులతో మెడిటేషన్ చేయించాలి. కలెక్టర్లు కూడా విద్యార్థులతో తరచుగా మాట్లాడుతూ మోటివేట్ చేయాలి. పాఠశాల విద్యలో ప్రతి రోజూ క్రీడలకు చోటివ్వాలి. ప్రైవేటు పాఠశాలల్లోనూ ఇది అమలు కావాలి. సాంఘిక సంక్షేమశాఖ అమలు చేస్తున్న ఐఐటీ, నీట్ శిక్షణ కేంద్రాలను ఎస్సీ, బీసీ, మైనారిటీ విద్యార్థులకు అందుబాటులోకి తీసుకురావాలి. పార్వతీపురం మన్యం జిల్లాలో విద్యార్థుల పరిశుభ్రతకు అమలు చేస్తున్న 'ముస్తాబు' కార్యక్రమాన్ని అన్ని ప్రభుత్వ పాఠశాలలు, వసతిగృహాలు, గురుకులాల్లో తీసుకురావాలి.

బ్రాహ్మణ కార్పొరేషన్ విధానం ఆదర్శం

ఏపీ బ్రాహ్మణ కార్పొరేషన్‌లో మంచి ప్రయోగం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చే డబ్బులకు కమ్యూనిటీ కూడా కొంత చేయూత అందించి, అర్హులకు రాయితీ పథకాలు అందేలా చేశారు. మిగతా కార్పొరేషన్లు కూడా దీన్ని అమలు చేయాలి. కుల సంఘాలు వన భోజనాలకు పరిమితం కాకుండా ఆయా సామాజికవర్గాలు సాధికారత సాధించేలా చూడాలి.

డ్వాక్రా నిధుల్ని దుర్వినియోగం చేసిన వారి నుంచే రికవరీ

✦ రాష్ట్రంలో 1.10 కోట్ల మంది డ్వాక్రా మహిళలున్నారు. ఒక కుటుంబాన్ని యూనిట్‌గా తీసుకుని ఏ విధంగా వారి ఆదాయాన్ని పెంచాలో సంక్షేమశాఖలు ప్రణాళిక రూపొందించాలి.

✦ మహిళలకు గతంలో ఇచ్చిన స్వయం ఉపాధి పథకాలు ఉపయోగపడుతున్నాయా లేదా అధ్యయనం చేయాలి.

✦ మెప్మా పరిధిలో డ్వాక్రా మహిళలు బ్యాంకులకు చెల్లించిన నిధుల్ని దుర్వినియోగం చేసిన ఆర్పీలు, సీసీల ఆస్తుల నుంచే ఆ మొత్తాన్ని రికవరీ చేయాలి.

✦ రైతులతో స్వయం సహాయక సంఘాల ఏర్పాటుపై వ్యవసాయ, ఉద్యాన శాఖలు దృష్టి పెట్టాలి.

అనకాపల్లిలో 250 ఎకరాల్లో ఫుడ్ ప్రాసెసింగ్ పార్క్

✦ అనకాపల్లి జిల్లాలో ఫుడ్ ప్రాసెసింగ్ పార్క్ ఏర్పాటుకు 250 ఎకరాలు కేటాయిస్తాం. ప్లగ్ అండ్ ప్లే విధానంలో లేఅవుట్ తయారు చేయాలి. ఏజెన్సీలో సాగయ్యే కాఫీ, పసుపు, ఇతర ఆర్గానిక్ పంటలకు అందుబాటులోకి తీసుకురావాలి. వచ్చే కలెక్టర్ల సమావేశం నాటికి ఇది పూర్తి కావాలి.

✦ గిరిజన సహకార సంస్థే గిరిజన ప్రాంతాల్లో హోటళ్లు నిర్మించి, నిర్వహణను స్టార్ హోటళ్లకు ఇస్తే ఎలా ఉంటుందో పరిశీలించాలి.

✦ వసతిగృహాల మరమ్మతులకు పెండింగ్ నిధులు విడుదల చేయాలి.

జనవరి 15 నుంచి ఫిజికల్ ఫైళ్లు ఉండొద్దు

- ఈ-ఆఫీస్ ద్వారానే దస్త్రాలు పరిష్కరించాలి
- కలెక్టర్ల సమావేశంలో చంద్రబాబు

ఈనాడు, అమరావతి: ప్రభుత్వ కార్యాలయాల్లో దస్త్రాలను 'ఈ-ఆఫీసు' ద్వారా ఆన్‌లైన్‌లోనే పరిష్కరించాలని సీఎం చంద్రబాబు కలెక్టర్లను ఆదేశించారు. వచ్చే ఏడాది జనవరి 15 నుంచి ఫిజికల్ ఫైళ్ల అనుమతించేది లేదని తేల్చి చెప్పారు. ఈ-ఫైళ్ల నిర్వహణపై సిబ్బందికి అవసరమైన చోట శిక్షణ అందించాలని సూచించారు. 'ఇంకా ఫిజికల్ ఫైళ్లు ఎందుకు నిర్వహిస్తున్నారు? ఈ-ఆఫీసు ద్వారా ఫైళ్ల పరిష్కారానికి మీకు ఏమైనా సదుపాయాలు కావాలా? వాటిని సమకూర్చేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉంది. ఈ-ఆఫీస్ విధానంలో ఫైళ్ల పరిష్కారాన్ని వేగవంతం చేసేందుకు మొబైల్ ఫోన్‌లో బయోమెట్రిక్ ద్వారా లాగిన్ అయ్యే అవకాశాన్ని కల్పించే అంశాన్నీ పరిశీలిస్తున్నాం. గతంలో పోలిస్తే దస్త్రాలను వేగంగా పరిష్కరించడంలో కొందరు కలెక్టర్లు వెనుకబడ్డారు. దానికి కారణమేంటి? అన్ని జిల్లాల జేసీలు, జిల్లాల ఎస్పీలు సైతం ఈ-ఆఫీస్ ద్వారా ఫైళ్లను పరిష్కరించాల్సిందే' అని నిర్దేశించారు. కలెక్టర్ల సదస్సులో సీఎం మాట్లాడుతూ.. పోలీసు శాఖ ఈ-ఆఫీస్‌ను అసలు వినియోగించడం లేదని గణాంకాలు చెబుతున్నాయన్నారు. నెల్లూరు జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా ఫైళ్ల పరిష్కారానికి రెండు రోజుల వ్యవధి తీసుకుంటే.. ఆయన భార్య (కృతికా శుక్లా) ఒక్కరోజులోనే పరిష్కరిస్తూ ఆయన కంటే ముందున్నారంటూ సీఎం చమత్కరించారు.

వాట్సప్ గవర్నెన్స్‌పై అవగాహన పెంచాలి

'జనవరి 15 నుంచి అన్ని ప్రభుత్వ కార్యాలయాల ద్వారా సేవలు ఆన్‌లైన్ విధానంలో అందాలి. భద్రతపై అనుమానాలు, వినియోగించడంపై అవగాహన లేకపోవడం, స్మార్ట్ ఫోన్ లేకపోవడం వంటి మూడు కారణాలతో వాట్సప్ గవర్నెన్స్ వినియోగంపై ప్రజలు ఆసక్తి చూపడం లేదు. దీనిపై వారికి అవగాహన కల్పించే కార్యక్రమాలు జిల్లాల్లో చేపట్టాలి. ప్రభుత్వ సేవల కోసం ప్రజలు కార్యాలయాలకు రాకూడదు. ఇతర రాష్ట్రాల సరిహద్దు గ్రామాల్లో భాష సమస్య లేకుండా. . అవసరమైతే కన్నడ, ఒరియా, తమిళ భాషలనే వినియోగించుకునే అవకాశం కల్పించండి' అని సీఎం పేర్కొన్నారు. ఫిర్యాదుల పరిష్కారంపై జనవరి నుంచి ఆకస్మిక తనిఖీలు చేస్తామన్నారు. ప్రజల నుంచి అందే ఫిర్యాదులు పరిష్కరించడంలో కొన్ని జిల్లాలు బాగా వెనుకబడ్డాయంటూ గణాంకాలతో ప్రస్తావించారు. 'ప్రజల నుంచి అందే ప్రతి ఫిర్యాదునూ పరిష్కరించి తీరాలి. 90 శాతం మంది అధికారులు పనిచేస్తున్నా.. 10 శాతం ఇబ్బందికరంగా వ్యవహరిస్తున్నారు. వారు విధానాలు మార్చుకోవాలి. ఏమైనా నిబంధనలు మార్చాలంటే మారుస్తాం. ఫిర్యాదులు తక్కువ ఉంటే. . ప్రభుత్వం బాగా పనిచేస్తున్నట్లు. ధ్రువీకరణ పత్రాలు ఆన్‌లైన్‌లో పెడుతున్నాం. ఆన్‌లైన్‌లో అన్ని సేవలు అందుబాటులోకి వస్తాయి. వివాదాస్పద సమస్య ఉంటే మాత్రమే బాధితులు అధికారుల దగ్గరకు వచ్చేలా చూడాలి. వచ్చే మూడు నెలల్లో ఫిర్యాదులు పెండింగ్ లేకుండా చూడాలి. అన్ని జిల్లాల కలెక్టర్లు రాబోయే మూడు నెలల్లో డ్రెయిన్లు శుభ్రం చేయించే కార్యక్రమాన్ని చేపట్టాలి. పంచాయతీలు, పట్టణ ప్రాంతాల్లో వేసవిలో తాగునీటి సమస్య లేకుండా చూడాలి' అని సీఎం పేర్కొన్నారు.

> **ఆర్టీజీఎస్ గణాంకాల ఆధారంగా వివిధ శాఖల పురోగతిపై ఐటీ శాఖ కార్యదర్శి కాటమనేని భాస్కర్ ప్రజంటేషన్ ఇచ్చారు. ముఖ్యాంశాలివీ..**
>
> ✦ వాట్సప్‌లో ప్రస్తుతం ఒక నంబరు నుంచి గరిష్ఠంగా 200 మందికి మాత్రమే మెసేజ్‌లు పంపే అవకాశం ఉంది. ఉద్యోగులకు గ్రూప్‌ల వారీగా మెసేజ్‌లు పంపే విధానాన్ని అందుబాటులోకి తెచ్చాం.
>
> ✦ జీఐఎస్ పోర్టల్ ద్వారా అన్ని ప్రభుత్వ భవనాలు, మౌలిక సదుపాయాలను అనుసంధానం చేశాం.
>
> ✦ ఈ-ఆఫీస్‌లో ఆండ్రాయిడ్, ఐఓఎస్ మొబైల్ ద్వారా వినియోగించుకునేలా అప్లికేషన్లు తెచ్చాం. దీనివల్ల అధికారులు ఎప్పుడైనా, ఎక్కడి నుంచైనా దస్త్రాలు పరిష్కరించడంతో పాటు నిర్ణయాలు తీసుకోవచ్చు.
>
> ✦ 14 వేల సీసీటీవీ కెమెరాల్లో విద్యుత్ అంతరాయం ఏర్పడుతుంది. సమస్యను డిస్కంలు పరిష్కరించాలి.
>
> ✦ గ్రామ, వార్డు సచివాలయాల్లో పనిచేసే సిబ్బంది అందుబాటులో ఉండటం లేదని ప్రజల నుంచి ఫిర్యాదులు వస్తున్నాయి. రోజూ సగటున 74 శాతం మందే హాజరవుతున్నారు.
>
> ✦ ఏపీఎస్ఎఫ్ఎల్ నెట్‌వర్క్‌కు అంతరాయం లేకుండా విద్యుత్ అందించాలి.



సదస్సులో వివిధ శాఖల కార్యదర్శులు, హెచ్ఓడీలు, కలెక్టర్లు

151% పెరిగిన అరటి ఉత్పత్తి

వ్యవసాయశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రాజశేఖర్ వెల్లడి

ఈనాడు, అమరావతి: రాష్ట్రంలో అరటి పండ్ల ఉత్పత్తి 151% పెరిగింది. 14.85 లక్షల టన్నుల నుంచి 37.31 లక్షల టన్నులకు చేరుకుంది. జామ, బత్తాయి ఉత్పత్తులు కూడా పెరిగాయి. రొయ్యల ఉత్పత్తిలో 27%, చేపల ఉత్పత్తిలో 17% వృద్ధి కనిపించింది. వ్యవసాయ రంగం నుంచి రెండో అర్థ సంవత్సరంలోనే ఫలితాలు కనిపిస్తాయి. గుడ్ల ఉత్పత్తి 64 లక్షల టన్నుల నుంచి 67 లక్షల టన్నులకు పెరిగింది.

✦ స్థూల అదనపు విలువ జోడించే పంటలు, వాటి సాగుపై సమగ్ర ప్రణాళికలు రూపొందించాం.

✦ ఉద్యాన శాఖలో అనంతపురం, సత్యసాయి, కర్నూలు, వైఎస్సార్ కడప జిల్లాలు ముందువరుసలో ఉన్నాయి. ఉద్యాన రంగంలో 22 ప్రధాన పంటల నుంచే అధిక స్థూల విలువ జోడించగలం. వీటిలో అరటి, మామిడి, మిరప అగ్రస్థానంలో ఉన్నాయి. మల్లెపూలు కూడా అధిక వృద్ధికి ఉపకరణాలు.

విలువ జోడింపుతో 7% అదనపు వృద్ధి

ఈనాడు, అమరావతి: మూడు నెలల్లో రాష్ట్రంలోని సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమ (ఎంఎస్ఎంఈ)లను ఉత్పత్తుల వారీగా గుర్తించి, కేటగిరీల వారీగా జాబితా సిద్ధం చేయాలని చంద్రబాబు ఆదేశించారు. దీనివల్ల ఒకే తరహా పరిశ్రమల మధ్య ఉత్పత్తి, ఖర్చుల వ్యత్యాసాన్ని గుర్తించి.. కారణాలను విశ్లేషించే వెసులుబాటు కలుగుతుందన్నారు. విలువ జోడింపు, ఉత్పాదకత పెంపు ద్వారా పారిశ్రామిక రంగంలో 7 శాతం అదనపు వృద్ధి సాధించవచ్చన్నారు. ఎంఎస్ఎంఈలు క్షేత్రస్థాయిలో ఎదుర్కొంటున్న ఇబ్బందులను తెలుసుకునేందుకు నెలకోసారి సమీక్షించాలని సీఎం ఆదేశించారు.

45 రోజుల్లో గ్రౌండింగ్‌కు కార్యాచరణ

రాష్ట్రంలో పెట్టుబడుల ఒప్పందాలను 45 రోజుల్లోగా గ్రౌండింగ్ చేయాలన్న ప్రభుత్వ లక్ష్యానికి అనుగుణంగా జిల్లా కలెక్టర్లు ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలని పరిశ్రమల శాఖ కార్యదర్శి యువరాజ్ పేర్కొన్నారు. రాష్ట్రంలో పెట్టుబడుల ప్రతిపాదనలపై కలెక్టర్ల సదస్సులో ఆయన ప్రజంటేషన్ ఇచ్చారు. అందులో ముఖ్యాంశాలివీ..

✦ రాష్ట్రంలో 2024 జూన్ నుంచి రూ. 8.55 కోట్ల పెట్టుబడుల ప్రతిపాదనలను మంత్రిమండలి ఆమోదించింది. వాటి ద్వారా 8.23 లక్షల మందికి ఉపాధి అవకాశాలు లభిస్తాయి. అవన్నీ గ్రౌండింగ్‌కు సిద్ధంగా ఉన్నాయి.

✦ ఇప్పటి వరకు 735 ప్రాజెక్టులకు సంబంధించి ఒప్పందాలు కుదిరాయి. వాటి ద్వారా 22.19 లక్షల మందికి ఉపాధి లభిస్తుంది. వీటిని గ్రౌండింగ్ చేసేందుకు ఒక్కో ప్రాజెక్టుకు ఒక అధికారిని నియమించుకుని నిరంతరం పర్యవేక్షించాలి.

✦ నియోజకవర్గానికి ఒకటి చొప్పున ప్రతిపాదించిన 175 ఎంఎస్ఎంఈ పార్కుల్లో ఇప్పటికే 100 పార్కులకు సీఎం శంకుస్థాపన చేశారు. మిగిలిన 75 పార్కులకు రాబోయే నెల రోజుల్లో భూమిపూజ చేయాలి.

✦ ఏపీఐఐసీ ద్వారా ఇప్పటి వరకు 21,589 సంస్థలకు భూములు కేటాయిస్తే వాటిలో 16,885 యూనిట్లు ఉత్పత్తి ప్రారంభించాయి. మిగిలినవి గ్రౌండింగ్ చేసే బాధ్యత కలెక్టర్లు తీసుకోవాలి.

✦ సర్క్యులర్ ఎకానమీ పార్కుల ఏర్పాటుకు ప్రతి జిల్లాలో 80 నుంచి 100 ఎకరాలు అవసరం.

✦ విశాఖలో పరిశ్రమల కోసం భూమిలిచ్చే వారికి 20 శాతం కేటాయించి.. మిగిలిన మొత్తాన్ని పారిశ్రామిక అవసరాలకు వినియోగించుకునేలా అక్కడి కలెక్టర్ వ్యవహరించారు. ఇతర జిల్లాల్లోనూ దీన్ని అమలు చేయవచ్చు.

✦ ఉపాధి పొందిన వారి పేరు ఆధార్ నంబరుతో అనుసంధానిస్తున్నాం. దీనివల్ల కచ్చితమైన లెక్కలు వస్తాయి.

దావోస్‌కు ముందే ఎంవోయూలు అమల్లోకి రావాలి

- 30 రోజుల్లో రూ.12 లక్షల కోట్ల పెట్టుబడులు గ్రౌండింగ్ కావాలి
- పారిశ్రామిక ప్రాజెక్టులకు అనుగుణంగా కొత్త ఆర్థిక నగరాలు సృష్టించాలి
- కలెక్టర్ల సదస్సులో సీఎం చంద్రబాబు



రాష్ట్ర సచివాలయం ఐదో బ్లాక్‌లో ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన నిర్వహించిన కలెక్టర్ల సదస్సులో పాల్గొన్న మంత్రులు, జిల్లాల కలెక్టర్లు, కార్యదర్శులు, హెచ్ఓడీలు

ఈనాడు, అమరావతి: రాష్ట్రంలో రూ.20 లక్షల కోట్ల పెట్టుబడులకు ఒప్పందాలు కుదుర్చుకున్నామని, క్యాబినెట్ అనుమతులు ఇచ్చిన తర్వాత ప్రాజెక్టులు గ్రౌండింగ్ చేయించాలని సీఎం చంద్రబాబు కలెక్టర్లకు సూచించారు. 'రాబోయే 30 రోజుల్లో భూములు కేటాయించి.. రూ.12 లక్షల కోట్ల విలువైన పెట్టుబడులు పూర్తిచేయాలి. దావోస్‌కు వెళ్లే ముందుకు వాటిని పూర్తి చేయాలి. భారీ ప్రాజెక్టులను పూర్తి చేసేందుకు యుద్ధ ప్రాతిపదికన రోజువారీ సమీక్షలు కలెక్టర్లు జరపాలి. ఎంఎస్ఎంఈ పార్కులు ఇంకా 75 ఏర్పాటు చేయాల్సి ఉంది. ఒక కుటుంబం.. ఒక పారిశ్రామికవేత్త అనేది ప్రభుత్వ విధానం. భూ సేకరణలో ఎక్కడా వివాదాలు లేకుండా చూడాలి. ప్రాజెక్టు వస్తే ఆ ప్రాంతంలో ఆర్థికంగా అభివృద్ధి జరుగుతుంది. భూములు ఇచ్చినవారికీ లబ్ధి చేకూరేలా చూడాలి. జిల్లాలవారీగా ఎంతమందికి ఉపాధి కల్పిస్తారనేది ప్రభుత్వం పర్యవేక్షిస్తుంది. రాబోయే రోజుల్లో పారిశ్రామిక రంగంలో పెద్దఎత్తున అభివృద్ధి జరగబోతోంది. తర్వాత సేవా రంగంలో ఎన్నో అవకాశాలు రానున్నాయి. కాగ్నిజెంట్ ద్వారా 25 వేల ఉద్యోగాలు ఇచ్చే అవకాశం ఉంది. ప్రస్తుతం 4.5 లక్షలమంది వర్క్‌ఫ్రం హోం విధానంలో పనిచేస్తున్నారు. కో-వర్కింగ్ స్పేస్ ద్వారా 10 లక్షలమందికి కెపాసిటీ బిల్డింగ్ చేయడం ద్వారా వారికి ఎక్కువ జీతాలు పొందే అవకాశం ఉంటుంది. ఆర్సెలార్ మిత్తల్ ప్రాజెక్టులకు అనుసంధానంగా కొత్త ఆర్థిక నగరాలు సృష్టించాలి' అని పేర్కొన్నారు.

క్వాంటమ్ టెక్నాలజీలో శిక్షణ: కాటమనేని భాస్కర్

రాష్ట్రంలో ఏటా 5,000 మందికి క్వాంటమ్ టెక్నాలజీలో శిక్షణ అందించాలన్నది లక్ష్యమని ఐటీ శాఖ కార్యదర్శి కాటమనేని భాస్కర్ పేర్కొన్నారు. 'యువతకు అమరావతి క్వాంటమ్ అకాడమీ ద్వారా శిక్షణ అందించాలనేది లక్ష్యం. అమరావతి క్వాంటమ్ వ్యాలీలో పెట్టుబడులు పెట్టేందుకు 29 కంపెనీలతో ఒప్పందాలు కుదిరాయి. వాటి ద్వారా రూ.2,847 కోట్ల పెట్టుబడులు రానున్నాయి. అందులో 8 సంస్థల ఏర్పాటుకు ఇప్పటికే అనుమతులు జారీ చేశాం. క్వాంటమ్ హార్డ్‌వేర్ సంస్థలు కూడా వస్తున్నాయి. దీనికోసం 200 ఎకరాలు అవసరం. రాజధానికి అనుసంధానంగా భూములు సేకరించే ప్రయత్నాలు చేస్తున్నాం. అవి రెడ్ కేటగిరీ పరిశ్రమలు కావడంతో పల్నాడు, గుంటూరు జిల్లాల్లో రాజధాని ప్రాంతానికి కొంతదూరంగా భూములు తీసుకుంటాం. జనవరిలో ఐబీఎం సంస్థ రెండు క్వాంటమ్ కంప్యూటర్లు ఏర్పాటు చేయనుంది. 2030 నాటికి 6.5 గిగావాట్ల డేటా సెంటర్లు ఏర్పాటు లక్ష్యం. గూగుల్‌తో పాటు పలు సంస్థలు డేటా సెంటర్ల ఏర్పాటుకు ప్రతిపాదన అందించాయి. రూ.2,97,707 కోట్లతో పలు సంస్థలు డేటా సెంటర్లను ఏర్పాటు చేయనున్నాయి. వాటికి అవసరమై భూములను కలెక్టర్లు సేకరించాలి. స్టార్టప్‌లను ప్రోత్సహించేందుకు డిస్ట్రిక్ట్ ఇన్నోవేషన్ ఫెస్ట్ నిర్వహిస్తాం. ఐటీ పార్కుల కోసం కోసం ల్యాండ్ బ్యాంక్‌లు సిద్ధం చేయాలి' అని తెలిపారు.

ఏమిటీ.. ఈ నీటిమట్టాలు కరక్టేనా?

- భాస్కర్ నా పరువు పోతుంది
- ఒకసారి సెన్సార్ల లెక్కలు సరి చూసుకోండి
- అవేర్‌పై చర్చలో ముఖ్యమంత్రి చంద్రబాబు వ్యాఖ్యలు

ఈనాడు, అమరావతి: "ఏమిటీ ఈ భూగర్భ నీటిమట్టాలు.. మీరు చెబుతున్న లెక్కలు కరక్టేనా? కాకినాడలో నీళ్లు పైకి ఉండాలి. అంతకిందకు ఎందుకు ఉన్నాయి. ఎన్టీఆర్ జిల్లా, కృష్ణా జిల్లాలు.. నిజానికి ఇక్కడ ఉన్న లెక్కలకు భిన్నంగా అటూ ఇటూ ఉండాలి. ఏమిటి భాస్కర్ (ఆర్టీజీఎస్ కార్యదర్శి) ఈ లెక్కలు కరక్టేనా.. మళ్లీ నా పరువు పోతుంది. అందుకే ఈ లెక్కలన్నీ ప్రజల ముందు పెడుతున్నా. వాస్తవాలు తెలుస్తాయి" అని ముఖ్యమంత్రి చంద్రబాబు పేర్కొన్నారు. అవేర్‌పై చర్చలో భాగంగా భూగర్భ జలమట్టాలపై ఆసక్తికరమైన చర్చ జరిగింది. నవంబరు నెలాఖరుకు ఉన్న నీటి మట్టాలపై చూపుతున్న లెక్కలను సీఎం ఈ సందర్భంగా చదివి వినిపించారు. పశ్చిమ గోదావరిలో సగటున 7.7 మీటర్ల లోతున భూగర్భ జలమట్టం ఉందని, ఇది కరక్టేనా అని అడిగారు. దీనికి పశ్చిమగోదావరి జిల్లా కలెక్టర్ స్పందిస్తూ "ఇలా తవ్వితే అలా నీళ్లు వచ్చేస్తాయి. మా సమస్య అదే. మరి అర్థం కావడం లేదు" అని వ్యాఖ్యానించారు. ఉండిలో 13 మీటర్లు ఏమిటి భాస్కర్. మీరు ఆ జిల్లా కలెక్టర్‌గానూ పని చేశారు అని చంద్రబాబు ప్రశ్నించారు. గోదావరి పక్కన ఏలూరు జిల్లాలో సగటున 16.22 మీటర్ల లోతున, తూర్పుగోదావరి జిల్లాలో సగటున 18.62 మీటర్ల లోతున భూగర్భ జలమట్టం ఉంది. గోదావరి పక్కన ఇలా ఉందంటే ఎవరూ నమ్మరు అని సీఎం వ్యాఖ్యానించారు. సెన్సార్లు ఎలా పని చేస్తున్నాయో చెక్ చేసుకోవాలని సూచించారు.

నీటి బడ్జెట్ తయారు చేయాలి

"నీళ్లు ఉన్నాయి కదా అని తీసుకుంటే సరిపోదు. ఇక నుంచి పంచాయతీరాజ్‌కు, అర్బన్‌కు ఎంత తాగు నీరు అవసరమో ముందే నీటి బడ్జెట్ తయారు చేయాలి. ఆ నీటి లెక్కలు ముందే సమర్పించాలి. భవిష్యత్తులో నీటికి కూడా ఛార్జి ఉంటుంది. నీటి అవసరాలపై, నీటి నిల్వలపై శాస్త్రీయంగా కసరత్తు చేయాలి" అని చంద్రబాబు ఆదేశించారు.

వృద్ధి లక్ష్యాల సాధనకు జిల్లా, మండలవారీ ప్రణాళికలు

ఆర్థిక, ప్రణాళికా శాఖ ముఖ్య కార్యదర్శి పీయూష్ కుమార్

✦ 2047 స్వర్ణాంధ్ర విజన్ సాధించేందుకు, ఈ ఏడాది వృద్ధి లక్ష్యాలు అందుకునేందుకు జిల్లా, మండల, నియోజకవర్గాల వారీగా వార్షిక, పంచవర్ష ప్రణాళికలు రచించి జిల్లాలకు పంపాం. రాష్ట్ర వృద్ధి రేటు బలమైన పెరుగుదల ధోరణి చూపుతోంది. 2024-25లో రెండో త్రైమాసికం నాటికి 10.26%గా ఉన్న వృద్ధి రేటు ఈ ఏడాది 11.30%కి చేరింది.

✦ విశాఖ, కృష్ణా, ఎన్టీఆర్, తిరుపతి, ఏలూరు, గుంటూరు జిల్లాలు జీఎస్‌డీపీలో అగ్రస్థానంలో నిలిచాయి.

✦ 643 కీ ఇండికేటర్స్ సాయంతో ప్రతి ప్రభుత్వ శాఖ పనితీరును మదింపు చేస్తున్నాం.

✦ పరిశ్రమల రంగంలో మైనింగ్, విద్యుత్తు, నిర్మాణ రంగాలు.. సేవల విభాగంలో రవాణా, కమ్యూనికేషన్, బ్యాంకింగ్ రంగాలు వృద్ధి సాధించాయి.

✦ గృహ నిర్మాణం, ఆర్థిక, ఇంధన, వ్యవసాయ, ఆరోగ్యశాఖలు ఏ-ప్లస్ గ్రేడ్ సాధించాయి.

పీఎంఏవై గ్రామీణ్‌కు 10 లక్షల మంది దరఖాస్తు

గృహనిర్మాణ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజయ్‌జైన్

ఈనాడు, అమరావతి: ప్రధానమంత్రి ఆవాస్ యోజన (పీఎంఏవై) గ్రామీణ్‌కు రాష్ట్ర వ్యాప్తంగా 10.42 లక్షల మంది దరఖాస్తు చేసుకున్నారని గృహనిర్మాణ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజయ్‌జైన్ తెలిపారు. వీటిని కేంద్ర ప్రభుత్వం వచ్చే ఫిబ్రవరిలో మంజూరు చేసే అవకాశముందని పేర్కొన్నారు. 2029 నాటికి అర్హులైన ప్రతిఒక్కరికీ స్థలం, సొంతిల్లు ఉండాలనే ప్రభుత్వ లక్ష్యానికి అనుగుణంగా చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. సచివాలయంలో సీఎం చంద్రబాబు అధ్యక్షతన బుధవారం నిర్వహించిన కలెక్టర్ల సదస్సులో అజయ్ జైన్ గృహనిర్మాణ శాఖపై ప్రజంటేషన్ ఇచ్చారు. 'కూటమి అధికారంలో వచ్చిన తర్వాత 3.10 లక్షల గృహాల్ని పూర్తిచేసి, లబ్ధిదారులకు అందించాం. మరో 5.68 లక్షల ఇళ్ల నిర్మాణాలు పురోగతిలో ఉన్నాయి. చిత్తూరు, శ్రీకాకుళం, అనకాపల్లి, విజయనగరం, పశ్చిమగోదావరి జిల్లాల్లో ఇళ్ల నిర్మాణ పురోగతి బాగుంది. అల్లూరి సీతారామరాజు, ఎన్టీఆర్, గుంటూరు, బాపట్ల, కృష్ణా జిల్లాల్లో కేటాయించిన గృహాల్లో 53 శాతం కంటే తక్కువ పురోగతి నమోదైంది. వచ్చే ఉగాది నాటికి మరో 5 లక్షల గృహాల్ని పూర్తి చేయాలని సీఎం లక్ష్యాన్ని నిర్దేశించారు. జిల్లాల వారీగా పూర్తి చేయాల్సిన గృహాలకు సంబంధించి లక్ష్యాలు నిర్దేశించాం. ఈ మేరకు ఆయా జిల్లాల కలెక్టర్లు చర్యలు తీసుకోవాలి. గృహనిర్మాణానికి సంబంధించి ఇంజినీరింగ్ అసిస్టెంట్ల పనితీరుపై ప్రజల్లో కొంత అసంతృప్తి ఉంది. దీనిపై కూడా దృష్టిపెట్టాలి' అని సూచించారు.



ఉర్దూ అకాడమీ స్వర్ణోత్సవ లోగో జాకెట్‌ను ఆవిష్కరిస్తున్న మంత్రి ఎన్‌ఎండీ ఫరూక్, అకాడమీ అధికారులు

జోజినగర్ భూవివాదంపై మీ పాలనలో ఏం చేశారు?

జగన్‌పై ఏపీ బిల్డింగ్ అడ్వైజరీ కమిటీ ఛైర్మన్ ధ్వజం

ఈనాడు, అమరావతి: విజయవాడ భవానీపురం జోజినగర్ భూవివాదంపై వైకాపా ప్రభుత్వంలోనే హైకోర్టు తీర్పు ఇచ్చినా.. బాధితుల పక్షాన ఎందుకు నిలబడలేదని మాజీ సీఎం జగన్‌ను ఏపీ బిల్డింగ్ అడ్వైజరీ కమిటీ ఛైర్మన్ గొట్టిముక్కల రఘురామరాజు ప్రశ్నించారు. న్యాయస్థానం ఇచ్చిన తీర్పును ఇప్పుడు ప్రభుత్వానికి ఆపాదిస్తూ దురుద్దేశపూర్వకంగా జగన్ రాజకీయాలు చేస్తున్నారని మండిపడ్డారు. మంగళగిరిలోని తెదేపా కేంద్ర కార్యాలయంలో బుధవారం రఘురామరాజు విలేకర్లతో మాట్లాడారు. తాడేపల్లి ప్యాలెస్ చుట్టూ ఉన్న పేదల ఇళ్లు కూలగొట్టించిన వ్యక్తి జగన్ కాదా అని దుయ్యబట్టారు. ఇప్పుడు పరామర్శ పేరుతో ఆయన నాటకాలాడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

కానిస్టేబుల్ పోస్టుల భర్తీని జగన్ క్రెడిట్‌గా చెప్పడం సిగ్గుచేటు

వైకాపా నాయకులపై తెదేపా నేత విజయశేఖర్‌రెడ్డి ధ్వజం

ఈనాడు, అమరావతి: కానిస్టేబుల్ పోస్టుల భర్తీనీ వైకాపా అధినేత జగన్ క్రెడిట్‌గా చెప్పడం ఆ పార్టీ నేతల దిగజారుడుతనానికి నిదర్శనమని తెదేపా అధికార ప్రతినిధి మేడా విజయశేఖర్‌రెడ్డి ధ్వజమెత్తారు. మంగళగిరిలోని తెదేపా కేంద్ర కార్యాలయంలో బుధవారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. 18 నెలల్లో 31 కేసులను పరిష్కరించి 5,757 మంది కొత్త కానిస్టేబుళ్లకు నియామక పత్రాలు ఇచ్చిన ఘనత కూటమి ప్రభుత్వానిదని చెప్పారు. జగన్ క్రిమినల్, లూటీల క్రెడిట్‌ను మాత్రం ఎవరూ చోరీ చేయలేరని ఎద్దేవా చేశారు.

మూసేసిన మీసేవ కేంద్రాలను పునఃప్రారంభించాలి: సీపీఐ

ఈనాడు, అమరావతి: గత ప్రభుత్వం మూసేసిన 170 ప్రభుత్వ పట్టణ ఈ(మీ)సేవ కేంద్రాలను పునఃప్రారంభించాలని కోరుతూ సీపీఐ రాష్ట్ర కార్యదర్శి గుజ్జుల ఈశ్వరయ్య సీఎం చంద్రబాబుకు లేఖ రాశారు. "రాష్ట్ర విభజన తర్వాత 13 జిల్లాల్లోని అర్బన్ మీసేవ కేంద్రాల్లో 607 మంది ఉద్యోగులు విధులు నిర్వర్తించేవారు. 376 రకాల సేవలు ప్రజలకు అందించడం ద్వారా ప్రభుత్వ శాఖలకు ఏడాదికి దాదాపు రూ.4 వేల కోట్లు, యూజర్ ఛార్జీల రూపంలో మరో రూ.40 కోట్ల ఆదాయం వచ్చేది. వైకాపా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఐటీ శాఖ పరిధిలోని ఈ వ్యవస్థను గ్రామ, వార్డు సచివాలయాల శాఖకు బదిలీ చేసింది. అనంతరం కేంద్రాలను మూసివేసింది" అని పేర్కొన్నారు.

రామచంద్రరాజు సేవలు చిరస్మరణీయం

సీఎం చంద్రబాబు

ఈనాడు, అమరావతి : తెదేపా సీనియర్ నాయకుడు, తితిదే బోర్డు మాజీ సభ్యుడు బి.రామచంద్రరాజు మృతిపై చంద్రబాబు విచారం వ్యక్తం చేశారు. ఆయన కుటుంబ సభ్యులకు ఎక్స్ వేదికగా బుధవారం సానుభూతి తెలియజేశారు. "ఎన్టీఆర్ వీరాభిమానిగా, అఖిలభారత ఎన్టీఆర్ ఫ్యాన్స్ అసోసియేషన్ అధ్యక్షుడిగా పనిచేసి 'ఎన్టీఆర్ రాజు'గా పిలిపించుకున్నారు. ఆయన పార్టీకి చేసిన సేవలు చిరస్మరణీయం" అని చంద్రబాబు కొనియాడారు.

పరకామణిలో చోరీ జగన్‌కు తెలిసే జరిగింది

తెదేపా నేత వర్ల రామయ్య ఆరోపణ

ఈనాడు, అమరావతి: శ్రీవారి పరకామణిలో చోరీ వ్యవహారం వైకాపా అధినేత జగన్‌కు తెలిసే జరిగిందని తెదేపా పొలిట్‌బ్యూరో సభ్యుడు వర్ల రామయ్య ఆరోపించారు. జగన్ వ్యాఖ్యల్ని బట్టి ఇదే విషయం స్పష్టమవుతోందని చెప్పారు. మంగళగిరిలోని తెదేపా కేంద్ర కార్యాలయంలో బుధవారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. కోట్ల మంది హిందువులు భక్తితో సమర్పించే కానుకల చోరీ కేసు చిన్నదా? అని జగన్‌ను ప్రశ్నించారు. హిందూ సమాజానికి వెంటనే ఆయన క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు.



సందర్శకులకు 'టోపీ'..

వారంతా హ్యాపీ

తెలంగాణలోని వికారాబాద్ జిల్లా కోటిపల్లి రిజర్వాయర్ వద్ద కనిపించిన చిత్రమిది.. అనంతగిరి హిల్స్ దగ్గరగా ఉండటంతో ఈ ప్రాంతం నిత్యం పర్యాటకులతో సందడిగా ఉంటుంది. భిక్షాటనకు ఇక్కడికి వచ్చిన సమీప ప్రాంతానికి చెందిన వృద్ధుడు హనుమయ్యకు.. ఉపాధి కోసం ఏదైనా చేయాలనే ఆలోచన వచ్చింది. సమీపంలోని అడవుల్లో టేకు ఆకులు సేకరించి.. ఆకట్టుకునేలా ఈ టోపీని తయారుచేశారు. దానికి రంగురంగుల పూల కాగితాలను అలంకరించారు. సందర్శకులు ఈ టోపీ ధరించి సెల్ఫీ తీసుకోవచ్చని.. అందుకు రూ.10 చొప్పున ఇవ్వాలని కోరుతున్నారు. ఈ టోపీని పెట్టుకుని సాధారణ రోజుల్లో ఇరవై మంది.. వారాంతాల్లో 50 నుంచి 60 మంది సెల్ఫీ దిగుతున్నారని చెప్పారు.

– ఈనాడు, హైదరాబాద్

మరింత మందికి 'ఈఎస్ఐ'!

- వేతన వివరణ మారుతోంది..
- ఇక ఎక్కువ మంది కార్మికులకు బీమా వైద్యసేవలు
- 50 శాతానికి మించిన అలవెన్సులు లెక్కింపులోకి..

ఈనాడు, హైదరాబాద్: కొత్తగా అమల్లోకి వచ్చిన సామాజిక భద్రత కోడ్‌లో వేతన వివరణను మార్చడంతో భారీసంఖ్యలో కార్మికులు ఈఎస్ఐసీ (కార్మిక రాజ్య బీమా సంస్థ) వైద్యసేవల కిందకు రానున్నారు. నిబంధనలకు లోబడి ఇక రూ.42 వేల కన్నా తక్కువ వేతనం పొందుతున్న కార్మికులకు బీమా వైద్యసేవలు అందే అవకాశాలున్నాయి. ఇంతవరకు మూలవేతనం, డీఏ, ఇతర అలవెన్సులన్నీ కలిపి నెలకు వేతనం రూ.21 వేల లోపు ఉంటే ఈఎస్ఐసీ పరిధిలోకి వచ్చేవారు. ఇక నిబంధనలకు లోబడి మూలవేతనం, డీఏ కలిపి రూ.21 వేలలోపు ఉంటే అర్హులవుతారు. సామాజిక భద్రత కోడ్‌లో భాగంగా వేతన వివరణపై ఇటీవల ఈఎస్ఐసీ కేంద్ర కార్యాలయం ఆదేశాలు జారీచేసింది. ఈ మేరకు కొత్త వేతన వివరణలకు లోబడి. . ఇంతవరకు ఈఎస్ఐ సేవలకు దూరంగా ఉన్న కార్మికులను బీమా వైద్యసేవల పరిధిలోకి తీసుకురావాలని ప్రాంతీయ సంచాలకులకు ఆదేశాలిచ్చారు. కొత్త వేతన వివరణపై యాజమాన్యాలకు అవగాహన కల్పించాలని స్పష్టంచేశారు. కొన్ని సంస్థల్లో ఈపీఎఫ్ పరిధిలోకి వచ్చే ఉద్యోగుల సంఖ్య ఎక్కువగా, బీమా వైద్యసేవల పరిధిలోకి వచ్చేవారి సంఖ్య తక్కువగా ఉన్నందున.. తనిఖీచేసి అందరినీ ఈఎస్ఐ పరిధిలోకి తీసుకురావాలని సూచించారు.

చట్టంలోని సెక్షన్ 2(88)లో వేతన వివరణ ఇలా..

వేతనం పరిధిలో.. మూలవేతనం, కరవుభత్యం (డీఏ), రిటైనింగ్ అలవెన్సు ఉంటాయి. బోనస్, ఇంటి అద్దె, ఈపీఎఫ్, ట్రావెలింగ్ అలవెన్సు, ప్రత్యేక చెల్లింపులు, ఓవర్‌టైం వేతనాలు, ఉద్యోగులకు ఇచ్చే కమీషన్లు, గ్రాట్యుటీ, పదవీ విరమణ ప్రోత్సాహకం వేతన లెక్కింపులోకి రావు. అయితే గ్రాట్యుటీ, పదవీ విరమణ ప్రోత్సాహకం మినహా మిగతావన్నీ చెల్లించే వేతనంలో సగాని కన్నా ఎక్కువగా ఉండకూడదు. ఒకవేళ ఈ ప్రోత్సాహకాలన్నీ 50% కన్నా ఎక్కువగా ఉంటే.. ఆ ఎక్కువ మొత్తాన్ని వేతనంలో కలుపుతారు. ఈ లెక్కన అలవెన్సులు మొత్తం వేతనంలో 50 శాతానికి మించకూడదు.

ఎందుకు ఇలా..!

కొన్ని సంస్థల్లో మూలవేతనం, డీఏ తక్కువగా చూపించి, ఇతర అలవెన్సులు ఎక్కువగా ఇస్తున్నారు. తద్వారా ఆయా ఉద్యోగులకు తక్కువ మొత్తంలో ఈపీఎఫ్ చందా చెల్లించడంతో వారికి దక్కాల్సిన ప్రయోజనాలు దూరమవుతున్నాయి. ఈ నేపథ్యంలో సామాజిక భద్రత కోడ్‌లో 50% నిబంధన తీసుకువచ్చారు. ఈ నిబంధనతో ఉద్యోగులకు తమ వేతనం నుంచి చెల్లించాల్సిన ఈపీఎఫ్, అలాగే యాజమాన్యం ఉద్యోగి ఖాతాలో జమచేసే చందా మొత్తం పెరుగుతాయి. తద్వారా ఈపీఎఫ్ నిల్వలు పెరుగుతాయి. గతంలో మొత్తం వేతనం సాధారణ ఉద్యోగులకు రూ.21 వేలు, దివ్యాంగులైన ఉద్యోగులకు రూ.25 వేలలోపు ఉంటేనే ఈఎస్ఐ సేవలు అందేవి. ఇకనుంచి వేతన వివరణలో మూలవేతనం, డీఏ, రిటైనింగ్ అలవెన్సు మాత్రమే ఉంటాయి. తద్వారా ఈ మొత్తం రూ.21 వేలలోపు ఉన్న కార్మికులంతా ఈఎస్ఐ పరిధిలోకి వస్తారు.

ఉదాహరణకు.. ఒక ఉద్యోగికి నెలకు రూ.30 వేల వేతనం అందుతోంది. ఇందులో మూలవేతనం, డీఏ కలిపి రూ.12 వేలు ఉంటే.. ఇతర అలవెన్సులన్నీ కలిపి రూ.18 వేలు. గతంలోని నిబంధన ప్రకారం వేతనం రూ.30 వేలు దాటినందున ఆ ఉద్యోగికి ఈఎస్ఐ ప్రయోజనాలు వర్తించవు. కొత్త వేతన వివరణ ప్రకారం.. ఆ ఉద్యోగికి చెల్లించే అలవెన్సులు కలిపి మొత్తం వేతనంలో 50 శాతం కన్నా రూ.3 వేలు ఎక్కువ. దీంతో ఆ రూ.3 వేల అలవెన్సు వేతనంలో కలుపుతారు. దీంతో వేతనం రూ.15 వేలకు (రూ.12 వేలు + రూ.3 వేలు) లెక్కిస్తారు. ఇది రూ.21 వేల కన్నా తక్కువగా ఉన్నందున అతనికి ఈఎస్ఐ సదుపాయాలు అందుతాయి. ఈ లెక్కన నెలకు రూ.42 వేల కన్నా తక్కువ వేతనం పొందే ఉద్యోగులు ఈఎస్ఐ పరిధిలోకి వచ్చే అవకాశం ఉంది. అయితే మూలవేతనం, డీఏ కలిపి రూ.21 వేలు దాటితే ఆ ఉద్యోగులు, కార్మికులు ఈఎస్ఐ పరిధిలోకి వచ్చే అవకాశాలు ఉండవు.

ఊరూరా జలఫలాలు

- ఖరీఫ్ తర్వాత జలాశయాల్లో 913 టీఎంసీలు
- వాటితో చెరువులు నింపేందుకు ప్రణాళికలు
- కాలువలు, ఎత్తిపోత, ఇతర మార్గాల అన్వేషణ

ఈనాడు, అమరావతి: రాష్ట్రంలో సాగునీటి ప్రాజెక్టుల్లో నీటి నిల్వలు ఎంత కీలకమో.. చెరువులు నిండటమూ అంతే ముఖ్యం. వర్షపాతం బాగున్నా.. భారీ, మధ్యతరహా జలాశయాలు జలకళతో ఉన్నా.. ఊర్లలోని చెరువులు మాత్రం నిండని పరిస్థితులు నెలకొన్నాయి. ప్రస్తుతం ఖరీఫ్ గడిచిపోయింది. కొన్నిచోట్ల రబీ సాగుకు నీళ్లిచ్చారు. ఈ పరిస్థితుల్లో రాష్ట్రంలోని భారీ, మధ్యతరహా జలాశయాల్లో డిసెంబరు ప్రారంభంలో కూడా మూడొంతులు నీళ్లున్నాయి. వీటితో రాష్ట్రంలోని 38,628 చెరువులు నింపేందుకు జలవనరుల శాఖ కృషి సాగిస్తోంది. అయితే.. ఇప్పటివరకు దాదాపు 15 వేల చెరువుల్లోకి చుక్కనీరు కూడా చేరలేదు. 25% మాత్రమే నిండినవి మూడు వేలకు మించి ఉండగా, 50% మేర నిండినవి సుమారు 4,000 ఉన్నాయి. దాదాపు పది వేల చెరువులు మాత్రమే పూర్తిగా నిండాయి. ఈ క్రమంలో సీఎం చంద్రబాబు చెరువులను నింపేందుకు ప్రత్యేక ప్రణాళిక రూపొందించాలని ఆదేశాలు జారీ చేశారు. ఈ వారంలో నిర్వహించే సమావేశంలో దీనిపై చర్చించనున్నారు. దీంతో గ్రావిటీ ద్వారా ఎన్ని చెరువులు నింపే ఆస్కారం ఉంది.. కాలువలను కొంతమేర విస్తరించి ఎన్నింటికి జలాలు తరలించొచ్చు.. మొబైల్ ఎత్తిపోతల పథకాల ద్వారా ఎన్నింటిని నింపొచ్చు.. అనే అంశాలపై అధికారులు ప్రణాళికలు రూపొందిస్తున్నారు.

భూగర్భ జలాలు ఇలా రీఛార్జ్ అవుతాయి

ఏ రకంగా	భూగర్భ జలం రీఛార్జ్ శాతం
వర్షం	37.0
కాలువల ద్వారా	9.4
ఉపరితల ప్రవాహం	27.1
భూగర్భ జలం వల్ల	6.4
చెరువులు, కుంటలతో	8.8
నీటి సంరక్షణ కట్టడాలు	11.2

.భూగర్భ జలాలతో పచ్చదనం

రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలకూ కాలువల ద్వారా నీరందించే పరిస్థితులు లేవు. అనేక ప్రాంతాలకు భూగర్భ జలాలే ఆధారం. ఇవి 3 నుంచి 8 మీటర్ల మధ్య ఉండేలా చూసుకోవాలనేది ప్రభుత్వ లక్ష్యం. ఇలా చేయడం వల్ల నీటిని తోడేందుకు విద్యుత్తు ఖర్చు తక్కువవుతుంది. ఎక్కడ కాలువలు ప్రవహిస్తాయో.. ఎక్కడ చెరువుల్లో నీళ్లుంటాయో.. ఎక్కడ ప్రాజెక్టులుంటాయో.. ఆ చుట్టుపక్కల ప్రాంతాలన్నీ భూగర్భ జలాలతో అలరారుతాయి. ఆయాచోట్ల ఆరుతడి పంటలు సాగుచేసే అవకాశం ఉంటుంది. ఈ క్రమంలో రాష్ట్ర వ్యాప్తంగా చెరువులు నింపడమూ అవసరమని రైతులు చెబుతున్నారు. డిసెంబరు ఒకటో తేదీ నాటి పరిస్థితుల ప్రకారం.. కోస్తాంధ్రలో సగటున 5.97 మీటర్లు, రాయలసీమలో సగటున 6.31 మీటర్ల స్థాయిలోనే భూగర్భ జలాలున్నాయి. కిందటి వేసవి తర్వాత కురిసిన వర్షాలకు కోస్తాంధ్రలో సగటున 3.56 మీటర్లు, రాయలసీమలో 4.40 మీటర్ల మేర భూగర్భ జలాలు ఎగువకు చేరాయి.

ప్రస్తుతం చెరువుల్లో నీటి నిల్వలు ఇలా..

మొత్తం చెరువులు	:	38,628
వాటి సామర్థ్యం	:	206.21 (టీఎంసీలు)
ప్రస్తుత నిల్వ	:	128.75 (టీఎంసీలు)

ఇదీ తాజా పరిస్థితి..

ప్రాజెక్టులు	మొత్తం నీటి నిల్వ (టీఎంసీలు)	ప్రస్తుత నీటి నిల్వ (టీఎంసీలు)
భారీ జలాశయాలు	1,014.27	849.32 (83.74%)
మధ్య తరహా జలాశయాలు	91.58	64.17 (70.07%)

రూ.35 వేల కోట్లతో విద్యుత్ నెట్‌వర్క్

- అందుబాటులోకి రెండు గ్రీన్ ఎనర్జీ కారిడార్లు
- 765 ఎంవీఏ సామర్థ్యంతో మూడు అల్ట్రా హై ఓల్టేజ్ సబ్‌స్టేషన్లు

ఈనాడు, అమరావతి: రాష్ట్రంలో కొత్తగా రెండు గ్రీన్ ఎనర్జీ కారిడార్లు ఏర్పాటు కానున్నాయి. దీనికి అనుగుణంగా రూ.35 వేల కోట్లతో విద్యుత్ సరఫరా నెట్‌వర్క్ ప్రాజెక్టులకు కేంద్రం అనుమతులు ఇచ్చింది. కేంద్ర ప్రభుత్వరంగ సంస్థ పవర్ గ్రిడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (పీజీసీఐఎల్), ట్రాన్స్‌కో చెరొక ప్రాజెక్టును రూ.30 వేల కోట్లతో అభివృద్ధి చేయనున్నాయి. వాటితో పాటు విద్యుత్ ఎగుమతి విధానంలో ఏర్పాటు చేసిన పునరుత్పాదక ప్రాజెక్టుల నుంచి వచ్చే విద్యుత్‌ను జాతీయ గ్రిడ్‌కు అనుసంధానం చేసేందుకు సుమారు రూ.5 వేల కోట్లతో సరఫరా నెట్‌వర్క్ అభివృద్ధికి కేంద్రం అనుమతించింది. రాష్ట్రంలో ఇప్పటి వరకు సుమారు 84,580 మెగావాట్ల సౌర, పవన, పంప్డ్ స్టోరేజి విద్యుత్ (పీఎస్‌పీ) ప్రాజెక్టులకు ప్రభుత్వం అనుమతులు ఇచ్చింది. నిర్దేశిత వ్యవధిలో వాటిని పూర్తి చేయాలని భావిస్తోంది. వాటి నుంచి వచ్చే విద్యుత్‌ను గ్రిడ్‌కు అనుసంధానించే నెట్‌వర్క్ అందుబాటులో లేదు. ఈ దృష్ట్యా దశల వారీగా సరఫరా నెట్‌వర్క్‌ను బలోపేతం చేసేందుకు వీలుగా ప్రాజెక్టులను ప్రతిపాదించింది.

నెట్‌వర్క్ విస్తరణ ఇలా

◆ రాయలసీమ-ఉత్తరాంధ్ర జిల్లాలను అనుసంధానిస్తూ గ్రీన్ ఎనర్జీ కారిడార్‌ను రూ.9 వేల కోట్లతో అభివృద్ధి చేసేందుకు పీజీసీఐఎల్‌కు కేంద్రం అనుమతించింది. ఆ సంస్థ నెట్‌వర్క్‌లో భాగంగా ఇప్పటికే సబ్‌స్టేషన్లు అందుబాటులో ఉండటంతో.. కొత్త లైన్లు ఏర్పాటు చేయాలి. ◆ రూ.21 వేల కోట్లతో గ్రీన్ ఎనర్జీ కారిడార్ ఏర్పాటుకు ట్రాన్స్‌కో పంపిన ప్రతిపాదనకు కేంద్రం ఇప్పటికే అనుమతించింది. రాష్ట్రంలో ఏర్పాటు కానున్న డేటా సెంటర్లు, విశాఖ-చెన్నై, హైదరాబాద్-బెంగళూరు, చెన్నై-బెంగళూరు పారిశ్రామిక కారిడార్లలో అభివృద్ధి చేస్తున్న పారిశ్రామిక నోడ్‌లలో ఏర్పాటయ్యే పరిశ్రమలకు విద్యుత్‌ను అందించేందుకు నెట్‌వర్క్ అభివృద్ధి చేయాల్సి ఉంది.

◆ విద్యుత్ ఎక్స్‌పోర్ట్ పాలసీ కింద ఏర్పాటయ్యే పునరుత్పాదక ప్రాజెక్టు నుంచి వచ్చే విద్యుత్‌ను జాతీయ గ్రిడ్‌కు అనుసంధానించేందుకు రూ.5 వేల కోట్లతో కొత్త సబ్ స్టేషన్లు, లైన్లు ఏర్పాటు చేయాలని ట్రాన్స్‌కో ప్రతిపాదించింది.

మూడుచోట్ల అల్ట్రా హై ఓల్టేజ్ సబ్ స్టేషన్లు

రాష్ట్రంలో ట్రాన్స్‌మిషన్ నెట్‌వర్క్ బలోపేతం కోసం 765 ఎంవీఏ అల్ట్రా హై ఓల్టేజ్ సబ్‌స్టేషన్లు అనంతపురం, కర్నూలు, పెందుర్తిలో ఏర్పాటుకు విద్యుత్ సంస్థలు నిర్ణయించాయి. రాయలసీమ పరిధిలో పునరుత్పాదక ప్రాజెక్టుల పూర్తయ్యే నాటికి కొత్త సబ్‌స్టేషన్లను అందుబాటులోకి తేవాలని భావిస్తున్నాయి. రాయలసీమ జిల్లాలలో ఏర్పాటు చేసే పునరుత్పాదక విద్యుత్ ప్రాజెక్టుల ద్వారా రాబోయే ఏడేళ్లలో 10 వేల మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి అవుతుంది. ఆ విద్యుత్ ఇతర రాష్ట్రాలకు సరఫరా చేసేందుకు సరిపడా అంతర్రాష్ట్ర నెట్‌వర్క్ లేదు. ఈ దృష్ట్యా సుమారు రూ.5 వేల కోట్లతో నెట్‌వర్క్ విస్తరణకు ప్రతిపాదనలను విద్యుత్ సంస్థలు కేంద్రానికి పంపాయి. ఈ ప్రాజెక్టును టారిఫ్ బేస్డ్ కాంపిటీటివ్ బిడ్డింగ్ విధానంలో చేపట్టేందుకు కేంద్రం అనుమతించింది. దీనికి అయ్యే ఖర్చును జనరల్ నెట్‌వర్క్ యాక్సిస్ (జీఎన్‌ఏ) కింద సర్దుబాటు చేసేందుకు కేంద్రం అంగీకరించింది. ◆ అనంతపురం జిల్లాలో ప్రస్తుతం 400 కేవీఏ సామర్థ్యమున్న రెండు సబ్‌స్టేషన్లు అందుబాటులో ఉన్నాయి. అక్కడ మొదటి 765 ఎంవీఏ సబ్‌స్టేషన్ ఏర్పాటు కానుంది. * ఒక్కొక్క 765 సబ్‌స్టేషన్ నిర్మాణానికి సుమారు రూ.1,200 కోట్లు ఖర్చు అవుతుందని అంచనా.

హైదరాబాద్ చేరుకున్న రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము

- స్వాగతం పలికిన తెలంగాణ గవర్నర్, ఉపముఖ్యమంత్రి, మంత్రులు

బొల్లారం, న్యూస్‌టుడే: రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము శీతాకాల విడిది కోసం బుధవారం హైదరాబాద్‌కు చేరుకున్నారు. ప్రత్యేక విమానంలో హకీంపేట విమానాశ్రయానికి చేరుకున్న రాష్ట్రపతికి... గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, ఉప ముఖ్యమంత్రి భట్టివిక్రమార్క, మంత్రులు సీతక్క, శ్రీధర్‌బాబు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, డీజీపీ శివధర్‌రెడ్డి, మేడ్చల్ కలెక్టర్ మను చౌదరి, అదనపు కలెక్టర్లు రాధికాగుప్తా, విజయేందర్ రెడ్డి, త్రివిధ దళాల అధికారులు పుష్పగుచ్ఛాలు అందజేసి స్వాగతం పలికారు. అనంతరం ద్రౌపదీ ముర్ము బొల్లారంలోని రాష్ట్రపతి నిలయానికి చేరుకున్నారు. అంతకుమునుపు రాష్ట్రపతి తమిళనాడు రాష్ట్రం వేలూర్‌లోని స్వర్ణ దేవాలయాన్ని సందర్శించారని, అక్కడ ధ్యాన మండపాన్ని ప్రారంభించారని రాష్ట్రపతి కార్యాలయ వర్గాలు తెలిపాయి. శీతాకాల విడిది సమయంలో రాష్ట్రపతి రాష్ట్రంలో పలు కార్యక్రమాల్లో పాల్గొననున్నారు. 19న తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ నిర్వహిస్తున్న కమిషన్ల ఛైర్‌పర్సన్ల జాతీయ సదస్సును ప్రారంభిస్తారు. 20న బ్రహ్మకుమారీస్ శాంతి సరోవర్ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని నిర్వహించే సదస్సులో పాల్గొంటారు.



రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ముకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న తెలంగాణ గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ

స్నేహితుడిని కొట్టి.. బాలికను బెదిరించి రౌడీషీటర్ అత్యాచారం

నిందితుడికి వైకాపా మహిళా నేత ఆశ్రయం

కంబాలచెరువు (రాజమహేంద్రవరం), న్యూస్‌టుడే: స్నేహితుడితో ఉన్న ఓ బాలికను బలవంతంగా తమ ఇంటికి లాక్కెళ్లి అత్యాచారానికి పాల్పడ్డాడు ఓ రౌడీషీటర్. రాజమహేంద్రవరంలో రెండు రోజుల క్రితం జరిగిన ఈ అమానవీయ ఘటన వెలుగులోకి వచ్చింది. పశ్చిమగోదావరి జిల్లా నరసాపురం ప్రాంతానికి చెందిన ఓ బాలిక కొవ్వూరులో ఇంటర్ చదువుతోంది. అక్కడ వసతికి ఇబ్బందులున్నాయని ఇటీవల రాజమహేంద్రవరంలోని ఓ ప్రైవేటు వసతిగృహంలో చేరింది. ఈనెల 15న రాత్రి 11 గంటలకు తన స్నేహితుడైన బాలుడితో కలిసి జైలు రోడ్డులోని ఓ పార్కు వద్దకు వెళ్లింది. అదే సమయంలో రాజమహేంద్రవరం క్వారీ మార్కెట్ ప్రాంతానికి చెందిన రౌడీషీటర్ రేగుళ్ల వినోద్, అతని స్నేహితుడు గణేష్ మద్యం మత్తులో అటుగా వెళ్తూ వీరిని గమనించారు. బాలుడిని కొట్టి, ఆ బాలికను రౌడీషీటర్ తనతోపాటు బలవంతంగా ఇంటికి తీసుకువెళ్లి అత్యాచారానికి పాల్పడ్డాడు. అర్ధరాత్రి విడిచిపెట్టడంతో బాధితురాలు పోలీసులను ఆశ్రయించినట్లు తెలిసింది. ఓ డీఎస్పీ స్థాయి అధికారి కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సమాచారం. రౌడీషీటర్‌పై గతంలోనూ పలు కేసులున్నాయి. పీడీ చట్టం అమలు చేయగా ఇటీవల జైలు నుంచి బయటికొచ్చాడు. నిందితుడికి నగరంలోని ఓ వైకాపా మహిళా నేత ఆశ్రయం కల్పించినట్లు తెలుస్తోంది.



మనసుకు బాధ కలిగి..

ప్రముఖ జానపద కళాకారుడు, పద్మశ్రీ అవార్డు గ్రహీత దర్శనం మొగులయ్య వర్ణచిత్రాన్ని ప్రభుత్వం హైదరాబాద్ ఎల్‌బీనగర్ వద్ద మెట్రో పిల్లర్‌పై గీయించింది. ఈ చిత్రంపై కొందరు ప్రకటనల కాగితాలు అతికించి అపరిశుభ్రం చేయడంతో.. గమనించిన మొగులయ్య.. తానే శుభ్రం చేయడం సామాజిక మాధ్యమాల్లో కనిపించిన విషయం తెలిసిందే. తుర్కయంజాల్ సర్కిల్ పరిధిలో నివాసం ఉంటున్న మొగులయ్యను ఈ నేపథ్యంలో 'న్యూస్‌టుడే' పలకరించింది. 'ఆరోగ్యం బాగోలేక రెండు రోజుల క్రితం ఆసుపత్రికి వెళ్లి వస్తుండగా.. నా వర్ణచిత్రం ప్రకటనల కాగితాలతో అపరిశుభ్రంగా కనిపించింది. మనసుకు బాధ అయింది. దీంతో ఒకాయన సాయం తీసుకొని నీళ్లు తీసుకొచ్చి కడిగా' అని మొగులయ్య వాపోయారు.

–న్యూస్‌టుడే, తుర్కయంజాల్ పురపాలిక

కానిస్టేబుల్ పోస్టుల భర్తీతో హామీ నెరవేర్చాం

మంత్రి లోకేశ్ వెల్లడి

ఈనాడు, అమరావతి: పోలీస్ కానిస్టేబుల్ పోస్టులు భర్తీ చేస్తామని యువగళం పాదయాత్రలో ఇచ్చిన హామీని నెరవేర్చామని మంత్రి నారా లోకేశ్ తెలిపారు. ఈ మేరకు 'ఎక్స్'లో బుధవారం ఆయన పోస్టు పెట్టారు. "కానిస్టేబుళ్ల పోస్టులు భర్తీ చేస్తామని పాదయాత్ర సమయంలో హామీ ఇచ్చాను. ఆ పోస్టుల భర్తీని కూటమి ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంది. నా హామీని నెరవేర్చేందుకు ఎంపిక ప్రక్రియను ఒక యజ్ఞంలా చేపట్టి పూర్తి చేసిన హోం మంత్రి వంగలపూడి అనితకు హృదయపూర్వక కృతజ్ఞతలు. ఈ పోస్టుల భర్తీని అడ్డుకునేందుకు వేసిన కుట్రపూరిత కేసులను అత్యంత చాకచక్యంగా పరిష్కరించడం వెనుక అధికార యంత్రాంగానికి హోం మంత్రి పూర్తి సహాయ, సహకారాలు అందించారు. ముఖ్యమంత్రి, ఉపముఖ్యమంత్రి చేతుల మీదుగా కొత్త కానిస్టేబుళ్లకు నియామక పత్రాలు అందజేసే కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించిన హోంమంత్రి, పోలీసు యంత్రాంగానికి ధన్యవాదాలు తెలియజేస్తున్నాను" అని పేర్కొన్నారు.

మా తండ్రిని మోసం చేసి భూమిని రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు

తెదేపా కేంద్ర కార్యాలయంలో బాధితుడి ఫిర్యాదు

ఈనాడు, అమరావతి: తన తండ్రిని మోసం చేసి 2.45 సెంట్ల భూమిని రిజిస్ట్రేషన్ చేయించుకున్న వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని చిత్తూరు జిల్లా పుంగనూరు మండలానికి చెందిన బాలాజీ కోరారు. ఈ మేరకు మంగళగిరిలోని తెదేపా కేంద్ర కార్యాలయంలో బుధవారం వినతిపత్రం సమర్పించారు. వివిధ సమస్యలతో వచ్చిన బాధితుల నుంచి గుంటూరు కార్పొరేషన్ మేయర్ కోవెలమూడి నాని, తెలుగునాడు కార్మిక సంఘం నేత గొట్టిముక్కల రఘురామరాజు వినతులు, ఫిర్యాదులు స్వీకరించారు. తనకు రావాల్సిన కాంట్రాక్టు బిల్లుల్ని స్థానిక వైకాపా నేత అన్యాయంగా డ్రా చేసుకున్నాడని అన్నమయ్య జిల్లా సంబేపల్లె మండలానికి చెందిన నాయక్ ఫిర్యాదు చేశారు. అప్పుగా తీసుకున్న నగదు చెల్లించమంటే చంపుతామని బెదిరిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని కృష్ణా జిల్లా గుడివాడ మండలం లింగవరానికి చెందిన సురేశ్ కోరారు.

మధ్యాహ్న భోజనం పథకం యాప్‌లో సవరణలు చేయాలి: ఆప్టా

ఈనాడు, అమరావతి: ప్రభుత్వ పాఠశాలల మధ్యాహ్న భోజనం పథకం యాప్‌లో సవరణలు చేయాలని ఏపీ ప్రైమరీ టీచర్స్ అసోసియేషన్ (ఆప్టా) అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కాకి ప్రకాశ్‌రావు, ఎంజీ మోహాదీ కోరారు. ప్రతి నెలా వేర్వేరు తేదీల్లో ఇండెంట్లు పెట్టాల్సి వస్తోందని, ఎప్పుడైనా ప్రధానోపాధ్యాయులు మరిచిపోతే ఇబ్బందులు తలెత్తుతున్నాయని వారు పేర్కొన్నారు. అలా కాకుండా ప్రతి నెలా 5-10 లేదా 10-15 తేదీల్లోనే అన్ని సరకులకు ఇండెంట్లు పెట్టేలా అవకాశం కల్పించాలని కోరారు.

ఆ సెలవులపై వయోపరిమితి తొలగింపు హర్షణీయం: టీఎన్‌యూఎస్

ప్రభుత్వ ఉద్యోగినులు, ఒంటరి పురుష ఉద్యోగులు వారి సర్వీసు కాలంలో పిల్లల సంరక్షణ సెలవులను వినియోగించుకునేందుకు ఉన్న గరిష్ఠ వయోపరిమితిని ప్రభుత్వం తొలగించడంపై టీఎన్‌యూఎస్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మన్నం శ్రీనివాస్, రామిశెట్టి వెంకటేశ్వర్లు హర్షం వ్యక్తం చేశారు.

రాష్ట్ర మీడియా అక్రెడిటేషన్ కమిటీ ఏర్పాటు

ఈనాడు, అమరావతి: రాష్ట్ర మీడియా అక్రెడిటేషన్ కమిటీని ఏర్పాటు చేస్తూ ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. సమాచార, పౌర సంబంధాలశాఖ డైరెక్టర్ దీనికి ఛైర్మన్‌గా వ్యవహరిస్తారు. ఐ అండ్ పీఆర్ అదనపు డైరెక్టర్ కన్వీనర్‌గా ఉంటారు. ఏపీయూడబ్ల్యూజే, ఏపీడబ్ల్యూజేఎఫ్, ఏపీఎంఎఫ్, ఏపీజేఎఫ్, జేఏపీ, తదితర మీడియా సంఘాలు, యూనియన్ల నుంచి 10 మందిని సభ్యులుగా నియమించింది.

ఇంటికి తీసుకుపో బిడ్డా!



రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి.. నడవలేని స్థితిలో చేయి చాచి యాచిస్తున్న ఈయన పేరు డప్పు మల్లయ్య. స్వగ్రామం తెలంగాణలోని రంగారెడ్డి జిల్లా కొత్తూరు మండలం మల్లాపూర్. గ్రామంలో ఆయనకు ఉన్న కాస్త భూమిలో వ్యవసాయం చేసుకుంటూ గౌరవంగానే జీవనం సాగించారు. మల్లయ్యకు గణేష్, శివ, సునీత సంతానం. పిల్లలకు మెరుగైన భవిష్యత్తు ఇవ్వాలనే ఉద్దేశంతో సుమారు 30 ఏళ్ల క్రితం భార్యాబిడ్డలతో కలిసి శంషాబాద్ సమీపంలోని రాళ్లగూడకు వలస వచ్చారు. దంపతులు కాయకష్టం చేసి అక్కడే స్థలం కొనుగోలు చేసి..సొంతిల్లు నిర్మించుకున్నారు. ముగ్గురు పిల్లలకు వివాహాలు జరిపించారు. భార్య యాదమ్మ కరోనాతో కన్నుమూయడంతో మల్లయ్యకు కష్టాలు మొదలయ్యాయి. ఆర్నెల్ల క్రితం రోడ్డు ప్రమాదంలో గాయపడి..నడవలేని స్థితికి చేరడంతో సమస్యలు చుట్టుముట్టాయి. తన రెక్కల కష్టంతో పెంచి పెద్దచేసిన తండ్రికి సపర్యలు చేయాల్సిన కుమారులు, కుమార్తె..కర్కశులుగా మారారు. కట్టుబట్టలతో ఇంటి నుంచి వెళ్లగొట్టారు. అప్పట్నుంచి రాళ్లగూడ ఫ్లైఓవర్ కింద ఫుట్‌పాత్‌పై దయనీయ స్థితిలో కాలం వెళ్లదీస్తున్న మల్లయ్య 'బుక్కెడు అన్నం పెట్టండి' అంటూ వాహనదారులను వేడుకుంటున్నారు. 'ఒక కుమారుడు ఆటో డ్రైవర్. మరో కొడుకు సెంట్రింగ్ పనులు చేస్తున్నారు. ఇద్దరూ కలిసి నా పేరుతో ఉన్న పొలం, ఇల్లు బలవంతంగా స్వాధీనం చేసుకుని అమ్ముకున్నారు. నన్ను వీధిపాలు చేశారు. ఎముకలు కొరికే చలిలో నిత్యం చచ్చిబతుకుతున్నా' అంటూ కన్నీరు పెట్టుకుంటున్నారు మల్లయ్య. ఇంటికి తీసుకెళ్లేలా బిడ్డలను ఒప్పించాలని వేడుకుంటున్నారు. – న్యూస్‌టుడే, శంషాబాద్

జగిత్యాల జిల్లా పైడిపల్లిలో తీవ్ర ఉద్రిక్తత

- ఫలితాన్ని తారుమారు చేశారంటూ భాజపా వర్గీయుల ఆందోళన
- పోలీసుల లాఠీఛార్జి... గాల్లోకి కాల్పులు

ఈనాడు, కరీంనగర్– వెల్గటూరు, న్యూస్‌టుడే: తెలంగాణలోని జగిత్యాల జిల్లా వెల్గటూరు మండలం పైడిపల్లిలో సర్పంచి ఎన్నికల ఫలితాలు వెల్లడించే క్రమంలో తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. ఇరువర్గాల మధ్య పెద్దఎత్తున వాగ్వాదం జరగడంతో పోలీసులు గాల్లోకి కాల్పులు జరపాల్సి వచ్చింది. ఇక్కడ నలుగురు అభ్యర్థులు బరిలో నిలిచారు. 2,050 మంది ఓటర్లుండగా... 1,713 ఓట్లు పోలయ్యాయి. ఓట్ల లెక్కింపు అనంతరం 32 ఓట్ల మెజారిటీతో భారాస మద్దతుదారు గంగుల మంగ విజయం సాధించినట్లు ఎన్నికల అధికారులు ప్రకటించారు. అప్పటివరకు తమకు ఎక్కువ ఓట్లు ఉండగా ఒక్కసారిగా ఫలితాన్ని తారుమారు చేశారని సమీప ప్రత్యర్థి, భాజపా మద్దతుదారు జక్కుల మమత వర్గీయులు ఆరోపించారు. ఓ ప్రముఖ రాజకీయవేత్త కౌంటింగ్ కేంద్రంలోకి వెళ్లడంతోనే ఫలితం తారుమారైందంటూ ఆందోళనకు దిగారు. రీకౌంటింగ్ జరపాలని పట్టుపట్టారు. ఫలితాన్ని ప్రకటించేశామంటూ రీకౌంటింగ్‌కు అధికారులు నిరాకరించడంతో తీవ్రస్థాయిలో నిరసన వ్యక్తం చేశారు. పోలింగ్ సిబ్బంది, వాహనాలు వెళ్లకుండా అడ్డగించి పోలింగ్ కేంద్రం ఎదుట బైఠాయించారు. దీంతో ఆందోళనకారులపై పోలీసులు లాఠీఛార్జి చేశారు. అయినా పరిస్థితి అదుపులోకి రాకపోవడంతో పోలీసులు ఒక రౌండు గాల్లోకి కాల్పులు జరిపారు. ఈ క్రమంలో కొందరు ఆందోళనకారులు వాహనాలపైకి రాళ్లు రువ్వగా ఓ పోలీసు అధికారికి స్వల్ప గాయమైనట్లు సమాచారం. ఆందోళనకు దిగిన వారిలో కొందరిని అదుపులోకి తీసుకుని... బ్యాలెట్ బాక్సులను పోలింగ్ కేంద్రం నుంచి తరలించారు. గ్రామంలో పోలీసు బలగాలను మోహరించారు.